# గర్గభాగవతము

రచన :

శ్రీ ధర్మవరపు సీతారామాంజనేయులు

ప్రచురణ :

శ్రీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, I.A.S.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1995

# గర్దభాగవతము

రచన :

శ్రీ ధర్మవరపు సీతారామాంజనేయులు

ప్రచురణ :

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1995

*GARGABHAGAVATHAM*

*by*

*Sri Dharmavarapu Seetharamanjaneyulu*

*Edited by:*

*D. Nagasidda Reddi*

*T. T. D Religious Publications Series No.* 464

*Copies:* 2000

*Published by:*

*Sri N. Ramesh Kumar,* I. A. S.

*Executive Officer,*

*T. T. Devasthanams, Tirupati.*

*Printed at:*

*T. T. Devasthanams Press,*

*Tirupati*-517 507.

# ముందుమాట

భగవానుని ఇరవై ఒక్క అవతారాల్లో శ్రీకృష్ణపరమాత్మ పూర్ణత మావతారుడు. ఆయన లీలావిశేషాల్ని భక్తిప్రపత్తులచేత మాత్రమే అవగతం చేసుకోగలం. శ్రీకృష్ణునియొక్క, ఆ స్వామి భక్తులయొక్క గాథల్ని వివరించే గ్రంథం శ్రీమద్భాగవత పురాణం. నారదుని ఉపదేశా న్ననుసరించి వేదవ్యాసమునీంద్రుడు శ్రీమద్భాగవతాన్ని రచించాడు. ఐతే నారదమహర్షి వ్యాసభాగవత విశేషాలతో తృప్తిపడక, యదు కులానికి పురోహితుడు, బలరామకృష్ణులకు ఉపనయనం చేసిన ఋషి పుంగవుడు అయిన గర్గమునిని దర్శించి శ్రీకృష్ణుని దివ్యచరితాన్ని సంపూర్ణంగా వివరించవలసిందిగా కోరాడు. ఆ ముని మాటప్రకారం గర్గుడు సంస్కృతభాషలో 'గర్గసంహిత' అనే పేరుతో శ్రీకృష్ణపరమాత్మ అవతారతత్త్వంలోని అంతరార్థాల్ని విపులంగా విరచించాడు.

గోలోక ఖండము, బృందావన ఖండము, గిరిరాజ ఖండము, మాధుర్యఖండము, మధురాఖండము, ద్వారకాఖండము, విశ్వజిత్ ఖండము, బలభద్రఖండము, విజ్ఞానఖండము అనే తొమ్మిది విభాగాలతో 12,000 శ్లోకాలతో విలసిల్లే ఈ 'గర్గసంహిత'ను 6000 పద్యాలలో చంపూ కావ్యంగా 'గర్గభాగవతం' అనే పేరుతో శ్రీచివుకుల అప్పయ్యశాస్త్రిగారు తెనుగులోనికి అనువదించారు.

శ్రీధర్మవరపు సీతారామాంజనేయులుగారు వ్యాస గర్గభాగవతాల్ని పోతన అప్పయ్యశాస్త్రిగార్ల అనువాదాల్ని ఆమూలాగ్రంగా చదివి ఒక నూత్నశైలిలో ఈ గ్రంథాన్ని రచించారు. ఆంధ్రప్రజానీకానికి

వ్యాస పోతనార్యుల భాగవతాలు పరిచయం వున్నంతగా 'గర్గ భాగవతం'తో పరిచయం లేదనీ, ఆ కొరతను కొంతైనా తీర్చడం సమంజసమనీ భావించి తిరుమలతిరుపతి దేవస్థానములు ఈ తెనుగువచన గర్గభాగవతాన్ని ముద్రించడం జరిగింది. ఆంధ్రదేశంలో ఈ గ్రంథం బహుళప్రచారాన్ని పొంది శ్రీకృష్ణ భక్తులకు సంతోషాన్ని కలిగిస్తుందని నమ్ముతున్నాం.

తిరుపతి,
13–9–1991

ఎం. వి. ఎస్. ప్రసాద్
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# గ ర్గ భా గ వ త ము

## స్తుతి

శ్లో. శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్,
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే.

కం. హరి యను రెండక్షరములు
హరియించును పాతకంబు లంబుజనాభా!
హరి నీ నామమహత్త్వము
హరి హరి పొగడంగ వశమె హరిశ్రీకృష్ణా!

శ్లో. కస్తూరీతిలకం లలాటఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్,
సర్వాంగే హరిచందనం చ కలయన్ కంఠే చ ముక్తావళీం
గోపస్త్రీపరివేష్టితో విజయతే గోపాలచూడామణిః.

నృత్యం మధురం సఖ్యం మధురం
అధరం మధురం వదనం మధురమ్,
నయనం మధురం హసితం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్.

## నైమిశారణ్యము

ప్రకృతిరామణీయమునకు నిలయమును, పరమపవిత్రమునుఅగు గంగానదీ తోయములతో పూతమైన దివ్యస్థలమున, యజ్ఞయాగాది క్రతువు లొనర్చుచు, సకల జనులకు సకల శ్రేయస్సులు నమకూర్చుచు, కాషాయాంబరధారులై, భగవత్సేవానురక్తులై, భాగవత కథాశ్రవణా సక్తులైన మహర్షులకు ఆటపట్టగు నైమిశారణ్యమునకు మహాతపస్వి, బ్రహ్మతేజస్సుతో దేదీప్యమానముగ వెలుగొందు గర్గముని విచ్చేసెను.

శౌనకాదిమునులు మహానందభరితులై ఆ మహర్షికి అర్ఘ్యపాద్యాదుల నొసగి, ఉన్నతాసనమున గూర్చుండ బనిచి సేమ మరసి భాగవత కథాశ్రవణ కుతూహలులై పరిపూర్ణతమావతారము దాల్చిన శ్రీకృష్ణ పరమాత్మకథను వీనులవిందుగ వినిపింపుమని వేడుకొనిరి.

గర్గమహర్షి కృష్ణభక్తుడు. ఆ లీలామానుష విగ్రహుని దివ్యలీలలను కనులార తిలకించి రసాస్వాదన గావించిన పరమభక్తాగ్రేసరుడు. తనకు లభించిన సదవకాశమును సద్వినియోగము జేయుటకు పూనుకొనెను.

## బహుళాశ్వ మహారాజు

గర్గమహర్షి మునీంద్రులతో "ఋషిపుంగవులారా! శ్రీకృష్ణావతార సమయమున మిథిలానగరమందు జనకమహారాజు వంశీయుడైన బహుళాశ్వ మహారాజు గలడు. ఆయన మహాజ్ఞాని. ఒకసమయమున నారద మహర్షి మిథిలానగరమునకు అరుదెంచెను. రాజు మునీంద్రునకు అర్ఘ్యపాద్యాదుల నొసగి ఉపవిష్టుని గావించి, "మహర్షీ! తాము బ్రహ్మమానస పుత్రులు, త్రిలోకసంచారులు, త్రికాలవేదులు. శ్రీకృష్ణపరమాత్మ మానవుడుగ భూలోకమున అవతరించుటకు కారణమేమి" అని ప్రశ్నించెను.

మహర్షి బహుళాశ్వునితో "రాజేంద్రా! 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే' అను గీతాచార్యుని పలుకులు వినియుండలేదా? భగవానుని అవతారములలో అంశావతారము, కళావతారము, ఆవేశావతారము, పూర్ణావతారము, పూర్ణతమావతారములు గలవు. అంశావతారమున మరీచి, అత్రియును; కళావతారమున కపిలుడు మున్నగు మహర్షులు; ఆవేశావతారమున పరశురాముడు; పూర్ణావతారమున శ్రీనృసింహస్వామి, శ్రీరామచంద్రమూర్తి; పూర్ణతమావతారమున సర్వకళలను ప్రదర్శించినది లీలామానుషవిగ్రహుడగు శ్రీకృష్ణపరమాత్మయే. జ్ఞానులకు అవతారభేదములు లేవు" అని నుడివెను.

బహుళాశ్వమహారాజు కృష్ణభక్తుడు. సదా కృష్ణనామమును స్మరించుచు, షోడశోపచారములతో శ్రీకృష్ణుని సేవించుచు, మధురఫలములను గోక్షీరమును, కండచక్కెరను, కదళీ నారికేళ ఫలములను, మృష్టాన్నములను స్వామికి నివేదన గావించి, హాంతుల నొసగి తత్ప్రసాదమును సేవించువాడు. కృష్ణనామ స్మరణచే సమాధిస్థితి నొందువాడు.

రాజు నారదునితో "మహర్షీ! ఈ చర్మచక్షువులతో నందనందనుని జూడగలనా? నాకన్న అధికులగు భక్తులు స్వామికెందరో గలరు. వారిని వదలి నాకడకు అరుదెంచునా? అంతటి భాగ్యము నాకు అబ్బునా!" అని పలుకుచు అశ్రువుల రాల్చెను. రాజు భక్తికి నారదుడు అచ్చెరువొందుచు "నీ జన్మ ధన్యమైనది. ఈ మిథిలానగరమున శ్రుతదేవుడను వేరొక భక్తుడు గలడు. మీకు దర్శనభాగ్యమును గలుగజేయుటకు శ్రీకృష్ణుడు తప్పక రాగలడు" అని అనునయించెను.

మహర్షి రాజుతో "ఈ పంచభూతాత్మకమైన దేహము మోక్షసౌధమును అధిరోహించుటకు నిచ్చెన వంటిది. శ్రీకృష్ణుని స్మరింపని వారికి ముక్తి లభింపదు. అది లభింపని వారిజన్మ నిరర్థకము. శ్వేత వరాహ కల్పములో భూభారము భరింపలేక భూదేవి గోమాత రూపమున, ధర్మదేవత వృషభరూపమున బయలుదేరి బ్రహ్మకడ కేగి, అసత్యవాదిని భరింపలేమని మొరవెట్టుకొనిరి. చతుర్ముఖుడు వారిని వెంటనిడుకొని కైలాసమున కేగెను. శంకరుడు వారందరిని వైకుంఠధామమునకు తోడ్కొనిపోయెను. శ్రీహరి వారెల్లరను వెంటనిడుకొని గోలోకమందున్న శ్రీకృష్ణ పరమాత్మకడకు బయలుదేరెను.

## గోలోకము

గోలోకమును విరజానది చుట్టియున్నది. అందు ఎనిమిది మహానగరములు గలవు. అందలి పాలరాతి ప్రాసాదములు రత్నఖచితములై ఆకస మంటుచున్నవి. అచ్చటి సరస్సులలోని స్వర్ణపద్మములు అరుణ కాంతులతో వింతసొయగములను గూర్చుకొనెను. అనంతకోటి సూర్య కాంతులతో సరితూగగల తేజస్సు కనబడెను. త్రిమూర్తులు మున్నగు

వారు ఆ దివ్యతేజస్సును చూడలేక కనులు మూసికొనిరి. కొంతతడవునకు తేరుకొని కనురెప్పలు విడివడ, వారికి ఆదిశేషుడు కనబడెను. ఆయన శిరముపై గోలోకము గలదు. అచట ప్రకృతి వికారములు పనిచేయవు. అంతా చిన్మయము. పరమాత్మతత్త్వము గోలోకమువలె భాసించు చుండెను. త్రిమూర్తులు మున్నగువారిని జూచినంతనే ద్వారపాలకులు అడ్డగించిరి. శ్రీకృష్ణదర్శనార్థము అరుదెంచితిమని తెలుప, రాధాదేవి చెలి 'శతచంద్రానన' బెత్తము పుచ్చుకొని "మీరు ఎవరు? ఇచటికి అరుదెంచుటకు హేతువేమి? ఏ బ్రహ్మాండమున చరింతురు?" అని ప్రశ్నించెను. కొంతతడవునకు కనికరించి వారి కామె దారిచూపెను.

అదిగో గోలోకము! గోగణములతో, కల్పవృక్షములతో, నీలి వలివర్ణము గలిగిన యమునానదీతోయములతో, మలయ పవనములతో, పురివిప్పి నాట్యముజేయు మయూరములతో, పంచమస్వరమును ఆల పించు గండుకోయిలల 'కుహూ' 'కుహూ' నాదములతో, స్వర్ణశిఖరము లతో, దేదీప్యమానముగ వెలుగొందు రత్నస్థగిత ప్రాసాదములతో మనో హరముగ కనబడెను.

అచటి గోమాతలు స్వర్ణవర్ణము, పాటలవర్ణము, ధూమ్రవర్ణము, కోయిలవర్ణము మున్నగు వివిధవర్ణములతో ముచ్చట గొలుపుచుండెను. బంగరు కడియములతో, చిరుగంటలతో, పలురకముల పూసలపేరులతో కలకలలాడుచుండెను. గోక్షీరము మధురాతిమధురము. గోమాతలకు వృద్ధాప్యము లేదు. కామధేనువులు వాటికి సరితూగజాలవు. గోగణము లను నూటయెనిమిది తెగలుగ విభజించి, అన్నివర్ణములుగల పూసలు శ్రీకృష్ణపరమాత్మ మాలికగ కంఠమున ధరించునని ప్రతీతి.

గోవులను గోపాలకులను జూచుచు ముందుకు సాగుచుండ వారికి దివ్యతేజస్సు కనబడెను. అందు సహస్రదళపద్మము. దానియందు అష్టదళ పద్మముపై రత్నఖచిత సింహాసనము. అందు శ్రీకృష్ణుడు, ఆయన ఎడమతొడపై రాధాదేవి ఆసీనులై యుండిరి. రత్నమయమైన పిడులతో రాజహంసల ఈకలతో జేసిన వింజామరలతో చెలులు విసరు చుండిరి.

శ్యామసుందరుడు శిరమున నెమలిపింఛము, నల్లనిముంగురులు పద్మపత్త్రాయత నేత్రములు, కంఠమున వనమాల(తులసి, కుందమందార కరవీర, సరోరుహములతో), కర్ణములకు మకరకుండలములు, శ్రీవత్స మను పుట్టుమచ్చ, నడుమునకు పసుపుపచ్చని పట్టుపుట్టము, నీలిపట్టు అంగవస్త్రము, మొలకు మేలిమి మొలత్రాడులతో నొప్పారు మోహన మూర్తి రాధాదేవి సౌందర్యరాశి, సర్వలక్షణశోభిత, రాధాకృష్ణుల సౌంద ర్యమును జూచి మన్మథుడు సైతము మురియుచుండెను. త్రిమూర్తులు మున్నగువారు తన్మయులై రాధాకృష్ణులకు ప్రణమిల్లిరి. రాధామాధ వులు మందహాస మొనర్చిరి.

అదేమి చిత్రమో ! శంఖ చక్ర గదా శార్ఙ్గధారియై శ్రీమహావిష్ణువు లక్ష్మీసమేతముగ మాధవునిలో లీనమయ్యెను. అటులే నృసింహావ తారము. శ్రీసీతామహాదేవి సమేతముగ శ్రీరామచంద్రమూర్తి రథా రూఢుడై, అంజనేయుడు వానరులు వెంటనడువ నందనందునిలో లీన మైరి. పూర్ణావతారములుగ ప్రసిద్ధివడసిన షోడశావతారములు శ్రీకృష్ణ పరమాత్మలో లీనమగుటచే, పూర్ణతమావతారమే శ్రీకృష్ణపరమాత్మ యని గ్రహించిన త్రిమూర్తులు మున్నగువారు స్వామిని పెక్కు విధముల స్తోత్రము చేయుచు, "హే కృష్ణా! ముకుందా! మురారి! నీవు పూర్ణతమా వతారుడవు. నీవు నిర్గుణుడవని, మహాతేజస్స్వరూపుడవని, నిరాకారుడవని యోగులు పలుకుదురు. భాగవతులు నీవు శ్యామసుందరుడవని, సగుణుడ వని వక్కాణింతురు. నీ రెండు రూపములను నేడు దర్శించి ధన్యుల మైతిమి" అని కృతజ్ఞతాంజలుల నర్పించిరి. శ్రీకృష్ణపరమాత్మ వారితో "వేదములు నా వాక్కు. దేవతలు నా దేహము. మీరు మీమీ అంశలతో బృందావనమున జన్మింపుడు. మిమ్ములను కాపాడుటకై నేను భూలోక మున అవతరింతును. నిర్భయముగ నుండుడు" అని ఉపశమనవాక్య ములు పలికెను.

అది విని రాధాదేవి మూర్ఛనొందెను. దేహము కంపించుచుండెను. స్వేదబిందువులు నేలపై రాలుచుండెను. చెలులు వింజామరలతో విస రుచు శీతలోపచారములు చేసిరి. రాధాదేవికి స్పృహ వచ్చెను. ఆమె

ఇరువదితొమ్మిది నాళులు జరిగిన పిమ్మట శుభసమయమున డోలీ ఉత్సవమునకు సన్నాహములు గావించిరి. అంతఃపురమును రంగు రంగు దీపములతో అలంకరించిరి. పరిమళ పుష్పములతో పచ్చనిఆకుల తోరణములు; మంగళవాద్యములు మనోహరముగ మ్రోగుచున్నవి. నగరమందలి పుణ్యస్త్రీలు సర్వాలంకృతులై విచ్చేసిరి. కీర్తి వారిని రత్నకంబళములపై కూర్చుండ బనిచెను. అగరు, పునుగు, జవ్వాజి ధూమములు వేసిరి. కాళ్ళకు పసుపు పూసిరి. మోమున కుంకుమ దిద్దిరి. పన్నీరు చల్లిరి. బంగరుఊయల కొనిరాబడెను. ముద్దులు మూటగట్టు పసికందు రాధాదేవిని సువాసనద్రవ్యముల నలది, పట్టుపొత్తిళ్ళలోనుంచి బంగరుఊయెలలో పరుండబెట్టిరి. సౌందర్యఖనియగు రాధాదేవిని జూచి వారెల్లరు మురిసిరి. కీర్తి నారికేళ, కదళీ, మామిడి మున్నగు ఫలములను, లడ్డు జిలేబి పూతరేకులు మున్నగు మధురపదార్థములను, శనగలను, తాంబూలమును పంచిపెట్టెను. పుణ్యస్త్రీలు జోలపాటలు పాడుచు, ఊయల నూపుచుండ, పసికందు బోసినవ్వులు చిందించుచు శోభాయమానముగ ప్రకాశించెను. పరిమళ పుష్పములను, దివ్యాక్షతలను పుణ్యస్త్రీలు రాధాదేవిపై జల్లి సకలశుభములు గలుగునటుల ఆశీర్వదించిరి. కీర్తి అదృష్టమును కొనియాడిరి. జగదేకారాధ్య యగునని బిడ్డను ఆశీర్వదించుచు వారు తమతమ నెలవులకు జనిరి. కీర్తి కన్నబిడ్డకు దృష్టి తీయించి, వేరొక ఊయెలలో పరుండబెట్టెను. వృషభానుడు తన అదృష్టమునకు మురిసెను.

## దేవకీ వసుదేవుల కల్యాణము :

బ్రహ్మవేత్త, యాదవుల గురువగు గర్గాచార్యుడు మధురానగరమందలి ఉగ్రసేన మహారాజు కొలువు కూటమునకు విచ్చేసెను. రాజు మహర్షికి అర్ఘ్యపాద్యాదుల నొసగి ఉన్నతాసనమున గూర్చుండ బనిచెను. మహర్షి ఉగ్రసేనునితో "రాజా! ప్రజలు పాడిపంటలతో తులతూగుచున్నారా? నీ తమ్ముడు దేవకుని కుమార్తెకు యుక్తవయస్సు వచ్చినది. శూరసేనుని కుమారుడగు వసుదేవున కిచ్చి వివాహము

ఒక వసువు ఉద్ధవుడుగ, మరుత్తు అను రాజు ఉగ్రసేనుడుగ, భగుడు ధృతరాష్ట్రుడుగ, పూషాను పాండురాజుగ, స్వాయంభూమనువు అర్జునుడుగ, శతరూప సుభద్రగ, సూర్యుడు కర్ణుడుగ, అగ్నిహోత్రుడు ద్రోణాచార్యుడుగ, కలిపురుషుడు దుర్యోధనుడుగ, శివుడు అశ్వత్థామగ, యముడు ధర్మరాజుగ, వాయువు భీమసేనుడుగ, అశ్వనీదేవతలు నకుల సహదేవులుగ, చంద్రుడు అభిమన్యుడుగ, అంబరీషుడు యుయుధాముడుగ, క్షీరసముద్రుడు శంతనుడుగ, ప్రభాసుడను వసువు భీష్ముడుగ, దివోదాసుడు శల్యుడుగ, ప్రహ్లాదుడు సాత్యకిగ, బ్రహ్మ బాహ్లికుడుగ, మాయాశక్తి యశోద గర్భమున యోగమాయగ జన్మింతురు.

## కంసుడు

క్షీరసాగరమథన సమయమున అమృతముకొరకు దేవతలు దానవులు పోరుసలుపునపుడు కాలనేమి అను దానవుడు మృతినొందగా శుక్రాచార్యులు సంజీవని మంత్రప్రభావమున వానిని బ్రతికించెను. వాడు గరిక రసమును గ్రోలి ఉగ్రతపము గావించెను. బ్రహ్మ ప్రత్యక్షమయ్యెను. ఎవరిచేనైనను మృతినొందకుండునటుల వర మొసగుమని కాలనేమి బ్రహ్మను వేడుకొనెను. కాలాంతరమున అట్టిశక్తి సమకూరునని బ్రహ్మ వానికి అభయ మొసగెను. ఆ కాలనేమియే కంసుడు.

కంసుడు మహాబలోపేతుడు. జరాసంధుడు కట్టివేసిన కువలయాపీడము అను మదపుటేనుగు కట్లు త్రెంచుకొని పరిసర ప్రాంతములను నశింపజేయుచుండ కంసుడు దాని తొండమును బట్టి గిరగిరత్రిప్పి విసరివేసెను. కంసుని బలపరాక్రమములకు అచ్చెరువొంది, జరాసంధుడు అస్తి, ప్రాప్తి అను తనకూతుళ్ల నొసగి వానికి కల్యాణము జరిపించెను.

కంసుడు మాహిష్మతీపురమందలి మల్లులను జయించెను. ప్రవర్షణ గిరిపైనున్న ద్వివిదుడను వానరవీరునితో ఇరువదినాళులు పోరుసల్పి యోడించెను. ఋష్యమూక వనమందున్న కేశి యను నరమాంసభక్షకుని ముష్టితో పొడిచి సంహరించెను. మహేంద్రపర్వతమును ముమ్మారు కదిపెను. ఆ కుదుపునకు కుపితుడై పరశురాముడు కంసుని వధించుటకు

పూనుకొనెను. అది గ్రహించిన కంసుడు పరశురాముని క్షమాభిక్ష వేడు కొనెను.

పరశురాముడు వానితో “ ఈ ధనుస్సును త్రిపురాసుర సంహారము నకై శ్రీమహావిష్ణువు మహేశ్వరున కొసగెను. నా అభీష్టమునుమన్నించి శంకరుడు దీనిని నాకు ప్రసాదించెను. దీని నెక్కుపెట్టుము. కానిచో నిన్ను కడతేర్తును ” అని కంసుని బెదరించెను. వాడు విష్ణుధనుస్సు నెక్కుపెట్ట దిక్కులు పిక్కటిల్లెను, నక్షత్రములు నేలరాలెను. కంసుడు పరశురాము నితో “స్వామీ! నేను అల్పుడను. నీ దాసుడను. రక్షింపప్రార్థన” అనెను.

పరశురాముడు ధనుస్సును కంసున కొసగుచు “దీనిని ఎవరు విరుతురో అతడే శ్రీకృష్ణపరమాత్మ యని గ్రహింపుము. ఆ మహాపురు షుని చేతిలో నీకు చావుతప్పదు ” అని చెప్పెను.

బకాసురుని తోబుట్టువు పూతన తనతో యుద్ధము జేయుమని ఆమె కంసుని కోరెను. ‘ స్త్రీలతో యుద్ధము చేయులేను’ అని బదులు పలికెను. కాని బాణాసురునితో పోరు సల్పుటకు నిశ్చయించుకొని కంసుడు శోణ పురమున కేగి తనతో పోరు సల్పుమని బాణుని కోరెను. శంకరుడు వా రిరువురను మంచిమాటలతో ఉపశమింపజేసి పరస్పర మైత్రీభావము పెంపొందించుకొనుమని హితము పలికెను. అటుపిమ్మట కంసుడు అమరా వతీ పట్టణముపై దాడి వెడలెను. దేవేంద్రునిపై పోరికి సిద్ధపడెను. దేవ రాజు విసిరిన వజ్రాయుధము పుష్పమాలికగ మారి కంసుని కంఠహార మయ్యెను. సురలు పారిపోయిరి. విజయగర్వముతో కంసుడు మథురా నగరమునకు మరలెను.

## రాధాదేవి

వృషభానుని భార్య కీర్తి గర్భవతి యయ్యెను. ఆదిలక్ష్మి తేజస్సు అందు ప్రవేశించెను. భాద్రపద శుక్లపంచమీ సోమవారము మధ్యా హ్నము అభిజిమ్ముహూర్తమున రాధాదేవి అవతరించెను. దేదీప్యమాన ముగ వెలుగొందు ఆ పసికూనను జూచి దేవతలు ముగ్ధులైరి. ఆ పసిబిడ్డపై పుష్పవృష్టి కురియించిరి.

ఇరువదితొమ్మిది నాళులు జరిగిన పిమ్మట శుభసమయమున డోలీ ఉత్సవమునకు సన్నాహములు గావించిరి. అంతఃపురమును రంగు రంగు దీపములతో అలంకరించిరి. పరిమళ పుష్పములతో పచ్చనిఆకుల తోరణములు; మంగళవాద్యములు మనోహరముగ మ్రోగుచున్నవి. నగరమందలి పుణ్యస్త్రీలు సర్వాలంకృతులై విచ్చేసిరి. కీర్తి వారిని రత్నకంబళములపై కూర్చుండ బనిచెను. అగరు, పునుగు, జవ్వాజి ధూమముల వేసిరి. కాళ్ళకు పసుపు పూసిరి. మోమున కుంకుమ దిద్దిరి. పన్నీరు చల్లిరి. బంగరుఊయల కొనిరాబడెను. ముద్దులు మూటగట్టు పసికందు రాధాదేవిని సువాసనద్రవ్యముల నలది, పట్టుపొత్తిళ్ళలోనుంచి బంగరుఊయెలలో పరుండబెట్టిరి. సౌందర్యఖని యగు రాధాదేవిని జూచి వారెల్లరు మురిసిరి. కీర్తి నారికేళ, కదళీ, మామిడి మున్నగు ఫలము లను, లడ్డు జిలేబి పూతరేకులు మున్నగు మధురపదార్థములను, శనగ లను, తాంబూలమును పంచిపెట్టెను. పుణ్యస్త్రీలు జోలపాటలు పాడుచు, ఊయల నూపుచుండ, పసికందు బోసినవ్వులు చిందించుచు శోభాయ మానముగ ప్రకాశించెను. పరిమళ పుష్పములను, దివ్యాక్షతలను పుణ్య స్త్రీలు రాధాదేవిపై జల్లి సకలశుభములు గలుగునటుల ఆశీర్వదించిరి. కీర్తి అదృష్టమును కొనియాడిరి. జగదేకారాధ్య యగునని బిడ్డను ఆశీ ర్వదించుచు వారు తమతమ నెలవులకు జనిరి. కీర్తి కన్నబిడ్డకు దృష్టి తీయించి, వేరొక ఊయెలలో పరుండబెట్టెను. వృషభానుడు తన అదృష్ట మునకు మురిసెను.

## దేవకీ వసుదేవుల కల్యాణము :

బ్రహ్మవేత్త, యాదవుల గురువగు గర్గాచార్యుడు మధురానగర మందలి ఉగ్రసేన మహారాజు కొలువు కూటమునకు విచ్చేసెను. రాజు మహర్షికి అర్ఘ్యపాద్యాదుల నొసగి ఉన్నతాసనమున గూర్చుండ బని చెను. మహర్షి ఉగ్రసేనునితో "రాజా! ప్రజలు పాడిపంటలతో తుల తూగుచున్నారా? నీ తమ్ముడు దేవకుని కుమార్తెకు యుక్తవయస్సు వచ్చినది. శూరసేనుని కుమారుడగు వసుదేవున కిచ్చి వివాహము

చేయుము. ఇరువంశములు వియ్యమందుట ప్రశస్తము" అని హితము బలికెను. దేవకీ వసుదేవుల పెండ్లి నేత్రపర్వముగ జరిగెను. భూదానములు గోదానములు విరివిగ జరిగెను.

దేవకి వసుదేవుల రథమున అధివసింపజేసి కంసుడు స్వయముగ తోలుచుండ, ఆకాశవాణి బిగ్గరగ ఇటుల పలికెను. "కంసా! నీ చెల్లెలి యెనిమిదవ గర్భమునందు నిన్ను సంహరించు వసికందు అవతరించును.

కంసుని హృదయము బ్రద్దలయ్యెను. మృత్యుభయ మావరించెను. వివేకము కోల్పోయెను. దేవకీదేవి శత్రువుగ కన్పట్టెను. కంసుడు కరవాలము దూసి సోదరిని కడతేర్చుటకు సిద్ధమయ్యెను.

దేవకీదేవి కంపించుచుండెను. ఆమెకు పెండ్లి పారాణి చెదరలేదు. కంసుడు ఆమెను గారవమున పెంచినవాడు. ఆకాశవాణి పలుకులు విశ్వసించి తన అనుగుసోదరిని సంహరించుట కుద్యుక్తుడయ్యెను. దేవకీదేవి పరమాత్మను స్మరించుకొని కాపాడుమని లోలోన మొరబెట్టుకొనెను.

వసుదేవుడు కంసునితో, "బావా! శాంతింపుము. తోబుట్టువును చంపుట ధర్మవిరుద్ధము. ఈమె వలన కాదుగదా నీకు ప్రమాదము! ఈమెకు గలుగు సంతానమును నీకు సమర్పింతును. భయము నొందకుము. సంతోషముతో మమ్ములను మా నెలవునకు చేర్చుము" అని ప్రార్థించెను. దేవకీ వసుదేవులను వారి మందిరమున విడిచి కంసుడు మధురానగరమునకు మరలెను.

దేవకీదేవి గర్భము దాల్చెను. షట్సంతానమును కంసుడు కరవాలమునకు బలి యొసగెను. దేవకీ వసుదేవులను, ఉగ్రసేనుని కారాగారమున బంధించి మధురానగరమునకు తానే రాజయ్యెను.

## బలరాముడు

దేవకీదేవి సప్తమ గర్భమును దాల్చెను. అందు సంకర్షణస్వామి ప్రవేశించెను. పరమాత్మ అజ్ఞానువర్తినియై యోగమాయ దేవకీదేవి

సప్తమ గర్భమును రోహిణీదేవియందు ప్రవేశపెట్టెను. మధురానగర మందలి వనితలు దేవకీ గర్భము జారెనని భ్రమనొందిరి. నందమందిర మున రోహిణీదేవి దివ్యతేజస్సుతో వెలుగొందుచుండెను. పంచగ్రహ ములు ఉచ్చస్థితిలో నుండ, తులాలగ్నమున, స్వాతీనక్షత్రము, భాద్ర పద శుక్లషష్ఠి, బుధవారము పగలు రోహిణి ప్రసవించినది. దేదీప్యమాన ముగ వెలుగొందు అందాల ప్రోగు అనదగు మగశిశువు గలిగెను. నందుడు కడు సంతసించెను. దేవదుందుభులు మ్రోగెను. సురలు పుష్పవృష్టి కురియించిరి. బాలుని జాతకర్మ మహోత్సవమునకు ద్వైపా యనుడు, దేవరాతుడు, దేవలుడు, నారదుడు మున్నగు మహర్షులు విచ్చేసిరి. నందుడు వారిని ఉచితరీతిని గౌరవించెను. ఆదరముతో పూజించెను.

వేదవ్యాస మహర్షి నందునితో "ఓయీ! నీవు భాగ్యశాలివి. ఈ శిశువు రహస్యమును వివరింతును. ఈయన సాక్షాత్ అచ్యుతుని అవతా రమే. దేవకీదేవి గర్భమందు శ్రీహరి ప్రవేశించెను. ఆ గర్భమును యోగమాయ రోహిణీ గర్భమందుంచెను. అందుచే పసికందుని జూచి ధన్యుల మయ్యెదము" అని తెలుప నందుడు శిశువును స్వయముగ గొనివచ్చి మహర్షులకు జూపెను.

వేదవ్యాసమహర్షి పసికూనతో "నీవు సంకర్షణుడవు. ఓ బలరామ స్వామీ! మమ్ములఁ గాపాడుము, నీవు పరమాత్మకు సోదరుడవు. హస్తినా పురమును నాగలితో కదలింతువు. తీర్థయాత్ర చేయుదువు. సుయో ధనునకు ఆరాధ్యదైవ మగుదువు" అని కొనియాడి, సరస్వతీతీర్థమునకు జనెను.

మధురానగరమున కారాగారబద్ధులై యున్న దేవకీ వసుదేవులు పరమాత్మ తేజస్సుతో వెలుగొందు చుండిరి. దేవకీదేవి అష్టమ గర్భము దాల్చెను. కారాగారమందలి కారుచీకటులు చెదరిపోయెను. ఆ కారా గృహము దేదీప్యమానముగ ప్రకాశించు చుండెను. అది విని కంసుడు నిద్రాహారములు మానెను. కావలివారిని అప్రమత్తులుగ నుండుడని కట్టడి జేసెను. భోజనపాత్రలో పరమాత్మ, ఉదకపాత్రలో పరమాత్మ,

ఎల్లతావుల పరమాత్మ తనను వెంటాడు చున్నటుల భ్రమ జెందుచుండెను. మహర్షులు, వేదవిదులు పరమాత్మ అవిర్భవించునని కారాగారమునకు ప్రదక్షిణములు చేయుచుండిరి. వారు "మాతా! నీవు ఎంతో అదృష్ట శాలినివి. పరమాత్మ నీకు తనయుడుగ అవిర్భవించును. నీకెట్టి భయ మును లేదు. నీవలన మే మెల్లరము, చరితార్థులమగు సమయ మాసన్న మగుచున్నది" అని ఉల్లాస పరచుచుండిరి. మథురానగర వాసులు పరమాత్మ ప్రాదుర్భావమునకు ఉవ్విళులూరుచుండిరి. లోక కంటకుడగు కంసుని సంహరించుటకు తప్పక రాగలడని నిరీక్షించు చుండిరి.

## శ్రీకృష్ణ జననము

ఆకసము నిర్మలముగా నుండెను. సూర్యచంద్రాది గ్రహములు, అశ్విన్యాది నక్షత్రములు ఉచ్చదశలో నున్నది. మలయ పవనములు ఆహ్లాదకరముగ నున్నవి. వర్షకాలమందు సైతము నదుటలోని నీరు, శరత్కాలమందువలె నిర్మలముగ నున్నది. రాత్రివేళ పద్మములు విక సించుచున్నవి. సారసపక్షులు మధురగానము జేయ దొడగెను. వృక్ష జాతులు పుష్పఫలభరితము లయ్యెను. పుష్పసౌరభము గుబాళించు చున్నది. అష్టమిచంద్రుడు పూర్ణచంద్రు డయ్యెను. సముద్రము సంతో షముతో పొంగెను. వ్యాధిగ్రస్తులు ఆరోగ్యవంతులైరి. మథురానగరము సుభిక్షమయ్యెను. పరమాత్మ రాకకై సర్వులు నిరీక్షించుచుండిరి. దేవ దుందుభులు మనోహరముగ మ్రోగుచున్నవి. దేవతలు, గంధర్వులు, సిద్ధచారణులు పరమాత్మను స్తోత్రముచేయ దొడంగిరి. అప్సరసలు నాట్యము చేయుచుండిరి. మహర్షులు పరమాత్మకు స్వాగతము బలుకు చుండిరి.

భాద్రపద మాసము, కృష్ణ పక్షము, రోహిణీన క్షత్రము, వృషభ లగ్నము, బుధవారము, అర్ధరాత్రి చిన్మయరూపముతో శ్రీకృష్ణపరమాత్మ అవిర్భవించెను.

శ్యామసుందరుడు చతుర్భుజములతో, శంఖము, సుదర్శన చక్రము, కౌమోదకి అను గద, తామరపుష్పము లున్నవి. శిరమున

మణిమయ కిరీటము, నీలిముంగురులు, చంద్రబింబమువంటి నెమ్మోము లలాటమున త్రిపుండ్రము, పద్మపత్రముల వలెనుండు విశాలమైన నేత్రములు, కర్ణములకు మకరకుండలములు, మణిదర్పములవంటి చెక్కిళ్లు, దొండపండువంటి అధరము, కంఠమున దివ్యహారము, కౌస్తుభమాణిక్యము, వక్షస్థలమున వనమాల, శ్రీవత్సమను పుట్టుమచ్చ, బంగరుభుజకీర్తులు, దండకడియములు, కంబుగ్రీవము, మెరుపుతీగవలె మిరుమిట్లు గొలుపు మేలిమి మొలత్రాడు, పట్టుపుట్టములతో బోసినవ్వులు విరజిమ్ముచు సహస్రకోటి మన్మథసౌందర్యముతో మాతాపితలకు దర్శన మొసగెను. వారు మహానంద భరితులైరి. మురళీరవము మనోహరముగ వినబడెను.

స్వర్ణకాంతులతో రాధాదేవి, శుద్ధస్ఫటిక కాంతులతో బలరామస్వామి ఇంద్రనీలమాణిక్య కాంతితో శ్రీకృష్ణపరమాత్మ వెలుగొందుచుండిరి. ఒక్క పరబ్రహ్మతత్త్వమే రాధాకృష్ణులుగను, బలరామస్వామిగను జన్మించిరి. సకల జీవరాసులలో నిండి నిబిడీకృతమైనది ఆ పరబ్రహ్మతత్త్వమే.

## దేవకీవసుదేవులు శ్రీకృష్ణుని స్తుతించుట

శ్యామసుందరుడగు శ్రీకృష్ణపరమాత్మను వసుదేవుడు ఇటుల స్తోత్రముజేసెను.

" ఓ దయాసింధూ! నీవు ఈ విశ్వమునకు అధిష్ఠానస్వరూపుడవు. దేహకర్మలాదులు నీకు అంటవు. దేహవిలక్షణుడవు. సర్వసాక్షివి. సకల బ్రహ్మాండములు నీ కుక్షియందున్నవి. మాయందు దయయుంచి మాకు తనయుడవైతివి. ఇవే నీకు నా కృతజ్ఞతాంజలులు.

దేవకీదేవి పరమాత్మతో " అఖిలాండ బ్రహ్మాండనాయకా! బ్రహ్మాండములు నీ కుక్షియందున్నను, నీవు నా కుక్షియందుండుట నీ దయావిశేషముగ కనబడుచున్నది. నీవు ఈ దివ్యమంగళరూపమును ఉపసంహరించి, బాలుడవై మా సేవ లందుకొని మహాభాగ్యమును మాకు ప్రసాదింపుము " అని వేడుకొనెను.

శ్రీకృష్ణ పరమాత్మ తల్లితో "అమ్మా! పూర్వజన్మమున నీవు పృశ్ని అను మహాసాధ్వివి. నా తండ్రి వసుదేవుడు సుతపుడను పేరుగల వాడు. బ్రహ్మవాక్యము ననుసరించి మీ రిరువురు నన్నుగూర్చి మన్వంతరము తపము గావించితిరి, నేను మీకు దర్శనమొసగి, వరము కోరుకొమ్మని అడుగ నావంటి కుమారుని ప్రసాదింపుమని కోరితిరి. నాకు నేనే సాటి. అందుచే నేనే నీ గర్భమున జనించితిని. మరుజన్మమున మీరు అదితికశ్యపులుగ జన్మింప, నేను వామనమూర్తిగ జన్మించితిని. మూడవ జన్మమున మరల నీ గర్భమందు జన్మించితిని. ఇక మీకు పునర్జన్మలేదు. నన్ను వెంటనే నందరాజు సతియగు యశోదాదేవికడకు గొనిపొండు. ఆమెకు కలిగిన ఆడశిశువును (యోగమాయ) మీరు చేకొని నన్ను యశోదమ్మ ప్రక్కలో పరుండబెట్టుడు" అని ఆనతిచ్చెను.

దేవకిదేవి పరమాత్మతో "స్వామి! మేము ఈ కారాగారమున బంధింపబడియుంటిమి, చేతులకు సంకెళ్లు వేయబడియున్నవి. యమునా నది దాటి వెళ్లవలెను. బిడ్డల మార్పిడికి యశోదాదేవి అంగీకరించునా? ఏమి చేయుటకు తోచుటలేదు" అని మొరబెట్టుకొన తానే కార్యసిద్ధికి తోడ్పడుదు నని పరమాత్మ ఊత మిచ్చెను.

వసుదేవుడు బిడ్డను చేకొనుటకు కరములు చాచగానే సంకెలలువిడిపోయెను. కారాగారమందలి కవాటములు విచ్చుకొనెను. చీకటులు తొలగి వెలుగు వచ్చెను. కుంభవృష్టికి తడియకుండునటుల వాసుకి ఛత్రము బట్టెను. వర్షాకాలమున వెల్లువలై ప్రవహించు యమునానది రెండు పాయలుగ చీలి, త్రోవ నొసగెను. పరమాత్మ కార్యమునకు విఘ్నము గలుగునా?

నందగోకులమున యోగమాయ జనించెను. సపరివారము గాఢ నిద్రలో నిమగ్నులైరి. వసుదేవుడు తనఅరచేతులలో నున్న పరమాత్మను మనసార ముద్దిడుకొని, యశోదమ్మ ప్రక్కన పరుండబెట్టి ఆమె ప్రక్కన ఉన్న యోగమాయనుగైకొని, మధురానగరమునకు మరలెను. దేవకీదేవికి యోగమాయ నొసగెను, ఆ బిడ్డ 'కావు' 'కావు' మని బిగ్గరగ నేడువ సాగెను. ఆ ధ్వనికి కావలివాండ్రు మేల్కాంచిరి. చారులు ఆ వార్తను కంసునకు దెలిపిరి.

కంసుడు మహోదగ్రుడై కలవాలము చేబూని, కారాగారమునకు దూసికొని పోయెను. దేవకీదేవి దీనవదనయై యోగమాయను చంక నిడుకొని పరమాత్మను ధ్యానించుచుండెను. కంసుడు శిలాహృదయుడు. యోగమాయను లాగికొని రాతిబండపై విసరెను. దేవకీవసుదేవులు నిరుత్తరులైరి;

యోగమాయ ఆకసమున కెగసెను. అష్టభుజములతో, కోటిసూర్య ప్రభలతో భాసించుచు సహస్రాశ్వములు పూన్చిన వద్మరథముపై నధి వసించి కంసునితో, "ఓరీ కంసా! నీ పాపము పండినది. నీ కపటో పాయములు కట్టిపెట్టుము. మృత్యుదేవత నిన్ను కబళించుటకు వేచి యున్నది. నీ ప్రాణములు హరించుటకు శ్రీకృష్ణపరమాత్మ అవతరించెను. దీనురాలైన దేవకీదేవి కడగండ్ల పాలొనర్చుట పాడియా" అని కటువుగ మందలించెను. వింధ్యాచలమున పదునాలుగు స్థానములలో వివిధ నామములతో యోగమాయ ఆవిర్భవించెను.

కంసుని శిలాహృదయము ద్రవించెను. దేవకీ వసుదేవుల కడ క్షమాభిక్ష వేడుకొని, తన అంతఃపురమున కేగెను. ఆ రాత్రి వానికి నిదుర రాలేదు. ఆహారమును ముట్టలేదు. ఎటు చూచినను శ్రీకృష్ణపరమాత్మయే గోచరించుచుండెను. మృత్యుదేవత కబళించుటకు వేచియున్నదని భ్రమ జెందెను. యముడు పాశమును తనపైకి విసరుచున్నటుల తత్తరపాటు చెందుచుండెను.

మరునాడు మంత్రుల రావించి, కంసుడు కొలువు తీరెను. జరిగిన ఉదంతమును వారికి వివరించెను. పదిదినముల పసిపాపల నరికివేయు డని ఆజ్ఞాపించెను. గోవులు, భూసురులు, మహర్షులు, వేదవిదులు, సాధుపుంగవులలో విష్ణుఅంశ యుండును. అట్టివారిని చిత్రవధ చేయు డని కట్టడి జేసెను.

కంసుని దూతలు ఋషుల గడ్డములను పీకుచుండిరి. హోమకుండ ములను అపవిత్రము గావించుచుండిరి. చేజిక్కిన సజ్జనులను బాధింప దొడగిరి. ఆ మహనీయు లొనర్చు ఆర్తనాదము రిత్తపోవునా? వారి కన్నీరు కంసుని చిత్రవధ చేయకుండునా?

## పుత్రోత్సవము

నందవ్రజమున నందుని మందిరము దివ్యప్రభలతో వెలుగొందు చుండెను. ప్రభాతమున నందుడు మేల్కొనెను. యశోదమ్మ ప్రక్కన పసికందు దేదీప్యమానముగ వెలుగొందుచుండెను. నందుడు సతిని నిదురలేపెను. తనప్రక్కన గుసగుసలాడు పసికందును జూచి యశోదా దేవి పరవశించెను. పలుమారు ముద్దాడెను. చెలులను రండని ఆమె కేక వేసెను. వారు మరుక్షణమున అచట ప్రాలిరి. పసిబిడ్డను జూచి ముచ్చట పడిరి.

తనకు వృద్ధాప్యమున లభించిన బిడ్డయగుటచే నందరాజు భూసురుల రావించి నవధాన్యములు, గోవులు, బంగారు నాణెములు, నవరత్నములను దాన మొసగెను. నందవ్రజ వీథులలో పన్నీరు చిలికిరి. ముత్యాలముగ్గులు వేసిరి. పచ్చని ఆకుతోరణములు గట్టిరి. మంగళ వాద్యములు మ్రోగుచున్నవి. నందుని మందిరమున వేలకొలది గోమాతలను, లేగదూడలను, పసుపుకుంకుమలతో, ముత్యాలసరులతో, అమూల్యాభరణములతో అలంకరించిరి. వాటిపై రత్నకంబళుల నుంచిరి. నందరాజు గోసంపద గోపాలకులను ఆకర్షించెను.

రాధాదేవి తండ్రి వృషభానుడు, తల్లి కీర్తి నందనందుని జూచుటకు విచ్చేసిరి. నవనందులు, ఉపనందులు ముత్తెములు, రత్నములు కానుకగ కొనివచ్చిరి. గోపకులు జుట్లు ముళ్లువేసికొని, తలగుడ్డలు చుట్టుకొని, రత్నకంబళుల కప్పుకొని, పట్టుపుట్టముల ధరించి, నుదుట ఊర్ధ్వపుండ్రములను, వేణువులు, బెత్తములు చేబూని నృత్యము జేయుచు వచ్చిరి. వృద్ధులు సైతము ఊతకఱ్ఱల గొని, యశోదపట్టిని దర్శించుటకు సంబరముతో వచ్చిరి. వారు నందుని అదృష్టమును గొనియాడిరి. తాను ప్రజలకు సేవకుడనని నందరాజు వినమ్రుడై పలికెను.

వ్రజవనితలు ఇంటిపనుల వదలి మైమరచి శ్రీకృష్ణపరమాత్మను జూడవలెనను కుతూహలముతో, జుట్టుముడులు వీడి, ఆభరణములు నలిగి పయటలు తొలగి, పసికూనల చంక నిడుకొని, యశోదాదేవి మందిరము

నకు పరుగు పరుగున వచ్చిరి; కొందరు గోపికలు ఎర్రనీరు, నల్ల ఆవాలు, ఉప్పు, పసుపు, యవలు, గోధుమలు దెచ్చి నందనందమనకు దృష్టి తీసిరి.

గోపికలు యశోదమ్మతో “నీవు రత్నగర్భవు! నీ సుతుడు జగదేక సుందరుడు, పద్మపత్రాయతాక్షుడు, శ్యామవర్ణము గలవాడు. ఈ బిడ్డడు నీకే గాదు మా అందరికీ ముద్దుబిడ్డడు. నందవ్రజము సకల సంపదలతో తులతూగుటయే గాక, పరమాత్మకు వాసస్థానమయ్యెను” అని నుడివిరి. యశోదాదేవి వారికి కృతజ్ఞతను దెలిపి, రోహిణీదేవికి సైగ జేసెను. ఆమె గోపికలకు విలువగల వలువలు, మధురఫలములు, పసుపు కుంకుమలు, శ్రీగంధము, సుగంధద్రవ్యములు, పరిమళ పుష్పముల నొసంగెను. దధిక్షీరములతో, వెన్నతో వసంతోత్సవములు జరిగెను. పరివారమును తగురీతితో సత్కరించిరి.

నందవ్రజమందలి వేడుకలు కనులార వీక్షించుటకై శారదా చతుర్ముఖులు హంసవాహనముపైనను, పార్వతీ పరమేశ్వరులు వృషభవాహనముపైనను, జగదంబ సింహవాహనముపైనను, దేవేంద్రుడు ఐరావతముపైనను, వాయువు కాటుకపిట్ట నెక్కియు, కుబేరుడు పుష్పకముపైనను, స్కందుడు మయూరముపైనను, అంగారకుడు వానరవాహనముపైనను, శని మకరవాహనముపైనను, రాహువు ఒంటెపైనను, షోడశమాతృకలు వెండిపల్లకియందు విచ్చేసిరి. భూదేవి గోమాత రూపమున వచ్చెను. మహర్షులు తపము చాలించి, శ్రీకృష్ణపరమాత్మను దర్శించుటకు అరుదెంచిరి. నంద యశోదలు వారెల్లరకు అర్ఘ్యపాద్యాదుల నొసగి బోసినవ్వులు విరజిమ్ము పసికందును వారికి జూపిరి. వారు పరమాత్మకు నమస్కరించుచు, ప్రణమిల్లుచు, ప్రస్తుతించుచుండిరి. అందలి రహస్యము నంద యశోదలకు అనూహ్యము. వారు అతిథులను ఘనముగ సత్కరించిరి. అతిథులు కడుతృప్తులై తమ తమ తమ నెలవులకు జనిరి.

## నంద వసుదేవులు

కంసునకు కప్పముగట్టు నెపముతో నందరాజు మధురానగరమున కేగెను. తన తనయుని సేమమును వసుదేవునితో విన్నవించుటయే తన ప్రయాణమందలి రహస్యము. నందరాజు రాక నెఱిగి, వసుదేవుడే నందునికడకు వచ్చెను. వాత్సల్యముతో వానిని కౌగిలించుకొనెను. కుశల ప్రశ్నలైన పిమ్మట నందుడు తన గారాబుపట్టిని గూర్చి వసుదేవునకు వివరించెను. వసుదేవుడు నందరాజుతో 'నీ బిడ్డ మాబిడ్డ కాకుండునా?' అని నవ్వుచు బలికెను. అందలి అంతరార్థము నందునకు తెలియలేదు. శ్రీకృష్ణపరమాత్మ అవతరించినప్పటి రహస్యము నందునకు తెలియదు. పసిబిడ్డను గూర్చి పెక్కుప్రశ్నలు వేయుచు, వాటికి నందు డొసగు ప్రత్యుత్తరముల విని పరవశు డగుచుండెను. తన మందిరమునకు రమ్మని నందుని వసుదేవుడు పిలువలేదు. కంసునివలన నందునకు ముప్పు కలుగునని వాని ఊహ. నందుడు మధురానగరమున కొన్ని నాళులు గడుపనెంచెను. కాని వసుదేవుని హితవాక్యములను మన్నించి నందరాజు వ్రజమునకు మరలెను. శ్రీకృష్ణపరమాత్మ నందవ్రజమున దినదినాభివృద్ధి నొందుచున్నాడను నందుని పలుకులను దేవకీదేవికడ వసుదేవుడు వల్లెవేసెను. ఆ మాతృమూర్తి పరవశించెను.

## పూతన

పూతన రక్కసి. పసిబిడ్డల చంపుచుండును. వారి రక్తపానము చేయును. దానికి మానవవాసనను గ్రహింపగల నేర్పు గలదు. కంస ప్రేరణమున పూతన పదునారేండ్ల సుందరీరూపమును దాల్చి యశోద మందిరమునకు వచ్చెను. బాలకృష్ణుడు పరుండిన బంగరు ఊయల కడ కేగి, పసికూనను చేకొని ముద్దాడుచు కాలకూటవిసము నలదిన స్తనము అను వానినోటి కందించెను. యశోదమ్మ రోహిణీదేవి కాదనలేకపోయిరి. కృష్ణపరమాత్మ సర్వము గ్రహించెను. ప్రియముగ పూతన స్తన్యమును పానముజేయ దొడంగెను. తొలిగ్రుక్కకే పూతన ప్రాణములు కడబట్టెను. వదలుమని కేకలు వేయుచున్నను మలిగ్రుక్క రక్కసి రక్తమాంసము అను పీల్చివేసెను; కాలకూటవిషము గూడ తానేయైన వానికి విస మేమి చేయును?

పూతన భయంకరముగ రోదనము సేయుచు నిజరూపముదాల్చెను. గిరులతో సమమగు వక్షోజములు, నాగళ్లంత పళ్లు. వికృతాకారము. ఆరుక్రోసుల దేహము నేలగూలెను. దానిక్రింద బడిన వృక్షములు, బండలు చూర్ణమయ్యెను.

ఆ భయంకరధ్వని విని, వ్రజవనితలు నందనందనుని సేమ మరయుటకు యశోదాదేవి మందిరమునకు పరువిడిరి. ఆదేమి చిత్రమోగాని బాలుడు పూతన కళేబరముపై ఆడుకొనుచుండెను. గోపికలు చకితలైరి. నందకిశోరుని చేకొని యెఱ్ఱనీటితో దిగదుడిచి దిష్టి తీసిరి. గోపంచితముతో యమునామృత్తికతో బాలుని స్నానము చేయించిరి. దుర్వాస మహర్షి యశోదకు చెప్పిన శ్రీకృష్ణకవచమును పఠించిరి.

## శ్రీకృష్ణకవచము

"శ్రీకృష్ణుడు నీదు శిరమును గాచుగాక! నీదు కంఠమును వైకుంఠాధిపతి గాచుగాక! శ్వేతద్వీపాధిపతి నీ కర్ణముల రక్షించుగాక! నీ నాలుకను శ్రీరామచంద్రుడు డోము గాక! నీ అధరములను నరనారాయణులు రక్షింతురు గాక! నృసింహమూర్తి నీ నేత్రద్వయమును బ్రోచుగాక! సనకసనందనాదులు నీ ఫాలమును గాతురుగాక! నీ ఉదరరూపమును కమఠరూపము బ్రోచుగాక! నీ వక్షఃస్థలము దత్తాత్రేయులు రక్షించుగాక! నీ గుహ్యమును మోహినీదేవి రక్షించుగాక! నీ వెన్నును భార్గవరాముడు గాచుగాక!" అని శ్రీకృష్ణకవచమును పఠించి గోపికలు బాలునకు రక్ష కట్టిరి; సామాన్య బాలుడని కాబోలు పరమాత్మకే వ్రజవనితలు రక్ష కట్టుట. బాలకృష్ణుడు చిరునవ్వులు చిందించుచు వ్రజమందలి ఆబాలగోపాలమును ఆకర్షించుచుండెను.

మధురానగరమునుండి నందరాజు వ్రేపల్లెకు వచ్చుచుండ మార్గ మధ్యమున పూతన కళేబరము కనబడెను బాలకృష్ణుడు సురక్షితముగ నుండెనని విని ఆయన కడు ముదమందెను. గోపకులు పూతన కళేబరమును ముక్కలుగ నరికి దహనము జేసిరి. అందుండి యేలకులు, లవం

గములు, కస్తూరి, మంచిగంధము పరిమళము నలుగడల వ్యాపించెను. పరమాత్మ ఎంతటి దయామయుడు! తామసప్రవృత్తిగల బాలఘాతిని; క్రూరురాలగు పూతనకు మోక్ష మొసగెను. ఇక శ్రద్ధాసక్తులతో, భక్తి విశ్వాసములతో ధ్యానించు వారికి ఏమి ఇచ్చునో? పా లిచ్చిన యశోదా దేవికి ఏమి ఇచ్చునో? అనురక్తభక్తులకు ఏమి ఇచ్చునో? వాత్సల్య ప్రేమతో కొలుచువారికి ఏ మొసగునో?

## పూతన పూర్వజన్మ

పూర్వజన్మమున పూతన బలిచక్రవర్తి కొమార్తె. పేరు రత్నమాల. ఆమె వామనమూర్తిని జూచి మురిసి, అట్టి బాలుడు తనకు లభించిన పా లిచ్చుకొందును గదా అని ముచ్చటపడెను. అది గ్రహించిన వామన మూర్తి 'అటులే అగుగాక!' అని ఆశీర్వదించెను. ద్వాపరయుగమున ఆమెయే పూతనగ జన్మించి, పరమాత్మకు పాలిచ్చెను. భక్తాగ్రేసరుల హృదయ కమలములపై నుండు పదారవిందము, ఉపనిషత్కాంతల శిరమునగల పావటలో అలంకారముగనుండు పాదద్వయము పూతనను స్పృశించి ఆమెకు కైవల్యమును ప్రసాదించెను.

## శకటాసురుడు

నందవ్రజమున శ్రీకృష్ణుడు పుట్టినరోజు పండుగకు అబాలగోపాల మునకు యశోదమ్మ కబురంపెను. చిన్నికృష్ణుని కురులు ముడిచి, పరి మళ పుష్పముల నుంచిరి. నుదుట కస్తూరి తిలకమును, నేత్రద్వయము నకు కాటుకను దిద్దిరి. చెవులకు పోగులను, పులిగోరు సమర్చిన చంద్ర హారమును మెడలో వేసిరి. పాలబుగ్గకు గడ్డమునకు చుక్క పెట్టిరి. కర ములకు బంగరు దండకడియములను; ముంజేతులకు బంగారు మురు గులు, మొలకు మేలిమి మొలత్రాడు నుంచిరి. యశోదాదేవి, రోహిణీ దేవి, వ్రజవనితలు నందనందునకు నీరాజన మొసగి బంగరుతొట్టియలో పరుండబెట్టి లాలిపాటలు పాడుచుండిరి. బంగరుఊయల బండిక్రింద

నుండెను. పుణ్యస్త్రీలకు పసుపుకుంకుమలు, తాంబూలము, మధురఫల ములు, మృష్టాన్నములు, పిండివంటలు, పూలు ఇచ్చిరి. ఆ కోలాహల ములో యశోదపట్టి యేడుపు వినబడలేదు.

కంసప్రేరణతో శకటాసురుడు వాయురూపమునవచ్చి పరమాత్మపై బండిని పడద్రోయుటకు యత్నించెను. ముద్దుకృష్ణుడు ముచ్చటగ శక టమును పాదముతో తన్నెను. బండిపై క్షీర, దధి, ఖాండములు గలవు. పెళపెళారావముతో బండి విరిగి శకటాసురునిపై బడెను. వాని శిరము వ్రక్కలయ్యెను. వ్రజవనితలు కలవరముతో యశోదగారాబుపట్టిని సమీ పించిరి. పరమాత్మ కేరింతలుకొట్టుచు ఆడుకొనుచుండెను. చిన్నికృష్ణుడు ఆకొని యేడ్చుచు ఆ శకటచక్రమును తన్నెనని గోపబాలకులు తెలిపిరి. 'బాలకృష్ణుడు బండిని తన్నుటయా ? అది ఆకసమున కెగసి నేలగూలి వ్రయ్యలగుటయా ?' అని అచ్చెరువొందుచు నందనందనునకు ఎర్ర నీటితో దిష్టితీసిరి. భూసురోత్తములచే వేదాశీర్వచ వనసలు చదివించిరి. రక్షరేకును గట్టిరి. మోహనమూర్తి యగు ముద్దుకృష్ణుడు బోసినవ్వు లొలికించుచుండ ఆతనిని విడువలేక పదేపదే వెనుదిరిగి చూచుచు ఆబాల గోపాలము శ్రమతమ నెలవులకు జనిరి.

## శకటాసురుని పూర్వజన్మ

హిరణ్యలోచనుని తనయుడు ఉత్కచుడు. వాడు క్రూరుడు. లోమశ మహర్షి ఆశ్రమమందున్న వృక్షలతాదుల పెరికివేసెను. మునీంద్రుడు కుపితుడై "ఓరీ ! సర్పము కుబుసము విడుచునటులు నీవు ఈ దేహ మును విడువుము" అని శపించెను. ఆ రక్కసుడు ఋషి పాదములకు ప్రణమిల్లి క్షమాభిక్ష వేడుకొనెను. మహర్షి శాంతించి ద్వాపరయుగమున శ్రీకృష్ణుని దివ్యస్పర్శచే శాపవిముక్తి కలుగునని అనుగ్రహించెను. భగ వానుని కృపయున్నచో కాలకర్మలు నిర్వీర్యమగునని వివరించెను. ఆ ఉత్కచుడే ఈ శకటాసురుడు.

## తృణావర్తుడు

యశోదమ్మ తొడపై బాలకృష్ణుడు కూర్చుండెను. తృణావర్తుడను దానవుడు సుడిగాలి రూపమున వచ్చెను. తనయుడు కొండంత భార మగుటచే యశోద బాలుని నేలపై దింపెను. సుడిగాలి వీచెను. పూరిండ్ల పై కప్పులు గాలిపటములవలె నెగురదొడంగెను. కనుల ధూళి నిండుటచే యశోదమ్మకు కొడుకు కనబడలేదు. గోపికలు కృష్ణుని వెదుక దొడంగిరి.

బాలకృష్ణుడు తృణావర్తునివెంట ఆకసమున కెగిరి వాని వీపుపై కురికెను వానికి కొండంత భారమయ్యెను. అది భరింపలేక రక్కసుడు పరమాత్మను నేలపై విసరికొట్టుటకు తలపడెను. చిన్నికృష్ణుడు తృణా వర్తుని కంఠమును నులిమివేసెను. వాడు నేలగూలి అసువుల బాసెను. ఆ దానవుని కళేబరముపై పరమాత్మ ఆడుకొనుచుండెను. వ్రజవనితలు బాలుని గొనివచ్చిరి. కృష్ణుడు భద్రముగ నుండుటచే యశోద కడుసంత సించెను. బిడ్డ నెత్తుకొని ముద్దాడి దిష్టి తీయించెను. వేదాశీర్వచనము చేయించెను. గో భూదానములు విరివిగ నొసగెను. అల్లరి మానుమని బాలకృష్ణుని బతిమాలుచు, బంగరు ఊయెలలో పట్టుపొత్తిళ్లలో పరుండ బెట్టెను. చిన్నికృష్ణునకు నిదుర రాలేదు. బోసినవ్వు లొలకబోయుచు ఆడుకొనుచుండెను.

## తృణావర్తుని పూర్వజన్మ

పాండుదేశమును సహస్రాక్షుడు పాలించుచుండెను. ఆయన భగ వద్భక్తుడు కాని స్త్రీలోలుడు. కామాంధుడై, దుర్వాసమహర్షి రాకను గమనించియు నమస్కరింపలేదు. మహర్షి మహోగ్రుడై వానిని రక్క సుడ వగుదువని శపించెను. సహస్రాక్షుడు మహర్షిని శరణు వేడెను. 'శ్రీకృష్ణుని పాదస్పర్శచే నీవు కైవల్యము నొందుదువు' అని అభయ మొసగెను. ఆ దానవుడే తృణావర్తుడు.

## నందయశోదల పూర్వజన్మ

అష్టవసువులలోని ద్రోణుడు 'ధర' అను పతితోగూడి శ్రీహరిని కొలుచుచుండెను. సంతానప్రాప్తికై వారిరువురు బ్రహ్మను గూర్చి మందరాచలమున తపముచేయ, చతుర్ముఖుడు ప్రత్యక్షమై వరము కోరు కొమ్మనెను. పరమాత్మనే తాము పుత్రునిగ బడయునటుల వారు కోరిరి. ఆ దివ్యదంపతులే నందయశోదలు.

## నామకరణములు

గర్గమహర్షి శిష్యగణముతో నందవ్రజమునకు అరుదెంచెను. నంద రాజు మహర్షి కెదురేగి స్వాగతము పలికి అర్ఘ్యపాద్యాదుల నొసగెను. మునీంద్రుడు నందునితో "నీ కుమారులకు నామకరణములు రహస్య ముగ జరుపవలెను. కంసునకు తెలియకూడదు. నీకు యశోదకు దక్క అన్యులకు ఈ రహస్యము పొక్కరాదు" అని పలికి పూజామందిరమునకు గొనిపోయి, విఘ్నేశ్వరపూజ నవగ్రహపూజలు చేయించి, రోహిణీదేవి కుమారునకు రాముడని యశోదాదేవి తనయునకు శ్రీకృష్ణుడని నామము లిడెను.

కమలనాథుడగుటచే 'క'కారము, శ్రీరాముడగుటచే 'ఋ'కారము షడ్గుణసంపన్నుడగుటచే 'ష' కారము, యజ్ఞపురుషుడు అనగా అగ్ని భుక్కు గావున 'అ'కారము, సాక్షాత్ నరనారాయణాఖ్యమునీంద్రస్వరూ పమే గావున 'ః' విసర్గతో గూడిన 'కృష్ణ' నామము పరమాత్మకు తగిన నామమని గర్గుడు నంద యశోదలకు తెలుప వారు మహానంద భరితులైరి. 'రామ', 'కృష్ణ'అను తనివిదీర ముద్దాడి ఆనందాశ్రువులు జాలువారుచుండ, గర్గముని బాలకులకడ సెలవు గైకొనెను. నంద యశోదలు మహర్షికి వారిశిష్యులకు మృష్టాన్నములతో విందుగావించిరి. కాషాయవస్త్రములు, యజ్ఞోపవీతములు, కమండలువులు, రాగి పంచ పాత్రలు, ధావళులు, బంగరు నాణెములు, గోవులు దాన మొసగిరి. నంద యశోదలకడ గర్గముని శిష్యగణముతో వృషభానునికడ కేగెను.

# రాధాదేవి

వృషభానుని అంతఃపురమునకు గర్గమహర్షి అరుదెంచెను. ఆయన మహర్షికి అర్ఘ్యపాద్యము లొసగి, ఉన్నతాసనమున కూర్చుండ బనిచి, "మునీంద్రా! సూర్యుడు అంతరంగమందలి చీకటులు పోగొట్టలేడు. కాని తమబోంట్లకు అది సాధ్యమే. తమరాకచే నా మందిరము పావన మయ్యెను. నా కుమార్తె రాధాదేవికి తగిన వరుని జూచి, తెలిపినచో ఆమెను వానికిచ్చి వివాహ మొనర్చి ధన్యుడనగుదు"నని విన్నవించెను.

అది విని కడుసంతసించి గర్గుడు వృషభానునితో "ఓయీ! నందరాజు ఇంట సాక్షాత్ పరమాత్మ పెరుగుచున్నాడు. నీ కొమార్తెకు ఆయన తగినవాడు. పూర్వజన్మమున వా రిరువురు దంపతులే. లక్ష్మి, శ్రీదేవి, భూదేవి, విరజాదేవి అను నాలుగు పూర్ణావతారములు ఆమె యందే లీనమైయున్నవి. అందుచే రాధాదేవి పూర్ణావతారము. ఆమెను స్మరించినచో శ్రీకృష్ణపరమాత్మ లభ్యమగును. భాండీరవనమున బ్రహ్మ దేవుడు కల్యాణము జరిపించును" అని హితవు పలికెను.

నందరాజు స్వయముగ గోవులను దోలుకొని యమునానదీతీరమం దున్న భాండీరమున కేగుచుండెను. గోసేవ అనిన మాధవసేవ అను విశ్వాసము నందరాజునకు గలదు. వెంటవత్తునని నందనందనుడు పట్టు పట్టెను. కన్నబిడ్డను చంక నెత్తుకొని నందరాజు బయలుదేరెను. మార్గ మధ్యమున పెనుగాలి వీచెను. వటవృక్షములు నేలగూలెను. కారుమేఘ ములు క్రమ్ముకొని అంధకారబంధుర మయ్యెను. యమునానది ఇసుక రేణువులు నందుని కనులలో బడెను. చంకనున్న గారాబుపట్టి గుక్కపెట్టి బిగ్గరగ నేడ్చుచుండెను. గోవులు చెదరిపోయెను. ఏమి చేయవలయునో తోచలేదు. ఆయన పరమాత్మను ధ్యానింపగనే కోటిసూర్యచంద్రుల వెలు గుతో రాధాదేవి నీలాంబరము ధరించి దివ్యాభరణభూషితయై మంద హాసము చేయుచు ప్రత్యక్ష మయ్యెను.

నందుడు ఆమెకు నమస్కరించుచు "అమ్మా! ఈ చిన్నికృష్ణుడు సాక్షాత్ పరమాత్మయే. నీవు వీని పట్టమహిషివని గర్గునివలన వినియుం టిని. నీవు జగన్మాతవు. ఈ బుడుతడు భయపడుచున్నాడు. వీనిని నీ

ఇంటికి గొనిపోయి భయమును పోగొట్టుము" అని ప్రార్థింప రాధాదేవి బాలగోపాలుని చేకొనగనే అతడు ఏడుపు మానెను. అది పరమాత్మ లీల యని నందుడు సంతసించెను.

## భాండీరవనము

రాధాకృష్ణులు స్మరించినంత మాత్రమున గోలోకమునుండి ఖండము (ముక్క) వచ్చును. ఎల్లప్పుడు అది ఉండదు. పంటభూములు కల్పవృక్షములు, యమునానది బంగారుగట్టులు, రత్నస్థగితమగు మెట్లు, గోవర్ధనపర్వతమునుండి అమృతమును గొనివచ్చు సెలయేళ్లు, చంద్ర కాంత శిలావేదికలు, స్వర్ణకలశములు గలిగిన పాలరాతి ప్రాసాదములు, ఆకసమంటుచు రమణీయముగ నుండెను. పొదరిళ్లు లతాగుల్మాదులతో, పరిమళ పుష్పములతో మనోహరముగ నుండెను. సువర్ణకమలములతో నిండిన సరోవరములు, పావురముల కలకల ధ్వనులు, మధువుతో మత్తె క్కిన గండుతుమ్మెదల ఝంకారములు, నెమళ్ళ క్రేంకారములు, సారస పక్షుల మధురగానము వీనుల విందొనర్చుచుండెను.

మధురభక్తులు పదునారు సంవత్సరముల కృష్ణకిశోరుని ఉపాసింతురు. రాధాదేవి మధురభక్తి స్వరూపిణి. ఆమెలో ఆలంబన, ఉద్దీపన, భావములు తొణికిసలాడుచుండును. చిన్నికృష్ణుడు పదునారేండ్లయదు కిశోరు డయ్యెను. ఆయన పీతాంబరము ధరించి, వేణువును చేబూని, మన్మథమన్మథు డయ్యెను. రాధాకృష్ణులప్రేమ మోహముగాదు, అజ్ఞానమునకు తావు లేదు. మన్మథుని బాణములు రాధాకృష్ణులయెడ నిర్వీర్యమగును. వారి భోగములు కామసంజనితములు గావు. వా రిరువురిది ఏకాత్మభావము. కామమునకు అతీతము. వారి రాసక్రీడను సమాధిస్థితిలో నుండిన శ్రీశుకుడు స్మరించి ధన్యుడయ్యెను. భీష్ముడు అవసానదశ యందు రాసక్రీడావైభవమును స్మరించెను. పరీక్షిన్మహారాజు శ్రీకృష్ణ పరమాత్మ లీలలను అన్నింటిని విని కైవల్యమొందెను. మనము పరమాత్మలో లీనము గావలెను. మనలో పరమాత్మను లీనము చేసికొనలేము. మనము వేరు, పరమాత్మ వేరు అను భావము కూడదు. నదులు సాగరమందు గలియునటుల మనము పరమాత్మలో లీనము గావలెను.

రాధాకృష్ణులు కల్యాణవేదికకడ కేగిరి. అందున్న నవరత్న సింహాసన ముపై నధివసించిరి. బ్రహ్మ వివాహమునకు వలయు సకలసముదాయ మును దోడ్కొని వచ్చెను.

## బ్రహ్మయుగళస్తవము

చతుర్ముఖుడు రాధాకృష్ణులను ఇటుల స్తుతించెను. "హే ముకుందా! రాధాపతీ! నిన్ను శరణు జొచ్చుచున్నాను. నీవు గోలోకనాథుడవు. నీ లీలాశక్తియే రాధాదేవి. నీవు పరబ్రహ్మవైనచో ఆమె ప్రకృతి. నీవు అంతఃకరణమగుచో ఆమె వృత్తిరూపము. మీరిరువురు స్వయంప్రకాశ స్వరూపులు. సామాన్య స్త్రీ పురుషులు గారు. అఖండాత్మ స్వరూపులు. రూపములు వేరైనను తేజస్సొక్కటే. ఆ తేజస్సునే స్మరించుచున్నాను లోకములయందలి స్త్రీ పురుషులు మీరే. సకల లోకరక్షణార్థము మీ రిరు వురు అవతరించితిరి. పూర్వమే మీ రిరువురు దంపతులు. తాము అంగీ కరించినచో లోకధర్మప్రకారము కల్యాణము జరిపించి చరితార్థుడ నగు దును."

## రాధాకృష్ణుల కల్యాణము

కమలసంభవుని చతుర్ముఖముల నుండి చతుర్వేద పఠనము జరుగుచుండెను. కల్యాణమంత్రములు సుస్వరముతో చదువబడెను. అగ్నిహోత్రునిచుట్టును రాధాకృష్ణులు సప్తప్రదక్షిణములు చేసిరి. రాధా దేవి కరమును శ్రీకృష్ణపరమాత్మ వక్షస్థలముననూ, పరమాత్మకరమును రాధాదేవి ఉదరమున నుంచిరి. వా రిరువురు పుష్పమాలికలు మార్చు కొనిరి. పరిమళ పుష్పమాలికలనుండి మధువు స్రవించుచుండెను. బ్రహ్మ స్వయముగ పరమాత్మ పాదద్వయమును బంగరువళ్లెర మందుంచి యమునానదీ పవిత్రోదకముతో కడిగెను. శ్రీకృష్ణపరమాత్మ రాధాదేవి కంఠమున మంగళసూత్రధారణ చేసెను. అట్టిదే ప్రేమ వివాహము. సతి స్వరూపమును పతియు, పతి స్వరూపమును సతియు దర్శింపగలిగిన వారే సతీపతులు. గృహిణి గృహస్థు సుముహూర్తమున ఒకరికరమును

మరియొకరి శిరముపై నుంచినపుడు వధూవరులలో ఏకాత్మభావము గల్గి వలెను. గంధర్వుల గానముతో, అప్సరసల నృత్యములతో రాధాకృష్ణుల కల్యాణము కనులపండువుగ జరిగెను. దేవతలు వారిపై పుష్పవృష్టి కురియించిరి.

రాధాకృష్ణులు దక్షిణ కోరుకొమ్మని చతుర్ముఖుని కోరిరి. ఆయన రాధాకృష్ణ పాదారవిందములయందు అనన్యభక్తి గలిగియుండునటుల దక్షిణ కోరెను. తథాస్తు అని వారు ఆశీర్వదించిరి.

సంకల్పమాత్రమున రాధాదేవి మృష్టాన్నముల సిద్ధపరచెను. రాధాకృష్ణులు విందారగించి సరసోక్తు లాడుకొనుచుండిరి. శ్రీకృష్ణుడు నికుంజము వెనుక దాగెను. రాధాదేవి వెదకి వెదకి నందకిశోరుని కను గొని నవ్వుచు వాని పీతాంబరమును పట్టుకొనెను. రాధాదేవి వేరొక వృక్షము వెనుక దాగెను. శ్రీకృష్ణుడు మందహాసము చేయుచు ఆమె నీలాంబరపు కొంగును చేజిక్కించుకొనెను. దాగుడుమూతలయిన పిమ్మట నీలిచెట్టుకు బంగరులతవలె రాధాకృష్ణులు పెనవేసికొనిరి. శ్రీకృష్ణుడు శ్యామసుందరుడు. రాధాదేవి మెరుపుతీగ వంటిది.

మోహనమూర్తి యగు శ్రీకృష్ణపరమాత్మ వేణుగానమునకు యమునానది పొంగెను. శిలలు ద్రవించెను. మోడువోయిన వృక్ష జాతులు చిగిర్చినవి. స్థావరములు జంగమము లయ్యెను. జంగమములు స్థావరము లయ్యెను. పశుపక్ష్యాదులు సైతము నిశ్చేష్టములైనవి. రాధ పరవశించి నందకిశోరుని మందారపురంగు అంగవస్త్రమును, మురళిని లాగికొని పరుగిడుచుండెను. నందకిశోరుడు మిన్నకుండునా? రాధాదేవి కరకమలమందున్న లక్షదళపద్మమును గుంజుకొని విలాసముగ యమునా తీరమునకు జనెను. రాధాదేవి పరమాత్మ వెంటబడెను. రాధాకృష్ణులు యమునానదిలో జలక్రీడలు సల్పిరి. పరమాత్మ సర్వతోముఖ ఆలింగనము ఆ యమునకే దక్కినది! శ్రీకృష్ణుడు రాధను స్వయముగ అలంకరించెను. రాధాదేవి పరమాత్మను అలంకరింపబోవ పదునారేండ్ల నంద కిశోరు డయ్యెను. రాధాదేవి కనులనీరు గ్రమ్మెను. ఆకాశవాణి బిగ్గరగ ఇటులు పలికెను. "రాధాదేవీ! ఇది పరమాత్ముని లీల. నీకు ఆ శ్రీకృష్ణుడే

పతి యగును. మీరు ఇరువురు పరమాత్మ స్వరూపులే. అవిభాజ్యులే"అని పలుక, రాధాదేవికి ప్రాణము లేచివచ్చెను. రాధాదేవి బాలకృష్ణుని చంక నిడుకొని యశోదాదేవి కడకేగి జరిగిన వృత్తాంతము సవివరముగ వివరించెను.

యశోదాదేవి పరవశించెను. తన చిన్నికృష్ణుడు తనకు దక్కెనని బాలుని మనసుదీర ముద్దిడుకొనెను. ఆ వార్త విని వ్రజవనితలు యశోద మందిరమునకు పరుగిడిరి. వారు రాధాదేవి సౌందర్యమును ఔదార్యమును మెచ్చుకొనిరి. చిన్నికృష్ణుడు చిరునవ్వులు చిందించుచుండ రాధ పరమాత్మకు నమస్కరించి యశోదకడ అనుమతిగైకొని తనమందిరమున కేగెను. యశోదకు రాధను విడచుట భారముగ దోచెను. ఆమె రాధాకృష్ణుల కమనీయ కల్యాణకథను స్మరించుకొని, పరమాత్ముని లీలలకు అచ్చెరు వొందెను.

## బాల్యక్రీడలు

నందవ్రజమున బలరామకృష్ణులు ప్రేమభాజనులు. వారు వ్రజమునకంతకు బిడ్డలే. వ్రజవనితలు వా రిరువురిని తమ కన్నబిడ్డలకన్న మిన్నగ చూచుకొనుచుండిరి. శ్రీకృష్ణపరమాత్మను స్మరించినంత మాత్రముననే వారికి బాహ్యస్మృతులు తొలగుచుండెను. ఏకాత్మభావము గల్గుచుండెను.

కాళ్ల గజ్జియలు ఘల్లుఘల్లు మనుచుండ ఆ అవ్యక్త మధురధ్వని ముల్లోకములను సమ్మోహిత మొనర్చుచుండెను. బలరామకృష్ణులకు గోధూళి, గోపికల గృహముల ముందుండు బురద యనినచో మిక్కిలి మక్కువ. వారు సింహపుపిల్లలవలె పరుగిడువారు. సువర్ణాభరణములు, పట్టుపుట్టములు, అవ్యక్తమధురమగు వచ్చిరాని పలుకులు చెవుల కింపుగ నుండెను. వ్రజవనితలు యశోదాదేవితో "అమ్మా! బలరామకృష్ణులు దుడుకువారు. వీథులలోనికి ఉరుకుచున్నారు. ప్రమాదము గలుగకుండ అప్రమత్తురాలవై యుండుము" అనిరి. యశోదా రోహిణులు బిడ్డలభారమును పరమాత్మపై నుంచిరి.

బలరామకృష్ణులు దినదినాభివృద్ధి గాంచుచుండిరి. వారి ఆగడములు పట్టశక్యము గాకుండెను. గోమాతలు, లేగదూడలు పచ్చికమేయుచుండ, వాని తోకలు కొమ్ములు పట్టుకొని పైకెక్కి కూర్చుండువారు. సింహముల జూలు, కోరలు పట్టుకొని నిర్భయముగ ఆడుకొనుచుండిరి. వారు అగ్నిలో దుముకుచుండిరి. అగ్నిదేవుడు శీతలుడై సుగంధరూపము దాల్చువాడు. బలరామ కృష్ణులలో శ్రీకృష్ణుడు వ్రజవాసుల హృదయమును మిక్కిలి ఆకర్షించెను. శ్రీకృష్ణపరమాత్మను స్మరించినంతమాత్రమునే వారు సర్వము మరచుచుండిరి.

బలరామకృష్ణులు పెరుగుచుండిరి. వారు శ్రీధాముడు, సుబలుడు మున్నగు మిత్రులతో గూడి కాళిందీనది తీరప్రాంతముల కేగి ఉద్యానవనములలో విహరించుచు, తమాలవృక్షముల కెగబ్రాకుచు, ఇసుకతిన్నెలపై వెన్నెలకుప్పలు ఆడుచుండిరి. వారిరువురిని కట్టడి సేయుటకు సాధ్యపడుట లేదు. ఎట్టి ప్రమాదములు సంభవించునో యని యశోదా రోహిణీదేవులు భయపడుచుండిరి.

## వెన్నదొంగలు

శ్రీకృష్ణునకు పాలు, పెరుగు, వెన్న, మీగడలపై మక్కువఎక్కువ. తన ఇంటిలోని పాలు, పెరుగు, వెన్న, మీగడ రుచింపదు. శ్రీకృష్ణుడు గోపబాలురను వెంటనిడుకొని, వ్రజవనితల గృహములలో రహస్యముగ కాలిడును. ఉట్లపైనుండు కుండలకు తూట్లు పొడుచును. వానినుండి స్రవించు వెన్న మీగడలను పాలు పెరుగును తాను మెక్కుచు త్రాగుచు మిత్రులకు మ్రింగబెట్టును. అదేమని ప్రశ్నించిన మారుపలుకక మెల్లగ జారుకొనును. వేకువనే కృష్ణుడు మేల్కొని గోపాలకుల ఇండ్ల ముందున్న లేగదూడల మెడత్రాళ్లను ఊడదీయును. 'ఏమిటి కృష్ణా' అంటే ముసిముసి నవ్వులు నవ్వును. ఆ నవ్వులలోని మర్మమేమో గాని గోపికల కోపము చల్లారును. వారు నందకిశోరుని కనులార్పక చూచుచు ఆనందింతురు.

యశోదమ్మ వీపుపై కృష్ణుడు ఆనుకొనెను. పరమాత్మ స్పర్శ అమృతమయము. చిన్నికృష్ణుని స్మరించుకొనుచు పరధ్యానమున నుండెను. గోపికలు గుంపులు గుంపులుగ వచ్చిరి. వారిని జూచి నంద నందనుడు తల్లివెనుక దాగెను.

వ్రజవనితలు యశోదాదేవితో "అమ్మా! శ్రీకృష్ణుని ఆగడములు మితిమీరుచున్నవి. ఇక వ్రజమున మేము నిలువలేము. మా ఇండ్లలోని పాలు, పెరుగు, వెన్న మీగడ మాకు దక్కుటలేదు. మిత్రులకు మ్రింగ బెట్టుచున్నాడు. ఉట్లు ఎత్తుగ గట్టిన పీటలమీద, రోళ్లమీద, బాలురభుజ ముల పైనెక్కి వెన్నమీగడల తాను మెక్కుచు సఖులను ప్రేరేపించు చున్నాడు. మా పిల్లలు మా మాటలు వినుటలేదు. చిన్నికన్నయ్య మాటలు వారికి శిరోధార్యము. ఒకతూరి వ్రజమందలి గోపబాలురను దాచిరి. అదేమి చిత్రమో! వేలకొలది గోపబాలురతో శ్రీకృష్ణుడు సిద్ధ మయ్యెను.

ఒకనాడు శ్రీకృష్ణుని వెంట వేలకొలది కోతులు వచ్చెను. వాటికి మా వెన్న, పాలు, పెరుగు, మీగడ పంచిపెట్టెను. ఉత్తకుండలను పగుల గొట్టెను. (కుండలు పగులగొట్టుటలోని విశేష మేమన దాన ధర్మములు చేయని వారిబ్రతుకులు వ్యర్థమని తెలుపుటకు) భగవదారాధనలేని కొంపలు పనికిరావని అగ్నిదేవునకు ఆహుతి గావించుచుండెను.

మేము పాలకుండలు చీకటిలో దాచెడివారము. శ్రీకృష్ణుడు వాటిని కనుగొని సఖులకు పంచువాడు. వాని చేతులకు కన్నులున్నవేమో! బాలకృష్ణుని రానీయగూడదని యత్నించే వారము. అతడు నవ్వుచు వచ్చువాడు. 'మాఇండ్లకు ఎందుకు వచ్చితివి' అని అడిగిన 'ఈ వ్రజ మంతా నాదే. ఈ ఇండ్లన్నీ నావే' అనును. 'పాలకుండలలో ఎందుకు చేయి పెట్టితివి?' అని అడుగ 'మా గోవు ఇప్పుడే ఈనినది. లేగదూడ కనబడుట లేదు. మీ ఇంటికే వచ్చినది. పాలకుండలో తెల్లగా కనిపించి నది. లేగదూడ అందు దాగియున్నదని చేయి నిడితిని' అని మృదువుగ పలుకును. కొందరి దేవుడిండ్ల గదులకు వెన్నబూసి 'అదేమి' అని అడి గితే 'నాకన్న అన్యదేవతలు లేరు' అనును.

ఒకగోపిక ఉట్టిమీద గంట కట్టెను. ఉట్టి ముట్టుకుంటే వినబడుననుతలంపుతో నీరు తెచ్చుటకు యమునానదికి వెళ్లెను. తలుపుకు తాళమువేసి చెవిని కన్నకొడుకున కిచ్చి కృష్ణుని రానీయవలదని చెప్పెను. గోపిక వెళ్లిన మరుక్షణమున కృష్ణుడు గోపబాలుర వెంటగొని వచ్చెను. గోపిక కుమారుడు వారిని వారింపలేదు. శ్రీకృష్ణుని సమ్మోహనశక్తి అట్టిది. గోపిక కుమారుడు తాళముచెవి వాని కిచ్చెను. తలుపు దీసి, కదలకుండ గంటను పట్టుకొనుడని సఖులతో చెప్పి, గోపికాతనయునితో 'ఓరీ! మీ అమ్మ నీకు ఎన్నడైనా వెన్న పెట్టినదా? త్రాగను పాలను ఇచ్చినదా? పెరుగన్నము పెట్టినదా?' అని అడుగ లేదని వాడు బదులు పలికెను. 'ఇవిగో. వీటిని కడుపార గ్రోలుము' అని కృష్ణుడు పిలిచెను. గోపబాలుడు కడు సంతసించెను. వారు కుండలకు తూట్లు పొడిచిరి. అందుండి స్రవించు పాలను త్రాగిరి. వెన్నమీగడలను మెక్కిరి. ఆ దృశ్యమును జూచిన గోపిక నందనందనుని పట్టుకొనుటకు గుమ్మముకడ నిలబడెను. పుక్కిటపట్టిన పాలను కృష్ణుడు ఆమె మోమున ఉమిసి తప్పించుకొని పారిపోయెను.

ఒకనాడు ఒక గోపిక తన ఇంటికి రావలదని కృష్ణుని మందలించెను. అప్పుడు నందకిశోరుడు ఆమెతో 'ఓసీ! ఇది నా ఇల్లు. ఇవి నా పాలు. ఇది నా వెన్న. ముట్టరాదనుటకు నీవెవరు?' అని చెంపపై బలముగ చరిచెను. ఆమె ప్రాణములు కడబట్టెను. ఇది మా అవస్థ."

యశోదాదేవి గోపికలతో "అమ్మా! నా బిడ్డకు ఇంటిలోని పాలు, పెరుగు, వెన్న, మీగడ రుచింపదు. మిమ్ములను జూచిన నాకు జాలి వేయుచున్నది, నా బిడ్డను మందలింపవలసినదే గాని, కొట్టుటకు నాకు చేతులు రావు. మీకు వలయు పాలు, పెరుగు, వెన్న, మీగడలు కొని పొండు. ఈసారి వెన్నమూతితో కృష్ణుని కొనిరండు. కట్టివేయుదును" అని అనెను.

ప్రభావతి అను గోపిక నందనందనుని పట్టుకొని ముసుగువేసి యశోదమ్మ కడకు కొనివచ్చెను. 'ఇదిగో నవనీతచోరుడగు నీ ముద్దుల పట్టి' అని ముసుగు తొలగింప, ఆ బుడుతడు ఆ ప్రభావతి కుమారుడే.

గోపిక చకితురాలయ్యెను. అంతఃపురపరివారము ఆ గోపికను గట్టిగా మందలించిరి. ఆమె స్వగృహమునకు వచ్చుచుండ చిన్నికృష్ణయ్య యెదురయ్యెను. అతడు గోపికతో 'నాపై కొండెములు నా తల్లితో చెప్పుదువా? అట్టి తప్పు మరియొకతూరి చేసినచో నీ పతిగ నీఇంటికేవత్తును. అని బెదరించెను. అంతపని చేయగల సమర్థుడని ప్రభావతి భయపడి కృష్ణుడు ఎంతగోల చేసినను మిన్నకుండెను. శ్రీకృష్ణుడు ఎప్పుడు ఏ రూపమున తమ ఇండ్లలో జొరబడి ఏమి అల్లరిచేయునో యని భయపడుచుండిరి.

ఒకనాడు వ్రజవనితలు ఒక్కొక్కరు ఒక్కొక్క అల్లరికృష్ణుని కనుగొని వచ్చిరి. ఒకగోపిక ఇంట వెన్నమీగడలు ఆరగించి కోడలి మూతికి వెన్న రాచెనట. ఒకరికుండలు వేరొకరి ఇంటిలో పడవేసెనట. వారుభయులకు జగడము రేగెనట. ఒకగోపబాలుని నోటిలో వెన్న గ్రుక్కెనట. వాడు ఉక్కిరి బిక్కిరి అగుచుండెను. వేసిన తాళములు వేసినటులే యున్నవి. పాలు, పెరుగు, వెన్నమీగడల కుండలు మాయమగుచున్నవి. ఇక మేము వ్రజమువదలి వెళ్లవలసినదే యని యశోదాదేవితో కన్నీరుగార్చుచు విన్నవించుకొనిరి.

యశోదాదేవి నిస్సహాయురాలు. 'తన హితవాక్యములను తన కన్నబిడ్డ పెడచెవిని బెట్టుచుండెను. అల్లరి మానలేదు. ఏమియు నెరుగని వానివలె తల్లిచాటున దాగుకొనెడివాడు. తన బిడ్డ నిరపరాధి యని యశోద భావించుచుండెడిది.

## మన్ను తినుట

ఒకనాడు బలరామకృష్ణులు, గోపబాలురు యమునానదీతీరమున ఆడుకొనుచుండిరి. చక్కెర బొక్కినటుల కృష్ణుడు యమునామృత్తికను (మన్ను) మ్రింగుచుండెను. గోపబాలురు 'కృష్ణా! అదేమైనా పెరుగా? వెన్నయా?' అని హేళన చేసిరి. మన్ను తినవలదని బలరాముడు కృష్ణుని బతిమాలెను. తల్లితో చెప్పుదునని బెదరించెను. ఇంటియందు మధురాతి మధురములైన పిండివంటకము లున్నవని ఆస చూపెను. ఫలితము శూన్యమయ్యెను. అందరు ఇండ్లకు బయలుదేరిరి.

బలరాముడు ముందుగ మృత్తికవృత్తాంతమును తల్లికి తెలిపెను. ఆమె కలవరమందెను. కృష్ణుడు బెదరుచూపులు చూచుచు, గోపబాలురతో గూడి యశోదకడకు వచ్చెను. ఆమె వానితో "బిడ్డా! నీ అగడములు మితిమీరుచున్నవి. ఇంటిలో పలురకముల పిండివంటకములుండ, మన్ను తినుట యేమి కర్మమురా? మన ఇంటిలోని పాలు పెరుగు, వెన్న మీగడలు నీకు రుచింపవు. పొరుగిండ్లలో అవి నీకు బహు రుచించును. వ్రజవనితలు నిన్ను జూచి భయపడుచున్నారు. నిత్యము నాతో నీపై కొండెములు చెప్పుచున్నారు. ఏమి చేయవలెనో తోచుటలేదు."

బాలకృష్ణుడు తల్లితో "అమ్మా! వారిమాటలు నమ్మకుము. నేను మన్ను తినలేదు. ఆటలలో నాచే చిత్తుగావింపబడినవారు నాపై కొండెములు చెప్పుచున్నారు". యశోద వానితో "సరే! బలరాముడు గూడ అసత్యము పలుకునా?" అన కృష్ణుడు 'అమ్మా! మన్ను తినుటకు నేను శిశువునా? మన్ను తినినచో నోరు నల్లగ నుండును. మట్టివాసన వచ్చును. నోరు తెరతును. యథార్థము నీకే తెలియును" అని నోరు తెరచెను.

## విశ్వరూపదర్శనము

శ్రీకృష్ణుని నోటిలో యశోదాదేవికి బ్రహ్మాండములు, సప్తద్వీపములు, సముద్రములు, పర్వతములు, అగ్ని, భూమి, సకలదిక్పాలకులు, వ్రజము, కృష్ణుడు, తాను కన్పట్టెను. ఆమె "వ్రజవనితలారా! ఇది ఏమి వింత? శ్రీకృష్ణుడు సామాన్యబాలుడు కాడు. సాక్షాత్ పరమాత్మయే. తన లీలలను మనకు జూపుచున్నాడు. కృష్ణా! నా తప్పిదము మన్నింపుము. నీమాయ నాకు అగోచరము. బ్రహ్మాదులకే అనూహ్యము. నే నెంతటి దానను? నీ విశ్వరూపమును జూడలేకున్నాను. నా చిన్నికన్నయ్యవు కమ్ము" అని వేడుకొనెను. పరమాత్మ చిన్నికన్నయ్య యయ్యెను.

వ్రజవనితలకు అదొకవింతగ దోచెను. యశోదకు చిత్తభ్రమ కలిగెనని వారు తలచిరి. కన్నబిడ్డపై ప్రేమచే అటుల తలపోయుచుండెనవి

సంశయించిరి. గోపికలకు బాలకృష్ణునిలో ఎట్టిమార్పును గోచరింపలేదు. పల్లెప్రజలకు పరమాత్మ స్వరూపమును గ్రహించు జ్ఞాన మెక్కడిది? మహాయోగులకు సైతము అలభ్యమగు పరమాత్మ విశ్వరూపదర్శనము చేయగలిగిన అదృష్టశాలిని యశోదమ్మయే". శ్రీకృష్ణు డేమియు నెరుగనివానివలె యశోదను కౌగిలించుకొనెను. 'రారా కన్నయ్యా' అని యశోద బిడ్డను కౌగిలించుకొని తనివితీర ముద్దాడెను. మాతృప్రేమ అంతటి అమృతమయమేమో!

## ఊలూఖల (బంధనలీల)

యశోదాదేవి స్వయముగ పెరుగు చిలుకుచుండెను. బాలకృష్ణునకు వెన్న తినబెట్టవలెనని ఆమె కోరిక. యశోద కృష్ణుని బాలక్రీడల గానము చేయుచుండెను. ఆమె మనస్సు కృష్ణునిపై లగ్నమయ్యెను. సమాధిస్థితి నొందెను. అప్పుడు బాలకృష్ణుడు తల్లి దరిజేరి 'ఆకలియగుచున్నది. పాలీయుమమ్మా' అని అడిగెను. తల్లికి స్పృహ రాలేదు. బాలకృష్ణుడు కవ్వమును బట్టుకొనెను. తల్లికి స్పృహ కలిగెను. కృష్ణుని చేకొని పాలిచ్చుచుండ, పొయ్యిమీదనున్న పాలు పొంగిపోవుచుండెను. బిడ్డను దించి యశోద పాలకుండను దింపబోయెను. పరమాత్మకు కోపము వచ్చెను. కృష్ణుడు రాతిని విసర కుండలోని పాలు నేల పాలయ్యెను. తల్లికి కోపము వచ్చి "కృష్ణా! పద్మగంధిపాలు నీకొఱకే వెచ్చబెట్టితిని. వాటిని నేలపాలొనర్చితివి. దీనికి తగిన శిక్ష విధింతును" అనెను. చిన్నికన్నయ్య ఆమెకు చిక్కక దూరముగ పరుగిడి రోటిని తిరుగవేసి దానిపై కూర్చుండెను. యశోద వానిని పట్టుకొనుటకు పరుగిడుచుండ ఆమె కొప్పుముడి వీడిపోయెను. పయ్యెద జారిపోవుచుండెను. శిరమున పువ్వులు రాలుచుండెను. ముచ్చెమటలు పోసెను. ఆమె బాగుగ అలసెను. యోగిపుంగవులు చిత్తము నిరోధించి ఏ వస్తువును పొందవలెనని యత్నించిరో, ఆ పరమాత్మను పట్టుకొనుటకు యశోద వ్యర్థప్రయత్నము జేసెను. ఆమె సొమ్మసిల్లెడు స్థితికి వచ్చెను.

పరమాత్మ ఆమె నిస్సహాయస్థితికి జాలినొంది తల్లికి పట్టువడెను. కన్నయ్య మోము జూడగనే ప్రేమ కడవె డయ్యెను. మరుక్షణమున కృష్ణుని కట్టివేయుటకు త్రాడు తెచ్చెను. అది చాలలేదు. గోపికలందరు వచ్చిరి. పెద్దత్రాడు తెచ్చిరి. చిన్నికృష్ణుని నడుము పన్ననిది. నువ్వు గింజంతయైనను పెరుగలేదు. పెద్ద త్రాడుచాలలేదు. వారి నిస్సహాయస్థితికి జాలినొంది కృష్ణుడు తల్లికి వశ డయ్యెను. ఆమె తెచ్చిన త్రాడు సరి పోయెను. ఆమె బిడ్డను రోటికి కట్టివేసెను. గోపికలు నందనందనునకు తగినశాస్తి యయ్యెనని పొంగిరి. వారు 'నందకుమారా! ఇక నీ ఆటలు సాగవు. జాగ్రత్త' అని వెనుదిరిగిరి. బాలకృష్ణుడు వెక్కివెక్కి యేడువ దొడంగెను; వ్రజవనితలకు నందకిశోరునిపై జాలి కలిగెను. కట్టూడదీసిన యశోదకు కోపము కలుగునని భయపడుచు మెల్లగ తమ తమ నెలవులకు జనిరి. యశోద నందరాజు కడకేగెను.

నందనందనుడు రోటిని యమునాతీర మందున్న రెండు మద్ది వృక్షముల నడుమ లాగికొనిపోవుచుండ, పెళపెళారావములతో అవి నేల గూలెను. ఆ వార్తను గోపబాలురు యశోదాదేవికి తెలిపిరి. తల్లి హృద యము తల్లడిల్లెను. తన తప్పిదమునకు ఆమె వెతనొందెను. వ్రజవని తలు ఆమెను యమునాతీరమునకు గొనిపోయిరి. మద్దివృక్షములు నేలపై పడియుండెను. నందకిశోరుడు గోపబాలురతో ఆడుకొనుచుండెను. మద్ది వృక్షములనుండి ఇరువురు పురుషులు వెలువడి, బాలకృష్ణుని పాదకమల ములకు ప్రణమిల్లి అంతర్హితులైరని గోపబాలురు నుడువ యశోదాదేవి చకితురా లయ్యెను.

ఆమె కట్టుత్రాడును ఊడదీసి చిన్నికృష్ణుని చంక నిడుకొని, పా లిచ్చి తనివిదీర ముద్దాడెను. గోపికలు తమ తప్పిదమును మన్నింపు మని పరమాత్మను వేడుకొనిరి. కృష్ణుని సాహసకృత్యమును గోపాలురు కొనియాడిరి. నందరాజు కన్నబిడ్డ లీలల అంతరార్థము గ్రహింపలేక పోయెను. మాయతెరలు ముప్పిరిగొనుటచే బాలుడు పరమాత్మ యను భావము స్ఫురింపక కన్నబిడ్డయని భ్రమ చెందుచుండెను.

## మద్దిమ్రాకుల పుట్టుక

మద్దివృక్షములనుండి వెలువడిన పురుషులు ఇరువురు కుబేరుని కుమారులు. నలకూబరుడు, మణిగ్రీవు లనువారలు. ఒకనాడు మందాకినీ నదియందు వా రిరువురు మద్యముగ్రోలి దేవతాస్త్రీలతో జలక్రీడ లాడు చుండిరి. దేవలుడు అను మహర్షి అచటికి వచ్చెను. దేవతాస్త్రీలు సిగ్గుతో వలువలు దాల్చిరి. నలకూబర, మణిగ్రీవులు ధన సౌందర్య గర్వముతో ఉడుపులు ధరింపలేదు. మహర్షిని లెక్క సేయలేదు. అందుచే దేవలుడు కుపితుడై వారిని మద్దిమ్రాకులు కండని శపించెను. వారు మునీంద్రుని పాదములకు ప్రణమిల్లి తప్పిదమును మన్నింపుమని వేడుకొనిరి. మహర్షి వారితో 'ద్వాపరయుగమున శ్రీకృష్ణపరమాత్ముని అనుగ్రహమునకు పాత్రులై యథారూపమును పొందుదురు' అని అభయ మొసగెను. నలకూబర మణిగ్రీవులే ఆ మద్దిమ్రాకులు.


## దుర్వాసుని గర్వభంగము

దుర్వాసమహర్షి శ్రీకృష్ణపరమాత్మను దర్శించుటకై నందవ్రజ మునకు విచ్చేసెను. యమునానది ఇసుకతిన్నెలపై గోపబాలురతో ఆడు కొను బాలకృష్ణుని జూచెను. ధూళిధూసరితమైన దేహము. కౌపీనము గూడ లేకుండ గోపబాలురతో కృష్ణుడు కుస్తీలు పట్టుచుండెను. ఇసుక తిన్నెలపై దొర్లుచుండెను. వక్రములైన ముంగురులు, రత్నఖచిత సువర్ణాభరణములు ధరించి మనోహరముగ కన్పట్టెను. ఆ బాలుడు పర మాత్మ కాడని, నందనందనుడు మాత్రమే యని భ్రమచెందెను.

బాలకృష్ణుడు సింహపుపిల్లవలె పరుగున వచ్చి మహర్షితొడపై కూర్చుండెను. ప్రేమతో మహర్షిని జూచుచు మందహాసము జేసెను. ఆ నవ్వులలోని మర్మమేమో గాని దుర్వాసుడు బాలకృష్ణుని జూచి మోహితు డయ్యెను. నందకిశోరుని ఉచ్ఛ్వాసముతో బాటు మహర్షి పరమాత్మ బొజ్జలోని కేగెను.

అందు విరజానది, గోలోకము, గోవర్ధనగిరి, యమునానది, అందలి ఇసుకతిన్నెలు, నికుంజములు, గోపగణములు, గోపికాగణములు, కల్పవృక్షములు, కోటిసూర్యచంద్రాదుల వెలుగు, సహస్రదళపద్మము, దానిపై అష్టదళపద్మము, అందు రాధాకృష్ణులు ఆసీనులైయుండిరి. ఆ అద్భుత దృశ్యమును జూచి మహర్షి చకితు డయ్యెను. వారు మహర్షినిజూచి నవ్వుకొనిరి. పరమాత్మ నిశ్వాసముతో బాటు దుర్వాసుడు వెలికి వచ్చెను. ఎదుట బాలకృష్ణుడు కనబడెను. తన తప్పిదమును మన్నింపుమని దుర్వాసుడు వేడుకొనెను. శ్రీకృష్ణుడు మందహాస మొనర్చెను. దుర్వాసుడు బదరికావనమున కేగెను.

గోలోకఖండము సమాప్తము.



## బృందావన ఖండము

నందరాజు వ్రజమండలి ఆబాలగోపాలమును రప్పించెను. నవ నందులు, ఉపనందులు, షడ్వృషభానులును అందుండిరి. నందుడు వారితో "వ్రజవాసులారా! వ్రజమున సంభవించిన ఉత్పాతములను జూచితిరి. పూతన, శకటాసుర, యమళార్జునములు మున్నగునవి కంస ప్రేరితములే. ఇక ఎట్టి ఉపద్రవములు రానున్నవో అనూహ్యము. భవిష్యత్కార్యక్రమమును గూర్చి ఆలోచించి తమ అభిప్రాయముల దెలుపుడు."

సన్నందుడు వ్రజమునకు పెద్ద. అనుభవశాలి, దూరదృష్టికలవాడు. బలరామకృష్ణులను తొడలపై నిడుకొని నందరాజుతో "రాజా! బలరామ కృష్ణులు వ్రజమునకే బిడ్డలు, వీరే ప్రాణము. శ్రీకృష్ణుడు వ్రజమునకు సంపత్తు. సర్వలోక ప్రకాశకుడు. వీనిపై మన బ్రతుకులు ఆధారపడి యున్నవి. అందుచే నందవ్రజము వదలివెళ్ళుట శ్రేయస్కరము.

### బృందావనము

మధురామండలమున ఇరువదినాలుగు వనములు గలవు. అందు బృందావనము తగినతావు. దాని విస్తీర్ణము ఎనుబదినాలుగు క్రోసులు. ప్రకృతివికారము లేదు. తీర్థరాజగు పుష్కరుడు బృందావనమును పూజించును. అచట గోవర్ధనగిరి, యమునానది, అందలి మనోహరమగు ఇసుకతిన్నెలు గలవు. అందు బృహత్సానువు ఇరువదిక్రోసుల విస్తీర్ణము గలదై పచ్చికబయళ్ళతో కళకళలాడుచుండును. గోవులకు సమృద్ధిగ పచ్చిక దొరకును. కల్పవృక్షములు, లతానికుంజములు, పూపొదరిండ్లు, నిర్మలోదకమును గొనివచ్చు సెలయేళ్లు, స్వర్ణకమలములతో నిండిన రమణీయ సరస్సులు గలవు. వాటియందు రాజహంసలు విలాసముగ నడయాడుచుండును. అందుచే బృందావనము మనకు వాసయోగ్యము" అని హితము పలికెను.

## తీర్థరాజము

పూర్వము బ్రహ్మదేవుడు నిదురలోనుండ శంఖాసురుడగు రక్కసుడు వేదముల సంగ్రహించెను. దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థింప ఆయన మత్స్యావతారము దాల్చి ప్రళయసముద్రములో దాగిన శంఖాసురునితో పోరుసల్పుచుండ, వాడు శ్రీహరిని గదతో నొసటను మోదెను. అచ్యుతుడు సుదర్శనచక్రమును ప్రయోగించి వానిగదను నూరుముక్కలు చేసెను. శంఖుడు శిరముతో మాధవుని బలముగ క్రుమ్మెను. గోవిందుడు వాని వెన్నెముకను బ్రద్దలు గావించెను. శంఖుడు శ్రీమన్నారాయణుని వక్షఃస్థలమును మోదెను. మధుసూదనుడు చక్రప్రయోగముతో శంఖుని శిరమును ఖండించెను. వేదములను చతుర్ముఖునకు ప్రసాదించెను. బ్రహ్మయజ్ఞము పూర్తి గావింపబడెను. ఆ పవిత్రస్థలమే ప్రయాగ. గంగా యమునలు ఇరుగడల చామరములు విసరుచుండ, సర్వతీర్థములు ప్రయాగయందు సంగమించినవి. అవి ప్రయాగుని తీర్థరాజుగ అభిషేకించినవి.

## గోవర్ధనగిరి

గోవర్ధనగిరి శాల్మలీ ద్వీపమున ద్రోణాచలమునకు పుత్రుడుగ జన్మించెను. భరతవర్షమున పశ్చిమతీరమందు శాల్మలీద్వీపము గలదు. హిమవత్పర్వతము మేరుపర్వతమును దర్శించుటకు వచ్చినవి. అవి గోవర్ధనగిరికి ప్రదక్షిణము గావించి "ఓ గోవర్ధనగిరిరాజా! నీవు పరమాత్మకు విహారస్థలివి. మా కెల్లరకు నీవే రాజువు. బృందావనమునకే అలంకారప్రాయమైన వాడవు. గోలోకమునకు కిరీటమువంటి వాడవు" అని స్తుతియించిరి. శైలరాజమని బిరుదిడిరి. పిమ్మట వారు తమ తమ నెలవులకు జనిరి.

నవబ్రహ్మలలో ఒకడగు పులస్త్యబ్రహ్మ గోవర్ధనగిరికి జనెను. అచటి మాధవీలతలు, పూలగురువింద మొక్కలు, సెలయేళ్ళు, అత్యద్భుతమగు గుహలు, పెక్కుగైరిక ధాతువులు, లేళ్ళు, రంగురంగుల పక్షిజాతులు, మయూరములు, శతశిఖరములతో నొప్పారుచు, కనులపండు

వుగ నుండెను. తపమునకు తగిన నెలవని తలచుచు, పులస్త్యబ్రహ్మ ద్రోణపర్వతము కడకేగి "ఓ పర్వతరాజమా! నీ తనయుడగు గోవర్ధన గిరిని నా కొసగుము" అని కోరెను. 'తమ నివాసమేడ' అని ద్రోణపర్వతము పులస్త్యుని అడుగ, ఆయన 'నా నివాసము విశ్వేశ్వరుడు ఆవిర్భవించిన తావు, ఈశ్వరునకు విహారస్థలమగు వారణాసి. దానినే కాశి యందురు. అచట విష్ణుపాదము అందు ఉద్భవించిన గంగ గలదు. అచట పర్వతములు లేవు. కాశిలో మృతినొందిన వారికి ముక్తి లభించును. నీ తనయుడగు గోవర్ధనగిరి గుణసంపన్నుడు. గోవర్ధనగిరిపై తపము జేయువలెనని కోరిక గలదు. నీవు తలచినమాత్రముననే నీ తనయుడు నీకు కన్పించును' అని అభయ మొసగ ద్రోణపర్వతము అంగీకరించెను.

గోవర్ధనగిరి పులస్త్యునితో 'ఓ మహర్షి! ఐదు ఆమడల పొడవు, రెండు యోజనములు వెడల్పు గలిగిన నన్ను కాశీక్షేత్రమునకు ఎటుల కొనిపోవుదువు' అన, 'అరచేతియందు బంతివలె నుంచుకొని కొనిపోవుదును' అని పులస్త్యుడు పలికెను. 'మధ్య నిలుపకుండ ప్రయాణము సాగింపవలెను' అని గోవర్ధనగిరి పట్టుపట్టెను. అందులకు అతడు అంగీకరించెను.

పులస్త్యుడు గోవర్ధనగిరిని అరచేతియం దుంచుకొని వారణాసికి పయనమయ్యెను. అతడు బృందావనమును ప్రవేశించినంతనే గోవర్ధనగిరికి శ్రీకృష్ణపరమాత్మ జ్ఞప్తికి వచ్చి పరవశుడై 'ద్వాపరాంతమున శ్రీకృష్ణుడు బృందావనమున విహరించుచు తన లీలలను అద్భుతముగ ప్రదర్శించును. నేను ఇచట నిలిచినచో పరమాత్మ లీలలను దర్శించుటయే గాక, ఆ మహాపురుషుని పాదరజముతో పవిత్రుడ నగుదును' నని భావించి బరువెక్కెను. పులస్త్యుడు లఘుశంకకు కూడ వెళ్ళవలసివచ్చెను. శపథమును మరచి బృందావనముపై గోవర్ధనగిరి నుంచి కాలకృత్యము దీర్చుకొని శుచియై రమ్మని కోవర్ధనగిరిని ప్రార్థించెను. అతడు మౌనము వహించెను. శక్తికొలది గిరిని ఎత్తుటకు యత్నించి పులస్త్యుడు విఫలుడయ్యెను, 'మధ్యలో నిలుపగూడ' దను శపథము నెరవేరలేదని గోవర్ధన

గిరి పట్టుపట్టెను. పులస్త్యుడు కోపోద్రిక్తుడై 'నీవు నిత్యము నువుగింజంత తరిగిపోదువు' అని గోవర్ధనగిరిని శపించెను. అతడు జంకలేదు. పులస్త్యుడు నిస్పృహతో కాశీక్షేత్రమునకు మరలెను.

## యమునావాపది

యమున గోలోకమున శ్రీకృష్ణపరమాత్మ వామభాగము నుండి ఉద్భవించినది. శ్రీమన్నారాయణుని పనుపున భూలోకమున అవతరించి గంగ విరజ అను పేరులతో రెండుగ చీలిపోయెను. పరిపూర్ణతమమైన యమున గోలోకమునుండి నికుంజద్వారము గుండా బయలుదేరి విరజా నదిలో గలిసెను. అచటినుండి శరవేగముతో గంగాయమునలు బయలుదేరి, గంగ హిమవత్పర్వతము వైపునకు, యమున కళిందపర్వతము వైపునకు సాగెను. అందుచే గంగకు హైమవతి అనియు, యమునకు కాళింది అనియు పేరులు గలిగెను, గంగ పాతాళలోకమున భోగవతియని, స్వర్గమున మందాకిని యనియు పిలువబడుచుండెను. యమున సప్త సముద్రములు దాటి ధ్రువలోకమున కేగి, అటనుండి వైకుంఠమునకు జని, వెనుదిరిగి గోలోకమున కేగెను.

## బృందావనము

నందరాజు వ్రజమును బృందావనమునకు బయలుదేరుడని చాటించెను. వేకువను నందరాజు, బలరామకృష్ణులు ఒక రథమందును, యశోదా రోహిణులు వేరొక రథమునను, వృషభానుడు, రాధాదేవి గజరాజుపైనను, నందులు, ఉపనందులు అశ్వములపైనను, గోపబాలురు, గోపకులు ఎడ్లబండ్ల మీదను శుభసమయమున బయలుదేరిరి. భూసురోత్తములు స్వస్తివాచకములు పలుకుచుండిరి. మంగళవాద్యములు మనోహరముగ మ్రోగుచుండెను.

పాలు, పెరుగు, వెన్న, మీగడల కుండలు, మృష్టాన్నములు బండ్లపై భద్రముగ నుంచిరి. శ్రీకృష్ణపరమాత్మకు జయము, బలరామునకు జయము అని పలుకులు బృందావనయాత్రికులు బయలుదేరిరి. ఏ నోట వినినను పరమాత్ముని లీలలే. చంద్రుడు బృందావనయాత్రికులకు

వీడ్కో లొసగెను. సూర్యభగవానుడు వారికి స్వాగతము పలికెను. మార్గ మధ్యమున సెలయేళ్లగట్లపై చల్దులు, మృష్టాన్నములు వడ్డించబడెను. పాలు, పెరుగు, వెన్న, మీగడ విరివిగ నొసగిరి. కడుపునిండుగ మెక్కిన వారు కదలలేకుండిరి. కొంతతడవు వారు విశ్రమించిన పిమ్మట మరల పయనమైరి.

యమునానది ఇసుకతిన్నెలు, సెలయేళ్లయందలి నిర్మలోదకము, పచ్చికబయళ్లతో నొప్పారు గోవర్ధనగిరి, పలురకముల ఫలపుష్పభరిత మగు వృక్షములతో, పూపొదరిండ్లతో, నికుంజములతో, రాజహంసలు విహరించు రమణీయ సరస్సులతో, మలయపర్వత సానువులనుండి వీచు పిల్లవాయువులతో, సారసపక్షుల మధురగానముతో, పురివిప్పి నాట్యము చేయు మయూరములతో నిండిన బృందావనము వ్రజవాసులను మిక్కిలి ఆకర్షించెను. వ్రజమును మరపించుచున్నదని వారు మెచ్చుకొనిరి. అర్ధచంద్రాకృతిలో వృషభానుడు నాలుగు ఆమడల పట్టణము నిర్మిం చెను. నందరాజు మరియొక పట్టణమును నిర్మించి వ్రజవాసుల నందుం చెను.

బలరామకృష్ణులు దినదినాభివృద్ధి నొందుచుండిరి. వారికి గోవులు గాయు పయసు వచ్చినది. గోవులను తోలుకొని, గోపాలురతో పచ్చిక బయళ్లలో విహరించుచుండిరి. కాళిందీనది ఇసుకతిన్నెలు వారికి విహార స్థలము లయ్యెను. బలరాముడు నీలాంబరమును ధరించును. శ్రీకృష్ణ పరమాత్మ పసుపుపచ్చని పీతాంబరము దాల్చును. అతడు వేణుగానము చేయ ఆ మధురగానము విని సకలజీవరాసులు తన్మయత్వము జెందు చుండెను. గోవులు చెవులు ఓరగిలపెట్టుకొని వేణుగానము వినుచు, పర మాత్మ ధ్యాననిమగ్నము లయ్యెను. బ్రహ్మానందసముద్రమున నోలలాడు చుండెను.

శ్రీకృష్ణుడు పక్షులనీడలలో పరుగెత్తును. నెమళ్ల లేళ్ల గుంపుల వెంటబడును. పరిమళ పుష్పములతో గోపబాలురను అలంకరించును. కోతికొమ్మంచులు, బిళ్లంగోళ్లు ఆడును. చల్దులబెట్టి గోపబాలురు శ్రీకృష్ణుని మెప్పును పొందుచుండిరి. పరమాత్మ వారి వింతకోర్కెల తీర్చుచుండెను.

యమునానదిలో జలకమాడును. ఎంతపిలిచినను వెలికిరాడు. లోతులకు బోవుచు, తాను మునుగుచు గోపబాలురను ముంచుచుండ, వారు వినోదముగ శ్రీకృష్ణునిపై నీరు చిమ్ముచుండిరి. సందెవేళకు గోవులతోలుకొని పరమాత్మ గోపబాలురతో ఇంటికి చేరుచుండెను.

## వత్సాసురుడు

కంసప్రేరితుడై వత్సాసురుడు అను రక్కసుడు లేగదూడయై శ్రీకృష్ణుని ఆలమందలో గలిసి తిరుగుచుండెను. పరమాత్మ వత్సాసురుని గమనించెను. వాడు మెల్లమెల్లగ నందకిశోరుని సమీపించి కాలితో తన్నెను. పరమాత్మ ఆ రక్కసుని రెండుకాళ్ళు పట్టుకొని గిరగిర త్రిప్పి వెలగచెట్టుకు కొట్టెను. వాడు పరమపదము నొందెను. వెలగచెట్లు నేల కొరిగి పండ్లు రాలెను. ఆ రక్కసునిలోనుండి తేజఃపుంజము బయలుదేరి పరమాత్మలో గలిసెను.

## వత్సాసురుని చరిత్ర

మురాసురుడను దానవుని కుమారుడు ప్రమీలుడు. వాడు విప్రవేషమున వసిష్ఠాశ్రమమునకు జని, నందినీధేనువును తనకు దానమొసగు మనెను, వసిష్ఠమహర్షి మిన్నకుండెను. నందినీధేనువు ప్రమీలుని మాయను గ్రహించి 'అసురస్వభావము గల లేగదూడ వగుదువుగాక!' అని శపించెను. తప్పిదమును మన్నింపుమని ప్రమీలుడు ధేనువును వేడుకొనెను. ద్వాపరాంతమున శ్రీకృష్ణుని ఆలమందలో జొరబడి సంహరింపబడి మోక్షము నొందెద వని అభయ మొసగెను. ఆ ప్రమీలుడే వత్సాసురుడు.

## బకాసురుడు

యమునానదీతీరమున శ్రీకృష్ణుడు గోపబాలురతో గూడి గోవులు కాయుచుండ బకాసురుడను పెద్దకొంగ అచటికి వచ్చెను. అది కైలాసమంత ఎత్తు. దాని అరుపు మేఘగర్జనవలె నుండును. దానిని జూచి గోపబాలురు భయపడిరి. వజ్రతుల్యమగు ముక్కుతో బకాసురుడు శ్రీకృష్ణుని నోటిలో వేసుకొని మ్రింగెను. అది చూచి గోపబాలురు ఏడువ

దొడంగిరి. దేవేంద్రుడు వజ్రాయుధము ప్రయోగించెను. బ్రహ్మ దండమును విసరెను. బకాసురుడు రెక్కలు విదిలించుచు, అదలించుచు, శరీరమును విరుచుకొనుచు గర్జించెను. ఈశ్వరుడు ఒకరెక్కను విఱుగగొట్టెను. వాయుదేవుని వాయవ్యాస్త్రము నిర్వీర్యమయ్యెను. యముడు దండముతో కొట్టినను వాడు చావలేదు. దండము మాత్రము విరిగెను. సూర్యుని వేయిబాణములు పనిచేయలేదు. చంద్రుడు నీహారాస్త్రము వేయ బకుడు లక్ష్యపెట్టలేదు. అగ్నిదేవుని ఆగ్నేయాస్త్రమునకు వాని రోమములు కాలెను. వరుణుడు పాశముతో గొట్టెను. భద్రకాళి గదాదండమును విసరెను. బకాసురుడు మూర్ఛనందెను. కుమారస్వామి శక్త్యాయుధమునకు బకునికాలు విరిగెను. ఒంటికాలితో వాడు ఆకసమున నెగురుచు దేవతలను తరిమి యథాస్థానమునకు జేరెను. మహర్షులు కృష్ణ పరమాత్మను ధ్యానము చేయుచుండిరి. పరమాత్మ బకుని ఉదరము చీల్చి నల్లొనర్చెను. ఊపిరి సలుపలేక బకుడు ఉమిసెను. పరమాత్మ వెలికి వచ్చెను. శ్రీకృష్ణుడు బ్రతికియుండెనని బకుడు ముక్కుతో పరమాత్మని పొడిచెను. నందకిశోరుడు బకుని రెండు ముక్కు పుటములను పట్టుకొని విరిచెను. బకుడు మృతినొందెను. దేవతలు పరమాత్మపై పుష్పవృష్టి కురియించిరి. బకుని తేజస్సు పరమాత్మునిలో లీనమయ్యెను. గోపబాలురు శ్రీకృష్ణుని కౌగిలించుకొనిరి. ఆపద తొలగినందుకు కడు సంతసించిరి. ఆ వార్తను యశోదాదేవికడ ఏకరువు పెట్టిరి.

## బకాసురుని చరిత్ర

బకాసురుడు హయగ్రీవుడను రక్కసుని కుమారుడు. పేరు ఉత్కలుడు. బలపరాక్రమములు గలవాడు. దేవేంద్రుని జయించి స్వర్గాధిపతియై నూరేండ్లు పాలించెను.

ఉత్కలుడు జాజలిమహర్షి ఆశ్రమసమీపమున సింధుసాగర స్థలమున చేపలు పట్టుచుండెను. మహర్షి వానితో "ఓయీ జీవహింస మహాపాపము" అనెను. ఉత్కలుడు మూర్ఖుడు. మునీంద్రుని పలుకులను విశ్వసింపలేదు. చేపలు పట్టుట మానలేదు. అందుచే మహర్షి కుపితుడై 'నీవు బకుడవు (కొంగవు) కమ్ము' అని శపించెను.

తన తప్పిదమును షున్నింపుమని ఉత్కలుడు మహర్షిని వేడుకొనెను. ద్వాపరాంతమున శ్రీకృష్ణపరమాత్మ గోవులను కాయు సమయమున శాపవిముక్తి కలుగు ననియు, ముక్తి నొందుదు వనియు అభయ మొసగెను. ఆ ఉత్కలుడే బకాసురుడు.

## అఘాసురుడు

గోపబాలురు చల్దిచిక్కములను బట్టుకొని, గోవులను తోలుకొని యమునాతీరమందలి పసిరికబయళ్లలో తిరుగుచుండిరి. శ్రీకృష్ణుడు గోపబాలురతో కప్పగంతులు వేయుచు, మయూరనృత్యము చేయుచు, కోతికొమ్మచ్చు లాడుచు, చెడుగుడుఆటల నాడుచు, జలక్రీడలు సలుపుచు ఉల్లాసముతో నుండెను.

బ్రహ్మజ్ఞులు పరమాత్మని పరబ్రహ్మగ దర్శించు చుండిరి. భక్తులు భగవానునిగ కొలుచుచుండిరి. యోగులు నేతినేతి వాక్యములతో తర్కించి చూచుచుండిరి. వారు సమాధిస్థితియందు పరమాత్మను హృదయకమలమున నుంచుకొని స్మరించుచుండిరి. దాస్యభక్తులు సేవ లొనర్చుచు సంతసించుచుండిరి. గోపబాలురు అదృష్టశాలురు. పరమాత్మతో ఆడుకొను మహద్భాగ్యమునకు నోచుకొనిరి. సఖ్యభక్తిచే వారు తరించిరి.

అఘాసురుడు బకాసురుని జ్యేష్ఠ కుమారుడు. వాడు కంస ప్రేరితుడై పరమాత్మను కాటువేయుటకై సర్పరూపమున యమునాతీర ప్రాంతమునందు వేచియుండెను. దాని పై పెదవి మేఘమండలమును క్రిందిపెదవి భూమిపైనను తెరచియుండెను. అది ఒక కొండబిలమని భ్రమసి పరమాత్మపైనున్న విశ్వాసముతో గోవులతోకూడ గోపబాలురు అందు ప్రవేశించిరి. ఆ సర్పము పరమాత్మకొఱకు వేచియుండెను. నంద కిశోరుడు గోవులను తోలుకొని అందు ప్రవేశించెను. అఘాసురుడు నోరు మూసెను. దాని విషవాయువులకు గోవులు, గోపబాలురు మృతినొందిరి. పరమాత్మ సర్పముయొక్క నవరంధ్రములను బిగించెను. వాని ఉదరము ఉబ్బెను. సర్పముపొట్ట పగిలెను. పరమాత్మ వెలికి వచ్చెను. పర

మాత్ముని సంకల్పమాత్రముచే గోవులు, లేగదూడలు, గోపాలురు పునర్జీవితులైరి. ఆనందోత్సాహములతో గోపబాలురు నందనందనుని ఎత్తుకొని జయజయ ధ్వానములు చేసిరి.

## అఘాసురుని చరిత్ర

అఘాసురుడు శంఖుడను రాక్షసుని కుమారుడు. బలిష్ఠుడు. చక్కనివాడు. యౌవనుడు. ఇతరులను నిందించు స్వభావము గలవాడు. వాడు అష్టావక్రమహామునిని జూచి 'ఇన్ని వంకరలేమి!' అని హేళన చేసెను. మహర్షి కుపితుడై 'ఓరీ! నీవు సర్పరూపము దాల్తువు గాక' అని శపించెను. తన తప్పును మన్నింపుమని అఘాసురుడు మునీంద్రుని వేడుకొనెను. 'నీ ఉదరమున పరమాత్మ ప్రవేశించిన వెంటనే నీకు ముక్తి కలుగును' అని మహాముని వానికి శాపమోక్షమును ప్రసాదించెను. ప్రతిమారూపమున స్మరించినంత మాత్రమున తరింతురని చెప్పుదురే. ఇక పరమాత్మ తానే స్వయముగ ఉదరమున ప్రవేశించినచో ముక్తి లభించుట ఆశ్చర్యము కాదు గదా!

## చల్దులు ఆరగించుట

శ్రీకృష్ణపరమాత్మ గోపబాలురతో 'ఈ స్థలము కడురమ్యముగ నున్నది. యమునానది యందలి స్వర్ణకమలములనుండి పరిమళమును గొని పిల్లవాయువులు ఆహ్లాదకరముగ వీచుచున్నవి. గోమాతలు, లేగదూడలు పసిరిక మేయుచుండును. చల్దులు ఆరగించుటకు రండు' అని కేక వేసెను.

గోపబాలురు బంతులుదీరి కూర్చుండిరి. నడుమ నందకిశోరుడు కూర్చుండెను. అందరికి కన్పించుట లేదు. వారు శ్రీకృష్ణునితో 'నందనందనా! నీ దర్శనము గానిచో ముద్ద లోనికి పోవుటలేదు. అందుచే నీవు అందరకు కన్పింపవలెను' అని వేడుకొనిరి. సరేయని పలికి పరమాత్మ వారియెదుట కూర్చుండెను. ప్రతియొక్కడు కృష్ణుడు తమచెంత నున్నటుల భ్రమజెంది కడు సంతసించిరి.

కొందరు అరటిఆకులు, లేచిగుళ్ళు, రాతిపలకలు, మరికొందరు పద్మములు కంచములుగ నుంచి వాటియందు చల్దులనుంచి ఆరగించు చుండిరి. వారు 'కృష్ణా! ఈ మీగడ పెరుగు చద్ది రుచిచూడు. ఈ పిండి వంటకములు తిను. ఈ ఊరగాయ నంజుకో' అని మోమోట పెట్టు చుండిరి. పరమాత్మ ఎడమచేతియందు మీగడపెరుగుముద్ద, కుడిచేతి వ్రేళ్లసందున ఊరగాయల నుంచుకొని మెక్కుచు, వారితో నల్లాపము లాడుచుండెను. వారు తెచ్చుకొనిన చల్దులు కొంచెమైనను, పరమాత్మ లీలచే బహుళము గాజొచ్చెను. ఎంత తినినను తరుగుట లేదు.

ఆ దృశ్యమును జూచిన దేవతలు అచ్చెరు వొందుచు, 'ఇది ఏమి వింత! వాజపేయము, పౌండరీకములో అహ్వానించినను హవిర్భాగము స్వీకరించని పరమాత్మ గోపబాలుర యెంగిలి చల్దులు తనివితీర స్వీక రించుచున్నాడు. గోపబాలురు ఎంతటి అదృష్టశాలులో!' అని పొగడు చుండిరి. గోపబాలురు యమునానది కేగి చేతులు కడుగుకొనుచుండ, దేవతలు మత్స్యరూపమున, కూర్మరూపమున నదిలో ప్రవేశించి మహా ప్రసాదమని ఆస్వాదించుచుండిరి. పరమాత్మ గోపబాలురను చేతులను చెట్లబోదెలకు పూయుడనెను. దేవతలు క్రిమికీటకాదులై సేవించుచుం డిరి. పరమాత్మ గోపబాలురను చేతులను దేహములకు అలముకొను డనెను. దేవతలు ఆశ్చర్యచకితులైరి. చల్దు లారగించిన గోపాలురకు గోమాతలు, లేగదూడలు కన్పింపలేదు. 'కలవర మెందుకు! త్రుటిలో వాటిని దెత్తును' అని అభయ మొసగెను.

తానే సృష్టికర్తనను అహంకృతితో గోవులను, లేగదూడలను తన మాయాకోశమందు బ్రహ్మ దాచెను. పరమాత్మ తానే గోమాతలుగ, లేగ దూడలుగ, గోపబాలురుగ వ్రజమున ప్రవేశించెను. గోవులు, లేగదూడలు గోపబాలురు తమ తమ గృహముల కేగిరి. పరమాత్మ వేణుగానము చేయుచుండ, ఆ మధురధ్వనికి గోమాతల పొదుగులు క్షీరసేచనము సేయుచుండెను. లేగదూడలు వాటిని విడుచుట లేదు. వ్రజవనితలు బిడ్డలను జేరదీసి పాలిచ్చుచుండిరి. అది 'పరమాత్ముని మాయ' అని బలరామస్వామి తలచెను. అతడు కనులు మూసికొన సర్వము శ్రీకృష్ణ మయముగ గోచరించెను. 'నేనే అన్నిటియందు నిలిచియుంటిని' అని పరమాత్మ వానికి సైగ జేసెను.

బ్రహ్మ వ్రజమున కేగ గోమాతలు, లెగదూడలు, గోపబాలురు వారి వారి ఇండ్లయం దుండిరి. తాను దాచినవి తన మాయాకోశమందే యుండెను. అతడు తన అవివేకమునకు సిగ్గిలుచు పరమాత్మకు ప్రణమిల్లెను. ఆనందబాష్పములు కురియుచుండ బ్రహ్మ పరమాత్మను అభిషేకించి ఇటుల స్తుతించెను.

## బ్రహ్మస్తవము

మెరపుతీగతో గూడిన మేఘమువలె శ్యామసుందరుడు పీతాంబరమును ధరించి శిరమున నెమలిపింఛము, నుదుట కస్తూరీతిలకము, మెడలో పూలగురువింద గింజలసరులు, అరచేతిలో వెన్నముద్ద, చంకను వేణువు ధరించి గోవుల గాయుచు మందహాస మొనర్చు నందకిశోరుని స్మరించుకొని బ్రహ్మ ఇటుల స్తుతించెను.

"ఓ నందనందనా! నీవు భక్తపరాధీనుడవు. ఎవరికి ఎట్టిరూపము ప్రీతికరమో అట్టి రూపమును దాల్తువు. నీ ఉపనిషద్రూపము గ్రహింపలేకుంటిని. ఏ సాధనద్వారానైనను నీ అనురాగము పొందవచ్చును. నీ యందు పూర్ణభక్తిలేమిచే సృష్టికర్తనను అహంకారముతో గోమాతలను, లేగదూడలను అపహరించి అకృత్యమున కొడిగట్టితిని. నిన్ను నిర్గుణునిగ తెలియగలను. నీ సగుణరూపమును గ్రహించుట దుర్లభముగ కనబడుచున్నవి. అనేక రూపములతో కన్పింతువు. నిన్ను పూర్ణునిగ తెలిసికొనుట అసాధ్యముగ తోచుచున్నది. నీవు గుణస్వరూపుడవు. అప్పుడు గుణములకు ప్రాకృతత్వము పోవును.

నీ కల్యాణగుణములు కొల్లలు. అనంతములు. శారదాదేవి నీగుణగణములను వ్రాసెను. నీ లీలలను వ్రాయలేక వదలివేసెను. నక్షత్రములను, ఇసుకరేణువులను, పరమాణువులను, హిమబిందువులను లెక్కింపవచ్చును. కాని నీ అనంతరూపము నరయుట దుర్లభము.

అచ్యుతా! నన్నుబోలిన బ్రహ్మలు నీలో నెందరో గలరు. అగ్నిజ్వాలలకు అగ్నివి నీవే. అనేక బ్రహ్మాండములు నీ రోమకూపములలో నడయాడుచున్నవి. ఈ బ్రహ్మాండము నీలో నున్నది. నీవు లేనిచోటు లేదు. అందుచే వాత్సల్యముతో నన్ను రక్షింపుము.

నీవు సర్వమునకు ఆధారభూతుడవు. తల్లివైనను తండ్రివైనను నీవే సకలలోక సాక్షివి. నీవు జీవసముదాయ మగుటచే నారాయణుడ వైతివి. నేను ఆవిర్భవించినపుడు అంతయు జలమయముగ నుండెను. నేను నిలబడిన తావు తెలియలేదు. కమలనాళమందు వెదకితిని. అనేక బ్రహ్మాండములు కనబడెను, అంతు తెలియక యథాస్థానము చేరితిని. తీవ్రముగ ఆలోచించుచుండ 'తప తప' అను శబ్దము వినబడెను. అంతట నిన్ను గూర్చి తపముచేయ నీవు జలరూపమున గోచరించితివి. క్షీరసాగర మందు శయనించినది నీవే. నేను నీ నాభికమలమందు ఉద్భవించితిని. నీ తనయుడను, రక్షింపవా ప్రభూ!

ఓ యశోదపట్టీ! నీ నోటియందు సకల బ్రహ్మాండములు చూపి నీ దివ్యత్వమును రుజువు చేసికొంటివి. నీ నోటిలో నీవుగూడ కన్పించితివి. నీవు బాలుడవు కావు. నీచే కల్పింపబడిన గోవులను, లేగదూడలను ఎచట దాచితివి?

గోవిందా! నన్ను కనికరించి బృందావనమున నీ భక్తునిగ జన్మించునటుల జేయుము. అందలి పరమభక్తుల పాదధూళి నా శిరమున దాల్తును. అందుచే నా అహంకారము నశించును.

ముకుందా! మోక్షముకన్న నీ యందలి భక్తి శ్రేష్ఠమైనది. వ్రజ వాసులు ఎంతో అదృష్టశాలురు. గోమాతలుగ, లేగదూడలుగ, గోపాలకు లుగ అనేక రూపములతో క్షీరసేవన చేసియుంటివా? నీ పాదరజముచే బృందావనము పూతమయ్యెను. పరమాత్మ స్వరూపుడవగు నీవు గోప బాలురతో సఖ్యము చేసితివి. వారు నీతో ఆడుకొనిరి. ఎంతటి భాగ్య శాలురు! మహాయోగులకు సైతము లభింపని వస్తువు వారికి లభించినది. వ్రజవాసులు సర్వస్వము నీకే అర్పించుకొనిరి. ఋణవిముక్తికై వారికి దాస్యము చేయుచుంటివా? అట్టి బృందావనిలో చీమగనైనను, దోమగ నైనను జన్మించునటుల చేయుము.

నందకిశోరా! త్రేతాయుగమందలి శ్రీరామచంద్రమూర్తివి నీవే. నీ భక్తుల పాదధూళి నీ పూజామందిరమందలి బరణిలో భద్రముగ దాచు కొందువని అందురు. అది సత్యమేనా? వేదములు సైతము వ్రజవనిత

లయ్యె ననుట నిజమేనా? సమస్త ప్రపంచము నీవే అని విశ్వసించి ఆత్మార్పణ చేయుచున్నాను. ప్రేమతో ఒక పుష్పము సమర్పించిన నీవు తృప్తి పడుదువట. నా అజ్ఞానమును నశింపచేసి నన్ను నీ భక్త కోటిలో చేర్చుకొనుము" అని ప్రార్థింప పరమాత్మ బ్రహ్మదేవుని స్పృశించి లేవ నెత్తెను. చతుర్ముఖుడు శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహమును చూచి మురిసి ప్రణమిల్లెను. పిమ్మట బ్రహ్మ సత్యలోకమున కేగెను,

## కలవరము

శ్రీకృష్ణుని సాహసకృత్యములను విని యశోదాదేవి కలవర మొందెను. తా నెంత మందలించినను కృష్ణుడు దుడుకుతనము మానలేదు. గోకులమున ఉత్పాతములు గలుగుచున్నవని కదా తాము బృందావనమునకు వచ్చినది? కాని ఆపదలు తప్పలేదు. నందకిశోరుని గోవులకాయుటకు పంపనని యశోదాదేవి పట్టుపట్టెను. ఆమె కన్నీరుమున్నీరుగ నేడువ దొడంగెను.

నందరాజు ఆమెతో "ఇదేమి వెర్రి! శ్రీకృష్ణుడు సామాన్యబాలుడు కాడని, గోలోకనాథుడని గర్గమహర్షి చెప్పెను కదా! విపత్తులు వచ్చినను మేఘములవలె తేలిపోవుచున్నవి. బిడ్డ భద్రతకొరకు అనేక దానములు చేయుము. అరిష్టములు కలుగకుండుటకై అన్నదానము విరివిగ సలుపుము" అని హితవు పలికెను. యశోదాదేవి బలరామ కృష్ణులచే పెక్కు దానములు చేయించెను. వ్రజవాసులకు మృష్టాన్నము నొసగి తృప్తుల గావించెను.

## ధేనుకాసురుడు

బలరామకృష్ణులు గోవులను, లేగదూడలను చక్కగా అలంకరించిరి. వాటి మూపురములు, కైలాస మేరుపర్వతములవలె నున్నవి. కొమ్ములు కుండలవలె మెరిసి కడవలకొలది పాలిచ్చుచుండెను. వివిధవర్ణములతో గూడిన ఆలమందలు కనులపండువుగ నున్నవి.

తనపై గోధూళి వడుటకై శ్రీకృష్ణుడు ఆలమందల వెనుక నుండు వాడు. పరమాత్మ దర్శనముకానిచో గోవులకు అడుగులు ముందుకు పడుట లేదు. లేతపసిరికకన్నను పరమాత్మ దర్శనమే వాటికి కడుప్రీతి. అందుచే తానే ఆలమందల ముందు, ఆలమందల నడుమ, ఆలమందల వెనుక నుండువాడు. శ్రీకృష్ణ దర్శనము కానిచో వాటికి ఉల్లాసము కలుగదు. జీవాత్మ పరమాత్మల కుండు అనురాగము అంతటి గాఢమైనదేమో!

మధురానగరములో తాళవనము గలదు. అందు గార్దభాకారము గల ధేనుకుడను దానవుడు కలడు. ఆ వనమందు తాటిపండ్లు మిక్కుటము. ధేనుకునకు భయపడి ఎవ్వరును అందు ప్రవేశింపకుండిరి బలరామ కృష్ణులు గోపాలురతో గూడి గోవులగాయుచు తాళవనసమీపమున కేగిరి.

గోపబాలురకు తాటిపండ్ల వాసన తగిలెను. వారికి నోరూరెను. తమ కోర్కె తీర్చుమని వారు బలరామకృష్ణుల కోరిరి. 'సరే'యని బల రామకృష్ణులు తాళవనము ప్రవేశించి వృక్షముల నూపిరి. తాళఫలములు నేల రాలెను. ఆ శబ్దమును వినిన ధేనుకుడు బలరామకృష్ణుల జూచెను. గార్దభమునకు వెనుకకాళ్ల యందు బల మధికము. ధేనుకుడు బలరాముని నాలుగుక్రోసుల దూరమున బడునటుల తన్నెను. బలరాముడు చలింప లేదు. ధేనుకుడు మరల బలరాముని తన్నుటకు యత్నింప ఆయన వానిని తాళవృక్షమునకు గొట్టెను. ధేనుకుడు చావలేదు.

గార్దభమునకు సహజముగ కొమ్ములుండవు. కాని ధేనువునకు వాడి కొమ్ములు గలవు. వాడు కుపితుడై గోపబాలురపై బడెను. వారు పారి పోవుచుండిరి. శ్రీధాముడు, సుబలుడు మున్నగువారు పాశములతో, శరములతో, అస్త్రములతో వానిని బాదిరి. ఆ రక్కసున కదియొక లెక్కయా? నందకిశోరుడు ధేనుకుని గోవర్ధనగిరికి విసరికొట్టెను. వాడు మూర్ఛ నొందెను.

కొంతతడవునకు ధేనుకుడు తేరుకొని శ్రీకృష్ణుని గగనమునకు గొని పోయి పోరు సల్పెను. పరమాత్మ వానిని నేలపై బడద్రోసెను గోవర్ధన పర్వతమును బంతివలె ధేనుకునిపై విసరెను. వాడు దానిని మరల పర

మాత్మపై విసరెను. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని యథాస్థానమం దుంచి బలరామునకు సైగ చేసెను. ఆయన పిడికిలితో ధేనుకుని పొడిచెను. ఆ ప్రేటునకు ధేనుకుడు అసువుల బాసెను. వాని తేజస్సు పరమాత్మునిలో లీన మయ్యెను.

## ధేనుకుని చరిత్ర

బలిచక్రవర్తికి సాహసికుడను తనయుడు గలడు. వాడు గంధ మాదనపర్వతముపై పదివేలమంది వనితలతో సయ్యాట లాడుచుండెను. గంధమాదన పర్వతగుహలో దుర్వాసమహర్షి తపము గావించుచుండెను. సాహసికుని అల్లరి హద్దులుమీరెను. మహర్షికి తపోభంగము కలిగెను. మహర్షి వానితో "ఓరీ! వినయవిధేయతలు పాటింపక గార్దభమువలె పంచరించుచు మహర్షుల తపస్సునకు భంగము కలిగించుచుంటివి. నీకు గార్దభాకారము గలుగుగాక!" యని శపించెను. వాడు తన తప్పిద మునకు గుందుచు మహర్షిని క్షమాభిక్ష వేడుకొనెను. ద్వాపరమున బల రాముని చేతిలో నీకు ముక్తి లభింపగలదని మహర్షి అభయ మిచ్చెను. అందుకే పరమాత్మ ధేనుకుని సంహరింపుమని అన్నకు సైగచేయుట. ఆ సాహసికుడే ఈ ధేనుకుడు. ప్రహ్లాదుని వంశములోని వారిని తాను సంహరింపనని పరమాత్మ వర మొసగి యుండెను.

## కాళీయమర్దన

శ్రీకృష్ణుడు గోవుల తోలుకొని గోపబాలురతో యమునానదీతీరము నకు బయలుదేరెను. ఆనాడు బలరాముడు వారితో వెళ్ళలేదు. నందకిశో రుడు గోపబాలురతో కాళిందీహ్రదము (మడుగు)ను సమీపించెను. అందు కాళీయుడను సర్పము సతీసమేతముగ నుండెను. కాళీయుని విషాగ్ని జ్వాలలకు వృక్షములు మాడెను. పశుపక్ష్యాదులు మృతినొందెను.

గోపబాలురు దప్పిక తీర్చుకొనుటకై మడుగునందలి జలమును త్రావి మృతినొందిరి. ఆ దృశ్యము పరమాత్ముని కలచివైచెను. ఆయన గోపబాలురను బ్రదికించెను. అంతట నందనందనుడు నీలివస్త్ర

మును నడుముకు బిగించి సింహపుపిల్లవలె అమృతపాన మొనర్చిన కదంబవృక్షమున కెగ్రబ్రాకి, నెమలిపింఛమును చక్కబరచుకొని పాద ద్వయమును దగ్గరకు జేర్చి కాళీయహ్రదమం దురికెను.

పరమాత్మ తాకిడికి కాళీయహ్రదము పాతాళమువరకు కదలెను. గట్టులు త్రెంచుకొని పొంగెను. అంతయు జలమయ మయ్యెను. అందు పరమాత్మ ఉల్లాసముతో మత్స్యమువలె నీదుచు, కరకమలములతో చెదర గొట్టుచుండెను. ఆ హ్రదమందున్న కాళీయుడు కోపోద్రిక్తుడై "ఓరీ! నీవెవరు? ఈ మడుగును జొచ్చినవా రెవ్వరు బ్రతుకలేదు. ఈ బుడుతడు ఎవడో? దుడుకుతనము ప్రదర్శించుచున్నాడు? నా విషాగ్ని జ్వాలలకు వీడు ఆహుతిగాక తప్పదు" అని ప్రేలుచు పరమాత్మపై కురికెను. ఆయనను కాటు వేసెను, నందకిశోరుని చుట్టుముట్టి దేహమంతయు కాటువేయ దొడంగెను. శ్రీకృష్ణుడు చలింపలేదు.

ఆ దృశ్యమును జూచిన గోపబాలురు విలపింప దొడంగిరి. భూమి కంపించెను. బృందావనమున దుశ్శకునములు గోచరించుచుండెను. బలరాముడు కన్పించెను. పరమాత్మ కానరాలేదు. బృందావనమందలి ఆబాలగోపాలము నందనందనుని వెదకుచు బయలుదేరిరి. పరమాత్మ పాదచిహ్నముల బట్టి పయనించుచుండిరి. కడకు కాళీయహ్రదము దరి జేరిరి.

కాళీయుని కౌగిలిలో శ్రీకృష్ణుడు నిలిచియుండెను. అది చూచి యశోదాదేవి మూర్ఛిల్లెను. గోపబాలురు బిగ్గరగ 'కృష్ణా! నీవు మమ్ములను రక్షించితివి. నిన్ను మేము కాపాడలేని దుఃస్థితియందుంటిమి' అని విలపించిరి. మడుగున దూకుట కుద్యుక్తులైరి. బలరామస్వామి వారిని వారించుచు పరమాత్మకు ఎట్టి విపత్తు సంభవింపదని అభయ మొసగెను.

పరమాత్మ బృందావనవాసుల దీనారవముల నాలకించి తన దేహమును పెంచెను. చుట్టుకొనిన కాళీయుని విడదీసి గిరగిర త్రిప్పుచు చిత్రవధ చేయుచుండెను. కాళీయుని మోము కళావిహీనమయ్యెను. వానికి కోపము హెచ్చెను. మిక్కిలి అలసెను. సహస్రఫణులతో కాళీయుడు పరమాత్మను కాటు వేసెను. నందకిశోరుడు చలింపలేదు. ఆయన సహస్ర

ఫణములపై బలముగ బొడిచెను. కాళీయుని పడగలు విచ్చిపోయెను. వాడు రక్తము గ్రక్కుచు మూర్ఛిల్లెను. వాని గర్వము బీటలు వారెను. సర్వకళావిశారదుడగు పరమాత్మ కాళీయుని సహస్రశిరస్సులపై పద్మ రాగాదిమణులకాంతులతో నృత్యము చెయుచుండెను. యమునయందలి కల్లోలము మృదంగధ్వనివలె నున్నది. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి.

కాళీయుని క్రోధము నశించెను. అవిద్య అహంకారము పరమాత్మ వలన హరింపబడెను. వానికి స్పృహ తప్పుచుండ పరమాత్మను ధ్యానిం చుచుండెను. కాళీయుని సతులు పరమాత్మతో "దీనజనరక్షకా! కృష్ణా! నిన్ను కడతేర్చుటకు వచ్చినవారికే కైవల్య మొసగితివి. మహాలక్ష్మి నిత్యము గోరుకొను నీ పాదరజము అయాచితముగ మా భర్తకు లభిం చెను. నీ పాదస్పర్శచే మాపతి ధన్యు డయ్యెను. మాకు పతిభిక్ష పెట్టవా ప్రభూ!" అని దీనారవముల జేసిరి.

పరమాత్మ కృపాళువు. కాళీయుని ఫణములపైనుండి విడివడి తన అభయహస్తముతో కాళీయునిదేహము నిమిరెను. వానికి పూర్వపు తుష్టి, పుష్టి లభించెను. పరమాత్మ కాళీయునితో "నీవు సతీసుత సమేతముగ రమణక ద్వీపమున కేగుము. గరుత్మంతుడు నా భక్తుడు. నీ మస్తక మందలి నా పాదచిహ్నముల జూచి నిన్ను పూజించును" అని అభయ మొసగెను. కాళీయుడు పరమాత్మను పెక్కువిధముల స్తోత్రము చేసి, సతీసమేతముగ రమణకద్వీపమున కేగెను. పరమాత్మ స్పర్శచే కాళీయ హ్రదమందలి విషము అమృతమయ్యెను.

పరమాత్మ గట్టునకు చేరగనే నందయశోదలు, ఆబాలగోపాలము ఆ దివ్యమంగళ స్వరూపుని ఆలింగనము గావించుకొనిరి. శ్రీకృష్ణుడు వారిపై ప్రసన్నదృక్కులను బరపెను. లేచిన వేళావిశేషముచే విపత్తు తొలగెనని వారు కడు సంతసించిరి. ఆ రేయి వారు ఆ తావుననే విశ్రమించిరి. నడిరేయి వారిని దావాగ్ని చుట్టుముట్టెను. వారు పర మాత్మను ప్రార్థింప, కనులు మూసికొనుడని చెప్పి, ఆ దావాగ్నిని పాన కమువలె గ్రోలెను. వారు కనులు తెరచిచూడ పరమాత్మ మందహాసము చేయుచుండెను. ఆ మోహనమూర్తిని గొని వారెల్లరు బృందావనము నకు మరలిరి.

## కాళీయుని చరిత్ర

స్వాయంభువ మన్వంతరమున వేదశిరస్సు అను భూసురోత్తముడు తపము చేయుచుండెను. అచటికి అశ్వశిరస్సు అను మరియొక విప్రుడు విచ్చేసి తానును ఆశ్రమమందు తపస్సుచేయుదు ననెను. వేదశిరస్సు అంగీకరింపలేదు. తన ఆశ్రమమందు అన్యులకు స్థానము లేదని పలికెను. అశ్వశిరస్సు వానితో "ఈ ఆశ్రమము నారాయణునిది. దురహంకారముతో నన్ను జూచి బుసలు కొట్టితివి. అందుచే నీవు సర్పరూపమును బొంది గరుత్మంతునితో వెతనొందుదువు గాక!" అని శపించెను.

వేదశిరస్సు వానితో "ఓయీ! తపోభంగము గలుగునని నిన్ను వేరొక తావునకు జనుమంటిని. అందులకు ఇటుల శపింతువా? నీవు నీ స్వార్థము ననుసరించి కాకివలె స్వలాభమును కాంక్షించితివిగాన నీవు కాకి వగుదువు గాక" అని ప్రతిశాప మొసగెను.

పరమాత్మ ప్రత్యక్షమై వారితో "మీ రిరువురు నా భక్తులు. మీ పలుకులు కార్యరూపము ధరించును. ఓ వేదశిరోమహర్షీ! నీ సహస్ర ఫణములపై నృత్యముచేసి, నా పాదచిహ్నములచే గరుత్మంతుని వలన బాధరాకుండు నటుల చేయుదును. ఓ అశ్వశిరో మహర్షీ! నీవు కాకి రూపము దాల్చినను త్రికాలవేదివై బ్రహ్మజ్ఞాన సంపన్నుడ వగుదు" వని అనుగ్రహించెను.

అశ్వశిరస్సు కాకభుశు డను నామముతో నీలగిరిపై తపము చేయుచుండెను, అయన రామభక్తుడు. గరుడునకు రామాయణము వినిపించెను. వసిష్ఠమహర్షికి తత్త్వోపదేశము చేసెను. శ్రీరామచంద్రమూర్తి తాను భుజించు ఆహారము కాకభుశునిపై వేయుచుండెను. ఒక్కొక్కప్పుడు శాపములు సైతము ప్రయోజనకారి యగుచుండును కదా!

దక్షప్రజాపతికి అరువదిమంది కొమార్తెలు గలరు. అందు పదునొకొండుమందిని కశ్యపప్రజాపతి కొనగెను. వారిలో కద్రువకు సర్ప సంతానము గలిగెను. (ఆ కద్రువయే రోహిణిగ పుట్టెను.) వినత యను

నామె గరుత్మంతుని గనెను. వేదశిరస్సు కాళీయుడుగ జన్మించెను. వానికన్న పెద్దవాడు శేషుడు. శ్రీహరికి తలగడయయ్యెను. ఆ శేషుడే బలరాముడు.

పరమాత్మ శేషునితో "ఓయీ! నీవు అమేయ బలసంపన్నుడవు. ఈ భూమండలము నీవు ధారణచేయవలెను. నా నామములు గుణములు లీలలు అనంతము. వాటిని నీ సహస్రఫణములతో గానము చేయుము. అవి పూర్తియైన పిమ్మట నీపై అట్టి భారముండదు. నీకు ఆధారము పరతత్త్వము. దానికి ఇతర ఆధార మక్కరలేదు" అని పలుక శేషుడు భూమండల ధారణచేసెను. ఆవగింజంత బరువుగూడ లేదు. శేషు డెన్నడైన శిరస్సు కదలించినచో భూకంపములు గలుగుచుండును.

గరుత్మంతుడు రమణకద్వీపము చేరి అందలి సర్పజాతిని సంహరించుచుండెను. అందలి సర్పములు గరుడునితో "ఓయీ! నీవు శ్రీమన్నారాయణుని వాహనముగ నుంటివి. విచక్షణారహితముగ సర్పజాతిని నశింపజేయుట న్యాయము కాదు. నాగులచవితినాడు మా సర్పజాతికి లభించిన పదార్థములలో సగము నీ కొసగుదుము" అనిరి. 'రోజునకొక సర్పము సమర్పింపుడు' అని గరుడుడు కోరెను. వారు అంగీకరించిరి. కాళీయునివంతు వచ్చెను. 'పక్షికి ఆహారము పంపుటయా?' అని అతడు మిన్నకుండెను. గరుడునకు ఆగ్రహము కలిగి తన కాళ్ళతో కాళియుని బలముగ తన్నెను. కాళీయుడు మూర్ఛిల్లెను. కొంతతడవునకు వాడు తెప్పరిల్లుకొని గరుడుని కాటువేసి కాళ్ళకు చుట్టుకొనెను. అతడు కాళీయుని విసరికొట్టెను. వాడు గరుడుని రెక్కలు పీకెను. రెండు ఈకలు క్రిందబడెను. ఆ రెక్కలనుండి ఆశ్వయుజ బహుళ దశమినాడు పాలపిట్టలు, నెమళ్లు పుట్టెను. ఆనాడు వాటిని చూచిన సకలశ్రేయస్సులు గలుగునని ప్రతీతి.

గరుడుడు కాళీయుని వెంటబడి ముక్కుతో పొడుచుచుండెను. ఆ బాధ భరించలేక కాళీయుడు అన్నయగు శేషునికడ కేగి రక్షింపుమని వేడుకొనెను.

శేషుడు కాళీయునితో "యమునానదీ తీరమున సౌభరిమహర్షి తపము చేయుచున్నాడు. అచట ఒక మీనరాజు (చేప) గలడు. ఆ మీన రాజు మనుమలు, మునిమనుమలతో వచ్చినచో ఆ నది నిండుచుండెడిది. మత్స్యరాజు సంతానము జూచి సౌభరికి సంసారముమీద మోజు కలిగెను. ఇక్ష్వాకువంశీయుడగు మాంధాత మహారాజునకు నూర్గురు కొమార్తెలు గలరు. సౌభరిమహర్షి వృద్ధుడు. కన్య నిమ్మని మాంధాతను కోరెను. స్వయంవరము నేర్పాటు గావించిరి. అదేమి చిత్రమో! ఆ నూర్గురు కన్యలు సౌభరిమహర్షిని ప్రేమించిరి. మహర్షి వారికి శతసౌధముల నిర్మించి వారికి తగువసతులు చూపెను. అందరి దగ్గర తానే అన్నిరూప ములు మహర్షి దాల్చెను. అది చూచి మాంధాత చకితుడయ్యెను. తన జన్మ ధన్యమయ్యెనని సంతసించెను. బహుసంతానముతో విరక్తి గలిగి సౌభరి మరల తపముచేయ దొడంగెను.

ఆ తావునకు గరుత్మంతుడు తరచుగ నేగి మత్స్యములను ముక్కున గరచుకొని విహరించుచుండెను. అది చూచిన మహర్షి కుపితుడై 'ఓయీ! గరుడుడా! నేటినుండి నీవు ఈ తావునకు రాకూడదు. వచ్చినచో నీకు చావు తప్పదు' అని శపించెను. అందుచే ఈ తావున గరుడునివలన బాధ గలుగదని శేషుడు దెలుప, కాళీయుడు యమునయందలి ఆ హ్రద మున నిశ్చింతతో సతీసమేతముగ వసించుచుండెను.

## పవిత్రప్రేమ

శ్రీకృష్ణపరమాత్మ దొండపండువంటి అధరపల్లవమున మురళిని జానిపి మృదుమధురముగ ఆలపించుచు, గోవుల తోలుకొని గోపాల బాలురతో జనుచుండ వృషభానుపురమందలి రాధాదేవి చెలులు లలిత, విశాఖ అనువారలు చూచుట తటస్థించెను. ఆ జగదేకసుందరుని చూచి వారు ముగ్ధులై రాధాదేవికడ కేగిరి.

చెలులు రాధాదేవితో "రాజకుమారీ! మేము అద్భుతదృశ్యమును గంటిమి. నీ ప్రియుడు అందాలప్రోగు. నిత్యము గోవుల తోలుకొని ఈ దారిని యమునాతీరమునకు జనును. ఎన్నడైన నీవు ఆ మోహన మూర్తిని దర్శించితివా?" అని నవ్వుచు ప్రశ్నించిరి.

చెలులు పరిహాసమునకై అటుల పలుకుచుండిరని తలచి " సకియ లారా! ఎవరినో జూచి నా ప్రియుడని అనుకొంటిరేమో! సరససల్లాప ములు ఆడుచుంటిరేమో! నేను మీ పలుకులను విశ్వసింపను. మీరు చిత్ర లేఖనమున ప్రవీణులు. ఆ దివ్యమంగళ విగ్రహుని చిత్రము వ్రాసి నాకు చూపుడు " అనెను.

చెలులు చిత్తరువు వ్రాసి తెచ్చిరి. అందలి నవమన్మథుని చూచి రాధాదేవి మురిసెను. ఆమె కనులవెంట ఆనందబాష్పములు జాలువారు చుండ శ్యామసుందరుడును, మన్మథమన్మథుడు నగు మనోనాథుడు గోచ రించెను. ఆయన ఆమెను చేరువకు రమ్మని కనుసైగ చేసెను. రాధా దేవిని సిగ్గుదొంతరలు కప్పివేసెను. ఏమని పలుకవలెనో తోచలేదు. పర మాత్మను రాధాదేవి స్మరించుచుండెను.

నందకిశోరుడు గోవుల తోలుకొని గోపబాలురతో ఇంటికి మరలెను. గవాక్షమునుండి చెలులు నందనందనుని చూచి రాధాదేవికి దెలిపిరి. ఆమె ఉల్లాసముతో గవాక్షముకడ కేగి యశోదపట్టిని దర్శించి మూర్ఛ ల్లెను. చెలులు శైత్యోపచారములు చేసిరి. అది ఉత్కటప్రేమ. రాధా దేవి చూపులు పరమాత్మచూపులు గలిసినవి. చిలిపిచూపులతో రాధాదేవి సర్వస్వమును శ్రీకృష్ణపరమాత్మ దోచెను. విడివడుటకు వా రిరువురకును భారమయ్యెను. రాధాకృష్ణులు వెన్నెలరాత్రులలో బృందావనమందలి ఇసుకతిన్నెలపై విహరించుట యెన్నటికో!

శ్రీకృష్ణుడు సాగిపోయెను. రాధాదేవి చెలులతో "నా మనోహరుడు నా కడకు వచ్చునా? నా విరహార్తిని ఉపశమింప జేయునా? రాధాకృష్ణులు అవిభాజ్యులు. కృష్ణుడు కన్పించనిచో రాధ బ్రతుకదు" అని దీనముగ బలికెను. ఆమె కనుల నీరుగ్రమ్మెను. చెలులు నందకిశోరుని కడకు రాయబార మేగిరి.

పరమాత్మ పూలగురువింద పూసలపేరులు దాల్చి యమునానదీ తీరమున కదంబవృక్షచ్ఛాయ నొంటిగ గూర్చుండి, రాధా విరహ వేదనతో పరధ్యాన మందుండెను. చెలులు గోపకిశోరుని సమీపించిరి.

ఏమి పలుకవలెనో తోచక చెలులు సంశయించుచుండిరి. రాధామానస చోరుడు చెలులను చూచి వారిరాకకు హేతువును దెలుపు మనెను.

రాధాదేవి చెలికత్తెయగు లలిత స్వామితో "మహానుభావా! నీ లీలలు కనుగొన మా తరమా? నీవు సర్వజ్ఞుడవు. రాధాదేవి నిన్ను విడిచి బ్రతుకలేనని విరహవేదనతో కృశించుచున్నది. అన్నపానీయాలు ముట్టుటలేదు. అమూల్యాభరణములు అవల పారవేయును; పట్టుపుట్ట ములను దాల్చుట లేదు. పరిమళద్రవ్యములను విషతుల్యముగ చూచు చున్నది. నెలరాజును పుష్పగుచ్ఛముల చూచిన కన్నీరు గార్చును. రాత్రులందు నిదురబోవుట లేదు. 'కృష్ణా! శ్రీహరీ! ముకుందా! మురారీ!' అని పలుకుచుండును. ఆమెకు మందిరము అడవివలె తోచు చున్నది. సదా నీ నామ స్మరణమే. నీ దర్శనము లభింపనిచో నీ రాధ నీకు దక్కదు. ఎట్టి సాహసమునకు పూనుకొనునో? ఆశ్రితవత్సలుడవు. రాధామానస రాజహంసవు. నయగారములు చాలించి బయలుదేరుము" అని వేడుకొనెను.

పరమాత్మ ఆమెతో "నీ పలుకులు అమృతతుల్యములు. రాధా దేవిని విడిచి యుండుట నాకుమాత్రము బాధాకరము గాదా! ప్రేమకు సాటి ప్రేమయే. మమ్ముల బాధించినది ఆ ప్రేమపాశమే. నిరుపాధిక ప్రేమ గలిగిన వారికి వియోగ ముండదు. నేను పాలు, ఆమె నురుగు. నేను చంద్రుడు, ఆమె వెన్నెల. నేను కమలము, ఆమె మకరందము. మేము అవిభాజ్యులము. కాలానుగుణముగ గడువవలసినదే. భాండీర వనమున మా కల్యాణము జరిగినది. రాధామాధవుల మనోరథము లీడేరు సమయ మాసన్నమైనది" అని అభయ మొసగెను.

చెలులు వడివడిగ రాధాదేవి మందిరమునకు జనిరి. లలిత స్వామి పలుకులను వల్లించెను. రాధాదేవి పరవశించెను. ఆమె గర్గమహర్షి శిష్యు రాలగు చంద్రాననను బిలిచి "నీవు వేదశాస్త్రములు అభ్యసించినదానవు. చతుష్షష్టికళాపరిపూర్ణవు. నా అభీష్టసిద్ధికై యే దేవతను సేవింపవలెనో, ఏ యే తీర్థముల గ్రుంకులిడవలెనో, ఏ యే సత్కార్యముల జేయవలెనో గర్గునికడ నేర్చుకొంటివి. పరమాత్మకు అనురాగదేవతగ నుండుటకు ఉపాయము దెలుపుము" అని కోరెను.

## తులసీవ్రతము

చంద్రానన రాధాదేవితో "అమ్మా! సకలశ్రేయస్సుల నొసగు తులసీవ్రతము గలదు. తులసి పరమాత్మకు ప్రీతికరమైనది. తులసిని ముట్టుట, పూజించుట, నాటుట, నీరుపోయుట, స్మరించుట, కీర్తించుట, దర్శించుటవలన తరింప వచ్చును.

తులసిమొక్కలు పెమ్మతో పూలతో విస్తరించినచోట వంశవృద్ధి కలుగును. తులసీదళము పవిత్రమైనది. పూలన్నియు నొకయెత్తు, తులసీదళము మరియొక యెత్తు. సువర్ణ రజతదానములకన్నను తులసీ వనము పెంచుట శ్రేష్ఠము. తులసిమొక్కయున్న తావున కొలుదుకాలూన లేదు. స్వప్నమందైనను యముడు కానరాడు. త్రికరణముల చేసిన పాపపంకిలము తులసిని సేవించుటచే తొలగిపోవును. పునర్జన్మ గలుగదు. సకల దేవతలు, సర్వతీర్థములు, పుష్కరుడు తులసీదళమును ఆశ్రయించి యుందురు. తులసీగంధము పరమాత్మకు ప్రీతికరమైనది. తులసినీడను శ్రాద్ధాదులు పెట్టిన పితృదేవతలు తృప్తి జెందుదురు. అక్షయఫలము లభించును. తులసిసేవ సేయుచుంటివా పరమాత్మ సదా నిన్నువెన్నంటి యుండును" అని హితము పలికెను. రాధాదేవి కడు ముదమందెను.

ఆమె మొగలివనమున వర్తులాకారముగ బంగరుతులసికోట కట్టించెను. నడుమ రమణీయమగు సరస్సు, దానికి రత్నఖచితమగు మెట్లు, నాలుగు దిక్కుల నిర్మించెను. అచ్చటచ్చట స్వర్ణధ్వజముల నెత్తించెను. తులసికోట చుట్టును ముత్యాలతోరణములు కట్టించెను. అందు తులసీవనమును ప్రతిష్ఠించిరి. గర్గమహర్షి రాధాదేవికి మూలమంత్ర ముపదేశించెను.

సుముహూర్తమున తులసీవ్రతము ప్రారంభింపబడెను. అశ్వయుజ శుద్ధపూర్ణిమ మొదలు చైత్ర శుక్లపూర్ణిమ వరకు తులసీవ్రతము జరుపబడెను. పాలు, ద్రాక్షరసము, చెరకురసము, పుట్టతేనె, పంచదారలతో గూడిన పంచామృతములతో అభిషేకము ఏబదియారు భోగములతో జరుపబడెను. అన్నదానము, వస్త్రదానము, సువర్ణదానము, గోదానము, భూదానము చేయబడెను. ఉసిరికకాయలంత మంచిముత్తెములు దాన

మొసగబడెను. గర్గమహర్షిని భక్తిశ్రద్ధలతో యథోచితరీతి రాధాదేవి పూజించెను. తులసీదేవి గరుడవాహనారూఢయై ప్రత్యక్షమయ్యెను. నీల వర్ణరత్నఖచిత సువర్ణాభరణములతో, వైజయంతీ పుష్పమాలికతో దేదీప్య మానముగ వెలుగొందుచుండెను. రాధాదేవి ఉత్కంఠయయ్యెను. తులసీ దేవి రాధాదేవిని కౌగిలించుకొని ముద్దాడెను. ఆమె రాధతో 'నీ భక్తి ప్రపత్తులు అనన్యమైనవి. నీవు జగన్మాతవు. నీ కోర్కె ఫలించును. పర మాత్మ నీకు వశ డగును. ఆ జగన్నాథునకు నీవు పట్టపురాణి వగుదువు' అని ఆశీర్వదించెను.

రాధాదేవి తులసీదేవితో "తల్లీ! శ్రీకృష్ణపరమాత్మ పాదారవింద ముల యందు అవ్యాజప్రేమ గలిగియుండునటుల వరమిమ్ము. నా చిర కాల వాంఛిత మది యొక్కటే" అన 'తథాస్తు' అని తులసీదేవి వర మొస గెను.

## మాయాగోపిక

రాధాదేవి ఆచరించిన తులసీవ్రతమునుగూర్చి విని నందకిశోరుడు మాయాగోపిక రూపమున బయలుదేరెను. శిరమున పెద్దకొప్పు, అందు పరిమళపుష్పములు, నుదుట కుంకుమబొట్టు, మెడలో ముత్యాలసరులు, చెవులకు కమ్మలు, ముక్కుకు నత్తు, ఆకుపచ్చని పట్టుచీర, మందారపు రంగు రవిక, ముంజేతులకు బంగరు గాజులు, ఘల్లుఘల్లుమను బంగరు అందెలు ధరించి జగన్మోహినీరూపమున వృషభపురిని ప్రవేశించెను. అనేకములైన అగడ్తలు, మండపములు, ఆలమందలు, బెత్తములు పట్టుకొని గోపాలకులు, వేణువు నూదు గోపబాలురు, రమణీయ మంది రములు, పన్నీటితో తడుపబడిన రాజవీథులు, పరిమళ పుష్పములతో వికసించిన ఉద్యానవనములు, రాజహంసలు విలాసముగ విహరించు మనోహరమగు సరస్సులుచూచి మాయాగోపిక ముగ్ధురాలయ్యెను. నగర వాసులు ఆమెను చూచి మురిసిరి. ఆమె లక్ష్మీదేవి యని భ్రమచెందిరి.

మాయాగోపిక మెల్లిగ రాధాదేవి మందిరములో ప్రవేశించెను. స్వర్ణద్వారములతో, రత్నఖచిత స్తంభములతో నీడలుదేలు పాలరాతి గోడలు, రాధాకృష్ణుల చిత్తరువులతో, వీణాగాయక బృందములతో,

రంగురంగుల దీపపుకాంతులతో రాధామందిరము దేదీప్యమానముగ వెలుగొందుచుండినది. అచట రాధాదేవి కానరాలేదు. ఆమె ఉద్యానవనమందుండెనని చెలులు ఆమెకు (మాయాగోపికకు) చెప్పిరి.

రాధాదేవి ఉద్యానవనమున దానిమ్మ, మల్లె, మాలతి, మాధవి, జాజి పుష్పజాతులు గలవు. అందలి మధువుమ్రోలిన భ్రమరములు, శృంగారగీతికల నాలపించుచుండెను. మలయమారుతములు ఆహ్లాదకరముగ నుండెను. గండుకోయిలలు 'కుహూ' నాదములు చేయుచుండెను. చిలుకలు గోరువంకలు విడివడుటకు ఇచ్చగించుట లేదు. మయూరములు పురివిప్పి నాట్యముచేయ దొడంగెను. అందలి నికుంజములలో పూలపాన్పులు గలవు. తేతమామిడిగున్నల నడుమనున్న నికుంజముముంగిట రాధాదేవి నిరీక్షించుచుండెను. ఆ లావణ్యవతిని చూచి మాయాగోపిక పరవశించెను. దిరిసెనపూలు నేలపై పరువబడియుండెను. వాటిపై రాధాదేవి అటునిటు అడుగు లిడుచుండెను. అంతలో మాయాగోపిక ఆమె కంటబడెను. అపరిచితురాలి అందచందములకు రాధాదేవి ముగ్ధురా లయ్యెను. ఆమె ఆలింగనభాగ్య మబ్బిన బాగుండునని తలచెను.

రాధాదేవి మాయాగోపికకు స్వాగతము పలికి చంద్రకాంత శిలా వేదికపై గూర్చుండ బనిచి "అమ్మా! నీరాక నాకు ఆనందదాయకము. నీవంటి సౌందర్యరాశిని నే నెన్నడు చూడలేదు. అభ్యంతరము లేనిచో నీ నివాసము, నామము తెలుపగోరెదను. నీ పాదరజముచే ఈ ఉద్యానవనము పావన మయ్యెను. నా సేవల నంగీకరించి నన్ను ధన్యురాలిని గావింపుము" అని వేడుకొనెను. మాయాగోపిక మందహాసము చేయుచుండ అందలి మర్మము రాధాదేవికి అవగతము గాలేదు. లీలామానుష విగ్రహుని లీలల నరయుట రాధాదేవికి సాధ్యమా?

## సంవాదము

రాధాదేవి మాయాగోపికతో "అమ్మా! నీ చిలిపిచూపులు నీ చిరునవ్వులు, నీ మందగమనము, చంద్రబింబమువంటి నీ నెమ్మోము నా హృదయమును జూరగొన్నవి. నిత్యము మనము కలియవలెను. సంకేతస్థలమునకు నన్ను రమ్మనినచో నేనే వత్తును. నా ప్రియుని లక్షణములు

నీలో కానవచ్చుచున్నవి. నిన్ను జూచిన నా ఆరాధ్యదైవమగు నంద నందనుడు జ్ఞప్తికి వచ్చుచున్నాడు. నీవు మాయాగోపికవు గాదుగదా?" యని సంశయము వెల్లడించెను.

మాయాగోపిక పైట సవరించుకొనుచు "రాధాదేవీ! నా నివాసము నందునిపురికి ఉత్తరదిక్కున గలదు. గోపికలు నిత్యము నన్ను గొలుచుచు గోపదేవత యందురు. నీ అందచందములు సుగుణసంపద లలిత అను గోపిక వర్ణించెను. అందుచే నిన్ను చూడవలెనను కుతూహలముతో ఇచ టికి విచ్చేసితిని. ఈ ఉద్యానవనము నన్ను మిక్కిలి ఆకర్షించెను. ఇది దేవేంద్రుని వనమును మరపించుచున్నది. రాజకుమారీ! నీ వెవరికొరకో నిరీక్షించుచుంటివి. ఆ అదృష్టశాలి ఎవరో? అభ్యంతరము లేనిచో పేరు చెప్పుము" అని మోమోట పెట్టెను. రాధాదేవి లేనిసిగ్గుతో శిరము వంచు కొనెను. పరస్పరసఖ్యము పుష్పించెను. వా రిరువురు మాటలాడుచు, పాటలు పాడుచు, ఆటలాడుచు, చల్దులు అరగించుచు సాయంసమయము వరకు వేడుకతో గడపిరి.

మాయాగోపిక రాధాదేవితో "అమ్మా! చీకటి పడనున్నది. నా నివాసమున కేగుదును. మరియొకతూరి నిన్ను గలియుదు" ననెను. 'ఎప్పుడు వత్తువు' అని రాధాదేవి ప్రశ్నించెను. 'రేపు తప్పక వత్తును. ఇందుకు గోమాతలు సాక్షి. పరమాత్మ సాక్షి' యని పలికి మాయాగోపిక తన నివాసమున కేగెను.

ఆ రాత్రి రాధాదేవికి నిదుర రాలేదు. గోపదేవత ప్రేమాభిమాన వర్ణనతో సరిపోయెను. నిదురబొమ్మని చెలులు బతిమాలిరి. ఫలితము శూన్యమయ్యెను. 'మాయాగోపిక నందనందనుడేమో'యను సంశయము రాధాదేవికి కలిగెను. 'పరమాత్మకు వేసముతో పనేమి' యని అనుకొనెను. ఆ రాత్రి యామెకొక యుగముగ దోచెను.

ప్రభాత మరుదెంచెను. రాధాదేవి స్నానాదికముల పూర్తిగావించు కొని సర్వాలంకారభూషితయై పూజామందిరమున చందనాగరు ధూపము లతో, పరిమళ పుష్పములతో స్వామిని పూజించి, కండచక్కెర, మధుర

ఫలముల నివేదన గావించి, కర్పూరహారతి నొసగి, తీర్థప్రసాదములను స్వీకరించి గోపదేవత రాకకై ఎదురుచూచుచుండెను. కొంత తడవునకు మాయాగోపిక అచటి కరుదెంచెను. రాధాదేవి ఆమెను కౌగిలించుకొని అద్వితీయానందాబ్ధి నోలలాడెను. వియోగమెంత దుర్భరమో సంయోగ మంత సంతోషమేమో! 'నిను జూచిన బ్రహ్మానందము కలుగుచున్నది' యని రాధాదేవి పలుక, గోపదేవత కనుగొలకులనుండి అశ్రువులు రాలెను.

రాధాదేవి గోపదేవతతో "అమ్మా! నీవు కన్నీరు గార్చుటకు హేతు వేమి? నిన్ను బాధించినవారు పరమాత్మ గానిచో వారిని తప్పక శిక్షింతును. దేహముకొరకు ధనమును త్యాగము చేయవలెను. మానము కొరకు దేహము త్యాగము చేయవలెను. సఖునికొరకు దేహము మానము త్యాగము చేయవలెను. వారే ధర్మ్యులు అనెను.

గోపదేవత రాధాదేవితో "అయ్యో! అది ఒక రహస్యము. బృందా వనములో బృహత్సానుపర్వత సమీపమున చిన్నసందులో పెరుగుకుండ నెత్తిని బెట్టుకొని ఒంటిగ జనుచుంటిని. ఒక అపరిచిత గోపాలుడు నా కుడిచేయిని పట్టుకొనెను. వాని చేతులలో వేణువు బెత్తము లున్నవి. ఆ గడుసరి నన్ను 'ఎచటి కేగుచుంటివి. సుంకము చెల్లింపనిచో కదల నీయ' ననెను. 'నీకు శుల్కమీయవలెనా?' అంటిని. 'రూకలు లేనిచో నన్ను పెండ్లియాడుము' అని కటువుగ బలికెను. కానీ నీ కుండలోని పెరుగుగాని, వెన్నగాని, నేయిగాని పెట్టుము' అనుచు నా నెత్తిపైనున్న కుండలో చేయి పెట్టెను. నేను వారించుటకు యత్నించి తిని. ఆ గడుసరి ఆగ్రహముతో నా కుండను బలవంతముగ దించి పెరుగు, వెన్న తిని కుండ పగులగొట్టెను. ఎవరైన వినిన నవ్వుదురేమో! నా పయటకొంగు లాగి యల్లరి చేసి నందీశ్వరపర్వతము వైపు పరు గిడెను.

"నీవు ఆ గండరగండను ప్రేమించితివని విని నొచ్చుకొంటిని. ఇం కెవ్వరు నీ కంటికి కాన్పింపలేదా? అతడు నల్లనివాడు; శీలము శూన్యము; నిర్ధనుడు. నీవో రూప గుణసంపద గలదానవు. వానిని గట్టుకొనిన నీకు

గలుగు సౌఖ్యమేమి? నీ సేమముగోరి చెప్పుచున్నాను. ఆయనపై ఆస వదలుకొనుము" అనెను.

రాధాదేవి మాయాగోపికతో "అమ్మా! పొరబడితివి. ఆ నందకిశోరుడు సాక్షాత్ పరమాత్మ. బ్రహ్మ, మహేశ్వరుడు, అంగిరసుడు, దత్తాత్రేయులు ఆ మహనీయుని పాదారవింద మకరందము ఆస్వాదింతురు. అట్టి దివ్యపురుషుని విమర్శించుట పాడిగాదు. ఆయన గోసేవచేయును. గోధూళి శిరమున దాల్చును. సదా గోస్మరణ చేయును. గుణముప్రధానము గాని జాతి అప్రధానము గదా? శ్యామసుందరుని జూచి శంకరుడు నృత్యము చేయును. గరళకంఠము, నాగాభరణము గలిగిన శివుడే ఆ మురళీధరుని చూచి ముగ్ధుడగును. అమూల్యమగునవి నల్లగ నుండును ఇంద్రనీలము నలుపు. నల్లకలువ నలుపు కనుగ్రుడ్డు నలుపు. సముద్రపు నీరు నలుపు. ఆకసము నలుపు. శ్యామసుందరుడు నల్లనివా డందువా? ఆయన స్వచ్ఛతకు ప్రతిరూపము. పశుపక్ష్యాదులు సైతము ఆ దివ్య మంగళ విగ్రహుని జూచి ముగ్ధము లగుచున్నవి.

ఇక నిర్ధను డందువా? మరుత్తులు సకలదేవతలు ఆ పరమాత్మను ఆశ్రయించి, ఆయన కృపవలన బ్రతుకుచుండిరి. ఆయన నిర్ధను డెట్లగును? శౌర్యసాహసము లందువా? వత్సాసురుని, బకాసురుని సంహరింపలేదా? కాళీయుని మర్దింపలేదా? శౌర్యము ఆయనలో మూర్తీభవించెను. శీలము లేదందువా? సర్వాత్మనా భక్తులయందు తాదాత్మ్యము చెందుచుండును. ప్రేమకన్న మించిన శీలము గలదా? భక్తి పంచమపురుషార్థము. భక్తియున్నచో జ్ఞానవైరాగ్యములు సహజముగ కలుగును. భక్తులకు సర్వము లభింపగలదు. గోపదేవతా! నీవు నాకు అత్యంత ప్రియురాలవు. అందుచే మిన్నకుంటిని. శ్రీకృష్ణుని కన్న అత్యంత ప్రియమైన వస్తువు వేరొకటి లేదు" అని దృఢముగ బలికెను.

గోపదేవత రాధాదేవితో "అమ్మా! నీ వలుకులు సమంజసములే. ఆ గడుసరిపై నీ కంతటి ప్రేమాభిమానము లున్నవని నాకు తెలియదు. నీవు స్మరించినంత మాత్రముననే ఆ మహాపురుషుడు దర్శనమొసగుచో, నీ పలుకుల విశ్వసింతుము" అనెను.

రాధాదేవి మాయాగోపికతో "నేను శ్రీకృష్ణుని స్మరించి పిలుతును. ఆ దయామయుడు తప్పక రాగలడు. ఒకవేళ రానిచో, నా సర్వస్వము నీకు వదలి అరణ్యముల కేగి తపము గావింతును. పరమాత్మ ప్రత్యక్ష మగుచో నీవు నాకే మిత్తువు" అనుచు రాధాదేవి పరమాత్మధ్యాననిమగ్న రాలయ్యెను. సమాధిస్థితి బొందెను. ఆమె దేహమంతయు స్వేదమయ మయ్యెను. రాధాదేవి భక్తితత్పరతకు పరమాత్మ ముగ్ధుడై మాయా గోపిక వేసము మార్చి మురళీధరుడై "రాధాదేవీ! నీవు 'కృష్ణా!' అని కేక వేసితివి. ఆ పిలుపు విని వంశీవటమునుండి గోవులను, గోపబాలు రను వదలి వడివడిగ ఇటకు అరుదెంచితిని. కనులు దెరువుము. నేను నీ కడకు వచ్చునపుడు ఒక కన్యక ఎదురయ్యెను. ఆమె యక్షకన్యా? గంధర్వ కన్యా? లేక గోపకన్నియయా? అనుచు ఆమె వెన్నును స్పృశించెను. ఆ దివ్యస్పర్శచే రాధాదేవికి మెలకువ వచ్చెను. ఆమె కనులు దెరచిచూడ శ్రీకృష్ణపరమాత్మ కన్పట్టెను. రాధాదేవి పరమాత్మను కౌగిలించుకొనెను. ఆమె కనులవెంట ఆనందాశ్రువులు జాలువారెను. రాధాకృష్ణులు అవిభా జ్యులు. వారి ప్రేమ పరమపవిత్రమైనది. అది లౌకికమగు క్షుద్రప్రేమ కాదు.

## రాసక్రీడ

రాధాకృష్ణులు వైశాఖశుద్ధ పంచమినాడు యమునాతీరమందున్న ఉద్యానవనమున రాసక్రీడ సలుప నిశ్చయించుకొనిరి. పరమాత్మసంకల్ప బలముచే కాలోలు, యమున ఎవరికి ఎంతలోతు కావలెనో అంతవరకు వచ్చెను. అందు గ్రుంకులిడినవారు మృతినొందుట నెరుగరు. అందలి కల్పవృక్షములు ముక్తిని ప్రసాదించును.

గోవర్ధనపర్వత శిఖరములు స్వర్ణమయమయ్యెను. అందలి శిలలు రత్నము లయ్యెను. సెలయేళ్లు అమృతము గొనివచ్చు చుండెను. లతా నికుంజములు మనోహరముగ నుండి అతిథులకు సరిపడునటుల సంఖ్య పెరుగుచుండెను. విశాలమైన రాజవీథులు పన్నీటితో తడుపబడెను. పాల రాతి ప్రాసాదములు, రత్నస్థగిత స్తంభములు, రంగురంగుల పతాకము

లతో గూడిన పొదరిళ్లు, ఫలపుష్పభరితములగు పలురకముల వృక్షజాతు లతో వసంతలక్ష్మి అరుదెంచెనేమో యమునతటుల భాసించెను, సారస పక్షులు, గండుకోయిలలు, మయూరములు, చిలుకలు, గోరువంకలు, మధువునుగ్రోలి మత్తెక్కిన భ్రమరములు రాధాకృష్ణుల పవిత్రప్రేమను గూర్చి మధురగీతికల గానముచేయ దొడంగెను. మలయపవనములు పరిమళముల విరజిమ్ముచుండెను.

శీల, రూప, గుణ, వయస్సంపన్నులగు పెక్కు గోపికా యూథ ములు వచ్చెను. అందు శయ్యల నమర్చువారు, శయ్యలు నిర్మించు వారు, శృంగారకళా ప్రవీణురాండ్రు, ఛత్రము పట్టువారు, చామరములు వీచువారు. నృత్యము జేయువారు అచ్చటికి వచ్చిచేరిరి పరమాత్మతో కూడ అందరును పదునారువత్సరముల వయస్సు గలవారే.

యమునానదీమతల్లి నల్లనిచీరను నవరత్నమాలికలను ధరించి వచ్చెను. జాహ్నవీనదీమతల్లి తెల్లనిచీరను, లక్ష్మీదేవి యెర్రనిచీరను ధరించి పద్మరాగమణుల మాలలతో అరుదెంచిరి గంగాదేవి తెల్లనిచీరను ధరించి మంచిముత్తెపుసరులతో విచ్చేసెను. వసంతలక్ష్మి శ్వేతవస్త్రము ధరించి పుష్పమాలికలతో అచటికి వచ్చిచేరెను. విరజానది ఆకుపచ్చని పట్టుపుట్టము ధరించి ఒయ్యారముగ నడయాడుచు వచ్చెను.

గగనమున చుక్కలలోని చంద్రునివలె శ్రీకృష్ణపరమాత్మ వేణువు చేబూని నెమలిపింఛము, పట్టుపీతాంబరము, ఆకుపచ్చని అంగవస్త్రముతో యమునా నదీతీరమందలి ఇసుకతిన్నెలపై రాధాదేవితోగూడి సరససల్లా పములు సలుపుచుండెను. చిరునవ్వు లొలికించుచు రాధాదేవి కుడిచేతిని పట్టుకొని పొదరిండ్లలోనికి లాగుకొనిపోవుచుండెను. ఆమెను అచటవదలి తాను వేరొక నికుంజముతోనికి జొరబడి దాగికొనియుండెను. రాధాదేవి యెంత వెదకినను పరమాత్మ కన్పింపలేదు. పరమాత్మ కల్పవృక్షశాఖల యందు దాగెను. రాధాదేవి నందకిశోరుని కనుగొనెను. అటులే రాధాదేవి దాగుడుమూత లాడెను. సర్వజ్ఞుడగు పరమాత్మ కమ్మగప్పుట రాధా దేవికి శక్యమా? కడకు మాధవీమాధవులు (రాధాకృష్ణులు) పరస్పరము తమాలవృక్షమును బంగరుతీగ చందమున చుట్టుకొనిరి. ఆ బంధము అవిచ్ఛిన్నము.

వర్తులాకారముగ వ్రజవనితలు వరుసలు వరుసలుగ నిలబడిరి. నడుమ రాధాకృష్ణులు నిలిచిరి. పరమాత్మ చాలమంది కృష్ణులుగ గోపికలందరితో గూడి రాసక్రీడ సలుపుటకు సిద్ధమయ్యెను. రాసోత్సవము ప్రారంభమయ్యెను. పరమాత్మ వేణువు నూదుచు నృత్యముచేయ దొడంగెను. అందుకు అనుగుణముగ దుందుభులు లయవిన్యాసము చేయ దొడగెను. నారద తుంబురులు సైతము ఆ మధురధ్వనులు ఏ రాగములో గ్రహింపలేకపోయిరి. రాసక్రీడ యన రసాత్మకమైన పరబ్రహ్మ క్రీడ యని యర్థము. పరమాత్మయే స్త్రీ పురుష రూపములతో క్రీడ సలుపును. తన ప్రతిబింబముతో పరమాత్మ ఆడుకొనుచుండును. నృత్యము నెరుగని గోపికలు పరమాత్మ సంకల్పముచే అడుగులకు అడుగులువేయ దొడంగిరి. కొందరి స్వేదబిందువులను తన అంగవస్త్రముతో పరమాత్మ అద్దుచుండెను. కొందరి కొప్పులను సరిచేయుచుండెను. కొందరి కంఠమాలికల చిక్కును విడదీయుచుండెను. మలయమారుతములు గోపికా కృష్ణులకు ఉద్దీపనము గలిగించుచుండెను.

రాసక్రీడను చూచి దివ్యానుభూతి నొందుటకై వైకుంఠవాసులు అరుదెంచిరి. స్త్రీల మొగ మెరుగని సనక సనందనాదులు సత్యలోకమునకు, కైలాసమున కేగిరి. అచట వారికి చతుర్ముఖుడు, శంకరుడు కానరాలేదు. రాసక్రీడామహోత్సవమును దర్శించుటకు వా రిరువురు బృందావనమున కేగిరని తెలిసి వారుగూడ అచటికి వెళ్ళిరి. రాసక్రీడామహిమచే వా రెల్లరు సమాధిస్థితి నొందిరి. ఆనందాబ్ధి నోలలాడిరి. రాసక్రీడలో పాల్గొనుటకు స్త్రీలకుదక్క అన్యులకు స్థానములేదని విని తాము స్త్రీలము కాకపోతిమే యని మహర్షులు దేవతలు కన్నీరు గార్చిరి. ప్రకృతి స్తంభించెను. తారలు నడకమానెను. నిరతిశయానంద మెంత యనుభవించినను తనివిదీరుట లేదు. దేవతలు పుష్పవృష్టి కురియించిరి. సదస్యులు తమ్ము తాము మరచిరి. వారి అహంకారము అదృశ్యమయ్యెను. గోపికలు కృష్ణునితో ఆడుకొనుచుండిరని తలతురేగాని కృష్ణుడు కృష్ణునితో ఆడుకొనుచుండెనని సామాన్యులు గ్రహింపనేరరు.

## జలక్రీడ

పరమాత్మునితో రాసక్రీడ సలిపిన గోపికలకు ముచ్చెమటలు పోసినవి. శ్రీకృష్ణునితో బాటు గోపికలందరు యమునానదిలోనికి దిగిరి. పరమాత్మయొక్క సర్వతోముఖ ఆలింగనభాగ్య మబ్బినది ఆ యమునానదీమతల్లి కే. యమున తన అదృష్టమునకు మురిసి ఉల్లాసముతో పొంగెను. గోపికలు పవిత్రోదకముల జిమ్ముచు కిల కిల నవ్వుచుండిరి. పరమాత్మ వారిని యమునాతోయముల ముంచెత్తెను. వారు ఉక్కిరి బిక్కిరయిరి. యమునానదిలో ఎంత గ్రుంకులిడినను వారికి తనివితీరుట లేదు.

రాధాదేవికడ నున్న లక్షదళపద్మమును, చీరను లాగికొని పరమాత్మ పరుగిడెను. రాధాదేవి పరమాత్మను వెంబడించి, తన వస్తువులు గైకొనుటయే గాక శ్రీకృష్ణుని పిల్లనగ్రోవిని, పీతాంబరమును లాగికొని పరుగిడెను. గోపికలు రాధాదేవి సాహసమునకు మెచ్చుకొనిరి. తగిన శాస్తియైనదని మాధవుని వెక్కిరించిరి. పరమాత్మకు ఆగ్రహము కలుగకుండుటకై మురళిని, పీతాంబరమును రాధాదేవి పతికి నొసగెను. రాధాదేవి ఆభరణములను పరమాత్మ ఆమెకు అందించెను. అల్లరి చేయుటలో రాధాకృష్ణు లిరువురు గడుసరులని గోపికలు నవ్వుకొనిరి.

గోపికలు రాధాదేవిని రత్నపీఠముపై గూర్చుండ బనిచి అగరు, కస్తూరి, మంచిగంధము, కాటుకతో అలంకరించిరి. మధు, మాధవి, వసంతలక్ష్మి రాధాదేవిపై పుష్పాదిని చల్లిరి. విరజానది ఆమెకు చంద్రహారము; లలితరత్నములతో కుట్టబడిన రైకను; విశాఖ కంఠాభరణము, చంద్రానన రత్నపుటుంగరములను; చంద్రకాంత బంగరుజడను; బృంద చంద్ర సూర్యాభరణములను సమర్పించిరి. రాధాదేవిని అలంకరించిన తావునకు శృంగారమండల మని పేరిడిరి. రాధాకృష్ణులు దేదీప్యమానముగ వెలుగొందుచుండిరి. చంద్రుడు రాధాదేవికి సహస్రదళ పద్మములను చంద్రకాంత మణులను సమర్పించెను.

పరమాత్మ మేఘమండలీ రాగమును వేణువుపై నాలపింప అమృతము వర్షించెను. మలయమారుతము ఆహ్లాదకరముగ నుండెను. రాధాకృష్ణులు, గోపికలు తాళవనమునందు విహరించుచుండ వారికి దప్పిక యయ్యెను. వారు పరమాత్మను పిలిచి యమునానదికి పోలేమని, ఆ యమునానదినే తాళవనమునకు గొనిరమ్మని శ్రీకృష్ణుని వేడుకొనిరి. వేత్రదండముతో పరమాత్మ పుడమిపై కొట్టెను. ఆ తావున పాతాళగంగ పైకి పొంగెను. ఆ స్థలమును వేత్రగంగ యందురు.

గోపికలు రాధాకృష్ణులను కుముదవనమునకు గొనిపోయిరి. రాధాదేవి శ్రీకృష్ణుని చంపక మల్లెపూలతో భుజకీర్తులను, కదంబములతో కిరీటమును, మందారపుష్పములతో అంగవస్త్రమును, సహస్రదళ పద్మములతో కర్ణములను అలంకరించెను గోపికలు పాటలుపాడుచు, నృత్యము చేయ దొడంగిరి. పరమాత్మ వారిపై ప్రసన్నదృక్కులు బరపుచుండెను. వారందరు అంబరీషుడు, ధ్రువుడు తప మొనర్చిన మధువనమున రాసక్రీడ సల్పిరి. అటుపిమ్మట కుంద, మాలతీ, ఆమ్లనింబ, దాడిమ, ద్రాక్ష, కదంబ, బిల్వ, నారికేళ, పనస, మొగలి, కదళి, పొగడ, మందార, తులసీవనములలో రాసక్రీడలు జరిపి కడకు వారు కామవనము జొచ్చిరి.

పరమాత్మ మురళిని ప్రయోగించుచుండ గోపికలు కామపీడితలైరి. దేవతావనితల కుచ్చెళ్లు జారుచుండెను. గోవర్ధనగిరి ద్రవించుటచే అచట శ్రీకృష్ణుని పాదచిహ్నములు కనబడుచుండెను. అటనుండి వారు నందీశ్వరగిరికి చేరి రాస క్రీడలు సలుపుచుండ గోపికలలో సౌభాగ్యవతులమను రాజసము, పరమాత్మయే వారిని వశీకరింపవలెనను ఆత్మాభిమానము గోచరించెను. శ్రీకృష్ణపరమాత్మ అంతర్హితు డయ్యెను.

## విరహావస్థ

గోపికలు కలత జెందిరి. సంయోగమున కన్నను వియోగమున ప్రేమ ఉద్దీపన మగును. పుష్టి నొందును. తమ గర్వము ఆత్మాభిమానమును పరీక్షించుటకే పరమాత్మ అదృశ్యుడయ్యెనని వారు భావించిరి. తమ తప్పిదమునకు కుములుచు, కురంగపక్షులవలె విలపించుచుండిరి.

పరమాత్మ వేణుగానము గోపికలను ఉన్మత్తుల గావించెను. వారినుండి అవివేకము లజ్జను పారద్రోలి పరమాత్మ కభిముఖులను గావించెను. ఆ దివ్యమంగళస్వరూపుని దర్శింపవలెనను కోరిక వారిలో ఇనుమడించెను. గోపికలకు పరమాత్ముడు దక్క అన్యులు గోచరించుట లేదు. శ్రీకృష్ణుని లీలలను స్మరించుచు పరమాత్మయందు తాదాత్మ్య మొందుచుండిరి.

ఒకగోపిక 'నేనే కృష్ణుడను' అని నృత్యముచేయ దొడంగెను. కొందరు గోపికలు కంటబడిన అశ్వత్థ, పున్నాగ, వెదురు, జువ్వి, మద్ది వృక్షములను 'పరమాత్మ జాడ తెలియునా?' అని అడుగ జొచ్చిరి. వాటి ఆకుల కదలికను గమనించి వారు పరమాత్మ అందులేడని గ్రహించిరి. కొందరు మాలతి, మల్లె, జాజి, లవంగ, మందారములను 'పరమాత్మ జాడ తెలుపుడు' అని యర్థించిరి. అవి మౌనము దాల్చినవి. శ్రీకృష్ణునకు దూరమగుటచే అవన్నియు శిలాసదృశము లయ్యెనని వారూహించిరి. పరమాత్మ కృప కలుగనిచో యోగులు సైత మా మహనీయుని దర్శించుట అసంభవమని తలపోసిరి.

గోపికలు శ్రీకృష్ణుని వెదకుచుండ తులసీవృక్షము కనబడెను అది సుగంధముతో మధువు స్రవించుచుండెను. వారు తులసితో "అమ్మా! పరమాత్మ నీకు ప్రేమభాజనుడు. సదా నీ దళములనే ఆయన కంఠ మాలికగ అలంకరించుకొనును. ఆయన ఇటకు అరుదెంచెనా?" యని యడిగిరి. తులసి మౌనము దాల్చెను. ఆమెకు తనపై దయ గలుగ లేదని తలచి వారు నిస్పృహ జెందిరి. పచ్చికబయుళ్లలో పరమాత్మపాద చిహ్నములు వారికి కనబడెను. వారు భూదేవితో "అమ్మా! రోమాంచము స్వామి పాదస్పర్శచే గలిగినదా? కానిచో వరాహరూపమున నిన్ను చంక నిడుకొనిన స్పర్శచే గలిగినదా!" యని గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్న అడిగిరి. భూదేవి మారుపలుకలేదు.

ఒక హరిణము చెంగుచెంగున దుముకుచు గోపికలను జూచుచుండెను. ఆ మృగము తమకు దారిచూపునని భ్రమచెంది వారు దానివెంట

బడిరి. కొంతదవ్వేగిన పిమ్మట ఆ లేడి యంతర్ధానమయ్యెను. పర మాత్మ ఆగ్రహమునకు వెఱచి ఆ హరిణ మెచటనో దాగెనని గోపికలు భావించిరి. లతలు, పుష్పములు మధువు స్రవించుచుండ వాటిని శ్రీకృష్ణ పరమాత్మ దర్శనముచే గలిగిన ఆనందాశ్రువులుగ వారు భావించిరి.

ఒకగోపిక పూతన ఆకారమున వచ్చెను. వేరొక గోపిక తనను కృష్ణునిగ భావించుకొని దాని స్తన్యమును పానముచేయ దొడంగెను. ఒక గోపిక తాను తృణావర్తుడనని పలుకుచు వేరొక గోపికను లాగికొని పోయెను. ఒకగోపిక తన నోటియందు సకల బ్రహ్మాండము లున్నవని నోరు తెఱచెను. వేరొకతె సంభ్రమముతో ఆ నోటిని వీక్షించుచుండెను. ఒకగోపిక 'గోవర్ధనపర్వతము నెత్తితి' ననుచు పైట పరచెను.

అంతట కొంతదవ్వేగుపరికి పరమాత్మ పాదద్వయము, మరిరెండు పాదములుగూడ వారికి కనబడెను. అవి రాధాకృష్ణుల పాదచిహ్నము లని భావించి వారి ప్రేమానురాగముల కీర్తించుచుండిరి. వారు పర మాత్మ పాదచిహ్నములందలి ధ్వజరేఖ, శంఖచక్రరేఖలు చూచి "ఈ పాదములు మహాయోగుల హృత్కమలముల భద్రపరుపబడి పూజింపబడు చున్నవి. శ్రుతులను వీథులలో పావటబొట్టుగ నున్నవి. దేవతలు శిర మున దాల్చునది, ముక్తికాంత మనస్సును ఆకర్షించునది ఈ దివ్యపాద ములే గదా?" అని తలచుచు సాగిపోవుచుండిరి. తానే అధికముగ పర మాత్మచే ప్రేమింపబడుచుంటినని రాధాదేవి గర్వమునొంది 'నేను నడువ లేను. నీ భుజస్కంధములపై గొనిపొమ్మని' శ్రీకృష్ణుని కోరెను. 'సరే' యని పరమాత్మ గూర్చుండెను. రాధాదేవి పరమాత్మ భుజస్కంధము లపై ఆసీనురాలైన వెంటనే పరమాత్మ అంతర్హితు డయ్యెను. రాధాదేవి బిగ్గరగ విలపించెను. ఆ దీనారవములు గోపికలు విని ఆమెకడకు జనిరి. తాము బయలుదేరిన తావునకే చేరితి మని గ్రహించిరి. అహంకారముతో తాముండువరకు పరమాత్మ తమకు కన్పింపడని తలచి శ్రీకృష్ణలీలలను గానముచేయ దొడంగిరి.

## గోపికాగీతలు

గోపికలు పరమాత్మను " ఓ కృష్ణా! ప్రియమగు అన్ని తావులను వదలి నీకొరకు వేచియుంటిమి. నీవు అవతరించిన పిమ్మట బృందావన శోభ వర్ణనాతీతము. వైకుంఠమందు సర్వులచే సదా సేవింపబడు మహాలక్ష్మి ఇచట సేవకురాలుగ నుండి నీకు సేవచేయుచున్నది. మా ప్రాణములు నీలో భద్రముగ దాచియుంటిమి. కానిచో విరహాగ్నిలో కరగియుండెడివి. మా ప్రాణముల హరించి దేహములను వదలి చిత్రవధ చేయుట నీకు పాడియా? నీవు నిగ్రహానుగ్రహ సమర్థుడవు. నీ చల్లని చూపులతో మమ్మనుగ్రహింపుము. నీవు చతురుడవు. నీవు కరవాలముతో గాక, క్రీగంటిచూపులతో మా హృదయములను చీల్చితివి. ఇది నీకు న్యాయమా? యశోదాదేవి హృదయము నవనీతసదృశ మని, కోమల మని అందురే! అట్టి మాతృగర్భమున పుట్టిన నీకు ఈ కాఠిన్య మెచటి నుండి వచ్చినది? నీవు సర్వాంతర్యామి వందురే! మా బాధలు నీకు తెలియకుండునా? నీ అభయహస్తము కన్పించుట లేదే! ఎచట దాచితివి? కనికరించి దానిని మా శిరముపై నుంచుము. మా అవిద్య తొలగి చతుర్విధ పురుషార్థములు మాకు లభించును. అబలలపై నీ ప్రతాపము చూపుచుంటివా? సంకల్పమాత్రముచే సకల శ్రేయస్సు లొసగ గలవు. ఇటుల మమ్ముల నపేక్షించుటకు మే మొనర్చిన యపరాధమేమి? మాచే సేవ లందుకొనుము. కానిచో మా కొకమారు నీ దివ్యమంగళ రూపమును జూపుము.

నందనందనా! నీ పాదపద్మములను శ్రుతులు కీర్తించినవి. నీ అధరామృతపాన మొసగి మా తాపము తీర్చుము. కోమలమగు నీ చరణకమలములను మా స్తనద్వయముపై నుంచి మా వేదన చల్లార్చుము. నిన్ను చూచునపుడు కనురెప్పలు అడ్డువచ్చుటచే సృష్టికర్త యగు బ్రహ్మదేవుని దూషించెడివారము.

నందకిశోరా! సంపర్గదోషముచే మా కఠినవక్షోజస్పర్శచే నీ హృదయము శిలారూపము దాల్చెనేమో! మన్మథుడు మమ్ములను మిక్కిలి

బాధించుచుండెను. నీవు మిన్నకుండుట భావ్యము కాదు. నందరాజవంశ చంద్రుడవు, గోపాలురను సముద్రమునకు మత్స్యము వంటివాడవు. చందనవంశమున కలహంసవంటి వాడవు. చంద్రబింబ సదృశమగు రాధాదేవి నెమ్మోమునకు చకోరమువంటి వాడవు. పద్మమువంటి ఆమె మోమునందలి మకరందమును ఆస్వాదించు తుమ్మెదవంటివాడవు. నీవు కన్పించని ప్రతిక్షణము మాకొక యుగముగ తోచుచున్నది. చంద్రకిరణములు వెచ్చగ నున్నవి. మలయమారుతము కర్కశముగ నున్నది.

కల్పాదగిరి మహర్షిపతి మదయంతి పొందిన విరహవేదనకన్నను సీతామహాదేవి శ్రీరాము నెడబాసిన పిమ్మట పొందిన వేదనకన్నను మా విరహవేదన కోటిరెట్లు అధికముగ నున్నది. నీ దర్శనభాగ్యము కలుగనిచో క్షణమైనను బ్రతుకలేము" అని పరమాత్మను ఉచ్చైస్స్వరమున ఎలుగెత్తి వేడుకొనిరి.

నవనీతచోరుడగు శ్రీకృష్ణుని హృదయము కరగెను. పరమాత్మ ప్రత్యక్ష మయ్యెను. శంఖ చక్ర గదా శార్ఙ్గధారియై పీతాంబర వనమాలాలంకృతుడై పిల్లనగ్రోవి చేబూని మన్మథమన్మథుడై నిలిచెను. గోపికలు పరమాత్మను తనివిదీర దర్శించిరి.

ఒకగోపిక పరమాత్ముని చేయి పట్టుకొనెను. మరియొకతె పరమాత్ముని చేతిని తన భుజముపై వేసికొనెను. ఒకతె తన స్తనములపై పరమాత్మ పాదముల నుంచుకొని తృప్తిచెందెను. రాధాదేవి కోపోద్రిక్తయై పరమాత్మను చురచుర చూచుచుండెను. శ్యామసుందరుని కనులార వీక్షించిన గోపిక సమాధిస్థితినొంది ఆనందించుచుండెను. ఒకతె 'నిన్ను నన్ను విడదీసిన విధాత ఎంతటి క్రూరకర్ముడు' అని నందకిశోరునితో ననెను. పౌరుషముతో భీష్మించుకొని దూరముగ నుండిన గోపిక పరమాత్మను పలుకరించెను. శ్రీకృష్ణదర్శన మబ్బుటచే వారు ఉల్లాసముతో పరమాత్ముని యమునానది ఇసుకతిన్నెలపైకి విహరించుటకు గొనిపోయిరి.

గోపికలు పయటలు పరచి అందు ఆసీనుడవుగమ్మని శ్రీకృష్ణుని వేడుకొనిరి. ప్రేమాతిశయముతో అందరి పయటలపై అన్ని రూపముల దాల్చి పరమాత్మ గూర్చుండెను. దీనినే గోపికాపరిషత్తు అందురు. యోగులు ఈ దృశ్యమును తమ హృదయకమలములందు ధారణ చేసిరి.

గోపికలు పరమాత్మతో "వ్రజకిశోరా! ఉపకారమును విస్మరింపక ప్రత్యుపకారము చేయువారు; ప్రతిఫలాపేక్ష లేకుండ ఉపకారము చేయువారు; ఉపకారము చేసినవారికి అపకారము చేయువారు ఈ లోకమున గలరు. పై మూడు జాతులలో తాము ఏ కోవకు చెందినవారు? అని నిల దీసిరి. తాను పై మూడు తెగలకు చెందినవాడను కానని పరమాత్మ చెప్పుచు 'వియోగమున ప్రేమ పుష్టివంతమగును. హృదయము తపించును. నిరపాధికప్రేమ నాయందు కొడమి నిధి ధ్యాస కలుగును. బ్రహ్మాకారచిత్తవృత్తి గలుగును, అప్పుడు అవిద్య తొలగును. ఎడబాటు కలుగని సంయోగము కలుగుటకే అటు లొనర్చితిని."

"ఓ వ్రజవనితలారా! నా కొరకై ధర్మాధర్మములను పాటింపక పండువంటి సంసారముల విడిచి వచ్చితిరి. నేను మిమ్ములను పదలలేదు. అంతర్యామినై మీ యందరిలో నుండి, మీ మాటలను చర్యలను గమనించుచున్నాను. మీరు నన్ను ప్రేమించితిరి, నాయందు మీకు ప్రేమ యున్నచో నా తప్పిదములు మీకు కానరావు. మీ ప్రేమ నిర్హేతుకమైనది. మీ ఋణమును నేను తీర్చుకోలేను. నన్ను అనుగ్రహింపుడు" అని ప్రాధేయపడెను. గోపికల హృదయము కరగెను. వారు పరమాత్మను పెక్కువిధముల స్తుతించిరి. 'అంతర్ధానమై ఎచటి కేగితివి' అని గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నించిరి.

పరమాత్మ వారితో "పుష్కరద్వీపమున హంసుడను మహర్షి నాకై రెండు మన్వంతరములు తపము చేసెను. అపుడు యోజనము నిడివిగల మత్స్యము మునీంద్రుని మ్రింగెను. మత్స్యమును, అందుండి వెలువడిన రక్కసుని సంహరించి ఋషిని కాపాడితిని. అంతట క్షీరసాగరమున శేష శయనముపై పరుండియుండ మీ పిలుపువినబడెను. పడిపడిగ ఇచట కరు

దెంచితిని ” అని తెలుప వారు వెలవెల బోయిరి. అకారణముగ అచ్యుతుని సంశయించితి మని నొచ్చుకొనిరి. క్షీరసాగర శయనరూపమును జూడ వలెనను కాంక్షగలదని విన్నవించుకొనిరి. అష్టభుజములతో శ్వేతశేషతల్ప ముపై ప్రక్కన రాధాదేవితో పరమాత్మ శయనించియుండెను. ఆ దృశ్య మునుజూచి గోపికలు మహానందము పొందిరి. అతనికి తమ కృతజ్ఞతను వెల్లడించుకొనిరి.

## రాధాకృష్ణుల విహారము

గోపికాసమేతముగ రాధాకృష్ణులు యమునాతీరమునకు విచ్చేసిరి. బింబ మాడినచో ప్రతిబింబ మాడునటుల కృష్ణునితో గోపికలు నృత్యము జేయ దొడంగిరి. మధురభక్తిలోని పరమావధి అదియే. వ్రజవనితలు అలసి స్వేదబిందువులు రాలుచుండ, పరమాత్మ వాటిని ఉత్తరీయముతో అద్దుచుండెను. తూలి పడిపోవువారిని పట్టుకొనుచుండెను. ఇది ప్రాకృతము కాదు. చిదేక రసము, సామాన్యులకు సాధ్యము గానిది.

రాధాకృష్ణులు గోపికలు యమునయందు జలక్రీడ సల్పిరి. రాధాదేవి పరమాత్ముని సర్వాలంకారభూషితుని గావించెను. పరమాత్మ రాధాదేవిని దివ్యాభరణములతో అలంకరించెను. గోపికలు అలంకరించుకొని రాధాకృష్ణుల వెంట లోహజంఘవనమున కేగిరి. పరమాత్మ అందలి పుష్పముల గోపి రాధాదేవి, గోపికల కొప్పులలో తురిమెను. సరసోక్తు లాడుకొనుచు వారందరు మహాపుణ్యవనమున జేరిరి. పరమాత్మ వారితో రాసక్రీడ సలుపుచుండెను.

## గదాయుద్ధము

శంఖచూడుడు కుబేరునకు ఆప్తుడు. గదాయుద్ధమందు ప్రవీణుడు. అతడు మధురానగరమున కేగి తనతో గదాయుద్ధమునకు రమ్మని కంసుని కోరెను. పోరున గెలుపొందిన వానికి ఓడినవారు దాస్యము చేయవలె నని నియమము. వా రిరువురకు ఇరువదియేడు దినములు యుద్ధము జరిగెను. ఇరువురు వెనుకంజ వేయలేదు.

ఆ సమయమున గర్గమహర్షి మధురానగరమున కరుగుట తటస్థించెను. ఆయన కంస శంఖచూడులతో "మీ రిరువురు సమబలులు. పోరు నిలుపుడు. శంఖచూడుడు శివభక్తుడు. పరమాత్మ మిమ్ముల సంహరింప గలడు. అందుచే సఖ్యముతో మెలగుడు" అని హితవు పలికెను. వారిరువురు అందుల కంగీకరించి పోరు మానిరి. శంఖచూడుడు కుబేరుని కడ కేగుచుండ మహాపుణ్యవనమున రాధాకృష్ణులు గోపికాసమేతముగ రాస క్రీడ సలుపుట చూచి పరమాత్మను సామాన్యమానవుడని భ్రమచెంది, శతచంద్రానన యను వనితను గొనిపోవుచుండెను.

## శంఖచూడుని వధ

తాళవృక్ష ప్రమాణముతో, సింహపుమోముతో, అసితవర్ణముతో, నిడివిగల నాలుకతో సమీపించు శంఖచూడుని చూచి గోపికలు పరుగులిడు చుండిరి. శతచంద్రానన అనుగోపిక కృష్ణునితో "నందకిశోరా! నవనీత చోరా! రాధామానస చకోరా! పాహిమాం రక్షమాం అని ఆర్తనాదము గావించెను. ఆ దీనారవము విని పరమాత్మ హృదయము వెతనొందెను. ఆయన సాలవృక్షము చేకొని, శంఖచూడుని సంహరించుటకు రయమున వెంబడింప శతచంద్రాననను వదలి శంఖచూడుడు పారిపోవుచుండెను. పరమాత్మ వానిని పట్టుకొని గిరగిర త్రిప్పి నేలపై విసరికొట్టి పిడికిలితో వాని శిరముపై పొడిచెను. శంఖచూడుడు అసువుల బాసెను. వాని శిరముననున్న మణిని పరమాత్మ శతచంద్రాననకు బహూకరించెను. ఆమె పరమాత్మ పాదపద్మములకు ప్రణమిల్లెను. శంఖచూడునిలోనుండి దివ్యతేజస్సు వెలువడి నందనందనునకు ఆప్తుడగు శ్రీదామునిలో ప్రవేశించెను.

## అసురిమహర్షి

నారదపర్వతమున అసురిమునీంద్రుడు రాధాకృష్ణుల స్మరించుచు తపము గావించుచుండెను. ఒకనాడు ఆయనకు రాధాకృష్ణులు మనోవీధిని గోచరింపలేదు. మహర్షి కలతనొంది శ్రీమన్నారాయణుని అన్వే

షించుచు బదరికాశ్రమమునకు జనెను. అచట పరమాత్మ కన్పింపలేదు. అసురిమహర్షి విచారగ్రస్తుడై లోకాలోకపర్వతమునకు జనెను. అచట పరమాత్మ ధ్రువునకు దర్శన మొసగుచుండెను. ఆ తావున శ్రీహరి మహర్షికి కన్పింపలేదు. మహర్షి చింతాక్రాంతుడై శ్వేతపర్వతమునకు, వైకుంఠమునకు జనెను. ఆ ప్రదేశమున అచ్యుతుడు కానరాలేదు. మాధవుని జాడ తెలుపుడని మహర్షి ద్వారపాలకులను కోరెను. పరమాత్మ వామనమూర్తి అవతరించిన బ్రహ్మాండమం దుండెనని వారు తెలిపిరి. అచట పరమాత్మ కానరాలేదు. అసురిమహర్షి కైలాసమున కేగి గోవిందుని జాడ దెలుపుమని శివుని వేడుకొనెను. మహర్షి మనోవేదనను జూచి ఈశ్వరుడు 'మునీంద్రా! పరమాత్మ బృందావనమున గోపికాసమేతుడై ఆరుమాసముల రాసక్రీడ ప్రారంభించిరి' అని తెలిపి మహర్షిని వెంట నిడుకొని బృందావనమునకు జనెను.

బృందావనమున రాసక్రీడ మనోహరముగ జరుగుచుండెను. నికుంజద్వారముకడ రాధాదేవి చెలులు కావలియుండిరి. అసురిమహర్షి, మహేశ్వరుడు అచటికి వచ్చిరి. ద్వారపాలికలు వా రిరువురిని లోనికి రానీయలేదు. స్త్రీలకు మాత్రమే ప్రవేశము గలదని తెలిపిరి. అతిథులకు నిస్పృహ గలిగెను. వారు ద్వారపాలికల బతిమాలుచు పరమాత్మ దర్శన భాగ్యమగుటకు ఉపాయము దెలుప వేడుకొనిరి. ద్వారపాలికలు వారితో "అయ్యా! ఇచటికి సమీపమున సరోవరమున గ్రుంకులిడిన పురుషులు స్త్రీలుగ మారుదురు. తమరు స్త్రీలుగ మారినపిమ్మట లోన ప్రవేశించుట కభ్యంతరముండదు" అనిరి. రాసక్రీడాసక్తులైన మహేశ్వరుడు, అసురి సరోవరమున గ్రుంకులిడి స్త్రీరూపముల బొందిరి. వారికి అదియొక వింత అనుభవముగ దోచెను. వా రిరువురికి ప్రవేశము లభించెను. నికుంజ ద్వారమున వారు రాసక్రీడ జరుగు స్థలమునకు జనిరి. పరమాత్మ రాధాదేవి, గోపికలు సల్పు రాసక్రీడను వారు కనులార తిలకించి ధన్యులైతిమని పొంగిపోయిరి.

అసురిమహర్షి మహేశ్వరుల భక్తిప్రపత్తులకు పరమాత్మ కడుసంతసించి "పరమ భక్తాగ్రేసరులారా! మీయందు నాకుగల అనురక్తిచే ఈ

సదవకాశము గలుగజేసితిని, వరముల కోరుకొనుడు" అనెను. వారు "ఓ దయామయా! నీ దర్శనభాగ్యమున కోరికలు నశించినవి. బృందావన మందుండి నిత్యము మిమ్ముల దర్శించు భాగ్యము ప్రసాదింపుము" అని వేడుకొనిరి. రాసక్రీడ ఆరుమాసములు వైభవముగ జరిగెను. మరునాడు వేకువను సర్వులు తమతమ నెలవులకు జనిరి. భగవల్లీలలకు కాల నియమము లేదు. అవి నిత్యములు. మహాయోగులు స్మరించినంత మాత్రమునసే రాసక్రీడమహోత్సవము కనులయెదుట గోచరించును. అదియే అద్వైతశృంగారము. భగవత్ శృంగారము. రాసక్రీడాఘట్టము వినిన హృద్రోగములు పోవునని ప్రతీతి.

## శంఖచూడుని చరిత్ర

పరమాత్మకు రాధ, విరజ, లక్ష్మి యను సతులు గలరు. అందు రాధపై పరమాత్మకు ప్రేమ మిక్కుటము. ఒకనాడు పరమాత్మ విరజతో భోగముల ననుభవించుచుండెనని విని రాధ కినుక వహించెను. సఖీసమేతముగ బంగరురథమునెక్కి రాధ నందకిశోరుడున్ననికుంజమునకు జనెను. ద్వారముకడ కావలియున్న శ్రీధాముడు ఆమె లోని కేగుటకు అనుమతించలేదు. కోపోద్రిక్తురాలైన రాధ వానిని ములుకోలతో చురకవేసి రథమును నికుంజములోనికి గొనిపోయెను. అది గ్రహించిన పరమాత్మ అంతర్హితు డయ్యెను. విరజ నదీరూపము దాల్చెను. పరమాత్మ కన్పింప లేదని కుందుచు రాధ తన మందిరమునకు మరలెను.

పరమాత్మ విరజ నికుంజమునకు విచ్చేసెను. నదీరూపముననున్న విరజ స్త్రీరూపము దాల్చెను. వారు రాసక్రీడ సలిపిరి. మాధవఅంశతో విరజకు సప్తసుతులు గలిగిరి. వారిలో వారికి కలహము రేగెను. అందరిలో చిన్నవానిని తక్కినవారు కొట్టిరి. మాతృహృదయము తల్లడిల్లెను విరజ వానిని దగ్గరకు దీసి బుజ్జగించుచుండెను. విరజ తనను విడిచి బిడ్డలను ప్రేమించుచున్నదని పరమాత్మ అదృశ్యు డాయెను. విరజ వెతనొంది 'పతీవ్రతుల యెడబాటుకు మీరే కారకులు గాన మీరు సదా విడి వడియుందురు గాక! మీ నీటిని ఎవరును ముట్టకుందురు గాక!' అని సుతుల శపించెను. వారు లవణ, ఇక్షు, సురా, సర్పి, దధి, దుగ్ధ, జలము

లను సప్తసముద్రములైరి. సుతులకు సైతము దూరమైతినని విరజ వ్యధ చెందుచుండ పరమాత్మ ప్రత్యక్షమై "మనకు వియోగ ముండదు. సుతులు నీకు సదా కన్పించుచుందురు" అని వర మొసగి శ్రీధామునితో గూడి పరమాత్మ రాధా నికుంజమున కేగెను.

శ్రీకృష్ణుని జూడగనే రాధ కోపము ఇనుమడించెను. ఆమె పరమాత్మునితో "ఓహో! ఇది రాధ మందిరమని తెలియక వచ్చియుందువు. నేను విరజను గాను. నావలన ఇక భోగములు జరుగవు. అ విరజకడ కేగుము. ఆమె నదీరూపమును బొందిన, నీవు నదరూపము దాల్చి సకల భోగము లనుభవింపుము. నిన్ను నావాడవని నమ్మి మోసపోతిని. ఇక నీ నయగారములు కట్టిపెట్టుము" అని నిష్ఠురముగ బలికెను.


పరమాత్మ మారుపలుకక మిన్నకుండెను. మౌనము రాధ కోపము మరుపశమింప జేయునని పరమాత్మ అనుకొనెను. విరహతాపమున అటుల పలికెనని తలపోసెను. శ్రీధాముడు పరమాత్మకు ప్రాణసఖుడగుటచే ఆమె పలుకులు ములుకులవలె గ్రుచ్చుకొనగ "ఓ కృష్ణప్రియా! నీవా ఇట్టి నిష్ఠురోక్తులాడుట? నీ పతి సామాన్యుడా? సకల లోకములకు ఆధారమైనవాడు. భవరోగముల బాపు భిషగ్వరుడు. సర్వుల కోర్కెల దీర్చగల దయామయుడు. పతి దరిద్రుడైనను, కురూపియైనను ప్రేమింపవలెనను ధర్మము నీకు తెలియదా? నిన్ను తన హృత్కమలమున భద్రపరచుకొని మురియుచుండును. అట్టి శ్రీకృష్ణుని నీవు నిరాదరింతువా? పరమాత్మ అందరిసొత్తని గ్రహింపనేరని అమాయకురాలవు. ఇంటికి వచ్చిన శత్రువుని సైతము ఆదరించుట ఆర్షసంప్రదాయము. కోపము మ్రింగి కాంతుని ఆదరింపుము" అని హితము పలికెను.

సతీపతుల కలహమున అన్యుల జోక్యము తగదని రాధ భావన. శ్రీధాముని హితోక్తులు ఆమెకు అగ్నిలో ఆజ్యము పోసినటు లయ్యెను. రాధ ఉచితానుచితముల పాటింపక "శ్రీధామా! నీవు నందకిశోరునికి తగిన సఖుడవు. నిన్ను రమ్మని ఎవరు పిలిచిరి? నీవు నాకు హితోక్తుల నుపదేశింతువా? ఈ పలుకులు నీ ప్రాణసఖునకు దెలిపిన బాగుండును. పితృదేవుని స్తుతించుచు, మాతృదేవిని నిందలించుచుంటివి. ఇక నీవు ఇటనుండ తగదు. దానవరూపము పొందుదువు గాక! అని శపించెను.

శ్రీధాముడు వెర్రివాడు. ప్రణయకలహమున తల దూర్చి రాధా దేవి శాపమునకు గురియయ్యెను. శ్రీధాముడు కుపితుడై "ఓ రాధా దేవీ! నీ కోపమే నీ శత్రువు. శతవర్షములు పరమాత్మ నీకు దూరమగు గాక!" అని ప్రతిశాప మొసగెను. రాధ, శ్రీధాముడు పశ్చాత్తప్తులైరి.

పరమాత్మ "ఓ రాధ! మానసమున కొంకపర్యాయము నీకు దర్శన మొసగి, నీవలన సకల భోగము ననుభవింతును. ఓ శ్రీధామా! శ్వేత వరాహకల్పమున రాసక్రీడా సమయమున నీవు 'శంఖచూడుడు' అను నామముతో నన్ను అవమానించి, నాచే సంహరింపబడి నిజరూపమును బొందెదవు" అని పలికెను. అందుచే శంఖచూడుడు శ్రీకృష్ణునిచే సంహ రింపబడినను వాని తేజస్సు శ్రీధామునిలో ప్రవేశించెను.

బృందావనఖండము సమాప్తము.



## గి రి రా జ ఖం డ ము

### గోవర్ధనగిరి ప్రశంస

నందవ్రజమున ప్రతివత్సరము ఇంద్రయాగముచేయు ఆచారము గలదు. గోపకులు ఇంద్రయాగము తలపెట్టిరి. అది పరమాత్మకు నచ్చ లేదు. సదస్యులందరు వినుచుండ, సప్తవర్షముల వయస్సు గలిగిన నందకిశోరుడు తండ్రితో "ఓ నందరాజా! ఇంద్రయాగము చేయుట సంప్రదాయమా? శాస్త్రసమ్మతమా? పారమార్థికమా?" అని ప్రశ్నించెను.

నందరాజు పరమాత్మతో "కృష్ణా! ఇది లోకహితము, పారమార్థికమునై యున్నది. వర్షములు కురియుటకు, భూమి సస్యశ్యామలమగుటకు, సకలజనులు సకల శ్రేయస్సులను అనుభవించుటకు ఇంద్రయాగము చేయుట ఆచారముగ నున్నది" అని ప్రత్యుత్తర మిచ్చెను.

నందకిశోరుడు తండ్రితో "పూర్వఫలముచే దేవతలు స్వర్గమందుండిరి. వారి పుణ్యము క్షీణింపగనే దేవత్వము నశించి మానవులుగ మారుచున్నారు. కాలమునకు కట్టుబడినవారు దేవతలు. వారు ముక్తి నెట్లు ప్రసాదింపగలరు? కాలాతీతుడైన పరమేశ్వరుడు భక్తిముక్తుల ప్రసాదింపగలడు. ఇంద్రుడు యజ్ఞము చేసినచో ఫల మొసగును. కాని స్వయముగ ఫలసిద్ధిని ప్రసాదింపలేడు. ఫలసిద్ధిని కలిగించునది కర్మ గాని ఇంద్రుడు కాడు. అందుచే కర్మనే భగవంతు డనవలెను.

స్వధర్మమైన కర్మచే జీవించువానికి ఆ కర్మయే దైవము. విప్రులు వేదాధ్యయనము, అధ్యాపనము, యజ్ఞయాగాది క్రతువు లొనర్చుట చేతను, వైశ్యుడు వ్యవసాయము, గోసేవ మున్నగువాని చేతను జీవింపవలెను. భగవద్దృష్టితో చేయు ప్రతిపనికి పూజ్యత గలుగును.

గోవులు, భూసురులు, సాధువులు, వేదములు పరమేశ్వరుని విభూతులు. మనము గోవర్ధనపర్వతమున నివసించువారము. గోసంపదచే బ్రతుకు వారము. గోవిందుని వక్షఃస్థలమునుండి గోవర్ధనగిరి బయల్వెడలెను. పులస్త్యునివలన నిట నిలిచెను. ఈ పరమ పవిత్రమగు గోవర్ధనగిరికి, గోవులకు, విప్రులకు ప్రీతిని గొలుపు యజ్ఞమును చేయుదము. ఇంద్ర యజ్ఞమునకు దెచ్చిన వస్తుసముదాయమును విప్రసంతర్పణకు వినియో గింపుడు. ఇది నా అభిమతము" అని వక్కాణించెను.

వ్రజవృద్ధుడగు సన్నందుడు పరమాత్మతో "నందనందనా! నీ పలుకులు కడు సమంజసములు. నీవు జ్ఞానస్వరూపుడవు. నీ అభిమతము మాకు శిరోధార్యము. గోవర్ధనగిరి పూజాక్రమమును దెలుపుము"అనెను. నందరాజు మిన్నకుండెను.

## పూజావిధానము

పరమాత్మ సన్నందునితో "తాతా! గోవర్ధనగిరి పాదభాగమును గోమయముతో నలుకవలెను. రంగురంగుల ముగ్గులు పెట్టవలెను. పూజా ద్రవ్యములు సమకూర్చవలెను. స్నానాదికము లొనర్చి, అర్ఘ్యపాద్యాది క్రమముతో గోవర్ధనగిరిని పంచామృతస్నానముతో పూజింపవలెను. త్రివేణీసంగమమునుండి పవిత్రజలముల తెప్పింపవలెను. గోక్షీరముతో అభిషేకము చేయవలెను. యజ్ఞోపవీతము, వస్త్రములను ఉంచి, పద్మముల పుష్పములతో పూజింపవలెను గోవర్ధనగిరి చుట్టును ప్రమిదలలో దీప ములు వెలిగింపవలెను. గిరిచుట్టును ప్రదక్షిణములు, నమస్కారములు చేయవలెను. 'ఓ గిరిరాజా! పరమాత్మకు నీవు ఛత్రమువలె నుంటివి' అని స్తోత్రము చేయవలెను నైవేద్యమునకు భక్ష్యభోజ్య, లేహ్య, చోష్య ములతో అన్నపురాసులు పోయవలెను. నివేదన జరిగిన పిమ్మట కర్పూర నీరాజన మొసగవలెను. విప్రసంతర్పణ, గోపూజ, సర్వులకు అన్న దానము గావింపవలెను. సాష్టాంగప్రణామములు ఆచరింపవలెను" అని వివరించెను. ఆబాలగోపాలము గోవర్ధనగిరి పూజ చేయవలెనను కుతూ హలమును వెల్లడించిరి.

## (గోవర్ధనగిరి) పూజామహోత్సవము

గోవర్ధనగిరి పూజామహోత్సవమునకు రమ్మని నందరాజు వ్రజమున చాటబంచెను. నందరాజు, యశోద, రోహిణీదేవి, బలరామకృష్ణులు వ్రజవాసులు గుంపులు గుంపులుగ బయలుదేరిరి. యాదవుల గురువు గర్గమహర్షి. పురోహితులు, వ్రజవాసులు శక్త్యనుసారము పూజాద్రవ్యముల గొనివచ్చిరి. వవనందులు, వృషభానుడు బంగరుపల్లకిలో రాధాదేవి సఖీసమేతముగ అరుదెంచెను.

దేవతలు, అప్సరసలు, రాజర్షులు, మహర్షులు, రాజన్యులు పరిమళ పుష్పములనే గాక పెక్కుకానుకలు గొనివచ్చిరి. అది విని పార్వతీ పరమేశ్వరులు విచ్చేసిరి. పరమాత్మ సంకల్పముచే గాబోలు పర్వతములు నిజరూపమంది పెక్కుబహుమతుల దెచ్చినవి.

గోవర్ధనగిరి చుట్టును దంపతులు పూజలు సేయుచుండిరి. ప్రదక్షిణములు దండములకు కొదవలేదు. నివేదనకు అన్నపురాసులు పోసిరి. కర్పూరనీరాజన మొసగిరి. ఆ రాసులలోనుండి సహస్రబాహువులతో దివ్యమంగళ స్వరూపము కనబడెను. ఆయన అన్నపురాసుల నారగించెను. ఆబాలగోపాలము గిరిరాజును పెక్కురీతుల స్తుతించిరి. దేవతలు పుష్పవృష్టి కురియించిరి.

వ్రజవాసులు "ఓ గిరిరాజా! నీ దర్శనభాగ్య మబ్బుటకు శ్రీకృష్ణ పరమాత్మయే కారణము. మమ్ములను, గోవులను, బంధుమిత్రులను చల్లగా కాపాడుము. సకలశ్రేయములు గలుగునటులు ఆశీర్వదింపుము" అని ప్రార్థింప 'తథాస్తు' అని పలికి గిరిరాజు అంతర్హితుడయ్యెను. సన్నందుడు నందనందనుని కౌగిలించుకొని ముద్దాడుచు 'గోకులమును ఉద్ధరించుటకు ఉద్భవించిన పరమాత్మవు నీవే' అని ఆనందాశ్రువులు రాల్చెను. శ్రీకృష్ణపరమాత్మకు జై, గోవర్ధనగిరిరాజుకు జై అను జయ జయ ధ్వానములు భూనభోంతరాళముల ప్రతిధ్వనించెను. వ్రజ చరిత్రలో అది యొక సువర్ణఘట్టము.

## ఇంద్రుని ఆగ్రహము

గిరిపూజను నారదమహర్షివలన విని దేవేంద్రుడు ప్రళయకాల మేఘముల బంపి బృందావనమును ధ్వంసము చేయుమనెను. ఏనుగు తొండము ప్రమాణమున కుంభవృష్టి కురిసెను. ఉరుములు, మెరుపులతో భూనభోంతరాళము దద్దరిల్లెను. జ్యోతిశ్చక్రము కదలుచుండెను. వట వృక్షములు కూకటివ్రేళ్ళతో నేలకొరుగు చుండెను. ఆబాలగోపాలము నందరాజు మందిరమున కేగిరి. వారు బలరామకృష్ణులకు ప్రణామము లాచరించి "ఓ కృష్ణా! దేవేంద్రుడు వ్రజవాసులపై పగ బూనెను. బీభత్సము సృష్టించెను. ఈ ఆపదనుండి కాపాడగల సమర్థుడవు నీవే. దేవేంద్రుడు నీకొక లెక్కయా? నీవు పరమాత్ముడవని ఆ దురహంకారికి తెలియదు గాబోలు!" అని ప్రార్థించిరి.

## గోవర్ధనగిరి నెత్తుట

శ్రీకృష్ణపరమాత్మ వ్రజవాసులతో "నేను మిమ్ముల కాపాడుదును. నావెంట మీరందరు గోవర్ధనగిరికి కదలుడు. గిరిరాజు అన్నపురాసుల నారగించి మిమ్ముల కాపాడుదునని బాసచేసెను. గిరిరాజు ఆడితప్పువాడు కాడు. ఆబాలగోపాలము గోవులు లేగదూడలతోకూడ బయలుదేరుడు" అని ఆజ్ఞాపించెను. వ్రజవాసులకు వేయి యేనుగుల బలము వచ్చెను. గోవుల తోలుకొని పసికూనల చంకనిడుకొని గోవర్ధనగిరికి బయలుదేరిరి. ఆ కోలాహలమునకు గిరిరాజు పరవశు డయ్యెను. శ్రీకృష్ణపరమాత్మను దర్శించి పులకితు డయ్యెను.

నందకిశోరుడు తామరపుష్పమును ద్రుంచినట్టుల గోవర్ధనగిరిని పెకలించి, బంతివలె పైకెత్తి దానిని తన చిటికెనవ్రేలిపై నిలిపెను. ఆ దృశ్యమును చూచి నందరాజు, యశోదాదేవి, సన్నందుడు మున్నగు వారు చకితులైరి. పరమాత్మ వారందరిని గోవులతో గోవర్ధనగిరిక్రిందకు రమ్మనుచు "వ్రజవాసులారా! నేను బాలుడనని, గిరి పెద్దదని, ఆ భారమును నేను మోయగలనా? అని సందేహింపకుడు. ఈ ధరాచక్రమం

తయు పైబడినను ఈ చిటికెన వేలు కదలదు. భయపడకుడు. వెంటనే గిరిక్రిందకు రండు” అని కేకవేసెను. అందరు గోవర్ధనగిరి నీడను తల దాచుకొనిరి.

నీరు పొంగిపొరలుచు గోవర్ధనగిరి క్రిందకు వచ్చుచుండెను. పరమాత్మ సుదర్శనచక్రమును ప్రయోగింప చుక్కనీరు లేకుండ మ్రింగివేసెను. ఆదిశేషుడు గిరిని చుట్టుకొనెను, బొట్టునీరు లోనికిపోవుటలేదు. శ్రీకృష్ణుని ప్రభావమున వారికి క్షుత్పిపాసలు లేవు. సప్తదినములు గిరిరాజు వ్రజవాసులకు మృష్టాన్నముల నొసగి తృప్తిపరచెను. పరమాత్మ స్పర్శచే జన్మ ధన్యమయ్యెనని గిరిరాజు పరవశించెను. ఆయన పరమాత్మకు ప్రణమిల్లెను. ఆ దృశ్యమును చూచిన వ్రజవాసులు శ్రీకృష్ణునకు, గిరిరాజునకు జయజయ ధ్వానము లొనర్చిరి. పరమాత్మ గిరిరాజును సకల శ్రేయస్సులు గలుగునటులు ఆశీర్వదించెను.

దేవేంద్రుడు వివేకహీనుడు. ఐరావతముపై గోవర్ధనగిరికి వచ్చి పరమాత్మను సామాన్యబాలునిగ నెంచి వజ్రాయుధమును ప్రయోగింప బోవ, శ్రీకృష్ణుడు వాని కరములను స్తంభింపచేసెను. దేవరాజు నందనందనుని శ్రీమన్నారాయణమూర్తి యని గ్రహించి, పరమాత్మకు ప్రణమిల్లి తన తప్పిదమును మన్నింపుమని వేడుకొనెను. ప్రళయకాల మేఘమాలను వెంటగొని స్వర్గలోకమున కేగెను. ఎనిమిదవనాడు మరల సూర్యోదయ మయ్యెను. వ్రజవాసులు కడు సంతసించిరి.

గోపకులకు గోవర్ధనగిరి బరువును పరీక్షింపవలెనని బుద్ధిపుట్టెను. వారి కోర్కెను మన్నించి పరమాత్మ గిరిబరువు నగము తగ్గించి చిటికెన వ్రేలిని కొద్దిగ కదలించెను. బరువును భరించలేక వ్రజవాసులు నేలపై బడిరి. తమ తప్పును మన్నింపుమని వారు పరమాత్మను ప్రార్థించిరి. పరమాత్మ వారిని మెల్లగ లేవదీసి గోవర్ధనగిరిని యథాస్థాన మందుంచెను. వ్రజవాసులు తమ తమ నివాసముల కేగిరి. వ్రజము పూర్వపు టైశ్వర్యమును బొంది కలకలలాడుచుండెను. అది శ్రీకృష్ణుని కృపావిశేషమని సర్వులు పరమాత్ముని కొనియాడిరి.

## పట్టాభిషేకము

స్వర్గలోకమందుండి కామధేనువు నందవ్రజమునకు వచ్చెను. అది గోపీవాధురంధరుడగు శ్రీకృష్ణునితో "స్వామీ! ఇక నాకు ప్రభుడవు నీవే" అని క్షీరాభిషేకము చేసెను. ఇక బృందావనమును వీడవని పట్టు బట్టెను. ఐరావతము తొండముతో గంగోదకము గొనివచ్చి పరమాత్మకు అభిషేకము గావించెను. మహర్షులు పవిత్రోదకములతో, వేదమంత్రములతో శ్రీకృష్ణుని అభిషేకించిరి. వారు నందకిశోరుని గోవర్ధనగిరిపైకి కొనిపోయి 'గోవింద' అని నామకరణముచేసి పట్టాభిషేకము గావించిరి. దేవతలు పుష్పవృష్టి కురియించిరి. గోవర్ధనగిరి తన అదృష్టమునకు మురిసెను. గిరిరాజు నిజరూపము దాల్చెను. ఆయన గోవర్ధనుడు అను నామముతో కృష్ణభక్తు డయ్యెను. ప్రీతితో పరమాత్మ గిరిరాజుపై హస్తముంచెను. ఆ చిహ్నములు ఇప్పటికి కానవగును. కామధేనువు క్షీరాభిషేక మొనర్చిన తావునకు గోవిందకుండ మని పేరు. ఆ సరోవరమందలి తీర్థము శ్వేతవర్ణము గలిగి తియ్యగ నుండును. అందు గ్రుంకులిడిన వారికి శ్రీకృష్ణసాయుజ్యము గలుగునని ప్రతీతి.

## నిస్సందేహము

వ్రజవాసులు నందరాజు కడకేగి "ప్రభూ! శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని చిటికెనవ్రేలిపై నిలిపెను. మీ వంశమువా రెవరైన ఇట్టి సాహసమును ప్రదర్శించిరా? నీవు, యశోదాదేవి వసుపుపచ్చని చాయ. కృష్ణుడు శ్యామవర్ణము గలవాడు. అతడు నీ బిడ్డడని నమ్ముటెట్లు? బలరామస్వామి గౌరవర్ణము గలవాడు. ఆయనను గూర్చి మాకెట్టి సందేహము లేదు. శ్రీకృష్ణునకు మీ పోలికలు రాలేదే? ఆయన క్షత్రియబాలుడని తోచుచున్నది. ఇదికూడ యాదవకులమునకు మాయని మచ్చ. అందుచే శ్రీకృష్ణుని పుట్టుకమగూర్చి మాకు గలిగిన సందేహము నివృత్తిచేయుము అనిరి.

నందరాజు కలవరమొంది "ఓ వ్రజవాసులారా! మీరు చక్కని ప్రశ్న వేసితిరి. రాధామానసచోరుని గూర్చి గరమహర్షి తెలిపిన విశేష

ములను వివరింతును. నందకిశోరుని పేరు కృష్ణుడు అనిగదా? ఆ నామ మందలి షడ్వర్ణములు ఆరు అవతారములు. 'క' అన వైకుంఠమూర్తి యగు కమలనాథుడు, 'ర' కారము రామచంద్రమూర్తి, 'ష' కారము షడ్గుణపతి, 'అ' అగ్నిభుక్, 'న' కారము నరసింహావతారము. విసర్గలు నరనారాయణావతరము. నాలుగు యుగములలో నాలుగు వర్ణములలో అవతారములు దాల్చెను. ద్వాపరాంతమున దుష్ట శిక్షణ శిష్ట రక్షణకై పరిపూర్ణావతారుడగు పరమాత్మ నీ కుమారుడుగ జన్మించెను. ఈయన ఇంద్రియాధిష్ఠాను డగుటచే వాసుదేవు డనియు, రాధాదేవికి పతి యగుటచే రాధాపతి అనియు, గోవర్ధనగిరి నెత్తుటచే గోవర్ధనగిరిధారి అనియు లీలాగుణముల ననుసరించి బహునామములు లేర్పడినవి. శుద్ధచైతన్యమే నీకు తనయుడుగ తరింపచేయుటకు ఆవిర్భవించెను" అని చెప్పెను.

వ్రజవాసులు నందునితో "గర్గమహర్షి పలుకులు సత్యమే. ఆయన బ్రహ్మజ్ఞులు. శ్రీకృష్ణుని నామకరణము రహస్యముగ జరుగుటకు హేతు వేమి? ఆనాడు మమ్ముల నెందుకు పిలువలేదు? దానికి కారణమేమి? నీ వివరణ మాకు తృప్తి నొసగలేదు. ఇక ఏ కార్యము మీ ఇంట జరిగి నను మేము రాలేము" అని విచారముతో వృషభానునికడ కేగిరి.

వ్రజవాసులు వృషభానునితో "ప్రభూ! నందకిశోరుడు నందనంద నుడు కాడని మాకు సందేహము గలుగుచున్నది. ఆ బాలుని సాహస కృత్యములు అద్భుతములు. అదే దోషము. అతడు క్షత్రియ బాలుడని తోచుచున్నది. నీకు కల్యాణమున కెదిగిన కొమార్తె గలదు. ఆమె కృష్ణుని మనసార ప్రేమించెను. ముందుముందు ఏమి జరుగునో? కులముకాని వానితో సంబంధము సమంజసమా? నీవు నందరాజుతో సంబంధము వదలుకొననిచో మిమ్ములను గూడ వదలి కులగౌరవమును నిలబెట్టు కొందుము" అని కటువుగ బలికిరి.

అది విని వృషభానుడు చకితుడయ్యెను. ఈ ఆకస్మిక పరిణామము నకు హేతువేమిటో ఊహించలేకపోయెను. నందరాజు తనకు ఆత్మీయుడు. తన తనయ రాధాదేవి నవనీతచోరుడగు నందనందనుని మనసార ప్రేమించెను. వారి ప్రేమ పవిత్రమైనది. రాధాకృష్ణుల కల్యాణమునకు

తాను అవరోధము కల్పింపలేదు. వ్రజమునకే అలంకారప్రాయుడగు శ్రీకృష్ణపరమాత్మను కులప్రాతిపదికపై వ్రజవాసులు సంశయించుటయా?

వృషభానుడు వారితో "ఓ గోపకులారా! గర్గమహర్షి నాతో అనిన ముక్కలివి. పరమాత్మయే దుష్టశిక్షణ, శిష్టరక్షణకై నందుని ఇంట జన్మించెను. నీ కుమార్తె రాధాదేవి పరమేశ్వరి. భాండీరవనమున బ్రహ్మ వారిరువురకు కల్యాణము జరుపును. రాధాదేవి కోర్కెను మన్నించి పరమాత్మ గోలోకము, గోవర్ధనగిరి, యమున, బృందావనము, గోవులు, గోపాలకులను సృజించెనట. గర్గమహర్షి సత్యవ్రతుడు. ఆయన హిత వాక్యములు మాకు శిరోధార్యము" అని తెలిపెను.

మాయావృతులగు గోపకులకు వృషభానుని పలుకులు రుచింపలేదు. నందరాజు, వృషభానుడు వియ్యమందుట వారికి నచ్చలేదు. వారు వృషభానునితో "ఓ రాజా! సరిసాటివారితో వియ్యమందవలెను. సిరిసంపదలలో నందరాజుకన్న నీవే అధికుడవు. నందరాజు కృషీవలుడు. నీతో తులదూగలేడు. నీకన్న అధికులగు శ్రీమంతులతో వియ్యమందుము. శ్రీకృష్ణుడు మాయావి. వానిని నీ ప్రాంగణమునకు రానీయకుము. అతడు రాధాదేవిని వలలో వేసికొనును. ఒకవేళ శ్రీకృష్ణుడు పరమాత్మయని నీవు భావించినచో అమూల్యమగు ముత్తెములతో గూడిన పెక్కు కానుకలను పెద్దలద్వారా నందరాజుకు పంపుము. ఆయన ప్రతిగ ఏమి పంపునో నీకే తెలియును" అనిరి.

వృషభానుడు ఉసిరిక ప్రమాణము గలిగిన ముత్తెములతోగూడిన కానుకలను పెద్దలద్వారా నందరాజునకు పంపెను. వారు నందరాజుతో "ప్రభూ! రాధాదేవిని శ్రీకృష్ణున కిచ్చి కల్యాణము జరిపించుటకు వృషభానుడు సంసిద్ధుడు. ఆయన అభీష్టము నెరవేర్పుము" అనిరి. నందరాజు వారికి కృతజ్ఞత దెలిపి యశోదాదేవికడ కేగెను. వృషభానుని అభీష్టమును వివరించెను. యశోదాదేవి పరవశించెను. రాధాకృష్ణుల కల్యాణము కనులపండువుగ తిలకించవలెననియే కదా ఆమె కోరిక!

యశోదాదేవి నందరాజుతో "నాథా! ఎంతటి శుభవార్తను గొని తెచ్చితిరి. వృషభానుడు పంపిన ఆణిముత్తెములు అద్భుతముగ ఉన్నవి

వియ్యాలవారికి రెట్టింపు కానుక లంపనిదే బాగుండదు" అనెను. నందరాజు ఆమెతో వెండి, బంగరు, మణులు రెట్టింపు పంపవచ్చును. కాని అతి ముత్తెములు మనకడ లేవే అనెను. అంతటి సంపద మనకు లభించిన పిమ్మట కళ్యాణము జరుగును. తొందరలేదని యశోద నిష్ఠురముగ పలికెను.

సర్వజ్ఞుడగు పరమాత్మ తల్లికడ కేగెను. యశోద విషయ వివరణ మొనర్చెను. అందు నూరు ముత్తెములగొని, నందకిశోరుడు యమునా నదీతీరమందలి పదనైన భూమిలో నాటెను. నందరాజు, 'కృష్ణా, నూరు ముత్తెములు తీసితివా?' అని అడుగ, 'వాటిని నేలలో నాటితినని, ముత్తెములపంట పండునని నందకిశోరుడు దెలిపెను. 'ఎచట నాటితివి?' అని నందరా జడుగ, పరమాత్మ వానిని ఆ ప్రదేశమునకు గొనిపోయెను. అది ఏమి చిత్రమో గాని ఆకసమంటు బంగరుకొమ్మలు, ఆకులు గలిగి ఉసిరిక ప్రమాణముగల అతిముత్తెములు గుత్తులు గుత్తులుగ నక్షత్ర కాంతితో మెరయుచుండెను. నందుడు కడుసంతసించి శ్రీకృష్ణుని ముద్దిడుకొని "నందకిశోరా! నీవు మమ్ములనే గాదు, సకల లోకముల నుద్ధరించుటకు ఆవిర్భవించిన మహనీయుడవు. అజ్ఞానినై నిన్ను అనగూడని మాటల నంటిని. నీ లీలల నరయుటకు నాకు సాధ్యమా! నీవంటి బిడ్డడు ఒక్కడు చాలు, మాతాపితలను సంతోషపెట్టువాడే సత్పుత్రుడు" అని పలుకుచు శ్రీకృష్ణుని వెంటనిడుకొని యశోదాదేవి కడకేగి జరిగిన వృత్తాంతముల గూర్చి తెలుప మాతృహృదయము పరవశించి నందకిశోరుని కౌగిలించుకొని ముద్దాడెను. ఆమె కృష్ణునితో 'బిడ్డా! నీ ఋణ మెటుల దీర్చుకొందు'నని ఆనందాశ్రువులు రాల్చెను.

నందుడు అతిముత్తెములను సంచుల కెత్తించి, మరికొన్ని అమూల్యాభరణముల జోడించి వృషభానునకు పంపెను. పెద్దలు తిరిగివచ్చి వృషభానునితో, నందుని సిరిసంపదల గూర్చి ప్రస్తుతించిరి. ఆయన ఆతిథ్యమును గొనియాడిరి. రాధాకృష్ణులకు ఈడు జోడు సరిపోవునని వారి కల్యాణము ఇరువంశముల పేరుప్రతిష్ఠలను ఇనుమడింపజేయుటయే గాక లోకకల్యాణమునకు అత్యవసరమని నొక్కి వక్కాణించిరి. అతి ముత్యములు పండిన తావును ముక్తాసరోవరము అని అందురు.

అది విని వ్రజవాసులు చకితులైరి. ముత్తైపుచెల్లెను చూచి మురి సిరి. పరమాత్మకు కులము నాపాదించుట వెర్రితనమని భావించిరి. సర్వ చరాచర జగత్తుకు మూలాధారమైన శ్రీకృష్ణుని సంశయించి మహాపాప మున కొడిగట్టితిమని, తమపై నందకిశోరునకు అగ్రహము గలుగవచ్చు నని, పరమాత్ముని శరణుజొచ్చుటయే యుక్తమని భావించి నందకిశోరుని కడకేగి సాష్టాంగప్రణామము లొనర్చి తమ తప్పిదములను మన్నింపు మని వేడుకొనిరి. అది వారి తప్పుకాదని, మాయాప్రభావమని వివరిం చెను. మాయతెరలు విచ్చిపోయెనని నందరాజు వృషభానుడు హర్షించిరి.

## దధిచోరుడు (దధిహరణ)

నందకిశోరుడు గోవర్ధనగిరి సమీపమున దారి కడ్డముగ నిలబడి వేణుగానము చేయ దొడంగెను. గోపికలు ఆ మార్గముననే పాలుపెరుగు వెన్న మధురానగరమునకు గొనిపోవుచుందురు. కొంత తడవునకు గోపి కలు వచ్చిరి. ఏ నోట వినినను పరమాత్మ స్మరణమే. ఆ మహాపురుషుని లీలావర్ణనలే. నందకిశోరుడు పాదము అడ్డుపెట్టి దారి నివ్వలేదు. అడ్డు తెమ్మని గోపికలు ఆయనను బతిమాలిరి. అచ్యుతుడు అందుల కంగీక రింపక, వారితో 'వ్రజవనితలారా! దారిసుంకము చెల్లించిన వారికి దారి నొసగుదును' అన 'ఏమి సుంకము?' అని వారు ప్రశ్నించిరి. 'నన్ను పెండ్లియాడుడు. ఇది సదవకాశము. ఆలసించిన ఆశాభంగము. కల్యాణముకొరకు నా మనస్సు వేగిరపడుచున్నది. ఈ విరహాగ్నిని చల్లా ర్చుటకు సమర్థులు మీరే రండు' అనుచు వారిని సమీపించి కరగ్రహణము చేయబోవ, వారు కసరుచు "కృష్ణా! నీ ఆగడములు మితిమీరుచున్నవి. మా ఇండ్లలోని ఉట్లపైనున్న కుండలలోని పాలు పెరుగు వెన్నమ్రింగి నది చాలక దారిగాచి కొంటెపనులు చేయుదువా? నందరాజు కుమారు డవు. యశోదాదేవి గారాబుబిడ్డవు. వారి సుగుణములు నీకు అబ్బలేదే? ఈ అల్లరిపనులు నీకు నేర్పిన దెవరు?' అన 'మీరే నేర్పితిరి' అని నవ్వుచు నందనందనుడు బదులు పలికెను. 'మేమా?' 'బాగు బాగు' ఇక నీ వయ్యారములు కట్టిపెట్టుము. మా బ్రతుకు లన్నియు ఈ పెరుగు తోనే గడచుచున్నవి. ఇవి అమ్మనిచో మాకు భుక్తి గడువదు. నీకేమి? శ్రీమంతుల బిడ్డవు. కనికరించి దారి వదలుము!" అని బతిమాలిరి.

పరమాత్మ వారిని విడువక పైటకొంగు లాగుచు పుష్పగుచ్ఛముల వారి శిరోజముల ముడుచుచు, పెరుగుకుండల లాగుచు కోరచూపులు చూచుచు, చిలిపినవ్వులు చిలికించుచు, గడ్డములు పుచ్చుకొని బతిమాలుచు అల్లరిచేయ దొడంగెను.

పరమాత్మ తన ప్రతిబింబముతో ఆడుకొనుచుండెను. అందలి అంతరార్థమును గోపికలు గ్రహింపనేరక, 'నందనందనా! సమయము మించుచున్నది. వేళకు ఇంటికి చేరనిచో అత్తమామలు, మగలు కేకలు వేయుదురు. చీకటి పడును. నీవు నవనీతచోరుడవు. నీ హృదయము శిల కాకూడదు. మేము వివాహితలము. నీ సుంకము చెల్లించు టెట్లు? మరియొక కోరిక కోరుము' అని బతిమాలిరి. 'పెరుగుకుండల దించుడు' అని కృష్ణుడు అనతిచ్చెను. వారు దించిరి. గోపిక లందరికడ అన్ని రూపములు దాల్చి పరమాత్మ వారిని ముద్దుపెట్టుకొనెను. వారితో నృత్యము చేసెను. గోపికలు మధురానగరమును మరచిరి. శ్రీకృష్ణుడు దక్క అన్యవస్తువు వారికి కన్పింపలేదు. తన్మయస్థితిలో వారు కొంత తడవు గడపిరి. స్పృహ గలుగునప్పటికి కుండలలోని పాలు, పెరుగు, వెన్న అదృశ్య మయ్యెను. గోపికలు వెలవెలబోయిరి. వెనుదిరిగినచో మాట వచ్చునని భయపడిరి. గోపికలు కోపోద్రిక్తలై 'కృష్ణా! మమ్ము అల్లరిపాలు చేయుదువా? నీ ఆగడములు మాననిచో కంసరాజుకో చెప్పి కారాగారబద్ధుని గావింతుము' అని కటువుగ బలికిరి.

పరమాత్మ వారితో 'వ్రజవనితలారా! కంసులు నాకొక లెక్కయా! కంసుని వాని బంధుమిత్ర పరివారమును కడతేర్తును. కంసుని కళేబరము వ్రజమునకు లాగికొని వత్తును. నా శక్తిని చులకన చేసినచో పశ్చాత్తప్తలు గాక తప్పదు. నాపై కొండెములు చెప్పినను మీ అత్తమామలు; భర్తలు నమ్మరు. నాశక్తి మీకన్నను వారికే బాగుగా తెలియును' అనెను.

పరమాత్మ గోపాలురను కేక వేసెను. మోదుగ, కడిమిచెట్ల ఆకులు కోయించి వాటిలో పాలు, పెరుగు పోసెను. వెన్న పెట్టెను. వారు వాటిని జుర్రిరి. ఆ తావునకు 'ద్రోణతీర్థ'మని పేరు.

గోపికలు నిస్సహాయులై పరమాత్మవంక దీనముగ చూచిరి. దీనదయాళుడగు పరమాత్మ కుండలచుట్టును మురళిని త్రిప్పెను. అదేమి చిత్రమోగాని పాలు పెరుగు వెన్నలతో నిండిన కడవలు వారి యెదుట నుండెను. మురళీధరుడు వారితో 'నాతో వైరము గూడదుసుమా! కడవల నెత్తుకొని మధురానగరమున కేగుడు. రెట్టింపు మూల్యము లభింపగలదు' అనుచు దారి నొసగెను. శ్రీకృష్ణలీలల గానముచేయుచు గోపికలు మధురానగరమున కేగిరి. మంచివెలకు పాలు, పెరుగు, వెన్నలను అమ్మిరి. 'ఇది కృష్ణమాయ' అని తలచుచు వారు తమతమ నెలవులకు సకాలమునకే చనిరి. అది గోపికలయందు పరమాత్మకుండు అనురక్తి.

## గిరిరాజ విభూతి


పంచనాథులలో తూర్పున పూరీ జగన్నాథమున జగన్నాథుడుగను, దక్షిణమున శ్రీరంగమున శ్రీరంగనాథుడుగను, పశ్చిమమున ద్వారకలో ద్వారకానాథుడుగను, ఉత్తరమున బదరియందు బదరీనాథుడుగను పరమాత్మ ఉద్భవించెను. గోవర్ధనగిరియందలి శ్రీనాథుని దర్శించిన నాథపంచకము దర్శించిన ఫలము గలుగునని ప్రసిద్ధి.

గోపాలకులు అన్నపురాసు లుంచిన తావు గోవర్ధనగిరిరాజుకు ముఖ్యస్థానము. మానసీగంగ స్వామికి నేత్రస్థానము. చంద్రసరోవరము నాసిక, గోవిందకుండము అధరము, కృష్ణకుండము చుబుకము, లలితాకుండము కపోలములు, గోపాలకుండము కర్ణములు, కుసుమసరోవరము కర్ణాంతములు, మౌళిశిల లలాటము, చంద్రశిల శిరస్సు, వాదినీశిల కంఠము, కందుకక్షేత్రము పార్శ్వములు, జౌష్ఠీకుండము కటిప్రదేశము, ద్రోణతీర్థము పృష్ఠము, లౌకికతీర్థము ఉదరము, కదంబతీర్థకుండము వక్షఃస్థలము, శృంగారమండలము జీవము, శ్రీకృష్ణ పదచిహ్నములు మనస్సు, హస్త చిహ్నములు బుద్ధి, ఐరావత పాదచిహ్నములు పాదములు, వృచ్ఛకుండము కామస్థానము, కామధేనువు పాదచిహ్నములు, బాహువులు, వత్సకుండము బలము, రుద్రకుండము రౌద్రము, కుబేరతీర్థము ఉద్యోగము, బ్రహ్మతీర్థము అనుగ్రహము, యమతీర్థము అహంకారముగను విరాజిల్లుచుండెను. అట్టి గోవర్ధనగిరి పరమాత్మ వక్షఃస్థల

మందు ఉద్భవించి, పుంస్త్వతేజమున ఆవిర్భవించి సాటిలేని మేటియై ప్రకాశించుచుండెను.

రాధాదేవితోగూడి పరమాత్మ లక్షదళపద్మముపై ఆసీనుడయ్యెను. గోపికలు నృత్యము చేయుచుండిరి. రాధాదేవి పరమాత్మతో 'స్వామీ! నాకొక కోరిక గలదు. తీర్చెదననివచో దెలుపుదును. 'సతికోరిక తీర్చుట పతికి ప్రీతికరము' అని పరమాత్మ నుడివెను. 'బృందావనమున యమునానదీతీరమున నికుంజపార్శ్వములో రాసక్రీడకు యోగ్యమగు స్థలము నేర్పరపుము' అని రాధాదేవి కోరెను. పరమాత్మ తన వక్షఃస్థలమును చూచెను. అందుండి అద్భుతమైన తేజస్సు ప్రవాహముగ బృందావనమున ప్రవేశించి పర్వతాకారము దాల్చెను. అదియే గోవర్ధనగిరి.

గిరిరాజ ఖండము సమాప్తము.



## మాధుర్యఖండము

### శ్రుతిగోపికలు

త్రేతాయుగమున శ్రీరామచంద్రమూర్తి సౌందర్యము జూచి వేదములు సైతము ఆయనను మోహించినవి. 'ద్వాపరాంతమున శ్రీకృష్ణునిగ జన్మింతును. అప్పుడు మీరు గోపికలై నాతో రాసక్రీడ సల్ప గలరు' అని ఆ మహనీయుడు అభయ మొసగెను.

ఒకనాడు పరమాత్మ ఆలస్యముగ ప్రాసాదమునకు మరలెను. శ్రుతిగోపికలు ఆయనతో 'నందకిశోరా! చంద్రుని రాకకు చకోరమువలె నను రాకకై నిరీక్షించుచుంటిమి. ఎచట నుంటివి?' అని ప్రశ్నించిరి. పరమాత్మ నవ్వుచు 'నాయందు చిత్తమునుంచి ధ్యానించు వారికి నే నెట్లు దూరమగుదును? సూర్యుడు సుదూరముగ నున్నను భూమిపై నుండు సరస్సులలోని కమలములు వికసించుటలేదా? చంద్రునిదర్శించి కలువలు విచ్చికొనుట లేదా? ప్రేమకు దూరముతో నిమిత్తము లేదు.'

ఇక ఆలస్యమునకు హేతువు దెలుపుదును. దుర్వాసమహర్షి నా గురువు. ఆయన ఖాండీరవనమం దుండెను. ఆ మహర్షిని పూజించి, సేవించి వచ్చుటచే ఆలస్యమైనది, గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మ, గురువే దైవము. అజ్ఞానమును పారద్రోలి, జ్ఞానమును ప్రసాదించువాడే గురువు. దుర్వాస మహర్షి గరికరసమును గ్రోలి తపము చేయుచుండెను, యమున కావల ఆశ్రమమే ఆయన నివాసము' అనెను. శ్రుతిగోపికలకు దుర్వాసమహర్షిని చూడవలెనని కుతూహలము గలిగెను. 'యమునానదిని దాటుటెట్లు? రాత్రివేళ నావికులుండరు గదా?' అని వారు ఆయనను అడిగిరి. నందకిశోరుడువారితో మీరు యమునానదిని ఇటుల ప్రార్థింపుడు. 'బాలయతి, అస్ఖలిత బ్రహ్మచారియగు శ్రీకృష్ణపరమాత్మను మేము ప్రేమించుచుంటిమి. యమునాదేవీ! దారి నొసగుము. ఖాండీరవనమున కేగి దుర్వాస మహర్షిని దర్శించివత్తుము' అని ప్రార్థింపుడు. యమున రెండు పాయలుగ చీలి మీకు దారి నొసగును' అనెను.

మహనీయుల కడకుగాని, గురువు కడకుగాని, దేవళములకు పోవునపుడు గాని, పసిబిడ్డల దగ్గఱకు వెళ్లునపుడు గాని రిక్తహస్తములతో పోగూడదు. అందుచే మృష్టాన్నములు, పాయసము కడవలలో నింపుకొని గోపికలు బయలుదేరిరి. యమునానది దారి నొసగెను. దుర్వాస మహర్షికి ప్రణమిల్లి కడవలు ముందుంచి ఆరగింపుమని వేడుకొనిరి.

మహర్షి నోరుతెఱచి మృష్టాన్నములను పాయసమును అందుంచుడని పలికెను. కడవలు ఖాళీయయ్యెను, పదార్థము అదృశ్యమాయెను. శ్రుతిగోపికలు చకితలైరి. మహర్షి 'తృప్తాస్స్వాహా' అనెను. వారు మన కృష్ణునకు తగిన గురువే అనుకొని 'మహర్షీ! శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహమున యమున దారి యొసగెను. మరల మేము బృందావనమునకేగుటకు దారి యొసగునా?' అను సంశయము వెలిపుచ్చిరి. మహర్షి శ్రుతిగోపికలతో 'నిత్యోపవాసి, సదోపవాసి యగు దుర్వాసమహర్షి దారి యొసగుమని నీతో చెప్పుమనెను' అని యమునానదీమతల్లితో చెప్పుడు. ఆమె మీకు దారి యొసగును' అనెను. వా రటులు పలుక యమునానది దారి యొసగెను. గోపికలు ఇండ్లకు చేరుకొనిరి.

శ్రుతిగోపికలు పరమాత్మతో "ఓ కృష్ణా! గురుశిష్యు లసాధ్యులే. మృష్టాన్నభోజనములే. నీవు రాసక్రీడ నెపముతో గోపికాయూథములతో విహరించితివి. బాలయతి వెట్లగుదువు? తమ గురువు మృష్టాన్నముల మ్రింగెను. ఆయన సదోపవాసి యెటులయ్యెను? ఈ రహస్యము దెలుపుము" అని ప్రార్థించిరి.

పరమాత్మ వారితో "ఓ వ్రజవనితలారా! నేను సర్వవ్యాపకుడను సర్వాంతర్యామిని. నాకన్న అన్యవస్తువు లేదు. నేను నిర్గుణుడను. నేనే జ్ఞానిని. జ్ఞానులకు నాకు అభేదము. జ్ఞానులు కర్మలు చేయుదురు. ఫలమును ఆశింపరు. కర్మఫలమును ఈశ్వరునకు అర్పణ చేయుదురు. జనకమహారాజు ఆ కోవకు చెందినవాడే. వారికి ఏ కర్మలు అంటవు. అందుచే నేను బాలయతినే.

దుర్వాసమహర్షి మీ తృప్తికొరకై పదార్థము లన్నింటిని స్వీకరించెను. పరమాత్మయందు ఆత్మనిష్ఠ గలవారికి ఆకలిదప్పు లుండవు. వారు తినగలరు. మానగలరు. భోక్త, భోజ్యము, భోజనము మూడు

తానైన వారు ఎంత తినినను సదోపవాసులే. స్త్రీ, పురుషులు నేనే. అందుచే నాకు అన్యు లెవరు ? ఎందరు గోపికలతో రాసక్రీడ సలిపినను నేను అస్ఖలిత బ్రహ్మచారినే. నాతో నేను రాసక్రీడ సలిపితిని" అని తత్త్వోపదేశము చేసెను. గోపికలకు సందేహనివృత్తి యయ్యెను.

## ఋషిగోపిక

పూర్వము మంగళుడు అను గోపాలుడు గలడు. ఆయన కృష్ణ భక్తుడు. విధివశమున సంపదనంతయు కోల్పోయెను. సంతానము హెచ్చెను. అందరును పుత్రికలే. వారిని పోషించుట మంగళునకు భార మయ్యెను. వారు పెరిగి పెద్దవారైరి. యుక్తవయస్సు వచ్చినది. ఏమి చేయుటకు తోచక మంగళుడు తీర్థయాత్రకు బయలుదేరెను. జయుడను గోపకుడు మధురానగరము నుండి వచ్చి మంగళునితో 'ఓయీ ! దుఃఖపడకుము. బృందావనమున నందరాజు సకల సంపదలతో తులతూగుచున్నాడు. వారికడ అవులమందలు పెక్కుగలవు నీ కుమార్తెలను నందరాజునకు అప్పగించినచో వారు సుఖపడుదురు' అని హితము పలికెను. మంగళుడు మహదానందభరితుడై తన కొమార్తెలను నందరాజున కొసగెను. ఆయన వారిని గోశాలలో పరిచారికలుగ నియమించెను. వారు శ్రీకృష్ణుని ప్రేమించిరి. పూర్వజన్మస్మృతి వారికి కలిగెను. వారు యమునానదీమతల్లిని ప్రార్థించిరి. పరమాత్మయే పతియగునని ఆమె తెలిపెను. మంగళుని కొమార్తెలు ఎవరోకాదు. త్రేతాయుగమున దండకారణ్యవాసులై శ్రీరామచంద్రుని ప్రేమింప ఆయన 'ద్వాపరాంతమున బృందావనములో నేను శ్రీకృష్ణునిగ అవతరించినపుడు, మీరు గోపికలై జన్మించి రాసక్రీడలో పాల్గొందురు' అని తెలిపెను. కార్తిక శుద్ధపూర్ణిమ నాడు పరమాత్మ వారితో రాసక్రీడ సలిపెను.

## గోపికావస్త్రాపహరణము

త్రేతాయుగమున మిథిలానగరమందు జనకమహారాజు కొలువుకూటమున ధనుర్భంగ సమయములో మిథిలావనితలు శ్రీరామచంద్రుని చూచి మోహించిరి. కృష్ణావతారమున వారికోర్కె నెరవేరునని ఆయన వారితో చెప్పెను. వారే మిథిలాగోపికలై బృందావనమున నుండిరి.

వారు మార్గశీర్షమాసమున కాత్యాయనీవ్రత మారంభించిరి. అందు వలన చక్కని దాంపత్యము సమకూరునని వారి విశ్వాసము. నిత్యము పరమాత్మ ధ్యానము చేయుచు వేకువను యమునకడ కేగి వివస్త్రలై, జలకమాడి, గట్టుపై నుంచిన వస్త్రముల ధరించి, యమునామృత్తికతో గౌరీవిగ్రహముచేసి షోడశోపచార పూజ లొనర్చి భగవంతుని గుణగణము లను కీర్తించుచుండిరి.

మార్గశీర్షమాసము చివరిరోజున యమునానది గట్లపై వస్త్రముల నుంచి స్నానానంతరము గౌరీదేవిని 'తల్లీ! మంగళగౌరీ! నీ వ్రతము నకు ఇది కడపటిదినము. శ్రీకృష్ణపరమాత్మను మాకు పతిగ నొనర్పుము అని ప్రార్థించిరి.

అంతట వారు మరల స్నాన మాచరించుచు ఒకరిపై నొకరు నదీ జలముల చిమ్ముకొనుచు మైమరచి యుండిరి. చలి వారిదరి చేరలేదు.

వ్రతఫల మొసగుటకు అది తగిన సమయమని పరమాత్మ భావించి గట్లపైనుండు వారి చీరల గైకొని కదంబవృక్షశాఖపై కూర్చుండెను. గట్లపై గుడ్డలు కన్పింపలేదు. ఆ పరిసరములలో నెవ్వరు కానరాలేదు. నిశితముగ వారు పరీక్షింప నందకిశోరుడు మందహాస మొనర్చుచుండెను. గోపికలు కృష్ణునితో "నందనందనా! నీకిది తగునా? మా వలువలతో నీకేమి పని? పాలు, పెరుగు, వెన్న మా యిండ్లలో మెక్కినది చాలదా? వస్త్రాపహారణమునకు తలపడితివా? నీ అందచందములను చూచి ప్రేమిం చుట మా నేరమా? మేము అబలలము. మా వలువలు మా కొసగి మానసంరక్షణ సేయుము" అని వేడుకొనిరి.

మురళీధరుడు వారితో "ఇవి మీవని నాకు తెలియదు. కదంబ పుష్పములని భ్రమించితిని. "గట్లపైనున్న ఉడుపులు వృక్షశాఖపై నుండ కారణమేమి? ఎవరు దెచ్చిరి?" అన 'నీవే' అని వారు ముక్తకంఠ మున బలికిరి. పరమాత్మ "నేనా! మీరు పొరబడితిరి. దొంగిలునపుడు నన్నెందుకు వారింపలేదు. అవి మీ వగుచో గొనిపొండు" అనెను.

గోపికలు "కృష్ణా! కంఠములోతు నీటిలో నుంటిమి. చలి ఎముకలు కొఱుకుచున్నది. సిగ్గుదొంతరలు మమ్ములను కట్టివేయుచున్నవి. నీ పాదదాసులము. నీ ఆజ్ఞను పాటించువారము. ఇటుల మమ్ము పరీక్షించుట న్యాయమా? మా వలువలు మా కొసగనిచో నీ తలిదండ్రులకు, కంసునకు చెప్పి తగినశిక్ష వేయింతుము" అని బెదరించిరి.

పరమాత్మ నవ్వుచు "వివస్త్రలై నా కడకు రాలేని మీరు నందరాజు కంసులకడ కేగుదురా? నందరాజునకు నాపై మక్కువ ఎక్కువ. ఇక కంసుడు నాకొక లెక్కయా? వానిని సంహరించుటకే నా యీ పుట్టుక. మీరు ఈ తావునకు రండు. చీరల గైకొనుడు. ఆలసించిన ఆశాభంగము గలుగును. నేను వానిని వ్రజమునకు గొనిపోదును. చలితో బాధనొందు గోవులపై కవ్వొదును" అని లేచెను.

మిథిలాగోపికలు కలవరమొంది, కొన్నిక్షణాలు గడచిన పిమ్మట వారిలో వివేకము గలిగి 'పరమాత్మను పతిగ బొందుటకే గదా ఇన్ని నాళులు వ్రతము చేయుట. ఆ మహాపురుషునకు మన సర్వస్వమును ఎన్నడో సమర్పించియుంటిమి గదా! సిగ్గును విడచుట అను ప్రసక్తి లేదు" అని తలచి వారు కదంబవృక్షముకడ కేగిరి.

వివస్త్రలైన గోపికలను చూచిన కృష్ణుని మనస్సు చలించలేదు. తానే పురుషుడు, తానే స్త్రీ యని భావించు వారిలో వికారము లుండవు. శ్రీకృష్ణుడు వారితో "గోపికలారా! మీ ప్రేమ పవిత్రమైనది. మీ సర్వస్వము నా కొసగితిరి. వ్రతనియమున నుండి వివస్త్రలై యమునా నదిలో స్నానముజేయుట అపచారము. స్నానము, దానము. హోమము శయనము, నడుచునప్పుడు వివస్త్రలుగ నుండరాదు. అటు లొనర్చిన గౌరీదేవిని కించపరచి నట్లగును. అందులకే ఇట్లొనర్చితిని. సర్వము త్యజించి నన్ను శరణుజొచ్చిన వారిని నేను తప్పక కాపాడుదును" అని అనెను. గోపికలు 'శ్రీకృష్ణా! అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ' అని రెండు చేతులెత్తి నమస్కరించిరి. నవనీతచోరునిహృదయము కరగెను. వారి ఉడుపుల వారి కొసగెను మిథిలాగోపికలు పరమాత్మను స్తుతించిరి.

పరమాత్మ వారితో "గోపికలారా! ప్రకృతికి అతీతుడు పురుషుడు. వికారమంతయు స్త్రీయే. 'ప్రకృతి, పురుషుడు ఒక్కటే' అని తెలిసిన వాడే పురుషుడు'. 'పరమాత్మయే పురుషుడు'. 'పరమాత్మ ఒక్కడే' అని సేవించువారు వ్యభిచారులు కారు. వస్త్రధారణలో విశేషము లేదు. నేను సర్వాంతర్యామిని. ఆత్మభూతుడను. నాకు తెలియని మర్మములు లేవు" అనుచు రాగద్వేషరహితమగు చల్లనిచూపులతో వారి అజ్ఞానమును లాగివేసెను. వారితో రాసక్రీడ సలిపి పరవశల గావించెను.

ఈ జగత్తు పరమాత్మ స్వరూపము. ఈ జగత్తునందు జగద్భావము నశించిన బ్రహ్మభావన గలుగును. శూన్యాకాశమును శూన్యము చేసిన చిద్వస్తువు దర్శనము గలుగును. గాలి, ఎండ, మంచు మున్నగుబాధల భరించి వృక్షములు నీడ నొసగును. మారుతముతో మనస్సున కాహ్లాదము గలుగజేయును. పండిన పండ్లను, పూచిన పుష్పములను మనకు అంద జేయును. మనమే విశ్వాసఘాతుకులము. వాటికి ప్రాణములేదని నఱికి వేయునపుడు అవి కంపించును వర్ణము మారును. ద్రవపదార్థమనదగు అశ్రువుల రాల్చును. అట్టి వృక్షజాతియందు ఎన్నడు పరిపూర్ణ ప్రేమ గలుగునో ఆనాడే పరమాత్మ దర్శన మగును. పరమాత్మయందు తాదాత్మ్యము గలుగును. అందుచే గోపికావస్త్రాపహరణము జగత్పూజ్య మయ్యెను.

## కోసల గోపికలు

కోసలదేశమందలి వనితలు శ్రీరామచంద్రుని జూచి మోహించిరి. పరమాత్మ అనుగ్రహమున వారు నవనందుల ఇండ్లలో గోపికలుగ జన్మించిరి. గోపకులను వారు వివాహమాడిరి. వారు పద్మినీజాతి స్త్రీలు. పద్మపత్రాయతాక్షులు. అమూల్యాభరణములతో సౌందర్యలావణ్యము లతో నొప్పారుచుండిరి. వారు శ్రీకృష్ణుని ప్రేమించిరి.

లౌకికవాదులు (జారులు) యౌవనమను ధనమును దోచుకొందురు. పరమాత్మ కుండకు మట్టివలె ఉపాదాన కారణమగును. అందుచే పరమాత్మను ప్రేమించుట (కామించుట) ఆత్మధర్మము. అచట గోపిక కాని కృష్ణుడు, కృష్ణుడు గాని గోపిక లేదు. స్థూలదృష్టితో ప్రాకృతులకు

కామమువలె గోచరించును. కనిపించని మాగుముళ్ల వలె కామజంటలు మనలో వ్యాపించియున్నవి. ఇవి జ్ఞానులను, యోగులను, పరమ హంసలను సైతము పతనము గావించుచున్నవి.

నందకిశోరుడు సౌందర్యరాశి. ఆయన వ్రజవీథులలో నడుచు నప్పుడు గోపికలు శ్రీకృష్ణుని ముద్దిడుకొని చూపులతో చూపులు, నవ్వులతో నవ్వులు, మాటలతో మాటలు కలుపుచుండువారు. వారికి సదా పరమాత్మ స్మరణమే. పెరుగు, పాలు, వెన్న కడవలు శిరమున నిడుకొని శ్రీకృష్ణుని స్మరించుచు మధురానగరమున కేగి వానిని విక్రయింతురు.

ఒక గోపిక—

విక్రేతు కామా కిల గోపకన్యా
మురారి పాదార్పిత చిత్తవృత్తిః,
దధ్యాదికం మోహవశా దవోచత్
గోవింద దామోదర మాధవేతి.

పెరుగు కడవను శిరమును నిడుకొని శ్రీకృష్ణునిపై మనస్సు లగ్న మగుటచే 'పెరుగోయమ్మ పెరుగు' అనుటకు బదులు 'గోవింద, దామోదర, మాధవ' అని కేకలువేయ దొడంగెను. మధురానగర మందలి స్త్రీలు ఆ గోపిక కడవను దింపిరి. అందు కృష్ణవిగ్రహములు కోకొల్లలుగ నుండెను. కోరుకొనిన వారికి కృష్ణవిగ్రహములు కొల్లలుగా లభించెను. వారు గోపికకు హెచ్చుమూల్యమును చెల్లించిరి. అక్రూరుని పతియును కృష్ణవిగ్రహమునుగొని పూజామందిరమున భద్రముగ దాచెనట. గోపికకు అదొక వింతగ దోచెను. ఆమె పరమాత్ముని లీలలను స్మరించుచు తన్మ యురాలై మెల్లగ వ్రజమునకు చేరుకొనెను.

గోపికలకు ఆకసమందు, వాయువునందు, భూమియందు, అష్టదిక్కు లందు పిపిలికాది బ్రహ్మపర్యంతము పరమాత్మయే కనబడుచుండెను. అన్యవస్తువు కన్పించుటలేదు. పరమాత్మ స్మరణచే రోమాంచము, గద్గద స్వరము, ఆనందాశ్రువులు జాలువారుట మున్నగు అష్టసాత్త్విక భావ ములు గోపికలకు గలుగుచుండెను. వారు వేదములు పఠింపలేదు. అష్టాంగయోగములు చేయలేదు. యజ్ఞయాగాదు లొనర్పలేదు. తీర్థ

యాత్రలు చేయులేదు. వారికి అట్టి దివ్యాను భూతి గలుగుట పరమాత్మ యందు వారికిగల అనురక్తి వలననే!

విరహోన్మాదలైన గోపికలు వ్రజవీథులలో విహరించుచుండిరి. వారికి లోకధర్మములు లేవు. లజ్జ లేదు. పరమాత్మయందు మనస్సు లగ్నమగుచో అన్నియు బోవును. యోగులు క్షణకాలము హృదయకమలమున నిలుపలేని పరమాత్మ వీరి హృత్పద్మములనుండి కదలుట లేదు. పరమాత్మ వీథులలో విహరించుచుండ. గోపికలు తాదాత్మ్యము నొంది ఆయనను ముద్దిడుకొనెడివారు. పరిపూర్ణ పరబ్రహ్మకు సర్వస్వము సమర్పించి లయవిక్షేపములకు లొంగక, నిర్వికల్పసమాధిలో వారు నిమగ్నమగుచుండిరి. వారు పరమాత్మపై చేతులువైచి ఆయనను విరహతప్తుని గావించుచుండిరి. పరమాత్మ వారితో రాసక్రీడ సల్పి ఆనందాబ్ధిని నోలలాడించుచుండెను.

## అయోధ్యాగోపికలు

అయోధ్యానగరమందలి స్త్రీలు శ్రీరామచంద్రుని జూచి మోహించిరి. ద్వాపరాంతమున శ్రీకృష్ణావతారమున వారితో రాసక్రీడ సలుపుదునని ఆయన బాస చేసెను.

చంపక అను నగరమున విమలుడు అను రాజు గలడు. ఆయనలో సహనము, సంపద, రూపము, విష్ణుభక్తి మూర్తీభవించెను, పెక్కురు పతులున్నను విమలునకు సంతానము గలుగలేదు. సూర్యుడు కన్పింపని రోజువలె, రాజులేని రాజ్యమువలె, హంసలులేని సరస్సువలె, పండితులు లేని సభవలె, సంతానములేని వాని జన్మము వ్యర్థ యని విమలుడు కుములుచుండెను.

యాజ్ఞవల్క్యమహర్షి చంపక నగరమునకు విచ్చేసెను. విమలుడు మహర్షికి అర్ఘ్యపాద్యాదుల నొసగి వినమ్రుడై నిలిచియుండ మహర్షి వానితో "ఓ రాజా! నీకు పుత్రికాసంతానము గలదు. పుత్రులు లేదని విచారపడకుము. వారు సుపుత్రులు కానిచో సద్గతి గలుగదు. భీష్మునకు సంతానము లేకున్నను సద్గతి గలుగలేదా? నీ కుమార్తెలను శ్రీకృష్ణపరమాత్ముడు చేపట్టగలడు" అని ఆశీర్వదించెను.

పరమాత్మ మధురానగరమున, యదువంశమునందు ద్వాపరాంతమున విళంబినామ సంవత్సర భాద్రపద శుక్ల అష్టమి, రోహిణీనక్షత్ర వృషభ లగ్నమున సోమవారము నడిరేయి దేవకీ వసుదేవుల గర్భమున అరణియందు అగ్నివలె అవతరించును. ఆ మహనీయుడు నీకు అల్లుడగును" అని వివరించెను.

అయోధ్యావాసినులు విమలునకు పుత్రికలుగ జన్మించిరి. వారు రూప, గుణ, శీల సంపన్నలు. వారు యౌవనవతులైన పిమ్మట విమలుడు అంతరంగిక మిత్రుని బిలిచి, 'మధురానగరమున కేగి శ్రీకృష్ణుని వృత్తాంతమును విచారించి రమ్ము' అని పంపెను. అతడు మధురానగరమునకేగి విచారింప, దేవకీవసుదేవులకు గలిగిన ఆర్గురుబిడ్డలను కంసుడు సంహరించెనని చెప్పిరి. అతడు చంపకనగరమునకు మరలివచ్చుచుండ రాజు చెప్పిన లక్షణములుగల బాలుడు కనబడెను. వానికి రెండు చేతులు గలవు. సౌందర్యఖని, శ్యామవర్ణము గలవాడు. ఆ బాలునిగూర్చి విమలునకు అంతరంగిక మిత్రుడు తెలిపెను.

కురువంశవృద్ధుడగు భీష్ముడు విమలుని జూడవచ్చెను. రాజు ఆయనతో తాను వినిన వృత్తాంతము నెరిగించెను. భీష్ముడు విమలునితో "ఓయీ ! దేవకీ వసుదేవుల గర్భమున శ్రీకృష్ణపరమాత్మ జన్మించెను. కంసునివలన ప్రమాదము గలుగునని ఆ బిడ్డను గోకులమున నందరాజు ఇంటియందు యశోదాదేవికడ పెంచుచున్నారు. పదునొకండు వత్సరములు పూర్తియైన పిమ్మట ఆ బాలుడు కంసుని సంహరించును. నీకుమార్తెలను ఆ పరమాత్మ కొసగి పరిణయము గావింపుము" అని తెలిపి హస్తినాపురమున కేగెను.

విమలుడు మిత్రుని బిలిచి శ్రీకృష్ణుని గొనిరమ్మని బృందావనమునకు బంపెను. అతడు పరమాత్మునితో "నందకిశోరా ! నేను చంపక నగరాధిపతియగు విమలుని అంతరంగిక మిత్రుడను. నీ పాదధూళిచే వ్రజము పావనమయ్యెను. కస్తూరి నెచట దాచినను సువాసన దాగనట్లు నీ యశశ్చంద్రికలు సకల లోకముల వ్యాపించినవి. విమలుడు సదా నిన్ను స్మరించుచుండును. తన కుమార్తెలను నీ కిచ్చి కల్యాణము జరి

పెంచుటకు విమలుడు ముచ్చటపడుచుండెను. దయతో నావెంట దయ చేయుము. నీ దర్శనభాగ్యమునకు రాజదంపతులు, వారి కుమార్తెలు నిరీక్షించుచుందురు" అని సవినయముగ మనవి చేసెను. వరమాత్మ భక్తవశంకరుడు. అనురాగము మెండు. ఆయన చంపకనగరమునకు బయలుదేరెను.

చంపకనగరమున విమలుడు యజ్ఞము చేయుచుండెను. వేద ఘోష వీనుల విందొనర్చుచుండెను. వరమాత్మను చూడగనే విమలుడు సాష్టాంగ నమస్కారము గావించి, స్వాగతసత్కారముల నొసగి, రత్నపీఠ ముపై గూర్చుండ బనిచి, షోడశోపచార పూజలు గావించి వినమ్రుడై నిలిచెను. ప్రాసాదాగ్రభాగము నుండి రాజపుత్రికలు వరమాత్మను చూచి ముగ్ధలైరి. శ్రీకృష్ణుడు వారి చూపులలో చూపు గలిపెను. ఎవరికి వారు వరమాత్మ తననే చూచెనని భ్రమచెందిరి. (చూపులు కలియుట అన ఒకటి యగుట. అదే ప్రేమసూత్రము. అదే రాధామాధవుల చూపు.)

వరమాత్మ విమలునితో "ఓయీ! నీకేమి కావలయునో కోరును ముము" అనిరి. రాజు ఆ మహనీయుతో 'ప్రభూ! నా మనస్సు చంచల మైనది. అది భ్రమరమువలె సంచరించుచుండును. తమ పాదారవింద మధువును అవిచ్ఛిన్నముగ ఆస్వాదించు భాగ్యము గలుగచేయుము. నా సర్వస్వము నీదె" అని సర్వసమర్పణ (ఆత్మనివేదన) గావించెను.

ఆత్మార్పణమే వరమాత్మకు వరశుల్కము. తన పుత్రిక లందరిని వరమాత్మ కొసగి విమలుడు వివాహము జరిపించి జన్మ ధన్యమయ్యెనని భావించెను. దేవతలు పుష్పవృష్టి కురియించిరి. దేవదుందుభులు మ్రోగి నవి. దివ్యతేజస్సు కనబడెను. అందుండి దివ్యరథము వచ్చెను. వర మాత్మ అనుగ్రహముచె విమలుని దేహము దివ్యముగ ప్రకాశించెను. సతీ సమేతముగ విమలుడు గోలోకమున కేగెను. విమలుని పుత్రికల వెంట నిడుకొని వరమాత్మ కామవనమున కేగి, అందరికి అన్నిరూపములతో సన్నిహితముగ నుండి రాసక్రీడ సల్పెను. వారే అయోధ్యా గోపికలు. శ్రీకృష్ణపరమాత్మ వేణువు నూదుచుండ వారు రాల్చిన ఆనందాశ్రువులు సరోవరముగ నేర్పడెను. దానిని విమలసరోవర మందురు.

## యజ్ఞసీత

త్రేతాయుగమున శ్రీరామచంద్రమూర్తి సీతామహాదేవిని అడవుల కంపెను. సీతాసమేతముగ యజ్ఞములు చేయుట సంప్రదాయమగుటచే శ్రీరాముడు సీతాదేవి విగ్రహములు చేయించెను. వానికి ప్రాణప్రతిష్ఠ జరిగినది. పిమ్మట అవి తమ్ము సతులుగ చేపట్టుమని శ్రీరాముని కోరినవి. ద్వాపరాంతమున శ్రీకృష్ణావతారమున తప్పక వారి కోర్కెను దీర్తునని ఆయన అభయ మొసగెను.

ఒకపర్యాయము ఉశీనరదేశమున క్షామము వచ్చెను. అచటి గోపాలకులు యమునానదీ తీరమున పచ్చికబయళ్లు విస్తారముగ గలవని నందరాజు ఎందరినైనను ఆదరింపగల సంపద గలవాడని విని, సతీసుతులు, గోవులను దోలుకొని బృందావనమునకు చేరిరి. వారికి నందరాజు తగు వసతులు చూపెను. యజ్ఞసీతలు ఆ గోపాలకుల గృహములలో జన్మించిరి. వారు పెరిగి పెద్దవారై నందకిశోరుని చూచి మోహించిరి. పరమాత్మకు సతులుగ నుండుటయే వారి ధ్యేయము. వారు రాధాదేవి కడకేగి తమ అభిమతమును వెల్లడించిరి.

రాధాదేవి వారితో "గోపికలారా! నందనందనుడు సామాన్యుడు కాడు. అందరిని ప్రేమించును. అన్నితావుల నుండును. అన్ని రూపములతో అందరితో రాసక్రీడ సలుపును. పరమాత్మ మాయ నాకే తెలియుట లేదు. అందరను మురిపించును, విరహతప్తుల గావించును. ఆ మహాపురుషునియందే అందరు ప్రాణములు నిలుపుకొందురు. అందరు ఆయననే ప్రేమింతురు, సేవింతురు. పరమాత్ముని లీలల తెలిసికొనుట కష్టసాధ్యము. ఏకాదశీవ్రతమును ఆచరించినచో పరమాత్మ మీకు వశుడగును అని హితము పలికెను.

## ఏకాదశీవ్రతము

మార్గశీర్ష మాసమున కృష్ణపక్ష ఏకాదశియందు ఏకాదశీదేవత, శ్రీమహావిష్ణువునుండి ఉత్పన్న యగును. ఆమె ఒక్కొక్క మాసమున ఒక్కొక్క రూపమును దాల్చును. ప్రతివత్సరమునకు వచ్చు ఇరువది యారు ఏకాదశులకు వేరు వేరు నామములు గలవు. ఉత్పన్న, మోక్ష,

సఫల, సుపుత్ర, షట్తిల, జయ, విజయ, అమలకీకామిక, పాపవిమోచన, కామద, వరూధిని, మోహి, వ్యవరా, నిర్జల, యోగిని, దేవ, శయనీ, ఇందిర, కామినీ, పవిత్ర, అజ, పద్మేందిర, పాశాంకుశ, రమా, ప్రబోధినీ. అధికమాసము వచ్చుచో సర్వసంపత్ప్రద అను నామములతో పిలువబడు చుండును.

దశమిరోజున ఏకభుక్తము చేయవలెను. ఆ రాత్రి కటికనేలపై పరుండవలెను. ఏకాదశినాడు ఐదుగడియల ప్రొద్దుండగనే మేల్కొన వలెను. కాలకృత్యములు దీర్చుకొని స్నాన మాచరింపవలెను. అరిషడ్వ ర్గములకు దూరముగ నుండవలెను. నీచులతో, పాషండులతో పలుక కూడదు. భక్తిశ్రద్ధలతో ప్రేమతో ఏకాదశీదేవతను షోడశోపచారములతో పూజింపవలెను. ప్రేమతో, భక్తితో గుహుడు శ్రీరాముని పాదములగడిగి కృతార్థుడయ్యెను. 'బ్రహ్మలోనున్న ప్రపంచము బ్రహ్మమయమే' అని తెలిసి పూజించిన సర్వేంద్రియములు భగవన్మయములై ఆనందా నుభూతి నొందును. వ్రతమహిమను వినవలెను. దక్షిణ, తాంబూలము లతో సదస్యులను తృప్తిపరుప వలెను.

ఏకాదశినాడు భోజనము చేయగూడదు. నిదురపోరాదు. అంత ర్ముఖులై స్వస్వరూపదర్శనము అనగా ఆత్మదర్శనము చేయవలెను. కంచుపాత్ర వాడరాదు. మాంసము, చిరుసెనగలు పనికిరావు. ఈ వ్రతము మూడురోజుల వ్రతము అనగా దశమీ, ఏకాదశీ, ద్వాదశీ నియమములు మూడునాళులు పాటించవలెను. తాంబూలచర్వణము గూడదు. తైలము పనికిరాదు. పరనింద చేయరాదు. ప్రయాణము చేయరాదు. మిగులు ఏకాదశినాడు ఉపవాస ముండవలెను. మరునాడు ద్వాదశిపారణ చేయ వలెను.

ఈ వ్రతఫలము ప్రశస్తమైనది. అన్నదానఫలము, భూదాన ఫలము సంసారమునుండి ముక్తి లభించును. యముడు దరికి రాలేడు. ద్వాదశినాడు విష్ణువును తులసీదళములతో పూజించిన పాపము లంటవు. సర్పములలో శేషునివలె, పక్షులలో గరుత్మంతునివలె, దేవతలలో శ్రీమహా విష్ణువువలె, వృక్షములలో అశ్వత్థవృక్షమువలె, మాసములలో మార్గశిరము వలె, వేదములలో సామవేదమువలె, వ్రతములలో ఏకాదశీవ్రతము విశేష మైనది.

దేవతలు ఈ వ్రతమును గావించి దానవుల జయించిరి. వైశంతుడను రాజు తండ్రిని నరకమునుండి రక్షించెను. కేతుమంతుడను రాజు పుత్రుల బడసెను. పుష్పవంతునకు, మాల్యవంతునకు గంధర్వత్వము లభించెను. శ్రీరామచంద్రమూర్తి ఈ వ్రత మాచరించి సేతువును దాటి రావణుని సంహరించెను. మాంధాత స్వర్గమున కేగెను. శంకరుడు బ్రహ్మహత్యా పాతకమునుండి విముక్తుడయ్యెను. అంబరీషుడు సకల సుఖముల పొందెను. హేమమాలి కుష్ఠరోగమును పోగొట్టుకొనెను. రుక్మాంగదుడు, హరిశ్చంద్రుడు మున్నగువారు ముక్తి నొందిరి.

అందుచే యజ్ఞసీత గోపికలు భక్తిశ్రద్ధలతో ఏకాదశీవ్రత మొనర్చి పరమాత్మ అనుగ్రహమును బడసిరి. పరమాత్మతో వారు రాసక్రీడలో పాల్గొని పరవశించిరి.

## పుళిందగోపికలు

త్రేతాయుగమున దండకారణ్యమందు పుళిందులను (చెంచులు) అటవికజాతి వారుండిరి. వారు శ్రీరామచంద్రమూర్తి సుందరరూపమును చూచి మోహించిరి. ద్వాపరాంతమున శ్రీకృష్ణావతారమున వారిని అనుగ్రహింతునని శ్రీరాముడు బాస చేసెను.

వింధ్యపర్వత ప్రాంతమందలి పుళిందులు చోరశిఖామణులు. రాజులనే బంధించి ద్రవ్యమును అపహరించెడివారు. బీదసాదల జోలికి పోవువారు కారు. వింధ్యరాజు వారి ఆగడములకు ఆగ్రహము గలుగుటచే రెండు అక్షౌహిణులసేనను వెంటనిడుకొని పుళిందులను ముట్టడించెను. వారు పారిపోయి కంసుని ఆశ్రయించిరి. ఆయన ప్రలంబుడను రక్కసుని వింధ్యరాజు కడకు బంపెను.

ప్రలంబుడు పొడగరి, కారుమేఘచ్ఛాయ, అగ్నిగోళములవంటి నేత్రములు, కంఠమున సర్పమాలికలు, భయంకరాకారముతో బయలుదేరెను. వాని పాదఘట్టనలకు గిరులు, మహావృక్షములు చూర్ణమగుచుండెను. మృగరాజును చూచిన గజరాజువలె వింధ్యరాజు పారిపోయెను. ప్రలంబుడు పుళిందులను వెంటనిడుకొని కంసునికడ కేగెను. ఆయన వారిని తన పరివారమున చేర్చుకొనెను. పుళిందులు కామగిరిపై నివాస మేర్పరచుకొనిరి.

ఆ పుళిందవనితలకు గలిగిన సంతానమే పుళిందగోపికలు. చూడ చక్కని చుక్కలు. యమునానదీతీరమున నున్న ఇసుకతిన్నెలపై నంద కిశోరుని పాదచిహ్నముల గుర్తించి తత్పాదరజమును దేహమున కలదు కొని పరవశించెడివారు, బ్రహ్మాదులు శిరమున దాల్చిన పాదపరాగము లభించెనని మురియుచుండెడివారు. వ్రజవనితల వక్షఃస్థలముల నంటు కొనిన కుంకుమగంధము పచ్చికబయళ్లపై కన్పించగనే వాటిపై దొర్లుచు పరమాత్మను స్పృశించినటుల తన్మయ లగుచుండెడివారు. వారి భక్తి ప్రపత్తులకు పరమాత్మ కడు సంతసించి రాసక్రీడామహోత్సవమున పర వశల గావించెను.

## రమాపఖ్యాది గోపికలు

త్రిలోకములకు లోకాలోకపర్వతము కోటవలె నుండెను. దానికి అవల సూర్యరశ్మి సోకని ధ్రువమండలము గలదు. అచ్చట శ్రీమన్నారా యణుడు సదా దర్శన మొసగుచుండును. పూర్వము ఒక విప్రునకు నవ సంతానములు గలిగినను పుట్టుట, గిట్టుట ఒకేక్షణమున జరుగుచుండెను. ఆయన ఆదేశమును పాలించు రాజుకడ కేగి అధర్మపరిపాలన ఫలితమే తనకట్టి ఆపద గలుగుట అని హెచ్చరించుచు, బలరామకృష్ణుల నిందించు చుండెను. నిస్పృహతో విరాగియై భూసురు డిటుల పలుకుచుండెనని భావించి రాజు మౌనము దాల్చెను.

శ్రీకృష్ణుని మరదియగు కిరీటి విప్రుని మాటలు విని పరమాత్మ యెడ నిందావాక్యములను సహింపనేరక, “ ఓయీ ! నీ పలుకులు ములు కులవలె నా హృదయమున గ్రుచ్చుకొనుచున్నవి. నా బావయగు కృష్ణ పరమాత్మను నిందించుటకు కారణమేమి ? ” అని అడుగ, భూసురుడు తన దీనావస్థను పరమాత్మకు వెల్లడించి, పరమాత్మకు తనపై అనుగ్రహము గలుగలేదను నైరాశ్యముతో నిందించుచుంటినని వివరించెను.

ధనంజయుడు విప్రునితో “ ఓయీ ! పరమాత్మ దయాంబురాశి. నీ సతి గర్భవతియై నవమాసములు నిండిన పిమ్మట నాకడకు కొనిరమ్ము గర్భస్థశిశువును బ్రతికింపలేనిచో అగ్నిప్రవేశ మొనర్తును. విప్రుడు సతి

దోడ్కొని అర్జునుని కడ కరుదెంచెను. పుట్టిన బిడ్డ మాయ మయ్యెను. శపథము నెరవేరలేదని ఫల్గునుడు అగ్నిప్రవేశమునకు పూనుకొనెను. పరమాత్మ ప్రసన్నుడై లోకాలోకపర్వతము కడకు కిరీటిని కొనిపోయి సుదర్శనచక్రముతో కారుచీకటులను చీల్చివైచి భూసురుని బిడ్డలను ప్రార్థన కొసగెను. ధనంజయుడు వారిని విప్రున కొసగెను. అర్జునుని సాహసమునకు మెచ్చుకొని పరమాత్మ ధ్యాననిమగ్నుడయ్యెను. లోకాలోకమందలి వనితలు పరమాత్మను చూచి మోహించిరి. వారు గోకులమున నీతి, విన్మార్గద, శుక్ల, పతంగ, దివ్యవాహన, గోపేష్టులను వృషభానుల గృహములలో జన్మించిరి. వారు దిన దిన ప్రవర్ధమానలై కృష్ణ భక్తులై నందకిశోరుని దర్శనభాగ్య మబ్బుటకై మాఘవ్రతము ప్రారంభించిరి.

మాఘపంచమినాడు పరమాత్మ మునివేసము దాల్చి నడుమునకు వ్యాఘ్రచర్మమును చుట్టుకొని జటాధారియై, దేహమునకు భస్మము పూసికొని వేణువు నూదుచు, రమాసఖ్యాది గోపికలకడకు అరుదెంచెను. పరమాత్మను వారు చూడగనే విరహతప్తలై "ఎవరో ఈ యౌవనుడు! నందకిశోరునివలె కన్పట్టుచున్నాడు. ఒకవేళ ఈ మునీంద్రుడు వెన్నెలరేడగుచో అందు మచ్చ కన్పించుటలేదే! మన్మథు డగుచో అంగవిహీనుడై కృశింపవలె గదా! దేవేంద్రు డగుచో బ్రహ్మహత్యాపాతకముతో వగచుచుండవలె గదా! ఈ మురళీధరుని చూడ ప్రేమ ప్రకోపించుచున్నది. విరాగియైనను రూపరేఖా విలాసములకు కొదువలేదు. మసిగుడ్డ కట్టిన మాణిక్యమువలె మెరయుచుండెను. వీనిని వదలి మాతాపితలు అర్ధాంగి యెటుల మనగలుగు చున్నారో!" అని తర్కింప దొడగిరి.

గోపికలు పరదేశితో "మునీంద్రా! తాము ఎవరు? నివాస మేది? తమ స్థితి ఎట్టిది? వృత్తి యేమి? సంకల్ప మెట్టిది?" అని ప్రశ్నించిరి.

పరదేశి వారితో "నేను యోగీశ్వరుడను (పరమాత్మను). మానస సరోవరము నా నివాసము (హృదయకమలము). నేను సంయమిని పరమహంసతో గలసి మెలసి త్రిమ్మరుచుందును. నా నామధేయము

స్వయంప్రకాశకుడు. స్తంభన, మారణ, ఉచ్చాటన, మోహన, వశీకరణ విద్యల నెరిగినవాడను. త్రికాలజ్ఞానిని" అని తెలిపెను.

గోపికలు ఆ మునీంద్రునితో "మహర్షీ! త్రికాలవేదులైనచో మా మనస్సులలోని కోరికలను తెలుపుము" అని అడిగిరి. పరమాత్మనవ్వుచు "గోపికలారా! మీ కోర్కెలను నేను వెల్లడించినచో సిగ్గుపడుదురేమో! చెవులలో రహస్యముగ దెలుపుదును" అని వారిని సమీపించెను. పరదేశి పరమాత్మయేయని వారు గ్రహించి "అయ్యా! మంత్రములు వచ్చునని తెలిపియుంటిరి. మా మనోవీథిని గిలిగింతలు పెట్టు మోహనమూర్తిని మాముందు నిలుపుము" అని నవ్వుచుండిరి. 'కనులు మూసికొనుడు, మీ ఆరాధ్యదైవమును దర్శింపగలరు' అని అన, వా రటులు సేయ మునీంద్రుడు పరమాత్మ యయ్యెను. కనులు దెరచిచూడ శ్రీకృష్ణుడు మందహాసము చేయుచు మనోహరముగ కన్పట్టెను. గోపికలు పరమాత్మను చుట్టుముట్టిరి. వారితో నందకిశోరుడు రాసక్రీడ సల్పెను. తమజన్మ ధన్య మయ్యెనని గోపికలు పరవశించిరి.

## హోళీపండుగ (వసంతోత్సవము)

శాంతి, వీతి, హోత్ర, భక్స్వంబ, పావన, శ్రుత, శ్రీకర, వ్రజనాథ గోపతులను నవనందులు గలరు. వారి జనపము వ్రజమండే. వారందరు ధనవంతులు, సుందరరూపులు, విద్యావేత్తలు, దాతలు, వారి ప్రాసాదములలో పరమాత్మ అనుగ్రహమున దివ్యలు, భూగోపికలు, త్రిగుణవృత్తి గోపికలు జన్మించిరి. వారెల్లరు సౌందర్యరాసులు. వారు రాధాదేవివలె అలంకరించుకొనువారు. పరమాత్మపై రాధాదేవికి ఎంత మక్కువయో వారును అంతటి ప్రేమ గలవారు. వారు రాధాదేవికి ముదమును గూర్చు నెచ్చెలులు.

ఒకనాడు రాసోత్సవము జరుగుచుండెను. తనను విడిచి పరమాత్మ అన్యులకడ కేగగూడదని రాధాదేవి భావన. పరమాత్మకు గోపికలందరు ఆత్మీయులే. ప్రియసఖులే. తాను వారినెట్లు విడువగలడు? విడిచినచో వారు మనగలరా! అందరను అన్ని రూపములతో దరిచేరి పరమాత్మ రాసక్రీడ సలుపుచుండ రాధాదేవి ప్రణయకోపముతో వెడలిపోయెను.

రాధాదేవిని విడిచి పరమాత్మ క్షణమైన నిలువగలడా? అందుచే ఆయన (వసంతోత్సవము) హోలీపండుగ జరుపుచుండెను. చెలులు రాధాదేవితో "కృష్ణప్రియా! వ్రజసుందరీ! పరమాత్మ వసంతోత్సవము జరుపుచుండెను. పరమాత్మను వదలి ఒంటిగ శయ్యామందిరమున నుండిన ఫల మేమి? నీవు లేనిచో వసంతోత్సవము రక్తి కట్టదు. రాధాకృష్ణులు అవిభాజ్యులు. కోపముమాని సర్వాలంకారభూషితవై నందకిశోరుని కడకు రమ్ము. నీవు లేకుండుటచే పరమాత్మ మోమున మందహాసము మెరయుట లేదు. ఉల్లాసము కన్పించుట లేదు. దీర్ఘకోపము గూడదు. ప్రణయకలహము క్షణకాలము మాత్రమే. నీవు రానిచో మేము వెళ్ళము. శ్రీకృష్ణుని మనస్సును నొప్పించుట పాడియా? ఆ దివ్యమంగళ స్వరూపుడు మనపై ప్రసరింపజేయు ప్రసన్నదృక్కులను మరచితివా? నవనీత చోరుని హృదయము నవనీతసదృశము" అనిరి.

మనోహరమగు వేణునాదము రాధాదేవి చెవిని బడెను. ఆమె కోపము చల్లారెను. సర్వాలంకారభూషితయై చిరునవ్వులు చిందించుచు చెలుల వెంటనిడుకొని వసంతోత్సవమునకు బయలుదేరెను. గోపికలు కృష్ణగీతికల నాలపించుచు ఉద్యానవనమున ప్రవేశించిరి. రాధాదేవిని పరమాత్మ క్రీగంటిచూపులతో చూచుచు ఆమెహృదయము చూరగొనెను. పరవశురాలైన రాధాదేవి నందకిశోరుని పాదములకడ వ్రాలెను. నందనందనుడు ఆమెను కౌగిలించుకొని చెక్కిలి ముద్దాడెను. గోపికలు వారిరువురిపై వసంతమును గ్రుమ్మరించిరి.

గండుకోయిలలు 'కుహూ'నాదములు చేయ దొడంగెను. మలయపవనములు ఆహ్లాదకరముగ నుండెను. పుష్పసౌరభము నలుగడ వ్యాపించెను. మకరందమును ఆస్వాదించిన భ్రమరములు ప్రేమగీతికల నాలపించుచుండెను. వసంతోత్సవమును వేడుకతో వసంతుడు తిలకించుచుండెను. దేవతలు ఆ దృశ్యమును చూచి కడు సంతసించిరి.

సుగంధము, మకరందములను పన్నీటితో కలిపిన కడవలు సిద్ధముగ నుండెను. గోపికల కోలాహలము మిన్నంటెను. రాధాదేవి వెండి గొట్టముతో శ్రీకృష్ణునిపై వసంతము చిమ్మెను. పరమాత్మ రాధాదేవిని వసంతములో ముంచెత్తెను. గోపికలు రాధాకృష్ణులపై వసంతమును

చిందించుచుండిరి. పరమాత్మ పెక్కురూపముల దాల్చి గోపికల దరిజేరి వసంతములో వారిని ముంచెత్తుటయే గాక రంగురంగుల గులాములను వారిమోమున పూసెను. గోపికలు రాధాకృష్ణులపై గులాములను గ్రుమ్మరించుచుండిరి. తారల నడుమ చంద్రునివలె గోపికల నడుమ శ్రీకృష్ణ పరమాత్మ మెఱయుచుండెను. వేణుగానము వీనుల విందొనర్చుచుండ గోపికలు రాసక్రీడ మొదలిడి లయబద్ధముగ నృత్యము చేయదొడంగిరి. పరవశించిన గోపికలు తమ్ము దాము మరచి పరమాత్ముని చేతిలోని పావులవలె ఆడుచుండిరి. దేవతలు ఆ దృశ్యమును చూచి వారిపై పుష్ప వృష్టి కురియించిరి.

## దేవకన్యాగోపికలు

మాళవదేశమును దివస్పతి యనురాజు పాలించుచుండెను. ఆయనకు పెక్కురు సతులు గలరు. వారు నీతినియమములు గలవారు. రాజు సతీసమేతముగ తీర్థయాత్రకు బయలుదేరెను. ఆయన నందరాజును, యశోదాదేవిని, శ్రీకృష్ణుని గూర్చి విని బృందావనమున కేగెను.

బృందావనశోభను తిలకించిన రాజు, రాణి మున్నగువారు ముగ్ధులైరి. సకలజనులు పరమాత్మ ధ్యానమున సదా సమాధిస్థితిని బొందుచుండిరి. సజ్జనులుండు తావు పుణ్యక్షేత్ర మగును. శ్రీరామచంద్రుని పాదధూళిచే రామేశ్వరమందలి ప్రతి ఇసుకరేణువు శివలింగ మయ్యెనని ప్రతీతి. అటులే శ్రీకృష్ణపరమాత్మ పాదధూళిచే బృందావనమందలి ప్రతి అణువు కృష్ణగానము చేయునని చెప్పుదురు.

దివస్పతి వాని సతులు బృందావనమును విడువలేక నందరాజు అనుమతి నొంది రమణీయోద్యానవనములలోసుందరసౌధముల నిర్మించుకొని ప్రొద్దులు గడపుచుండిరి. శ్రీరామచంద్రమూర్తిని మోహించిన దేవతాస్త్రీలు దేవలమహర్షి వాక్యానుసారము దివస్పతికి సంతానముగ జన్మించిరి.

దేవకన్యాగోపికలు ఉషఃకాలమున యమునానదిలో స్నానము చేసి కృష్ణగానము చేయుచు మాఘవ్రతమును ప్రారంభించిరి. ఆ గానమునకు తన్మయుడై పరమాత్మ వారికి దర్శన మొసగి వరము కోరు

కొప్పునెను. గోపికలు పరమాత్మను మనసార ప్రేమించిరి. స్వామి సదా తమ సన్నిధానమున నుండుటయే వారి అభిమతము. వారి భక్తి చాల గొప్పది. అందుచే వారు 'ఓ పరాత్పరా! యోగీశ్వర హృత్కమలము అలో నిలిచియుండు నీ దివ్యమంగళ రూపము ఎల్లప్పుడు మాకు కన్పించునటుల వర మొసగుము. ఏ ఇతరములైన కోర్కెలు కోరుటకు మేము అజ్ఞానులము కాము.

పరమాత్మ భక్తసులభుడు. సకల శాస్త్రములు భగవన్ముఖము లగుచో వాటిని విద్య అందురు. కానిచో అవిద్య అగును. భగవానుని యందు నిరతిశయప్రేమ గలవారికి పరమాత్మ కన్పించును. అట్టిప్రేమ లేనిచో ఎన్నిసాధనలు చేసినను అవి నిష్ఫలమగును. ప్రేమ సర్వులకు స్వరూపమైనది, నిష్కల్మషమైనది, పవిత్రమైనది, స్వతంత్రమైనది.

పరమాత్మ దేవకన్యాగోపికల కోర్కెకు సమ్మతించెను. గోపికలు కనులు మూసిన, కనులు తెరచిన శ్రీకృష్ణపరమాత్మయే కన్పించుచుండె. ఎప్పుడు పిలిచిన అప్పుడు పరమాత్మ వారికి దర్శన మొసగుచుండెను.

## జాలంధర గోపికలు

జలంధరుడు దానవవీరుడు. వాని దుండగములు మితిమీరు చుండెను. అందుచే శ్రీమన్నారాయణుడు వానికడ కేగెను. అచటి స్త్రీలు ఆ మహాపురుషుని చూచి మోహించిరి. శ్రీకృష్ణావతారమున వారికోర్కెను తీర్తునని కేశవుడు బాస చేసెను.

సప్తశైవలినీ తీరమున సకల సంపదలతో తులతూగుచు, యోజన విస్తీర్ణము గలిగిన రంగపట్టణము గలదు. దానిని రంగోజీ అను రాజు పాలించుచుండెను. అతడు హస్తినాపుర మేలు ధృతరాష్ట్రునకు సామంతుడు; కోట్లకొలది కప్పము చెల్లించువాడు. ఒకపర్యాయము రంగోజీ కప్పము చెల్లింపక మిన్నకుండెను. ధృతరాష్ట్రుడు కౌరవసైన్యమును రంగపట్టణమునకు పంపి కప్పమును గొనిరండని ఆజ్ఞాపించెను. వారు రంగోజీని బంధించి కరిపురము చేర్చి చెరసాలయం దుంచిరి. అతడు

కప్పము గట్టుటకు అంగీకరింపక అర్ధరాత్రివేళ చెరసాలనుండి తప్పించు కొని రంగపట్టణమునకు చేరుకొనెను.

ధృతరాష్ట్రుడు మూడు అక్షౌహిణుల సేనను రంగపట్టణమునకు పంపెను. రంగోజీ వారిచే పరాభవింపబడి పరాజితుడై దూతల బిలిచి, కంసునకు కమ్మ నిటుల వ్రాసెను.

" ఓ కంసరాజా ! ధృతరాష్ట్రుడు నా రాజధానీ నగరమును ముట్టి పెట్టి నన్ను సంహరించుటకు సిద్ధముగ నుండెను. తాము వీరాగ్రేసరులు. పెక్కురు దానవవీరుల జయించిన శూరశిఖామణులు. దీనజనుల నుద్ధ రించువారు. దయార్ద్రహృదయులు. నన్ను రక్షించుటకు సమర్థులు. చంద్రునికొరకు చకోరమువలె, మేఘముకొరకు చాతకమువలె, అన్నము కొరకు అన్నార్తునివలె, సలిలముకొరకు దాహపీడితునివలె, నేను తమ సాయముకొరకు నిరీక్షించుచున్నాను."

రంగోజీదూతలు మధురానగరమున కేగి కమ్మను కంసున కందిం చిరి. కువలయాపీడము అను దిగ్గజము నెక్కి చాణూర ముష్టికుల వెంట నిడుకొని కంసుడు రంగపట్టణమునకు జనెను. ఎండినవనమును అగ్ని దహించినటుల, కంసుడు కౌరవసేనపై తారసిల్లెను. రథములనుకాళ్లతో మట్టగించెను. కంసుని వసుపున వ్యోమాసురుడు గజములను గిరగిర త్రిప్పుచు సమరము సేయుచుండెను. కేశియను వాడు అశ్వికదళమును చెదరగొట్టెను. ఆ ధాటికి నిలువలేక కౌరవసేన పలాయన మయ్యెను. కంసుడు రంగోజీని మధురానగరమునకు దోడ్కొనిపోయి బర్హిషదము నిర్మించి అందు రంగోజీకి వసతిని చూపెను. రంగోజీ సతులతో అచ్చట సుఖముగ నుండెను.

శ్రీహరి వరప్రభావమున జాలంధరస్త్రీలు రంగోజీకి కొమార్తెలుగ జన్మించిరి. యుక్తవయస్సు వచ్చినపిమ్మట వారు గోపాలకులను పెండ్లి యాడిరి. వారు శ్రీకృష్ణపరమాత్మను మనసార ప్రేమించి సేవించుచుం డిరి. వారి భక్తిప్రపత్తులకు మెచ్చి వారితో పరమాత్మ రాసోత్సవము జరిపి వారిని ఆనందతరంగములలో నూగించెను. స్వకీయప్రేమ కన్న పరకీయప్రేమ యందు రసపుష్టి ఎక్కువ.

## సముద్రకన్యకాది గోపికలు

పరమాత్మ మత్స్యావతారములో నున్న సమయమున సముద్ర వనితలు ఆయనను మోహించిరి. కృష్ణావతారమున వారికోర్కె తీర్తునని పరమాత్మ అభయ మొసగెను.

శ్రీమంతుడు, ధీమంతుడు, నీతిమంతుడు, బలపరాక్రమములు గలవాడు, శోణపురాధీశ్వరుడగు నందునకు సముద్రస్త్రీలు కొమార్తెలుగ జన్మించిరి.

నరనారాయణుల తపోభంగమునకు అప్సరసలు యత్నించి విఫలలైరి. వారు శ్రీహరి యనుగ్రహమున గోపవనితలుగ జన్మించిరి. వారే కామసేనాగోపికలు.

సుతలలోకమందలి స్త్రీలు వామనమూర్తిని చూచి ప్రేమించిరి. శ్రీకృష్ణావతారమున వారు సుతలగోపికలుగ జన్మించిరి.

దుర్వాసమహర్షి సకల వాంఛల నొసగు యమునాపంచాంగ మను మహామంత్రము గోపికల కుపదేశించెను. వారు నందకిశోరుని పతియగు యమునను ఆరాధించి పరమాత్మ అనుగ్రహమునకు పాత్రులైరి. చైత్ర మాసమున మలయపవనములు ఆహ్లాదకరముగ నున్న సమయమున వసంతమండపమందు డోలికోత్సవము జరిగెను. పరమాత్మ వారిని ప్రసన్నదృక్కులతో వరవశల గావించెను.

## యమునాపంచాంగము

అయోధ్యను పాలించు మాంధాతృ చక్రవర్తి వేట నిమిత్తము బృందావని కేగెను. బృందావనమున యమునానదీ తీరమున సౌభరి మహర్షి ఆశ్రమము గలదు. సౌభరిమహర్షి మాంధాతచక్రవర్తి అల్లుడు. మాంధాత మహర్షికి ప్రణామము లాచరించి "స్వామి! తాము సదా భగవానునియందు సారూప్య మొందియుందురు. తమ దర్శనభాగ్యముచే మాకు జ్ఞానోదయ మగును. ఇది కార్యకారణప్రపంచము అని మాత్రమే మాకు తెలియును. ఇహలోకములో సకల భోగము లనుభవించుచు కడకు శ్రీకృష్ణసాయుజ్యము గలుగు నుపాయము దెలుపుము" అని వేడుకొనెను.

సౌభరిమహర్షి అయనతో "రాజా! యమునాపంచాంగము అను మంత్రరాజము గలదు. పంచాంగము అన ఐదు అంగములు గలది. కవచ, స్తవ, పటల, సహస్రనామ, ఫలశ్రుతులను పంచ అంగములు గలది. దీనిని సావధానముగ వినుము.

## యమునాకవచము

"రాజా! స్నాన సంధ్యావందనాదు లాచరించిన పిమ్మట, స్వస్తి కాసనమున ప్రాగ్దిశగగూర్చుండి 'యమునాస్రవంతి నా శిరము రక్షించు గాక! శ్యామకృష్ణ నా నేత్రముల రక్షించు గాక! మహావాహిని నాహృద యమును పాలించు గాక! పరమానంద స్వరూపిణి నా కపోలముల కాపాడు గాక! కాళింది నా అధరముల బ్రోచుగాక! నా చుబుకమును రవిసుత రక్షించు గాక! యమభగిని నా కంఠమును కాపాడు గాక! కృష్ణప్రియాంగన నా పృష్ఠము రక్షించు గాక! అంభోరువైన యమున నా భుజములను జానువులను పాపభేదిని కాపాడు గాక! కలుషహారిణి రాసేశ్వరి యగు యమున నా చరణములను కాపాడు గాక!' అని ప్రార్థింపవలెను" అనెను.

## యమునాస్తవము

మహర్షి మాంధాత "రాజా! యమునాస్తవమును దెలుపుదును. వినుము.

యమునాదేవీ! నీవు పరమాత్మ వామభాగము నుండి ఉద్భవించితివి. నీవు కృష్ణాత్మవగుటచే పూజ్యత నొందితివి. నీయందు గ్రుంకు లిడినచో, నా పాపముల హరించి గోలోకములో విహరించు భాగ్యము ప్రసాదింతువు. నీవు కృష్ణస్వరూపిణివి. నీ సుళ్ళలో పరమాత్మ మత్స్య రూపమున నుండెను. నీ ప్రతిబిందువునందు గోవిందుడు నిండియుండెను. ఓ లీలావతీ! నీకు నమస్కృతులు. గోలోకమందలి బ్రహ్మాండ కర్పరము భేదించుకొని గోపకులను, గోపికలను, గోవత్సములను, దేవతలను, మానవుల నుద్ధరించుటకై ఉల్లాసముతో ఉరకలు వేయుచు వచ్చియుంటివి. 'కృష్ణ' అను నీనామము వినినవారి కొండలవంటి పాపము

లను సైతము భస్మము గావింతువు. 'కృష్ణ' అను నామము ఎవని జిహ్వాగ్రమున నిరంతరము తాండవము చేయునో వారికి నీ అన్నయగు యమధర్మరాజు వలన బాధ గలుగదు. విషయము లను నూతిలో పడిన వారిని రక్షించుటకు నీ కటాక్షము త్రాడు వంటిది. ద్యులోకమునకు ఊర్ధ్వ స్థానానివి. గోలోకమందు భూలోకమందు విహరించుదానవు. బృందా వనమునకు ఆధారభూతురాలవు. ఓ తల్లీ! నివు శ్రీకృష్ణుని ప్రియురాలవు నీవు సాక్షాత్పరబ్రహ్మతత్త్వమే. నీ పవిత్రోదకము పైకి చిమ్మినచో ముత్యములవలె నుండును. శ్యామవర్ణముగల నిన్ను చూచి మయూర ములు మనోహరముగ నాట్యము చేయును. గండుకోయిలలు 'కుహూ' నాదము లొనర్చును. నా దేహమందలి ఒక్కొక్కరోమకూపము ఒక్కొక్క నాలుకయైనను నీ గుణగణముల గానము చేయలేవు. కళిందగిరిసుతవలె జన్మించిన నీ స్తవమును భక్తిశ్రద్ధలతో పఠించువారు మహదానందము బొందుదురు."

## యమునాపటలము

యమునా మంత్రమును పటల మందురు. షోడశదళపద్మమందు రత్నఖచిత సింహాసనముపై యమునాసహితుడై పరమాత్మయున్నటుల హృదయమందు భావించుటయే గాక, ఆ పద్మదళములపై నదీదేవతలగు గంగ, విరజ, కృష్ణ, చంద్రభాగ, సరస్వతి, గోమతి, కౌశికి, వేణి, సింధువు, గౌతమి, వేదస్మృతి, వేత్రవతి, శతద్రువు, సరయువు, ఋషి కుల్య, కకుద్మతులు ఉన్నటుల స్మరింపవలెను. బృందావనము, గోవర్ధ నము, బృంద, తులసీదేవతల నాలుగుదిక్కుల స్థాపించినట్లు భావింపవలెను.

## యమునాపటల పద్ధతి

పునశ్చరణ జరుగువరకును బ్రహ్మచర్య మవలంబింప వలయును. ప్రాతఃకాలమున స్నానసంధ్యావందనాది కృత్యము లాచరించిన పిమ్మట మంత్రానుష్ఠానము చేయవలెను. సమాప్తిసమయమున భూసురోత్తము లకు అన్నదాన సువర్ణదానములు చేయువలెను. ఇటు లాచరించిన సకల లాభీష్టములు నెరవేరును" అని చెప్పిరి.

## యమునా సహస్రనామము

### అథ యమునా ధ్యానమ్

శ్యామా మంభోజనేత్రాం
స ఘనఘనరుచిం రత్నమంజీరకూజత్
కాంచీకేయూర యుక్తాం
కనకమణిమయే బిభ్రతీం కుండలే ద్వే
భ్రాజత్ శ్రీనీలవస్త్రాం
స్ఫురదమర చరదారభారాం మనోజ్ఞాం
ధ్యాయే మార్తాండపుత్రీం
తనుకిరణ చయో ద్దీప్త దీపాభిరామామ్. (గర్గసంహిత)

యమునా సహస్రనామ శ్లోకములు 12౭ గలవు. వానిని నిత్యము పఠించిన సకలశ్రేయములు గలుగును.

## సహస్రనామ ఫలశ్రుతి

"సహస్రనామము ఒక పర్యాయము పఠించిన రాత్రివేళ చోర వ్యాఘ్రాది భయము గలుగదు. శుద్ధ విదియనాడు ప్రారంభించి పూర్ణిమ వరకు నియమముగ పఠించిన రోగి ఆరోగ్యవంతు డగును. గర్భిణీస్త్రీ సుపుత్రుని గాంచును. విద్యార్థి సకలవిద్యలందు ఆరితేరును. నిధి ప్రాప్తించును. మోహన, స్తంభన, వశీకరణాది విద్యలు సిద్ధించును. ఎల్ల కోర్కెలు సమకూరును, నిత్యము పఠించిన బ్రహ్మవర్చస్వి యగును. రాజన్యుడు రాజ్యాధిపత్యము నొందును. పుష్కలముగ సంపదలభించును. నిష్కామబుద్ధితో పఠించిన పాపపంకిలమునుండి విముక్తులై జీవన్ముక్తులగుదురు. శాశ్వతానందము బొందుదురు". సకల సంపత్కరమగు యమునాపంచాంగము సర్వులు ఆచరింప దగినది.

## ప్రలంబాసురుడు

వేసవియందు పచ్చిక బయళ్ళతో, నిర్మలోదకము గొనివచ్చు సెల యేళ్ళతో, మలయమారుతముతో, కలకలలాడు కల్పవృక్షములతో, పరి

మళ పుష్పములతో, మధురఫలములతో నిండియుండి లతాగుల్మాదులతో మనోహరముగ నుండెను. పరమాత్మ యమునాతీరమునమున్న పొగడ చెట్టుపై నెక్కి గోపాలకులతో గూడి వేణుగానము చేయదొడంగెను.

మురళీరవమును వినిన వెంటనే గోమాతలు పసిరికను వదలి నిర్జీవపు బొమ్మలవలె నందకిశోరునివైపు తిరిగినవి. 'యమునా' 'సరస్వతీ' 'గంగా' అని పరమాత్మ గోవులను పిలుచుచుండ, గంగా యమునా సరస్వతీ నదులు గట్టు లొరసికొనుచు పడివడిగ వచ్చుచుండ స్వామి పాద రజము సోకినవెంటనే పరవళ్లు త్రొక్కుచు, పరమాత్మ పాదములకు ప్రణామముల నర్పించుచుండినవి. పుష్పములు ఆనందాశ్రువులు రాల్చునటుల మకరందము ను స్రవించుచుండినవి. తులసీమధువులతో మత్తెక్కిన తుమ్మెదలు మధురగానముచేయ దొడంగెను. హంసలు, బెగ్గురుపక్షులు సమాధినిష్ఠులవలె వేణుగానము గ్రోలుచుండెను. పన్నని తుషారబిందు వులజల్లులు రాలుచుండెను. బలాకపక్షులు బారులుదీరి యుండెను. నిండు మేఘము వర్షించి చాతకముల కష్టముల దీర్చినటుల, కృష్ణమేఘము కరుణామృతము వర్షించి భక్తుల తాపత్రయమును బారద్రోలుచుండెను.

పరమాత్మ గోపబాలురతో ఆడుచు పాడుచు నృత్యము చేయుచు, పందెములు వైచుచు, కలహమాడుచు, క్రీడించుచుండెను. గోపబాలురు రెండు పక్షములుగ చీల బారులు తీరిరి. బలరామస్వామి ఒకపక్షము, పర మాత్మ రెండవ పక్షమున నాయకులుగ నుండిరి. గెలిచినవారిని ఓడిన వారు భాండీరక మను వటవృక్షము కడకు మోయవలెనని పందెము వేసి కొనిరి. క్రీడఇలో నోడిన పరమాత్మ శ్రీధాముని మోయుచుండెను. కంస ప్రేరితుడైన ప్రలంబాసురుడు పరమాత్ముని పక్షమునమండి యోడినటుల నటించి బలరామస్వామిని మోయుచుండెను. బరువు హెచ్చెను. ప్రలం బుడు నిజరూపము దాల్చెను. ముష్టిఘాతముతో బలరామస్వామి ప్రలం బుని బ్రహ్మరంధ్రము చిట్లునటులచేయ, రక్కసుని శిరస్సు రెండువ్రక్క లయ్యెను. దానవుని తేజస్సు బలరామునియందు ప్రవేశించెను.

## ప్రలంబుని చరిత్ర

కుబేరునకు 'చైత్రరథము' అను ఉద్యానవనము గలదు. అందలి పుష్పములు శివపూజకు మాత్రమే వినియోగింతురు. కావలి వాండ్రు అప్రమత్తులై యున్నను ఎవరో పుష్పములను అపహరించుచుండిరి. విసిగి వేసారిన కుబేరుడు పుష్పచోరునకు రాక్షసజన్మ గలుగునని శపించెను.

'హూహూ' అను గంధర్వుని తనయుడగు విజయుడు తీర్థయాత్ర చేయుచు కుబేర శాపము గూర్చి తెలియక, ఉద్యానవనమున ప్రవేశించి పూలను గైకొనెను. శాపప్రభావముచే విజయుడు రక్కసుడయ్యెను. వాడు కుబేరుని శరణు వేడెను. 'విజయా! నీవు విష్ణుభక్తుడవు. ద్వాపరాంతమున బలరామస్వామిచే సంహరింపబడి ముక్తి నొందుదువు' అని కుబేరుడు వానికి అభయ మొసగెను. ఆ విజయుడే ఈ ప్రలంబాసురుడు.

## దావాగ్నిని మ్రింగుట

విప్రుని జఠరాగ్నికన్న గోవు జఠరాగ్ని హెచ్చు. పరమాత్మ గోపబాలురతో ఆడుకొనుచుండ, గోవులు పచ్చికబయళ్లలో మేయుచు సుదూరమున నున్న ముంజాటవి (రెల్లు అడవి) లో చిక్కుకొనెను. గోపాలురు గోవుల వెదకుచు దారితప్పి సొమ్మసిల్లిరి. దావాగ్ని వారిని చుట్టుముట్టెను.

గోపబాలురు భయవిహ్వలులై 'హే కృష్ణా! ముకుందా! మురారీ! పాహిమాం రక్షమాం రక్షమాం' అని ఆర్తనాదములు చేయ దొడంగిరి. అది వినినంతనే పరమాత్మ వృక్షాగ్రము నధిరోహించి గోవులను పేర్లతో పిలువదొడంగెను. పరమాత్మ కంఠధ్వని వాటికి పరిచితమే. అవి అంబారవములు చేయుచు బదులు పలికెను. నందకిశోరుడు 'గోపబాలకులారా! భయ మొందకుడు. మిమ్ముల నేను రక్షింతును. నేత్రములనుమూయుడు' అన వారటుల మూసికొనిరి. పరమాత్మ దావాగ్నిని పానకమువలె గ్రోలెను. గోపాలకులు కనులు దెరువ గోవులతోగూడి వారెల్లరు భాండీర వనమున నుండిరి. వారు శ్రీకృష్ణుని పెక్కువిధముల స్తుతించిరి. పరమాత్మకు ప్రణమిల్లిరి.

## మునిపత్నులు

గోపబాలురకు ఆకలి వేయుచుండెను. అన్నము గావలెనని వారు కృష్ణుని కోరిరి. పరమాత్మ వారితో "అదిగో! అచట వేదవిదులగు భూసురోత్తములు స్వర్గఫలాపేక్షతో దేవతాప్రీత్యర్థము అంగిరస మను సత్రయాగము చేయుచున్నారు. బలరామస్వామి పేరు, నా పేరు చెప్పి అన్న మడుగుడు. బిడియపడకుడు" అని వారెల్లరను యజ్ఞవాటికకు పంపెను.

గోపబాలురు భూసురోత్తముల కడకేగి "విప్రవరేణ్యులారా! బలరామ కృష్ణులు అశోకవనమున వేంచేసి యున్నారు. ఆకలిదప్పులతో నున్నారు. మిమ్ములను అర్థించి అన్నము దెమ్మనిరి" అని తెలుప విప్రులు విముఖులుగ నుండిరి. అది అన్న మిడుటకు సమయము గాదని చెప్పిరి. పరమాత్ముని కోర్కెను తిరస్కరించుట వైరితనమని విప్రులకు తోచలేదు. సదవకాశమును జారవిడుచుకొని మౌనము వహించిరి.

గోపబాలురు జరిగిన వృత్తాంతమును నందనందనునకు తెలిపిరి. వారిని మునిపత్నుల కడకు అన్నమును గొనిరండని పంపెను. దొడ్డిత్రోవను గోపబాలురు యజ్ఞవాటికనుచేరి మునిపత్నులకు పరమాత్మ అభిమతమును దెలిపిరి. ఋషిపత్నులు మహానందభరితలై పంచభక్ష్య పాయసాన్నములను స్వయముగ చేకొని, పతుల పలుకుల పెడచెవినిబెట్టి బలరామ కృష్ణులకడకు బయలుదేరిరి.

మునిపత్నుల భక్తిశ్రద్ధలకు అచ్చెరువొంది పరమాత్మ వారి కెదు రేగెను. వారు బలరామ కృష్ణులకు పాదప్రక్షాళనము గావించి "స్వామీ! తమ దర్శనభాగ్యముచే ధన్యులమైతిమి. ఈ మృష్టాన్నముల స్వీకరించి మమ్ము కృతార్థుల గావింపుడు. నీ వొసగిన ప్రసాదములను నీకు అర్పించుటలో విశేషమేమి గలదు? మేమును బృందావనమున నుండుటకు అనుమతింపుము" అనిరి.

పరమాత్మ వారితో "ఋషిపత్నులారా! పతులు లేకుండ పతులు యజ్ఞము చేయుటకు అనర్హులు. అందుచే మీరెల్లరు యజ్ఞవాటికకు మరలి పొండు" అని హితము పలికెను.

వారు పరమాత్మతో "మహానుభావా! మాకు ధర్మాధర్మములతో పనిలేదు. నీవు తీసివేసిన తులసిమాల మాకు ఇచ్చినను అది మాకు మహా ప్రసాదము. ఇక ఐహికభోగములు వలదు. తమ పాదసేవ లభించిన చాలును" అని పలుకుచు విషాదాశ్రువులు రాల్చిరి. పరమాత్మ వారి నోదార్చుచు "ప్రియమగు వస్తువు దూరమగుచో ప్రేమ అధికమగును. నా దర్శనము మీకు ఆ తావుననే లభింపగలదు. సకలభోగములను బొందుదురు. మీ పతులు మిమ్ములను ప్రశంసింతురు. ఘటమునకు మృత్తువలె మిమ్ముల నేను విడువను" అని బాస చేసెను.

మునిపత్నులు యజ్ఞవాటికకు మరలిరి. ఋషులు సతులతో గూడి యజ్ఞమును పూర్తిచేసిరి. సతులు పరమాత్మ పలుకులను వల్లించిరి. మునులు తప్పిదమును గ్రహించి "పురుషులకన్న స్త్రీలు వివేకవతులు. పరమాత్మ ప్రేమకు పాత్రులైరి. శాస్త్రజ్ఞానమువలన లాభమేమి? ఏ పరమాత్మ మనకు ప్రసాదమిడెనో, ఆ మహాపురుషునకు ప్రసాద మిడుటకు నిరాకరించితిమి. అన్నములేక పరమాత్మ మనకడకు రాలేదు. ఎన్ని యజ్ఞములు చేసిన ఫలమేమి? అన్నియు నిష్ఫలములే గదా! గోపబాలురకు తాను ప్రసాదము పెట్టలేదా? యజ్ఞేశ్వరుడు యదువంశమున జన్మించెనని వినియుంటిమి, ఆ యజ్ఞేశ్వరుడు నిర్హేతుకప్రేమతో గోపబాలురను మనకడకు పంపెను. అది మనము గ్రహింపక కంసునకు వెఱచి శ్రీకృష్ణ పరమాత్మను దర్శింపలేదు" అని పరితప్తులై పరమాత్మను ధ్యానింప దొడగిరి.

అనన్యప్రేమ యున్నను భయ ముండదు. పురుషులు మస్తిష్క ప్రధానులు. స్త్రీలు హృదయప్రధానలు. అందుచే మునిపత్నులు భక్తితో పరమాత్మ దరిచేరి చరితార్థులైరి.

## వైకుంఠదర్శనము

నందరాజు ఏకాదశీవ్రతమును ఆచరించుచుండెను. మరునాడు ద్వాదశి కొలదిగ నుండెను. అందుచే అర్ధరాత్రివేళ స్నానము చేయుచుండ వరుణదేవుని భటులు నందరాజును గొనిపోయిరి. గోపకులు భయపడ జొచ్చిరి. వారు పరమాత్మతో "కృష్ణా! నందరాజు కన్పించుటలేదు.

ఆయనను రక్షించుటకు నీవే సమర్థుడవు. నందరాజు లేనిచో వ్రజము చిన్నవోవును. యశోదాదేవి హృదయము వ్రయ్యలగును. నీవు ఘటనా ఘటన సమర్థుడవు. నీకు అసాధ్యమగు కార్యము లేదు. వ్రజమునకు నీవే దిక్కు" అని కన్నీరు గార్చుచు మొరపెట్టుకొనిరి.

నందకిశోరుడు వారి నోదార్చుచు యమునానదిలో దూకెను. వరుణలోకమున కేగెను. వరుణుడు కోటిసూర్యప్రభా భాసమానుడగు పరమాత్మను చూచి భయపడి ప్రణామము లాచరించుచు "అచ్యుతా! నీవు అందరిని ఆనందింపజేయు వాడవు. మూర్ఖు డొకడు నందరాజును గొనివచ్చెను. స్నానము చేయుటకు సమయాసమయము లున్నవని తమకు తెలియనిది కాదు. నందరాజు అర్ధరాత్రి స్నానము చేయుటచే నా భటులు ఆయనను ఇటకు గొనివచ్చిరి. నైమిత్తికములందు స్నాన మెప్పుడైనను చేయవచ్చును. శాస్త్రము తెలియని మూర్ఖులు చేసిన తప్పిదమును మన్నింపుము" అని వేడుకొనుచు నందరాజును పరమాత్మ కప్పగించి శ్రద్ధాభక్తులతో ఆ మహనీయుని పూజించెను.

నందరాజు నందకిశోరుని శిరము నాఘ్రాణించెను. శ్రీకృష్ణుని సాహసమునకు కడు సంతసించెను. నందరాజు, పరమాత్మ వ్రజమున కన్పించిరి. వారిని చూడగనే యశోదాదేవికి ప్రాణము లేచివచ్చెను. తనయుని తనివితీర ముద్దాడెను. వ్రజమంతయు ఆనందడోలికలలో నోలలాడుచుండెను. వైకుంఠవైభవము చూపుమని పరమాత్మను వేడుకొనిరి.

బ్రహ్మహ్రదమున వారిని పరమాత్మ ముంచెను. వారికి నానాత్వము గోచరింపలేదు. వైకుంఠదర్శన మయ్యెను. శ్రీహరి శంఖ చక్ర గదా శార్ఙ్గధారియై దేదీప్యమానముగ వెలుగొందుచు శేషశయ్యపై వవ శించి యుండెను. దేవతలు అచ్యుతుని పెక్కువిధముల పొగడుచుండిరి. స్వామిని చేరుటకు గోపకులను విష్ణుపార్శ్వగులు అనుమతింపలేదు. అది గోపకులకు నచ్చలేదు. పరమాత్మతో ఆడుచు పాడుచు భుజములపై చేతులు వేసికొనుచుండు గోపకులకు వైకుంఠమండలి శ్రీమన్నారాయణునికన్న బృందావనవిహారి యగు నందకిశోరుడే మేలని భావించిరి.

పరమాత్మ బృందావనమును వారికి చూపెను. ఆనందోత్సాహములతో శ్రీకృష్ణుని కౌగిలించుకొనిరి. వైకుంఠముకన్న బృందావనమే శ్రేష్ఠమని వ్రజమున చాటిరి. వైకుంఠమున ప్రభువు, భృత్యుడు అను న్యాయము గలదు. భక్తిగలవారికి బృందావనమే రుచించును. ప్రేమలో తరతమ భేదము లుండవు గదా! గోపాలుడే కృష్ణుడు. కృష్ణుడే గోపాలుడు. నందకిశోరుడే వ్రజము. వ్రజమే నందకిశోరుడు.

## సుదర్శనోపాఖ్యానము

అంబికావనమున తిరునాళ్ళకు నందులు, ఉపనందులు, వృషభా నులు ఆరుగురు, వ్రజమందలి బాలగోపాలము చనిరి. వారు 'మహా విద్య' యను భద్రకాళీదేవిని, మహేశ్వరుని శ్రద్ధాభక్తులతో పూజించిరి. భూసురులకు మృష్టాన్నముల నొసగిరి. బంగరుమాడలను బహూకరిం చిరి. తాము భుజించి ఆ రాత్రి ఆ తావుననే నిదురవోవుచుండిరి.

నందరాజు పాదమునకు సర్పమొకటి చుట్టుకొనెను. ఎంత విదిలిం చినను అది వదలలేదు. అయన భయవిహ్వలుడై 'కృష్ణా! పాహిమాం రక్షమాం' అని దీనారవములు చేయుచుండ, నందకిశోరుడు వరుగు వరు గున వచ్చి తన పాదముతో సర్పమును స్పృశింప అది సర్పరూపమును విడిచి సుదర్శనుడను గంధర్వుడై "ఓ పరమాత్మా! నేను ఒక పర్యా యము అష్టావక్రుని చూచి నవ్వితిని. అయన నన్ను సర్పరూపమును దాల్చుమని శపించెను. నీ పాదరజముచే నాకు దివ్యత్వము లభించెను" అని కృతజ్ఞత వెల్లడించెను. అంతలో దివ్యవిమానము వచ్చెను. అందు సుదర్శనుడు ఆసీనుడైన పిమ్మట విమానము గోలోకమునకు జనెను. వ్రజవాసులు శ్రీకృష్ణుడు పరమాత్మయే యని గ్రహించి అయనను స్తుతించి సెలవు గైకొని తమ గృహములకు జనిరి.

## వ్యోమారిష్టాసురులు

గోపాలురతో నందకిశోరుడు ఆడుకొనుచుండెను. కొందరు గోవులు గను, కొందరు మేకలుగ, కొందరు చోరులుగ, కొందరు పసులకాపరులుగ విడివడి ఆడుచుండ, కంసప్రేరితుతగు వ్యోమాసురుడు అను రక్కసుడు

చోరుల గుంపున ప్రవేశించి గోవులను, మేకలను, గోపబాలురను గొని పోయి ఒక బిలమున దాచి మూసివేసెను. అది గ్రహించిన పరమాత్మ రక్కసుని రెండుకాళ్ళను పట్టుకొని గిరగిర త్రిప్పి నేలపై విసరికొట్టెను. వ్యోమాసురుడు మృతి నొందెను. వాని తేజస్సు పరమాత్మలో లీన మయ్యెను.

## వ్యోమాసురుని చరిత్ర

కాశీక్షేత్రమున భీమరథు డను రాజు గలడు. ఆయన విష్ణుభక్తుడు. మేధావి, దానశీలి. రాజ్యమును కొమారునకు అప్పగించి మలయపర్వత మున కేగి తపము చేయుచుండెను. పులస్త్యుడు అను ఋషిపుంగవుడు శిష్యగణముతో భీమరథుని కడకు వచ్చెను. రాజు ఆయనకు నమస్క రించెనే కాని సత్కరింపలేదు. పులస్త్యుడు కుపితుడై 'భీమరథా! ఇది అసురలక్షణము. అందుచే నీవు రక్కసుడుగ జన్మింతువు గాక !' అని శపించెను. తన తప్పిదము మన్నింపుమని రాజు మునీంద్రుని వేడు కొనెను. 'పరమాత్మ అనుగ్రహముచే నీవు ధన్యుడ వగుదువు' అని అభయ మొసగెను. ఆ రక్కసుడే వ్యోమాసురుడు.

ఒకతూరి అరిష్టాసురు డను రక్కసుడు వృషభరూపమున నంద వ్రజము ప్రవేశించెను. వాడు కొమ్ములతో వ్రజవాసులను పొడుచుటకు యత్నించెను. ఆబాలగోపాలము పారిపోవుచుండిరి. పరమాత్మ అరిష్టా సురున కెదురుగ నిలబడెను. వాడు నందకిశోరుని పొడువబోయెను. శ్రీకృష్ణుడు వానిని వెనుకకు నెట్టివేసెను. రక్కసుడు పరమాత్మను సుదూర ప్రాంతమునకు రోహితమను పర్వతము ఆయనపై విసరెను. ఆ పర్వత మును పరమాత్మ వానిపై త్రిప్పికొట్టెను. వాని కొమ్ములను నేలలో గ్రుచ్చెను. అందుండి జలధార పైకెగసెను. పరమాత్మ వానితో పోరు సల్పి వానిని కడతేర్చుటకు ఉద్యుక్తు డయ్యెను. అరిష్టాసురుడు దానవ రూపము వీడి విప్రుని రూపముతో "ఓ కృష్ణా! నేను బృహస్పతి శిష్యు డను. పేరు వరతంతువు, బ్రహ్మచారిని. గురువుకడ ఎటుల మెలగవలెనో తెలియని వాడనై కాళ్ళు సాచి కూర్చుంటిని. 'నీకు వృషభరూపము

గలుగు గాక!' అని గురువు నన్ను శపించెను. వృషభ రూపముతో సంచరించుచు రక్కసులతో మైత్రి నెరపితిని. వారి గుణములు నాకు అబ్బెను. నీ అనుగ్రహముచే శాపవిముక్తుడ నైతిని' అని విన్నవించు కొనుచుండ విమానము వచ్చెను. వరతంతువు విమాన మధిరోహించి గోలోకమున కేగెను.

మాధుర్యఖండము సమాప్తము.



## మ థు రా ఖం డ ము

### కంసుని మాయోపాయములు

పరమాత్మ సమువున నారదమహర్షి కంసుని కొలువుకూటమునకు చనెను. స్వర్గాధిపతియగు దేవేంద్రుని కంసుడు జయించి ఇంద్రసింహాసనమును, శ్వేతఛత్రమును మథురానగరమునకు గొనివచ్చెను.

స్వర్గసింహాసనముపై నధివసించిన కంసునకు వింజామరలు వీచుచుండిరి. యక్ష, కిన్నర, సిద్ధచారణులు జయజయ ధ్వానములు చేయుచుండిరి. మహర్షిని చూడగనే కంసుడు ఆయన కెదురేగి స్వాగతసత్కారములను, అర్ఘ్యపాద్యాదుల నొసగి, ఉన్నతాసనమున గూర్చుండ బనిచెను. కంసుడు మహర్షితో 'నారదమునీంద్రా! ఊరక రారు మహాత్ములు' అని ప్రాజ్ఞులు పలుకుదురు. తాము త్రిలోకసంచారులు. నా సేమ మరయువారిలో అగ్రగణ్యులు. విశేషమున్న తెలుప ప్రార్థన" అని సవినయముగ నడిగెను.

మహర్షి కంసునితో "ఓయీ! సదా నీ సేమము గోరువాడను. దేవకీదేవి అష్టమగర్భమున మగశిశువు జన్మించెను. వసుదేవుడు నందరాజునకు అప్పుడు. ఆ సమయమున యశోదాదేవి ఆడుశిశువును గనెను. దేవకీనందనుని యశోదాదేవి ప్రక్కన అతిరహస్యముగ నుంచిరి. ఆనాడు నీవు ఎగురవేసినది యశోదాదేవి గర్భస్థశిశువు. మాయా స్వరూపిణి. బలరామ కృష్ణులు నందరాజు ఇంటిలో పెరుగుచున్నారు. నీవు పంపిన దానవవీరులను మట్టుపెట్టినది వారే. ఈ రహస్యము నీకు తెలుపుట సమంజసమని తోచుటచే నీ కడకు వచ్చితిని" అని పలికెను.

కంసుడు క్రోధోద్రేకియై కరవాలమును దూసి 'వసుదేవుని సంహరింతును' అనెను. మహర్షి వానిని వారించుచు, వసుదేవుని జంపిన శత్రునిర్మూలనము గాదని తెలుపుచు మాయోపాయమున బలరామకృష్ణుల మధురానగరమునకు రావించి చంపుట శ్రేయస్కరమని చెప్పి వెడలిపోయెను.

దేవకీ వసుదేవులను కారాగారమున బంధించుటయే గాక కంసుడు 'కేశి' అను రక్కసుని రావించి బలరామకృష్ణుల వధింపుమని బృందావనమునకు పంపెను. పరమాత్మ మధురానగరమునకు అరుదెంచినచో పోరుసల్పుటకై ముష్టిక, చాణూరుల నియమించి, సింహద్వారముకడ కువలయాపీడము నుంచెను. తనకడనున్న విష్ణుధనుస్సును వెలికితీసి ధనుర్యాగము చేయుటకు పూనుకొనెను. అంతట అక్రూరుని బిలిచి బలరామకృష్ణులను ధనుర్యాగమునకు ఆహ్వానించి కొనిరమ్మని పంపెను.

## హితోపదేశము

కంసుని భయ మావరించెను. బలరామకృష్ణులు వానిమనస్సును కలవరపెట్టుచుండిరి. ఆతడు అక్రూరునితో "ఓయీ! ఋణశేషము శత్రుశేషము పనికిరాదు. ధనుర్యాగమునకు బలరామ కృష్ణులను, గోపకులను, నందరాజు, నవనందులను, వృషభానులు ఆరుగురిని ఆహ్వానింపవలెను యాదవులు నాకు శత్రువులు. కుబేరుని మేరుగుహలలో విసరివేసిన ద్వివిదుడు, జరాసంధుడు మున్నగువారు నాకు ఆప్తులు. నీవు కవివి. వాక్కులలో బృహస్పతివి. ధాతవు. నా శత్రువుల కడతేర్పవలెను. నీన సాయము అపేక్షించుచున్నాను" అని కోరెను.

అక్రూరుడు వానితో "ఓయీ! మనోరథములు మహాసముద్రము వలె నుండును. వాటికి అడ్డుండదు. బ్రహ్మాండములు దాటిపోవును. కాని అవి సఫలమగుట దైవాధీనము గదా! దైవానుగ్రహ మున్నచో మహాసముద్రము గోష్పాద మగును. లేనిచో గోష్పాదము సముద్ర మగును. దైవము అనిన కర్మ, పరమాత్మ అని అర్థము. అందుచే కర్మఫలప్రదాత పరమాత్మయే. దేవతలు సర్వజ్ఞులు కారు. పరమాత్మ శరణు జొచ్చిన కర్మలను తీపివేయును" అని హితము పలికెను.

కంసుడు అక్రూరునితో "ఓయీ! దుర్బలులకు దైవముతో పని యుండును. కాని బలిష్ఠులగు మమ్ములను దైవ మేమి చేయగలదు?" అనెను. అక్రూరుడు వానితో "ఓయీ! పురుషకారముతో దైవమును గూడ జయింపవచ్చునని శాస్త్రము పలుకుచున్నది. ఆ పురుషుడు పరమాత్మయే. 'నేను' అనే పురుషకారము రావలెను" అనెను. అక్రూరుని

వలుకులు కంసునకు వెగటుగ దోచెను. వాడు కుపితుడై అంతఃపురము నకు జనెను. వినాశకాలము దాపురించినచో ఆప్తవచనములు రుచింపవు. బృందావనమున కేగుటకన్న అక్రూరునకు గత్యంతరము లేకపోయెను.

## కేశి వధ

కంసుని పనుపున కేశి అను రక్కసుడు అశ్వరూపమున బృందా వనము ప్రవేశించి మేఘగర్జన చేసెను వ్రజ మంతయు గడగడ వణ కెను. అబాలగోపాలము శ్రీకృష్ణుని శరణు జొచ్చిరి. ఆయన వారికి అభయ మొసగెను.

పరమాత్మ చడ్డీ బాగుగ బిగించెను. కేశి నెదుర్కొనెను. వాడు కాలితో పరమాత్మను తన్నెను ఆయున చలింపలేదు. పరమాత్మ రక్కసుని కాళ్ళను పట్టుకొని దూరమునకు విసరెను. వాడు పరమాత్మను తోకతో కొట్టెను. పరమాత్మ వాని తోకను గట్టిగ పట్టుకొని గిరగిర త్రిప్పుచు పైకి నెగురవేసెను. వాడు భయంకరముగ గర్జన చేయుచు పరమాత్మపై దుమికెను. పరమాత్మ వానిని పిడికిలితో పొడిచెను. వాడు నేలపై బడి లేచి పరమాత్మను మెడపై నెక్కించుకొని ఆకసమున కెగసెను. గగన మున వారిరువురకు పోరు జరిగెను. పరమాత్మ రక్కసుని గిరగిర త్రిప్పుచు నేలపై విసరికొట్టెను. వాడు నోరు తెఱచి పరమాత్మను మ్రింగు టకు సిద్ధపడెను. కృష్ణుడు తన ముంజేతిని వాని నోటిలోనికి జొనిపి, నవ రంధ్రములను మూసివేసెను. రక్కసుని ఉదరము వ్రక్కలయ్యెను గిలగిల తన్నుకొనుచు కేశి మృతినొందెను రక్కసుని కళేబరము నుండి దివ్యపురుషుడు ఉద్భవించి శ్రీకృష్ణునకు ప్రణమిల్లెను.

## కేశి జన్మవృత్తాంతము

వృత్రాసురుని వధించుటచే దేవేంద్రునకు బ్రహ్మహత్యాపాతకము చుట్టుకొనెను. దానిని పోగొట్టుకొనుటకై ఇంద్రుడు అశ్వమేధయాగము చేయ నిశ్చయించుకొని యజ్ఞాశ్వము వదలెను. దేవరాజునకు వింజామర వీచు పరిచారకుడు అశ్వము నపహరించెను. దేవేంద్రుడు ఆ రహస్యము

దెలిసికొని వానిని అశ్వరూపమును బొందుమని శపించెను. పరమాత్మ పాదస్పర్శచే వానికి శాపవిముక్తి గలిగెను. ఆ పరిచారకుడే కేశి అను రక్కసుడు.

## అక్రూరుని రాయబారము

ఆ రాత్రి అక్రూరునకు నిదురలేదు. ఆనాడు ఏకాదశి. ఉపవసించి శ్రీకృష్ణపరమాత్మ ధ్యాననిమగ్నుడయ్యెను. మరునాడు బంగరురథము నధిరోహించి అక్రూరుడు బృందావనమునకు బయలుదేరెను. ఆయన తనలో 'ఎట్టి పుణ్యఫలముచే భరతవర్షమున జనియించితినో, ఏ మహానీయుని సేవ చేసితినో, ఎట్టి సత్పాత్రదానము చేసితినో, ఎట్టి జప తపములు చేసియుంటినో నాకు పరమాత్మ దర్శనము లభించుచున్నది. బ్రహ్మ రుద్రాదులు దర్శించిన పరమాత్మను దర్శింప బోవుచున్నాను, అచ్యుతుడు నిర్హేతుక కృపగలవాడు. ప్రేమసముద్రుడు. ఆయన అనుగ్రహము వలన పరమాత్మను దర్శింపనుంటిని.

పూతనాదులను రక్షించిన దయాళువు. నా యోగ్యతతో స్వామికి పనిలేదు. నా దేహము కంసపక్షమైనను నా హృదయము పరమాత్మ పక్షమే. కంసుడు కృష్ణద్వేషి నేను కృష్ణభక్తుడను. ఎందరో సచివులుండ నన్ను కంసుడు ఈ కార్యమునకు నియోగించుట భగవత్ప్రేరణయే. కానిచో నాకిట్టి సదవకాశము లభించునా?

నేను శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహమును దర్శింతును. చంద్ర బింబము బోలు నెమ్మోము, పండువెన్నెల చిలికించు చిరునవ్వులు, మణి దర్పణమువంటి కపోలములు, సంపెంగవంటి నాసిక, చెంగల్వలవంటి నేత్రద్వయము, మెలికలు తిరిగిన ముంగురులతో నొప్పారు నందకిశోరుని దర్శింతును.

బ్రహ్మ మహేశ్వరులు నిత్యము పూజించు పాదములు. ఆదిలక్ష్మి అనవరతము విడువని పాదములు. సౌందర్యము సౌభాగ్యము గలిగిన పాదములు. అందు ఏమి అమృతము గలదో? జీవన్ముక్తులకు పంచమ పురుషార్థమైన పాదారవిందము, సర్వసంగపరిత్యాగులగు పరమ భాగవ

తోత్తములు విడువని పాదములు, గోధూళిసోకిన పాదములు, ఉపనిష త్కాంతలు పావటయందు ధరించిన పాదములు, వ్రజవనితలు వక్షఃస్థల ముపై భద్రముగ దాచుకొనిన పాదములు, నఖాగ్రచంద్రికా కాంతులతో అంబరీషాదుల తరింపచేసిన పాదములు, ప్రేమకు లభ్యమగు పాదార విందములను దర్శింతును."

అక్రూరునకు శుభసూచకములు తోచుచుండెను. కృష్ణమృగములు (లేళ్ళు) ప్రదక్షిణముగ జనుచుండెను. భరద్వాజపక్షి, నెమళ్ళు చిలుకలు, గరుత్మంతుడు వామభాగమున పోవుచుండెను భగవద్దర్శనము తప్పక లభించునను తలంపు పెంపొందెను. ఆయన తనలో 'సకల జీవరాసులు కడకు బృందావనము సైతము తానైన పరమాత్మను దర్శింతును. ఆయన పాదములకు ప్రణమిల్లుదును. యోగీశ్వరులు బుద్ధియందు ధారణచేయు పరమాత్మ దర్శనము నాకు ప్రత్యక్షముగ లభింపగలదు. తన కృపాకటాక్షవీక్షణములతో పరమాత్మ నన్ను ముగ్ధుని గావించును. నేను ఆనందసాగరమున నోలలాడుచుందును. తన హస్తపల్లవములతో పరమాత్మ నన్ను లేవనెత్తును.

కాలసర్పమునుండి కాపాడు హస్తము. శ్రీదేవి కుచద్వయముపై నుండు హస్తము. రాసలీలాసమయమున గోపికల నెమ్మోమున నుండు స్వేదబిందువులను తుడిచిన హస్తము అట్టి అమృతహస్తమును పర మాత్మ నా శిరముపై నుంచి నన్ను సంతోషసాగరమున నోలలాడించి చేకొనును. ఆయన బాహుబంధములలో నా జన్మబంధము కర్మబంధము తొలగిపోవును. నా దేహము పవిత్రమగును. నేను ఇతరులను పవిత్రుల గావింపగలను. పరమాత్మను ఆశ్రయించిన వారికి సకలాభీష్టములు తప్పక సిద్ధించును' అనుకొనెను.

సంధ్యాసమయమున అక్రూరుడు బృందావనమున ప్రవేశించెను. ఆయనకు పరమాత్మ పాదచిహ్నములు గోపాదచిహ్నములు కనబడెను. వాటిని చూచి పరవశుడై అక్రూరుడు రథము దిగి నేలపై దొర్లుచు పర మాత్మ పాదచిహ్నములను కనుల కద్దుకొనుచుండెను. అక్రూరుడు 'కృష్ణా! కృష్ణా!' అని కేకలు వేయుచుండ గోపాలకులు వానిని గో శాలలో పాలు పిదుకుచున్న పరమాత్మ కడకు గొనిపోయిరి.

ఇంద్రనీలమువలె శ్రీకృష్ణుడు, స్ఫటికమువలె బలరామస్వామి ఏనుగు గున్నలవలె నుండిరి. నీలాంబరములను, పీతాంబరములను ధరించియుండిరి. దీర్ఘమైన భుజదండములతో, ఆకర్షణీయమగు చిరునవ్వులతో, కరుణాకటాక్షవీక్షణములతో, దివ్యరేఖాలక్షణలక్షితమగు పాదారవిందములతో, లేపనములతో, మరకతపర్వతమువలె శ్రీకృష్ణుడు, రజతాద్రివలె బలరామస్వామి గోచరించిరి. వారిని చూడగనే అక్రూరునకు బాహ్యాభ్యంతర తమస్సులు విడిపోయెను. ఆయన శ్రీకృష్ణపరమాత్మ పాదకమలములపై వ్రాలెను. ఆనందాశ్రువులతో స్వామి పాదముల నభిషేకించెను.

భక్తాగ్రేసరుడగు అక్రూరుని పరమాత్మ కౌగిలించుకొనెను. బలరామస్వామి ఆయనను అటులే ఆదరించెను. అక్రూరుని పాదములను పవిత్రోదకములతో బలరామ కృష్ణులు కడిగి స్వర్ణసింహాసనమున ఆసీనుని గావించి మధుపర్కము లొసగి, పరిమళ పుష్పములతో పూజించి, సుగంధద్రవ్యముల నలదిరి. మృష్టాన్నములతో విందుచేసిరి. తాంబూల చర్వణముచేయు సమయమున నందయశోదలు 'దేవకీ వసుదేవులకు కుశలమా!' అని అడిగిరి. అదివిని అక్రూరుడు విషాదాశ్రువులు రాల్చుచు "కసాయివానికడ పశువులకెంత భద్రతగలదో కంసునికడ దేవకీ వసుదేవులకు అంతే భద్రత. శిలాహృదయుడగు కంసుడు పరమమూర్ఖుడు. మాణిక్యములవలె నుండు పసికూనలను పొట్టబెట్టుకొనెను" అని కన్నీరు గార్చెను. నందాదులు అక్రూరుని ఓదార్చి వెడలిపోయిరి.

పరమాత్మ అక్రూరునితో 'తాతా! మా తలిదండ్రులకు క్షేమమా!' అని అడుగ, అక్రూరుడు 'కృష్ణా! నిన్ను, బలరాముని నందవ్రజమున దాచినందులకు నందాదులపై కంసుడు పగబూనెను. అతడు నీ తలిదండ్రులను చంపబోవ నారదమహర్షి అడ్డుపడెను. యాదవులను చిత్రవధ చేయుచున్నాడు. వారు తమ తమ నెలవులను వీడి వెడలిపోయిరి. ధనుర్యాగ మను నెపముతో మిమ్ము మధురానగరమునకు రావించి సంహరించుటకు సిద్ధపడుచున్నాడు. దుష్టశిక్షణ శిష్టరక్షణయే గదా మీ విధి. సమయ మాసన్నమైనది. నిమ్ము ఆశ్రయించిన వారిని ఎటుల కాపాడుదువో!" అని సవినయముగ పలికెను.

ఆ పలుకులు విని బలరామకృష్ణులు ఫక్కున నవ్విరి. వారికి కంసు డొక లెక్కయా? కంసుడు మృత్యుగహ్వరమును జొచ్చుటకు సిద్ధముగ నుండెను. నందకిశోరుడు తండ్రితో "ధనుర్యాగమునకు వ్రజవాసులంద రిని దోడ్కొనిపోవుట సమంజసము. కంసుని దుండగములు మితిమీరు చున్నవి. మృత్యుదేవత వానిని లాగికొనిపోవుటకు వేగిరపడుచున్నది. మనము నిమిత్తమాత్రులమే" అనెను.

పాలు, పెరుగు, వెన్నకావళ్లతో మధురానగరమున కేగుటకు సిద్ధముగా నుండుడని నందరాజు వ్రజమున చాట బనిచెను. మరునాడు వేకువను గోపకులు మధురానగరి కేగుటకు ఉవ్విళ్లూరుచుండిరి. గోపకు లకు ఆనందముగ నుండెను. పశుపక్ష్యాదులకు, వ్రజవనితలకు పరమా త్ముని విడుచుట దుర్భరముగ నుండెను. వారు విరహవేదన భరింప లేకుండిరి.

## గోపీవిరహము

గోపికలు వేడినిట్టూర్పులు విడుచుచుండిరి. వారి మోములు వాడి పోయెను. ఆభరణములు జారిపోవుచుండెను. శ్రీకృష్ణధ్యానమున వారి యందు సమస్తవృత్తులు నశించెను. సర్వము కృష్ణమయముగ దోచెను.

గోపికలు మధురస్మృతులను జ్ఞప్తికి దెచ్చుకొని "ప్రేమలేని హృదయము శిలాసదృశము. బహిరంగముగ ఏమేమో పలుకుదురు. అంతరంగమున మరియొక విధమున ప్రవర్తింతురు. రాసక్రీడలో పర మాత్మ మాతో 'మీ ప్రేమకు సాటి వేరొకటి లేదు. ఆత్మీయులను సైతము వదలి నాకొరకు వచ్చినారు. నేను మీకు ఎంతో ఋణపడియున్నా' నని పలికెను.

ఓ బ్రహ్మదేవా! పతీసుతులకు ప్రేమ కల్పించి 'నీవే నేను' 'నేనే నీవు' అనునటుల చేసి మరల విడదీయుదువా? బొమ్మల పెండ్లిండ్లు చేయుదురు. కడకు వాటిని వేరుచేయుదురు. నీకు మాపై కోపమెందుకో? పరమాత్మ నఖాగ్రములోని సృష్టిచాతుర్యము నిరుపయోగము. శ్రీకృష్ణుని దివ్యమంగళస్వరూప దర్శనము చేయించి, రసానుభవము కల్పించి, మమ్ములను ఈ రీతిని వేరుచేయుదువా? పరమాత్ముని చూచిన కనులతో

ఈ లౌకికప్రపంచము చూడజాలము. సౌందర్యరాశి నొసగి మరల ఆ వస్తువుమ హరించుట న్యాయమా? నీకు నీతినియమములు లేవు."

"ఓ అక్రూరా! నీకు ఈ పేరు ఎవరు పెట్టిరి? నేతిబీరకాయలలో నేయి లేకపోవచ్చును. కాని విషముండదు గదా? నీలో ఎంత క్రౌర్యమున్నది? 'అత్యంత క్రూరః అక్రూరః' అనిన బాగుండును. మేము అబలలము. ఏ పరమాత్ముని దర్శింపనిచో మా ప్రాణములు క్షణమైన నిలువవో ఆ మహాపురుషుని మాతో మాటమాత్రమైన చెప్పక మధురా నగరమునకు గొనిపోదువా?"

"పరమాత్మకు మనపై ప్రేమయున్న మనకు తెలుపక మధురా నగరమున కేగునా? మధురానగరస్త్రీలు నెఱజాణలు. చక్కని చుక్కలని భ్రమ జెందునేమో! పల్లెపడుచులు పరమాత్మకు వెగటయిరా? పరమాత్మను ప్రేమించుట మనదే తప్పు. గడచిన దానికి వగచిన ఫలమేమి? నందకిశోరుని చూచినచో పుష్పములు వికసించును. సకల జీవరాసులు సంతసిల్లును ఒక్కసారి ఆ దివ్యమోహనమూర్తిని చూచిన విడువలేము. స్వామి నెమ్మోమున అమృతమున్నది. ఎంతగ్రోలినను తృప్తి కలుగదు. మనది గ్రామ్యభాష. లలితముగ నుండదు. వారివి మృదుమధురముగ నుండును. పరమాత్మతో గలసియుండు యోగము వారికి పట్టనున్నది. మధురానగర భోగములలో మునిగి మనలను మరచునేమో? అప్పుడు మనగతి ఏమి? నిరాశానిష్పృహలతో క్రుంగికృశింప వలసినదేనా?"

"గోపకులు వెర్రివారు. మధురానగరమున కేగుచుంటి మను సంతోషమే గాని పరమాత్మ వ్రజమునకు రానిచో మనగతి ఏమి అని ఆలోచించుట లేదు. మధురానగరవాసులు మురళీధరుని వ్రజమునకు రానిత్తురా? శ్రీకృష్ణపరమాత్మను మనకు దక్కనివ్వరు."

"గోపకులలో నొక్కనికైనను తేలు కుట్టిరాదా? పాము కరువ రాదా? భూకంపమో, అగ్నిప్రమాదమో కలుగగూడదా? పయనము ఆగిపోవుమగదా? అరుగో, బలరామకృష్ణులు రథ మారోహించుచున్నారు. దారికి అడ్డుపడుదము. దయతలచి ఆగునేమో! పెద్దలు మనలను దూషింపవచ్చును. రాసక్రీడలో మనము అనుభవించిన దివ్యానుభూతి వర్ణనాతీతము.

రథము బయలుదేరుటకు సిద్ధముగ నుండెను. 'హే కృష్ణా' 'ముకుందా' 'మురారీ' అని విలపించుచు గోపికలు రథమునకు అడ్డు వచ్చిరి. వారు నందనందనా! మమ్ములను వదలుట న్యాయమా? గో మాతలు పసిరిక మేయునా? యశోదాదేవి బ్రతుకునా? నీవు మమ్ముల వీడిన మరుక్షణమున మేము బ్రతుకుట కల్ల. అందుచే స్త్రీహత్యా పాత కము నీకు పుష్కలముగ లభింపగలదు' అని కటువుగ బలికిరి.

పరమాత్మ వారితో "వ్రజవనితలారా! మీ ఆవేదన నాకు తెలి యును. మిమ్ముల విడుచుట నాకును బాధాకరమే. మధురానగరమున కంసుడు యాదవులను చిత్రవధ చేయుచున్నాడు, వారిని రక్షించుట నా కర్తవ్యము గదా! చెరసాలలో మ్రగ్గుచున్న దేవకీవసుదేవులను రక్షిం చుట నా విధ్యుక్తధర్మము గదా! కంసుని కడతేర్చుటయే నా లక్ష్యము విషాదాశ్రువులతో నన్ను మధురానగరికి సాగనంపుదురా? నిండుహృద యముతో నాకు వీడ్కోలొసగుడు. మిమ్ములను మరువనని ఇదే బాస చేయుచున్నాను. నా యాత్రాఫలితము సకల శ్రేయస్సు లొసగును" అని అనునయించెను.

## రాధను ఊరడించుట

పరమాత్మను చూచి రాధాదేవి మూర్ఛిల్లెను. ఆయన రథము దిగి రాధకడకు చనెను. ఆమె దీనావస్థను చూచి శ్రీకృష్ణుడు వేణునాద మొన ర్చెను. రాధాదేవి కనులు తెరచిచూడ పరమాత్మ ప్రక్కన నుండెను. ఆయన రాధాదేవితో "ప్రియా! నీ బాధను చూడలేకున్నాను. నేను దుష్ట శిక్షణ శిష్టరక్షణకై జన్మించితినని నీకు తెలియును గదా! యదువంశము కూకటివ్రేళ్లతో పెల్లగించుటకు కంసుడు వేగిరపడుచున్నాడు."

"దేవకీ వసుదేవులను కారాగారమున బంధించెను. నారదమహర్షి అడ్డుపడుటచే వారు బ్రతికియున్నారు. ధనుర్యాగ మిషతో కంసుడు వ్రజమును నిర్మూలించుటకు వ్యూహము పన్నెను. సింహద్వారము కడ కంసునికొరకు మృత్యుదేవత పొంచియుండెను. నా యాత్ర నిమిత్త మాత్రమే. కానున్నది గంధర్వులే తీర్చినటుల మృత్యుదేవత ఆ క్రూర కర్ముని విడువదు, ఆలసించిన ఎట్టి విపత్తులు సంభవించునో! కంస

సంహారమునకై నా రాక కొరకు మధురానగరవాసులు నిరీక్షించు చున్నారు నేను అచటి కేగనిచో తనకు వెఱచి వ్రజమున నుంటినని కంసుడు ప్రేలుటయే గాక వ్రజమునకు రాకమానడు. పోరు మధురా నగరమున జరుగుటయే శ్రేయోదాయకము. నా బలపరాక్రమములు, శక్తియుక్తులు చూచి దేవకీవసుదేవులు, ఉగ్రసేన మహారాజు, మధురా నగరవాసులు మురియుదురు. కంససంహారము జరిగిన పిమ్మట వ్రజ మున వ్రాలకుందునా? మిమ్ములను విడిచి నేను మధురానగరమున నిలువగలనా? చిరునవ్వులతో వీడ్కొలొసగుము" అని ప్రోత్సహించెను.

రాధాదేవి పరమాత్మతో "ప్రభూ! దుష్టశిక్షణ శిష్టరక్షణకే అవత రించితిరి తాము ఆ కార్యమందు నిమగ్నులై నన్ను మరువవచ్చును. మనసారా నిన్నే ప్రేమించితిని. నీవు బృందావనము వీడిన మరుక్షణము రాధ జీవించియుండుట కల్ల, కర్పూరమువలె హరించిపోవును" అని విషాదాశ్రువుల రాల్చుచు పరమాత్మ పాదములపై బడెను. ఆ దృశ్యము చూచిన వారందరి కనులు చెమర్చెను రాధా విరహవేదనను అక్రూరుడు స్వయముగ జూచి చకితు డయ్యెను.

పరమాత్మ ఆమెతో "రాధాదేవీ! మన వియోగమునకు కారణము నీకు దెలియును గదా! శ్రీదాముని శాపము ఊరకపోదు. నా భక్తుల పలుకులు వ్యర్థము కానీయను. నీ యందలి ప్రేమానురాగములకు చిహ్న ముగ నెలకొక పర్యాయము తప్పక నీకు దర్శన మొసగుదును" అనుచు రాధ చేతిలో చెయి వేసెను. రాధ పరవశురాలై 'రానిచో నీ రాధ నీకు దక్కదు' అని హెచ్చరించెను.

పరమాత్మ రాధాదేవితో "ప్రియా! నీతో కల్లలాడుదునా? మాస మున కొకతూరి తప్పక దర్శన మొసగుదును. ఇందులకు సూర్య చంద్రులు సాక్షి. గోమాతలు సాక్షి. అంతరాత్మ సాక్షి. నాతల్లి యశోద సాక్షి. ప్రేమయుండు తావున కపటమునకు స్థాన ముండదు. కర్మేంద్రి యములకెటుల రసజ్ఞానము లేదో, అటులే సకాములగువారు మహర్షు లైనను నిర్గుణబ్రహ్మానందమును బొందలేరు. జ్ఞానేంద్రియములు రసా నుభూతిని బొందినటుల శమదమాది గుణములు గలవారు బ్రహ్మానంద మును బొందుదురు. ప్రేమతో తుల్యమగు వస్తువు వేరొకటిలేదు. ఖాండీర

వనమందు మన కల్యాణము జరిగెను. ఆనందానుభూతిని పొందియు న్నాము? ఆ రసానుభూతిని మరల మరల పొందుదుము. క్షీరమునకు శ్వేతవర్ణమువలె, చంద్రునకు వెన్నెలవలె, మనము అవిభాజ్యులము. మనలను ఎవ్వరు భేదదృష్టితో చూతురో వారికి బ్రహ్మప్రాప్తి గలుగదు" అని ఓదార్చి రాధాదేవిని కౌగిలించుకొని అనుమతి పొంది రథమును ఆరోహించెను.

గోపికలు రథమును చుట్టుముట్టిరి. కృష్ణాయత్తచిత్తలైన వారి నెవరు అడ్డుకోగలరు? వారు లజ్జను వీడిరి. సారథిని నేలపై బడద్రోసిరి. అశ్వములను బెత్తములతో బాదిరి. రథచక్రములను విఱుగదన్నిరి. అక్రూరుని క్రిందికిలాగి బాదుచుండ గోపికల గాజులు ముక్కలయ్యెను. వారు కోపోద్రిక్తలై అక్రూరునితో "ఓ క్రూరుడా! పరమాత్మను మాకు దక్కకుండ జేయుదువా? నిన్ను చిత్రవధ చేసినను పాపము లేదు. మా హృదయములలో చిచ్చుపెట్టుదువా? నీవు నందకిశోరుని మాకు అప్ప గించనిచో మధురానగరము దగ్ధమగును. అందు నీవు ఆహుతి కాక తప్పదు" అని తూలనాడుచు రభస చేసిరి.

బలరామకృష్ణులు నిశ్చేష్టులైరి. మౌనము దాల్చినచో అక్రూరుడు బ్రతుకడు. పరమాత్మ గోపికలతో "వ్రజవనితలారా! రాయబారిని హింసించుట న్యాయమా? దానివలన చేకూరు మేలేమి! అక్రూరుడు నా భక్తుడు. నా శ్రేయోభిలాషి. కంసుని కొలువులో నున్నను నన్ను ప్రేమించు వారిలో అగ్రగణ్యుడు. కంసుని సంహరించుటకే మమ్ములను మధురానగరికి గొనిపోవుచుండెను. అట్టి నిరపరాధిని హింసించి వ్రజము నకే కళంకము దెత్తురా? ఆవేశము అవధులుదాటిన అనర్థము సంప్రాప్త మగును" అని హితము పలికెను. గోపికలకు జ్ఞానోదయ మయ్యెను. తమ తప్పిదమును మన్నింపుమని వారు పరమాత్మను అక్రూరుని అర్థించిరి.

అక్రూరుడు వ్రజవనితలతో "మీరు కడుంగడు మంచివారు. క్రూరుని కొలువుసేయు నాకు తగినశిక్ష విధించితిరి. మీ ఆవేదన నాకు అవగత మయ్యెను. కంస సంహారము జరిగిన పిమ్మట పరమాత్మను బృందావనమునకు గొనితెచ్చు బాధ్యత నాదే. నా పలుకుల విశ్వసింపుడు

విభీషణుడు శ్రీరామచంద్రమూర్తిని శరణుజొచ్చి, రావణ సంహారమునకు తోడ్పడెను. నేను పరమాత్మ పదాశ్రయుడను. కంస సంహారమున కెదురుచూచుచున్నాను. మధుర కేగుటకు దయతో దారి యొసగుడు" అని చేతులు జోడించి ప్రార్థించెను.

గోపికలు ప్రక్కకు తొలగిరి. పరమాత్మ రథమును చక్కబరచి, అశ్వములను చేతితో నిమిరి రథపతాకము సరిచేసెను. అంతట బలరామ కృష్ణులు, అక్రూరుడు రథము నధిరోహించిరి. సారథి తోదనముతో రథాశ్వముల నదలించెను. శరవేగముతో రథము ముందుకు దూసికొనిపోవు చుండెను. రథము, రథధ్వజము, రథచక్రధూళి కనబడునంతవరకు గోపికలు చూచి పిమ్మట మూర్ఛిల్లిరి. వారు కొంతతడవునకు తెప్పరిల్లి తమ తమ నెలవులకు జనిరి. వారికి సర్వము శూన్యముగ గన్పట్టెను. గోపికలు బిగ్గరగ నేడ్చిరి. గోమాతల, లేగదూడల కనులు చెమ్మగిల్లెను. అవి పసిరిక మేయుట మానెను. నందయశోదాదేవుల దీనావస్థ వర్ణనాతీతముగ నుండెను. యశోదాదేవి విచారదేవతవలె గన్పట్టెను.

రథము మధురానగరపు పొలిమేరలలో ప్రవహించుచున్న యమునాతీరమునకు చేరెను. బలరామకృష్ణుల యమునానతీరమునకు చేరెను. బలరామకృష్ణులు యమునాసలిలమున గ్రోలి రథముపై ఆసీనులైరి. అక్రూరుడు యమునానదిలో గ్రుంకులిడుచుండ అందు బలరామ కృష్ణులు కన్పించిరి. ఆయన చకితుడై పైకిలేచెను. రథముపై బలరామ కృష్ణులు కొలువుదీరి యుండిరి. మరల అక్రూరుడు నదిలో మునిగెను. సహస్రఫణులతో తామరతూడువలె నుండు ఆదిశేషుడు కన్పించెను. వానిపై అష్టదళపద్మము, అందు రాధాకృష్ణులు దివ్యముగ ప్రకాశించు చుండిరి. అదృశ్యమును చూచి అక్రూరుడు పరవశుడయ్యెను. ఆయన హృదయము ద్రవించెను. నేత్రములు చెమ్మగిల్లెను. అక్రూరుడు శ్రీకృష్ణపరమాత్మను స్మరించుకొని స్తోత్రముచేయ దొడంగెను.

## అక్రూరస్తవము

"హే రాధాపతే! ప్రపంచమునకు హేతుభూతమైన వాడవు నీవే! కాలకాలమునకు ఆధారము నీవే. శ్రీమన్నారాయణమూర్తివి నీవే. నీ

నాభికమలము నుండియే బ్రహ్మ ఆవిర్భవించెను. అహంకారము, మహత్తత్త్వము, అవ్యక్తము, మనస్సు, ఇంద్రియములు, సకలవిషయములు నీ స్వరూపమే. నీవు ఆద్యుడవు. గుణాతీతుడవైన నిన్ను గుణావృతు లగు జీవులు కనుగొనజాలరు. వేదమార్గము ననుసరించినవారికి భక్తి నేత్రములు గలవారికి నీవు కన్పింతువు. కర్మయోగులు నిన్ను యజ్ఞ రూపునిగ యజించుచున్నారు. జ్ఞానులు నిన్ను శ్రీమన్నారాయణునిగ గ్రహించి ధ్యానించుచున్నారు. రుద్రరూపముగ నుండునది, తదితర దేవతలుగ నుండునది నీ స్వరూపమే. మతభేదములు మతిభేదముతో వచ్చినవే. ఉన్నది నీవు ఒక్కడవే. ప్రకృతి అనునది విడిగలేదు. ప్రకృతి గుణములు నీ స్వరూపమని తెలిసినచో వాటిని విడువ నక్కర లేదు. ఈ విషయము నెఱుంగక నేను మానవుడను, నేను పక్షిని, నేను పశువును అని తలచుచుందురు. విరాట్స్వరూపుడవు నీవే. మేడిపండులో పురుగులవలె బ్రహ్మాండము లన్నియు ఒకదాని కొకటి తెలియక నీలోనే కదా తిరుగుచుండుట!

నీ పాదారవింద సేవయందు బుద్ధిపుట్టుట నీ అనుగ్రహముచేగదా! దేవేంద్రునకు త్రైవర్గికసంపత్తిని సమకూర్చితివి. బలిచక్రవర్తికి నిన్నే యొసగితివి. అట్టి నీకు నేను ఏమి ఈయగలను? నాకు నీవే శరణము. హృదయపూర్వక ప్రణామముల నందజేయుచున్నాను. నీవు నన్ను గ్రహించి నీ గుణగానము చేయుచు, ఎల్లవేళల నా నేత్రములు నీ దివ్యమంగళ విగ్రహము దర్శించునట్టి భాగ్యమును ప్రసాదింపుము. పరిపూర్ణతమావతారా! వ్రజకిశోరా! దేవకీనందనా! పాహిమాం పాహిమాం రక్షమాం రక్షమాం" అని అక్రూరుడు స్తుతించెను. అనుష్ఠానము పూర్తియైన పిమ్మట ఆయన బలరామ కృష్ణులకడకు వచ్చెను.

రథము బయలుదేరెను. సాయంసమయమునకు వారు మధురా నగర పరిసరములలో నున్న ఉపవనమందు నందాదులను కలసికొనిరి. బలరామకృష్ణులు అక్రూరునితో 'నీవు రథమును గైకొని ముందుమధురా నగరమునకు జనుము, మేముకూడ అచటికి వత్తుము' అనిరి.

అక్రూరుడు పరమాత్మతో "కృష్ణా! ఇచట మిమ్ములను వదలి నేను స్వగృహమునకు మరలుట అసంభవము. మీ రిరువురు నా మందిరమునకు విచ్చేసి, మీ పాదరజముచే మా పితృదేవతలను తరింపజేయుడు. నా గృహము పావనమగును. పంచయజ్ఞదేవతలు కడు సంతసింతురు. నీ పాదాబ్జమందు ఉద్భవించిన గంగను శంకరుడు శిరమున దాల్చెను. ఆ గంగచే గదా సగరపుత్త్రులు తరించినది! నీ పాదోదకము నా కొసగి నన్ను రక్షింపవా!" అని ప్రార్థింప శ్రీకృష్ణుడు "తాతా! నీ గృహమునకు తప్పక వత్తును. కాని ఇది సమయము గాదు. సకలజనులు కంసుని వలన బాధింపబడుచున్నారు. వారి బాధలు తీర్చువరకు విందారగింపలేను. కంస సంహారము జరిగిన పిమ్మట పరివారసమేతముగ నీ మందిరమునకు వచ్చి నీ సపర్యల స్వీకరింతును" అని మాట యొసగెను. పరమాత్ముని అనుమతినొంది అక్రూరుడు తన మందిరమునకు జనెను.

## నగర దర్శనము

ఆ రాత్రి విశ్రాంతి గైకొని మరునాడు అపరాహ్ణ సమయమున బలరామ కృష్ణులు మధురానగరమును చూచుటకు బయలుదేరిరి. 'అప్రమత్తులై యుండుడు' అని నందరాజు వారిని హెచ్చరించెను.

వారిని జూచుటకు మధురానగర వాసులు ముచ్చట పడుచుండిరి. రాజవీథికి ఇరుగడల ఆకసమంటు స్వర్ణప్రాసాదములు రత్నఖచితములై రమణీయముగ గన్పట్టుచుండెను. అందు స్వర్ణ, రజత, తామ్రనిర్మితములైన గంపలు గలవు. రాజవీథి కస్తూరి, పునుగు మున్నగు సుగంధ ద్రవ్యములతో గలిపిన పన్నీటిని జల్లుటచే పరిమళము నలుగడల గుబాళించుచుండెను. రంగవల్లులతో రాజవీథి కళకళలాడుచుండెను. జలదుర్గములలో నిర్మలోదకము సమృద్ధిగ నుండెను. నగరమందలి పోకచెట్లు శోభాయమానముగ నొప్పారుచు నిత్యకల్యాణము పచ్చతోరణమువలె నుండెను.

గోపకులు రామకృష్ణుల వెంట నడచుచుండిరి. నగరవాసులు రాజవీథికి ఇరుగడల బారులుదీరిరి. ప్రాసాదాగ్రభాగములలో అంతఃపుర

స్త్రీలు వేడుకతో నిరీక్షించుచుండిరి. కొంతతడవునకు జనసందోహమందు కోలాహలము హెచ్చెను. గోపబాలుర వేషములతో బలరామ కృష్ణులు చిరునవ్వులు చిందించుచు, మందగమనముతో వచ్చుచుండిరి. నగర వాసులు వారినిచూచి ముగ్ధులైరి. బలరామ కృష్ణులపై వారు పుష్పవృష్టి కురియించిరి. వారి దివ్యతేజస్సును గాంచి అచ్చెరు వొందిరి. ఆ సందడిలో స్త్రీలు అలంకార వస్తువులను విడిచి వచ్చిరి. ఒకేకంటికి సగమే కాటుక పెట్టుకొనిరి. సగమువస్త్రమును ధరించిరి. ఆభరణములను తారు మారుగ అలంకరించుకొనిరి. ఒకచెవికి మాత్రమే దుద్దులు పెట్టుకొనిరి. అభ్యంగన స్నానమునకు స్వస్తి పలికిరి. పసికందులకు పాలిచ్చుటగూడ మానివేసిరి. పరమాత్మకొరకై వారి మనస్సులు వేగిరపడ జొచ్చెను. ఆయన దర్శనభాగ్యము కొరకు త్రొక్కిసలాడుచుండిరి. ఎటు చూచినను ప్రజాసందోహమే! పరమాత్మ మధురా నగరవాసులపై కరుణాకటాక్ష వీక్షణముల బరపుచుండ వారు పరవశించిరి. కొందరు స్త్రీలు "శ్యామ సుందరుని దివ్యమంగళ విగ్రహము సర్వులను సమ్మోహితుల చేయు చున్నదే. ఏమి ఆ చిలిపిచూపులు! ఏమి ఆ హావభావ విలాసములు! అందమే మూర్తీభవించెనేమో! బృందావనము ధన్యమైనది. పరమాత్మ అధరామృతమును చవిజూచిన ఆ వ్రజవనితలు ఎంతటి అదృష్టవతులో" అని మురియుచుండిరి.

భూసురోత్తములు వారి కెదురేగి శ్రీగంధమును బూసిరి. మంచి ముత్తెములతో మిశ్రితమైన పరిమళ పుష్పములను జల్లిరి. బలరామ కృష్ణులు మందహాసము చేసిరి. అంతఃపురస్త్రీలు పాలు, పెరుగు, వెన్న కడవలను వారి కందించిరి. పుష్పమాలికలతో నలంకరించిరి. మధుర పానీయములు, పరిపక్వమైన ఫలముల నొసగిరి. కర్పూరనీరాజన మొసగిరి. 'శ్రీకృష్ణపరమాత్మకు జై, బలరామస్వామికి జై' అని దిక్కులు ప్రతిధ్వనించునటుల నినదించిరి. ఆ వార్తను చారులు కంసుని చెవిని వేసిరి. వాని హృదయము ఝల్లున మండెను.

## రజకునకు శాస్తి

కంసునికడ రజకు డొక్కడు గలడు. వాడు రాజమందిరమునకు బట్టలు గొనిపోవుచు, బలరామ కృష్ణ గోపకుల కంటబడెను. వల్లెప్రజకు పట్టుగుడ్డలపై మోజు గలిగెను. అది గ్రహించిన పరమాత్మ రజకునితో 'ఓరీ! ఆబట్ట లెవరివి?' అని అడిగెను. రాజుగారివని వాడు చెప్పెను. పరమాత్మ చాకలివానితో "ఓయీ! మేము కంసుని మేనల్లుళ్ళము. వాటిని ధరించుటకు మాకు అర్హత గలదు. అవి నీవు మా కొసగిన నీకు మేలు గలుగును, స్వర్గము ప్రాప్తించును" అనెను.

రజకుడు స్వామి సేవాపరాయణుడు. వివేకహీనుడు. పరమాత్మ ఆ బుడుతడే అని ఊహించలేకపోయెను. సామాన్యగోపాలుడని అ చాకలి తలపోసి "ఇవి రాజులు ధరించు అమూల్యాంబరములు. మీ రెన్నడైన ఇట్టి బట్టలు చూచితిరా? కౌపీనము ధరించు గోపకులకు రాజుగారి వస్త్రము లపై మోజు గలిగెనా? కంసమహారాజు ప్రతాపమును వినలేదేమో? బ్రతుకు మీద ఆపయున్నచో మీ దారిని మీరు పొండు" అని హేళన చేసెను.

పరమాత్మ శ్రీహస్తముతో వానిదౌడ వగుల గొట్టెను. చాకలిశిరము నేలపై బడెను. అందుండి దివ్యతేజస్సు బయలుదేరి పరమాత్మలో లీన మయ్యెను. ఆ దృశ్యము చూచి గోపకులు కడు సంతసించిరి. చాకలి మూటలోని మేలైన ఉడుపులను బలరామకృష్ణులు ధరించిరి. కొన్నిం టిని కొందరు గోపకులు దాల్చిరి. నగరవాసులు చాకలికి తగినశాస్తి జరిగినదని సంతసించిరి.

## నేతగాడు

బలరామకృష్ణులు కొంత దవ్వేగునప్పటికి బట్టలునేయు నేతగాడు కనుపట్టెను. వారిని చూడగనే నేతగానికి ప్రేమానురాగములు పెల్లుబికెను. గోపబాలురు దైవసమానులని వానికి తట్టెను. తనకడనున్న వాటిలో అందమైన గుడ్డలను దీసి బలరామకృష్ణులను అలంకరించెను. వారికి ప్రణమిల్లెను. నేతగాని కనులనుండి రాలిన ఆనందాశ్రువులు పరమాత్మ

పాదకమలములు స్పృశించి ముక్తి ప్రసాదింపుమని వేడుకొనినవి. వాని భక్తిని ప్రశంసించుచు "ఓయీ! నీవు బ్రతికినన్నాళ్లు దేహపటుత్వము గలిగి భక్తితో నన్ను సేవించి కడకు నా సారూప్యము నొందుదువు" అని వర మొసగెను.

## సుదాముడు

సర్వాలంకారభూషితులైన బలరామ కృష్ణులు ఏనుగు గున్నలవలె రాజవీథిని సాగిపోవుచుండిరి. మార్గమధ్యమున సుదాము తను మాలాకారుని గృహమును వారు ప్రవేశించిరి. సుదాముడు కృష్ణ భక్తుడు. సాక్షాత్ పరమాత్మయే తన ఇంటిని పావనము చేయుటకు స్వయముగ విచ్చేసెనని పరవశించుచు సుదాముడు బలరామకృష్ణుల పూలపాన్పుపై గూర్చుండబెట్టి అర్ఘ్యపాద్యాదుల నొసగి వినమ్రుడై పరమాత్మతో "స్వామీ! నేటికి నాపై అనుగ్రహము గలిగినదా! అన్నదమ్ముల రాక నాకెంతో ఆనందదాయకము. తాము కల్పవృక్షమువంటి వారు. భూభారమును బాపుటకు అవతరించిన అవతారమూర్తులు. ఇదిగో పుష్పమకరందము. ఆస్వాదింపుడు" అని అందించుచు, రంగురంగుల మంచి పుష్పమాలికలతో బలరామ కృష్ణులను అలంకరించెను. పరమాత్మ మహానందభరితుడై వానిని వరము గోరుకొమ్మనెను. అంతట మాలాకారుడగు సుదాముడు-

> "నీ పాదకమల సేవయు
> నీ పాదార్చకులతోడి నెయ్యము నితాం
> తాపారభూతదయయును
> తాపసమందార! నాకు దయసేయగదే!"

అని ప్రార్థించెను. పరమాత్మ సంప్రీతుడై వానితో "సుదామా! నీభక్తి అచలమైనది. నా సారూప్యము నొందెదవు" అని అభయ మొసగెను. 'నిన్ను వంశపరంపరగ మహాలక్ష్మి వదలకుండు గాక!' అని వానిని బలరామస్వామి ఆశీర్వదించెను.

## కుబ్జ

కుబ్జ కంసుని దాసి. ఆమె భూదేవి అంశ యని, భారముచే వంగియుండెనని అందురు. గూనిదగుటచే ఆమెను కుబ్జ అందురు. ఆమె నెమ్మోము చంద్రబింబమువలె నుండెను. యౌవనవతి. పసిడి పాత్రలో సుగంధలేపనముల నింపుకొని కంసుని కడ కేగుచుండెను. ఆమెకు మార్గమధ్యమున బలరామకృష్ణులు కనబడిరి. పరమాత్మనుచూడ గనే కుబ్జకు ప్రేమ పెల్లుబికెను. ఆమె తదేకదృష్టితో శ్రీకృష్ణుని చూచుచు నిశ్చేష్టురా లయ్యెను. పరమాత్మ మందహాసము చేయుచు కుబ్జతో "నీవు ఎవతెవు? ఎచటి కేగుచుంటివి? ఆ పసిడిగిన్నెలో ఏ మున్నది?" అని ఆప్యాయముగ పలుకరించెను.

కుబ్జ పరమాత్మతో "అయ్యా! నిన్నుచూడ ఈ రెండు కన్నులు చాలకున్నవి. సౌందర్యరాశివలె తోచుచున్నావు. తమభుజములు ఏనుగు తొండములవలె నుండి నన్ను మిక్కిలి ఆకర్షించుచున్నవి. నీవంటి రసికుని చూచుటచే నా హృదయము పరవశించుచున్నది. ఈ సుగంధ లేపనమును స్వయముగ నీ దేహమునకు పూయుదును. ఆహ్లాదకరముగ నుండును. నేను కంసుని పరిచారికను. కంసరాజుకడకు పోవుచుంటిని" అని ప్రేమయొలుక విన్నవించుకొనెను. బలరామస్వామి గోపకులు నవ్వుకొనిరి.

పరమాత్మ కుబ్జను సమీపించెను. ఆమె శ్రీకృష్ణునకు సుగంధలేపనము పూసెను. పాదకమలముల కన్నులకద్దుకొని తన్నుతాను మరచెను. పరమాత్మ కుబ్జ ప్రేమానురాగములకు మెచ్చి ఆమె వక్రత్వము పోగొట్టుటకై నృత్యము చేయ దొడంగెను. కుబ్జ గూడ నృత్యము చేయుచుండెను. పరమాత్మ కుబ్జ కడకేగి ఆమె పాదములపై తన పాదముల నుంచి త్రొక్కుచు, ఎడమచేతిని ఆమె నడుమునకుచుట్టి కుడిచేతితో ఆమె చుబుకముబట్టి పైకెత్తెను. కుబ్జ వంకరలు అదృశ్యమై అప్సరసవలె నుండెను. అది శ్రీకృష్ణుని లీలయని ఎల్లరు సంతసించిరి.

కుబ్జ తన సౌందర్యము చూచుకొని తానే ముగ్ధురాలై పరమాత్మతో "నందకిశోరా! నీ దయకు పాత్రురాలైతిని. ఈ దేహము నీ సేవకే వినియోగింతును. నీవే నా నాథుడవు. నీవు నా హృదయము హరించితివి. నిన్ను విడిచి నేను బ్రతుకలేను. నా గృహమునకు విచ్చేసి నన్ను ఆనందింపజేయుము. నేను అనాఘ్రాతపుష్పమును. ఈ తనువు నీదే. నీవు ప్రసాదించినదే" అని పరమాత్మ అంగవస్త్రమును పట్టిలాగెను. నగర వాసుల కోలాహలము ఆకస మందెను. కుబ్జ కోర్కె సమంజసమని నగర వనితలకు తోచెను. కంస సంహారానంతరము తప్పక వత్తునని పరమాత్మ కుబ్జకు అభయ మొసగెను. ఆ మోహనమూర్తిని విడువలేక కుబ్జ వెంబడించెను.

బలరామకృష్ణులు కొంత దవ్వేగునప్పటికి వివిధ వస్తువులతో కలకలలాడు అంగళ్ళు కనబడెను. వర్తకులు వారిని సగౌరవముగా గొనిపోయి అమూల్యాభరణములు, పట్టుపుట్టములు, విలాసవస్తువులు బహూకరించుచు, అయ్యలారా! కంస సంహారమునకు అరుదెంచిన వీరాగ్రేసరులుగ కనబడుచున్నారు. మధురానగర రాజ్యలక్ష్మి మిమ్ముల వరించుటకు సిద్ధముగ నున్నది. కంసుని పాలనలో మాకు మనశ్శాంతి కొరవడినది మా ధన, మాన, ప్రాణములకు భద్రత కఱవయ్యెను. తమ రాకచే మా కష్టములు గట్టెక్కునని గంపెడాశతో నుంటిమి ఇక మధురానగర వాసులను కాపాడు బాధ్యత మీదే" అని ప్రాధేయపడిరి. ఇక మీరెల్లరు నిర్భయముగ నుండవచ్చును అని పరమాత్మ వారికి అభయ మొసగెను.

రాజవీధిని బలరామకృష్ణులు బయలుదేరిరి. వణిక్ప్రముఖులు వారి వెంట నుండిరి. పరమాత్మ బలదామస్వామి మున్నగువారు ధనుర్యాగ శాలయందు ప్రవేశించిరి.

## ధనుర్భంగము

యాగశాలయందలి పూజామందిరమున వైష్ణవ ధనుస్సుండెను. అది పెక్కుపుట్ల బరువు. ఏడుతాళ్ల ప్రమాణము గలది. పాదప్రక్షాళన చేయకుండగనే పరమాత్మ ధనుస్సును పైకెత్తి నారి సారించెను ఆ ధ్వని భూనభోంతరాళముల ప్రతిధ్వనించెను. పరమాత్మ ఆకర్ణాంతము నారిని

లాగుటచే ధనుస్సు రెండు ముక్కలయ్యెను. ఆ శబ్దము బ్రహ్మాండమును దద్దరిల్ల జేసెను. కంసుని గుండె చెదరిపోయెను. శ్వేతఛత్రము నేల గూలెను. కంసుని పరివారము అస్త్రశస్త్రములతో బలరామకృష్ణులతో పోరు సల్పుటకు ఉద్యుక్తులైరి. ధనుఃఖండములు చేబూని బలరామ కృష్ణులు వారిని పారద్రోలిరి. నగరవాసులు దిగ్భ్రమ చెందిరి.

మరల బలరామకృష్ణులు బయలుదేరిరి. మధురానగర వనితలు వారిని తదేకదృష్టితో చూచుచు "ఏమి ఈ బాలకుల సౌందర్యము! ఎంత తడవు చూచినను తనివిదీరుట లేదు. ఈ చర్మచక్షువులు చాలకున్నవి. స్వప్నమందు సైతము వీరు కన్పించుట తథ్యము. బృందావనమందలి వ్రజవనితలు ఎంతటి అదృష్టవతులో! పరమాత్మను, బలరామస్వామిని మధురానగరమున నుండుడని మొరపెట్టుకొనవలెను. పరమాత్మ మన కోర్కెను అంగీకరించును. బృందావనమున ప్రకృతి రామణీయక మున్నది. మధురానగరము కేళీవిలాసకేంద్రము. వ్రజవనితలు చదువు సంధ్యలు లేనివారు. కామకళావిన్యాసముల నెఱుగనివారు. మధురానగర వనితలు సంగీత నృత్యములలో, కామకళలలో ప్రవీణలు. వ్రజవనితలలో అందగత్తెలు అరుదు. ఇట కొల్లలు. అందుచే పరమాత్మ నాకర్షించుట సాధ్యమే" అని తలపోయుచుండిరి.

బలరామకృష్ణుల సాహసకృత్యములను విని కంసుడు చకితు డయ్యెను. 'ధనుర్భంగము గావించుట మాటలా!' అనుకొనెను. వానికి దుర్నిమిత్తములు తోచుచుండెను. ఎడమకన్ను, ఎడమభుజము విరామ మెరుగక అదరుచుండెను. నీటియందును, అద్దమందును వాని శిరము వానికి కన్పించుట లేదు. జ్యోతిని చూచిన రెండుగ కనబడుచుండెను. నడచునపుడు కాలు కన్పించుట లేదు. ప్రాణధ్వని వినబడుట లేదు. స్వప్న మున కళేబరమును కౌగిలించుకొనినటుల తోచుచుండెను. ఎర్రని పుష్ప మాలికను ధరించినటుల అగపడుచుండెను. జుట్టు విరబోసికొనినట్లు నూనె నంటుకొని దిగంబరుడై దక్షిణదిక్కునకేగుచున్నటుల కనబడుచుండెను. తన పాపము పండినదని, తాను మృతినొందుట తథ్యమని తోచుటచే కంసుడు వివేకము కోల్పోవుచుండెను. వాని ధైర్యస్థైర్యములు బీటలు వారెను. ఆ రాత్రి కంసుడు కలవరముతో క్షణమొక యుగముగ గడపెను.

ఆ రాత్రి బలరామకృష్ణులు ఉద్యానవనమున నందాదులతో గలిసి కూర్చుండి పాయసాన్నము కడుపార మెక్కి నిదురవోయిరి. హంస తూలికాతల్పమున పరుండిన కంసునకు శ్రీకృష్ణపరమాత్మ వలుగడల నవ్వుచు కనబడుచుండెను.

## రంగస్థలము

కంసుడు సచివుల బిలిచి మల్ల క్రీడారంగస్థలమును సిద్ధపరుపుడని ఆజ్ఞాపించెను. గడియలలో రంగస్థల నిర్మాణము జరిగెను ప్రముఖులకు, ప్రజలకు ఉచితాసనముల నేర్పరచిరి. రంగురంగుల పతాకములు రంగ స్థలముచుట్టును గట్టిరి. అవి ఆకసమున రెపరెప కొట్టుకొనుచు, బలరామ కృష్ణులకు స్వాగత మొసగుటకు వేగిరపడజొచ్చెను. చాందినీలు వేసి ముత్యాలసరులతో నలంకరించిరి. సభామధ్యమున నెత్తైన రత్నమండ పము నిర్మింపబడెను. అందు ఇంద్రసింహాసనముపై కంసుడు ఆసీను డయ్యెను. వానిచుట్టును సేన నుంచుకొనెను. ఏ క్షణమున ఎట్టి ఉత్పా తములు సంభవించునో యని కంసుడు కలవరమందుచుండెను.

మంగళవాద్యములు మనోహరముగ మ్రోగుచున్నవి. బాణా సురుడు, నరకాసురుడు, కంసునిమామ జరాసంధుడు మున్నగు రాజ బంధువులు, శంబరాసురుడు మున్నగు ఆత్మసఖులు కంసునకు కానుకలు పంపిరి. నందుడు మున్నగు సామంతులు కానుకలు సమర్పించి ఉచితా సనముల నుపవిష్టులైరి. మల్లయుద్ధ ప్రవీణులగు చాణూర ముష్టికులు చక్కగ అలంకరించుకొని గురుసమేతముగ అట్టహాసముతో విచ్చేసిరి

గోపకులు వెంటనడువ బలరామకృష్ణులు రంగస్థలము సమీపించిరి. సింహద్వారముకడ కువలయాపీడము, దానిపై నెక్కిన మావటీడు అప్ర మత్తులై యుండిరి. బలరామకృష్ణులను చూడగనే మావటీడు కువలయా పీడమును వారిపైకి తోలెను. 'త్రోవ యొసగుము' అను పరమాత్మ పలుకు లను త్రోసిపుచ్చుచు మావటీడు ముందుకు వచ్చుచుండెను. 'నిన్ను, కువలయాపీడమును యమపురి కంపుదును' అని పరమాత్మ వానిని కటువుగ మందలించెను కువలయాపీడము తొండముతో పరమాత్మను పైకెత్తెను. ఆయన బరువు భరింపలేక గజరాజు పరమాత్మను విసరి

వేసెను. పరమాత్మ దాని కాళ్ళక్రింద దూరి నాలుగు స్తంభములాట నాడెను. ఏనుగునకు ఘ్రాణశక్తి యుండుటచే పరమాత్మ తిరిగిన వైపు నకు అదియును తిరుగుచుండెను. పరమాత్మ దానికి చిక్కుటలేదు. నంద కిశోరుడు కువలయాపీడము తోకపుచ్చుకొని ఊగుచుండెను. అది అలసి పోయెను. ఒక్కదెబ్బ చరచి పరమాత్మ దానికి చిక్కకుండ పరుగిడు చుండెను. అటుల కొంతతడవు దానిని ముప్పతిప్పలు పెట్టి కడకు దానికి చిక్కెను. అది పరమాత్మను కాళ్ళతో త్రొక్కుటకు యత్నించెను. దంత ములతో శ్రీకృష్ణుని పొడువబోవ అవి నేలలో గ్రుచ్చుకొనెను. పరమాత్మ అదృశ్యుడయ్యెను. రోషాయతనేత్రుడై వచ్చుచున్న గజరాజు తొండము పరమాత్మ దొరకపుచ్చుకొని దానిని గిరగిరత్రిప్పుచు నేలపై విసరికొట్టెను. ఘీంకారవములుచేయుచు కువలయాపీడము అసువుల బాసెను. పరమాత్మ గజరాజు దంతము నొకదానిని ఊడబెరికి దానితో మావటివానిని సంహ రించెను. రెండవదంతమును బలరామస్వామి ఊడబెరికెను. కువలయా పీడమునుండి దివ్యతేజస్సు వెలువడి పరమాత్మలో లీన మయ్యెను.

ఆ దృశ్యముచూచి భయవిహ్వలులై సింహద్వారముకడ కావలి యున్న రక్షకభటులు పారిపోయిరి. స్వేదబిందువులతో రక్తపు మరక లతో తడిసినవారై బలరామకృష్ణులు దంతముల చేబూని చాణూర ముష్టి కుల కడకు అరుదెంచుచుండిరి. వారిని చూచి కంసుడు కలవరమొందు చుండెను. ప్రేక్షకులదృష్టి బలరామకృష్ణులపై బడెను. కోలాహలము హెచ్చెను. సదస్యులు గావించు కరతాళధ్వనులు ఆకస మంటెను.

పరమాత్మ ప్రేక్షకులకు వివిధ రూపములలో కనబడెను. మల్లులకు రౌద్రరసముగ, మథురానగర వనితలకు శృంగార రసాధిదేవుడుగా, శ్రీదాముడు మున్నగు గోపకులకు హాస్యరసాధిపతిగను, నందాదులకు దయాసముద్రుడుగను, శత్రురాజులకు వీరరసముతో యమునివలె, కంసునకు మృత్యుదేవతవలె భయానకరసముతోను, సామాన్యులకు ఆశ్చర్యరసముతోను, ప్రాకృతులకు బీభత్సరసముతోను, గోపకులకు, యాదవులకు ప్రేమభక్తిరసముతోను. జ్ఞానులకు శాంతరసముతోను పర మాత్మ గోచరించెను. రసములు తొమ్మిదియైనను ప్రేమ భక్తిరసము పదియవ రస మయ్యెను.

నగరవాసులు చంద్రచకోర న్యాయముగ బలరామ కృష్ణులను చూచి ఆనంద మొందుచుండిరి. నేత్రపుటములు పెద్దవిచేసి వారి ముఖ కమలములందలి అమృతము సేవించుచుండిరి. కుబ్జ సుదాముడు పర మాత్మకు అలదిన సుగంధలేపనముల సౌరభము నలుదిశల వ్యాపించు చుండెను. బలరామకృష్ణుల చిరునవ్వులు పలుకులు దేహదార్ఢ్యములుచూచి జనులు అచ్చెరు వొందుచు "ఈతడేనా ! గోవర్ధనగిరిని చిటికెనవ్రేలిపై నిలబెట్టినది? కేశి, ధేనుకాసురుడు మున్నగు దానవవీరులను పరిమార్చి నది ఈ వీరాగ్రేసరుడేనా? సహస్రఫణములు దాల్చిన కాళీయుని మర్దిం చినది ఈ శూరుడేనా? శ్రీకృష్ణుడు అడవి కేగినచో గోశాలలలో గోవులు కన్నీరు కార్చెడివట, పరమాత్మ అడవినుండి మరలినప్పుడు అడవిమృగ ములు అశ్రుధారలు రాల్చెడివట. మురళీరవమును వినినంతనే అవి ఉల్లాసముతో ఊరకలు వేయుచుండెడివట. ఈ మహనీయుని వలన యదువంశ కీర్తిచంద్రికలు దేదీప్యమానముగ వెలుగొందుచున్నవి" అని పెక్కువిధముల కొనియాడుచుండిరి.

చాణూర ముష్టికులు బలరామ కృష్ణులతో ప్రేక్షకుల సమక్షమున "తాము బలపరాక్రమములు గలవారు. సదస్యుల సమక్షమున బలా బలముల ప్రదర్శించుటలో తప్పులేదు" అనిరి.

పరమాత్మ వారితో "మల్లయోధులారా! మీ పలుకులు మీకు తగి నట్లున్నవి. మాపై మామకు ప్రేమాభిమానము లుండుటచే మమ్ముల నిటకు ఆహ్వానించెను. పరమభాగవతులను అనుగ్రహింతుము. మేము బాలురము. మీరు మహాబలులు. పెక్కు బహుమతులందుకొనిన పరాక్ర మోపేతులు. అధర్మయుద్ధమును సదస్యులు మెత్తురా!" అని అనెను.

చాణూరుడు పరమాత్మతో "నీవు బాలుడవు కావు. కిశోరుడవుకావు. బలులలో మహాబలుడవు. నీవు కువలయాపీడమును కడతేర్చితివి. పాలు, పెరుగు, వెన్న, మీగడలు మెక్కి బలాఢ్యుడవైతివి. అందుచే ఇది ధర్మ యుద్ధమే. నీవు నాతో యుద్ధము సేయుము. మీ అన్న బలరామస్వామి మా అన్న ముష్టికునితో పోరాడును" అని ప్రేరేపించెను.

బలరామకృష్ణులు నవ్వుచు మల్లయుద్ధమునకు సమ్మతించిరి. సద స్యులు ఆందోళనతో చూడసాగిరి. అది కంసుని కపటోపాయమని ఊహ ించిరి. చాణూర-కృష్ణులు, బలరామ-ముష్టికులు గజరాజులవలె తార సిల్లిరి. ఒకరి నొకరు గ్రుద్దుచుండిరి. గిరగిర త్రిప్పుచుండిరి. ఎగురు చుండిరి. బలరామకృష్ణులు స్వేదబిందువులతో తడిసిరి. వారి మోమున మందహాసము, పెదవులపై చిరునవ్వులు తొణికిసలాడుచుండెను.

నగరవనితలు ఇటుల తలపోయుచుండిరి- "ఇది ధర్మయుద్ధము గాదు కంసుని సమక్షమున ఇంతటి అకృత్యము జరుగుచుండెను. దీని ఫలితము ఊరకపోవునా? పరమాత్మను క్రీడాస్థలమున చూచుచుంటిమి. వ్రజవనితల భాగ్యమే భాగ్యము. బలరామస్వామితో గూడి పరమాత్మ గోవుల కాచెను. గోపబాలురతో ఆటలాడెను. గోపికలతో రాసక్రీడ సలి పెను గోపిక లెంతధన్యలు! యశస్సునకు, సిరిసంపదలకు, జ్ఞానవైరా గ్యములకు నిలయమగు వస్తువు పరమాత్మ రూపమున అరుదెంచెను. పాలు పిదుకుచు ధాన్యము దంపుచు, పెరుగు చిలుకుచు, గోమయముతో అలుకుచున్నప్పుడు, బిడ్డలను సముదాయించుచున్నపుడు 'రాధే గోవింద కృష్ణ' అనుచుందురట. గృహములలో కసవు ఊడ్చునపుడు, నీరు చల్లు నపుడు సూక్ష్మక్రిములు నశించును. భగవన్నామముతో చేయు పనుల వలన పాపములు నశించును గృహకృత్యములలో మున్నను వ్రజవని తలు సదా భగవద్ధ్యానము దక్క అన్య మెరుగరట. అట్టి బుడుతలను మల్లులు బాధించుట చూడలేకుంటిమి. మనము అదృష్టవతుల మగుచో బలరామకృష్ణులకు జయమగు గాక!" అని గంపెడాసతో నిరీక్షించు చుండిరి.

నందరాజుకనుల నీరు గ్రమ్మెను. గోపబాలురు ఉత్కంఠతో నుండిరి. ప్రేక్షకులు బలరామకృష్ణుల జయమును కాంక్షించుచుండిరి. పరమాత్మ చాణూరుని బలముగ మోదెను. వాని దేహము గట్టిపడెను. వాడు ఉల్లాసముతో నెగురుచు పరమాత్మ వక్షఃస్థలమున బలముగ పొడి చెను. ఆ ప్రేటునకు పరమాత్మ చలింపలేదు. ఆయన చాణూరుని బాహు వులు పట్టుకొని గిరగిర త్రిప్పి నేలపై విసరికొట్టెను. చాణూరుడు మృతి

నొందెను. బలరామస్వామి అరచేతితో ముష్టికుని వీపుపై పొడిచెను. వాడు రక్తము గ్రక్కుచు అసువుల బాసెను. వారి సోదరులు బలరామ కృష్ణులపై శారసిల్లి చాణూరముష్టికులవలె మడసిరి. వారినుండి వెలు వడిన తేజస్సులు పరమాత్మలో లీనమయ్యెను. మల్లులగురువు కన్పింప లేదు. ప్రేక్షకుల కరతాళధ్వనులు మిన్నంటెను. శ్రీదాముడు మున్నగు గోపకులు బలరామకృష్ణుల భుజముల పైనెత్తుకొని జయజయధ్వానములు గావించిరి. మధురానగర వనితల వదనములు వికసించినవి. వదన్యులు ఆనందడోలికలలో నూయల లూగుచుండిరి. నందరాజు పరవశించెను. తన బిడ్డలు అసహాయశూరు లని గర్వించెను.

## కంసవధ

కంసుడు క్రోధోద్రిక్తమూర్తియై "రక్షకభటులారా ! బలరామ కృష్ణుల పారద్రోలుడు. వసుదేవుడు క్రూరుడు, వానిని కరవాలముతో ఖండఖండములుగ ఖండించుడు. నందుడు దుష్టుడు. అతడు ఈ బాలుర దాచెను. వానిని స్తంభమునకు కట్టివేయుడు. నా తండ్రి ఉగ్రసేనుని శిరశ్ఛేదము చేయుడు. ఈ కుట్రయందు వా రందరు భాగస్వాములే. శత్రువులను సమూలముగ ఛేదింపుడు" అని ఆవేశముతో ఆజ్ఞాపించెను. ఏమి జరుగునో యని ప్రేక్షకులు తదేకదృష్టితో చూచుచుండిరి పరమాత. కంసునిమీదికి లంఘించెను. మృత్యుదేవత ఆ రూపమున తనను గొని పోవుచున్నదని కలవరముతో కంసుడు కరవాలము దూసి డాలును చేబూ నెను. పరమాత్మ కంసుని జుట్టుపట్టుకొని "ఓరీ! నా తలిదండ్రులను చెర బెట్టిన క్రూరకర్ముడవు. వారి సప్తసంతతిని సంహరించిన పిరికిపందవు. యాదవులను హింసించుటకు కారణమేమి? కపటోపాయముతో మమ్ముల వధించుటకై పూనుకొంటివా ? నీ పరాక్రమములు ఇపు డేమైనవి ? నిమ్ము సంహరించుటకు నీ రాజధానీనగరమునకే వచ్చియుంటిమి. వీరు నకు కదనరంగమే విహారస్థలము. బాలురమని మమ్ము హేళనచేసితివి. కయ్యమునకు కాలు దువ్వితివి. పారిపోకుము. వెన్నుచూపి పారిపోవుట కన్న వీరస్వర్గ మలంకరించుట వీరాగ్రేసరుని లక్షణము. రమ్ము పోరుటకు సిద్ధముగ నుంటిమి" అని అధిక్షేపించెను.

కంసుని చిత్తస్థైర్యము బీటలు వారెను. కరవాలము, డాలు జారి నేలపై బడెను. మృతినొందుట తథ్యమని కంసుడు గ్రహించెను. శ్రీకృష్ణుడు సాక్షాత్పరమాత్మయే యని నిశ్చయించుకొనెను. అట్టి మహా పురుషునితో సమరము సేయుచు ప్రాణములు వీడుటవలన వీరస్వర్గము కరతలామలక మగునని విశ్వసించెను.

కంసుడు పరమాత్మతో "శ్రీకృష్ణా! వెన్నిచ్చి పారిపోవుటకు నేను వెర్రివాడను గాను. ప్రాణభీతిచే దేవకీవసుదేవులను బంధించితిని. వారి సప్తసంతానమును నా కరవాలమునకు బలి యొసగితిని. ఎందరో రక్క సుల బంపి నిన్ను కరతేర్పుమని కోరితిని. యదువంశీయుల నెందరినో చిత్రవధ చేసితిని. నా దుష్కృత్యములకు శిక్ష నేను అనుభవింప వలసి నదే, రమ్ము. సమరమునకు సిద్ధముగ నుంటిని" అని పరమాత్మతో తలపడెను. ఇరువురు గగనమున కెగసిరి. పరమాత్మ కంసుని గిరగిర త్రిప్పి నేలపై విసరికొట్టెను. వాడు చావలేదు. పరమాత్మ కంసునిజుట్టు పట్టుకొని నేలపై బడద్రోసి వాని వక్షఃస్థలముపై గూర్చుండెను. పర మాత్మ బరువును భరింపలేక కంసుడు ప్రాణములు వీడెను. వానికి కృష్ణ సాయుజ్యము లభించెను. దేవతలు పరమాత్మపై పుష్పవృష్టి కురియిం చిరి. పరాభవము భరింపలేక కంసుని సోదరులగు సునాముడు, సృష్టి, సుహృవు, దుష్టిమంతుడు, రాష్ట్రపాలకుడు, శంకుడు, అగ్రోధు అనువారు పోరికి సిద్ధపడిరి.

బలరామస్వామి ముద్గరము వారినందరిని తుత్తునియలు గావిం చెను. మధురానగరవాసులు బలరామకృష్ణుల బలపరాక్రమములకు అచ్చెరువొందుచు కంసబాధానివృత్తి కలిగినందుకు కడు సంతసించుచు ఆనందాతిరేకముతో 'శ్రీకృష్ణపరమాత్మకు జై, శ్రీబలరామస్వామికి జై' అని నినదించిరి. కంసుని సతుల దీనారావములు మిన్నంటెను. పర మాత్మ వారి నోదార్చెను. యమునానదీతీరమున మంచిగంధపుచెక్కలతో కంసునకు దహనసంస్కారములు సశాస్త్రీయముగ జరిగెను.

## బంధవిముక్తి

బలరామకృష్ణులు నందరాజు మున్నగువారు వెంటనడువ పరివారముతో దేవకీవసుదేవు లుండిన కారాగారమునకు జనిరి. తలిదండ్రుల సంకెలలు ఊడదీసిరి. బలరామకృష్ణులు వారికి ప్రణమిల్లిరి. దేవకీ వసుదేవులకు ఏమని ఆశీర్వదించవలెనో తోచలేదు. దైవాంశసంభూతుల నాశీర్వదించుట అపచారమని భావించుటచే ఆనందాశ్రువులు జాలువారుచుండ బలరామకృష్ణుల తనివిదీర వీక్షించుచుండిరి. వాత్సల్యభక్తి పరమాత్మకు ప్రీతికరమైనది. అందుచే వైష్ణవమాయను వారియందు ప్రవేశపెట్టెను. దేవకీ వసుదేవులు బలరామ కృష్ణుల కౌగిలించుకొని ముద్దాడుచు "నేటికి మిమ్ములను చూచు భాగ్యమబ్బినది. బాల్యక్రీడల దిలకించుటకు మేము నోచుకొనలేదు. ఆ యదృష్టము నందయశోదలకు, రోహిణీదేవికే దక్కినది. వారి ఋణము తీరునది కాదు" అని కృతజ్ఞత వెల్లడించిరి.

పరమాత్మ వారితో "మిమ్ముల చూచు భాగ్యము నేటికి అబ్బినది. తలిదండ్రులకు, తాతకు, గురువునకు, సోదరులకు, అభాగ్యులకు, సత్యవ్రతునకు, సతికి, సఖునకు, భక్తునకు ముదము గూర్పనివాడు జీవన్మృతుడు. సమయముకొరకు వేచియుండుటచే మీకు బంధవిముక్తిని గలిగించుటకు ఆలస్యమైనది. మన్నింప ప్రార్థన" అని పలుకుచు వారిచెంత కేగిరి. మాతృహృదయము పరవశించెను. వసుదేవుని స్థితియు నంతే. ఆయన నందరాజునకు కృతజ్ఞత దెలుపుకొనెను.

బలరామకృష్ణులు ఉగ్రసేనుని కారాగార విముక్తుని గావించిరి. ఆనందాశ్రువులు జాలువారుచుండ ఉగ్రసేనుడు బలరామ కృష్ణులను దగ్గరకు తీసుకొని వారి శిరముల నాఘ్రాణించెను. వారి సాహస కృత్యముల కీర్తించెను. కంసుని మృతికి వెతనొందెను. దేవకీ వసుదేవులు, బలరామ కృష్ణులు, నందరాజు మున్నగువారు ఉగ్రసేనుని ఓదార్చిరి.

మధురానగరవాసుల సమక్షమున ఉగ్రసేనునకు పరమాత్మ పట్టాభిషేకము జరిపెను. కంసునకు వెరచి వెళ్ళిన వారందరిని మరల పరమాత్మ మధురానగరమునకు రావించెను.

## విందులు, వినోదములు

మధురానగరము రంగురంగుల దీపకాంతులతో దేదీప్యమానముగ వెలుగొందుచుండెను. రాజప్రాసాదమున విందు నేర్పాటు చేసిరి. నగర ప్రముఖులను, ధనుర్యాగమునకు మల్లయుద్ధ ప్రదర్శనకు విచ్చేసిన నందరాజు మున్నగువారిని అహ్వానించిరి. ప్రధాన అతిథులు బలరామ కృష్ణులే. కుడిప్రైపు ఉగ్రసేన మహారాజు, దేవకీ వసుదేవులు, వామ పార్శ్వమున నందరాజు, ఉపనందులు, షడ్వృషభానులు ఆసీనులైరి.

వేదవిదులు చతుర్వేదముల పఠించుచు బలరామకృష్ణుల నాశీర్వదించిరి. పరిమళ పుష్పమాలికలతో అలంకరించి పన్నీరు చిలికిరి. సుగంధమును బూసిరి. నీరాజన మొసగిరి. మంత్రాక్షతలు బలరామకృష్ణులపై జల్లిరి.

విందు ప్రారంభ మయ్యెను. మధురాతిమధురమగు పానీయము లొసగబడెను. మృష్టాన్నములు, పిండివంటకములు వడ్డించిరి. మధుర ఫలములు ముందుంచిరి. గోఘృతము, గోదధిని విరివిగా గ్రుమ్మరించిరి. పరిమళమిశ్రితమగు తాంబూలముల నొసగిరి. నారద తుంబురులు మధురగానము చేసిరి. పేదసాదలకు, నగరవాసులకు అన్నదానము విరివిగా జరిగెను. శ్రీదాముడు మున్నగు గోపకులు పరవశించిరి. యశోద, రోహిణీదేవులు, వ్రజవనితలు, గోపబాలురు అందు పాల్గొనిన బాగుండెడిదని బలరామకృష్ణులు భావించిరి. సకలజనులు బలరామకృష్ణుల సాహస కృత్యముల వేనోళ్ళ పొగడిరి. మధురానగర చరిత్రలో అది యొక సువర్ణఘట్టమని గర్వించిరి.

## తిరుగు ప్రయాణము

నందరాజు, ఉపనందులు, షడ్వృషభానులు, గోపకులు బృందావనమునకు బయలుదేరుటకు సిద్ధమైరి. బలరామకృష్ణులు వారికి అమూల్యాభరణములు, పట్టుపుట్టములు కానుకగ నొసగిరి. యశోదాదేవికి, రోహిణీదేవుల కిమ్మని బంగరుసరిగంచు పట్టుచీరలను, రత్నఖచితసువర్ణాభరణములను నందరాజున కొసగిరి. అంతట బలరామ కృష్ణులు నంద

రాజు పాదములకు ప్రణమిల్లిరి. ఏమని ఆశీర్వదింపవలెనో నందరాజుకు తోచలేదు. ఆయన విషాదాశ్రువులు రాల్చుచు ఉత్కంఠతో నిలిచియుండెను. బలరామ కృష్ణుల కన్నులనీరు గ్రమ్మెను. పెంచిన తండ్రిని విడుచుట వారికి భారముగ తోచెను. నందుని స్థితియు నంతే.

పరమాత్మ నందరాజుతో "మా తలిదండ్రు లెవరో మాకు తెలియని స్థితిలో తాము, యశోదాదేవి, రోహిణీదేవి కన్నబిడ్డలకన్న వేయిరెట్లధికముగ మిమ్ములను పెంచితిరి. నిన్నటివరకు మీరే మా తలిదండ్రులని తలచితిమి. మిమ్ము విడుచుట మాకు మాత్రము సంతోషమా? ఉగ్రసేన మహారాజు వృద్ధుడు. నిన్ననే పట్టాభిషేకము జరిగెను. కంసుని పాలనలో సకలజనులు పెక్కు ఇడుమలకు లోనైరి. పరిస్థితులను చక్కబరచిన పిమ్మట బృందావనమునకు రాగలము. వ్రజవనితలు మా కొసగిన పాలు, పెరుగు, వెన్నమీగడలు మరవలేము. గోమాతలు, లేగదూడలు, గోపకులు, గోపబాలురను మేమెటుల మరువగలము? యమునాతోయము ఇసుకతిన్నెలు, పచ్చికబయళ్లు, రమణీయోద్యానములు, రాధాదేవిని మరచుటెట్లు? ప్రేమతో అక్కున జేర్చుకొని పాలిచ్చి పెంచి పెద్దచేసిన యశోదాదేవి నెటుల విడువగలము? ఆమె వ్రజమునకే అలంకారప్రాయమైనది. మేము ఎంత అల్లరి చేసినను కసరెడిదికాదు, తిట్టెడిది కాదు, కొట్టెడిది కాదు. ఆ మహనీయురాలు సహనము మూర్తీభవించిన మాతృమూర్తి. మమ్ములను విడిచి క్షణమైనను బ్రతుకలేనని కన్నీరు గార్చెడిది. మీ ఋణము దీర్చుకొనలేము. యశోదాదేవికి మా కృతజ్ఞతాంజలులు" అని మృదువుగ బలికెను.

నందరాజు పరమాత్మతో "కృష్ణా! మిమ్ములను విడిచి నేను, యశోదాదేవి, రోహిణీదేవి, గోపకులు, గోపబాలురు, వ్రజవనితలు, పశుపక్ష్యాదులు బ్రతుకుట కల్ల. 'నా బిడ్డలను మధురానగరమున విడిచి వచ్చుటకు మీ చేతు లెట్లాడెను?' అని యశోదాదేవి ప్రశ్నించిన నే నేమి చెప్పగలను? 'మా చిన్నికృష్ణుని మధురానగరమున విడిచి బృందావనమున కెటుల రాగలిగితిరి?' అని వ్రజవనితలు నిగ్గదీసిన నే నేమని వారిని సమాధానపరుపగలను? కంస సంహారము జరిగిన వెంటనే

బృందావనమునకు బలరామ కృష్ణులు వత్తురను గంపెడాసతో అఖాల గోపాలము నిరీక్షించుచుండును. మీకొరకు పాలు, పెరుగు, వెన్న, మీగడ కడవలు ఎదురు చూచుచుండును. వాటిని ఆరగించువా రెవ్వరు? మీరు రాలేదని గోమాతలు కన్నీరు గార్చుచో నేమ వాటిని ఎటుల నోదార్పగలము? యమునా నదీతోయములలో జలక్రీడలను, అందలి ఇసుకతిన్నెలపై బొమ్మల పెండ్లిండ్లను, ఉద్యానవనములలో రాసక్రీడల ఎవరు సల్పుదురు? నీ మురళీరవము సర్వజగత్తును రంజింపజేయును. అట్టి మధురగానము మా కెవరు వినిపింతురు? పెంచిన మా బోంట్ల కే ఇట్లుండ ఇక దేవకీ వసుదేవుల కెట్లుండునో? రాజకార్యములలో మునిగి బృందావనమునే మరతురేమో! అతిత్వరలో బృందావనమునకు అరుదెంచి మమ్ముల కాపాడుదుమని బాస చేయుము " అని దీనముగ బలికెను. ఆ పలుకులు వినిన ఉగ్రసేన, దేవకీ వసుదేవుల హృదయము వెన్న వలె కరగెను. వారు నందాదుల నోదార్చిరి.

స్వర్ణరథము సిద్ధము గావింపబడెను. అందు నందరాజు, నవనందులు, వృషభానులు ఆసీనులైరి. గోపకులు బండ్లలో నెక్కిరి. వారికి బలరామ కృష్ణులు చల్దుల నొసగిరి. పరమాత్మ బలరామస్వామి వారికి వీడ్కోలొసగిరి. రథచోదకుడు అశ్వముల నదలించెను. బంగరురథము సాగిపోవుచుండెను. బండ్లు బయలుదేరెను. కనుచూపుమేరకు నందరాజు గోపకులు వెనుదిరిగి బలరామ కృష్ణులను చూచుచుండిరి. ఇది ఏనాటి అనుబంధమో!

## ఉపనయన సంస్కారము

వసుదేవుడు గర్గమహర్షిని రావించి బలరామకృష్ణులకు ఉపనయన సంస్కారము జరిపించుమని కోరెను. కొలువుకూటము వచ్చని ఆకుతోరణములతో, పరిమళపుష్పగుచ్ఛములతో, కస్తూరి పునుగు జవ్వాజి మున్నగు ధూపములతో, రంగురంగుల దీపకాంతులతో దివ్యముగ ప్రకాశించుచుండెను. వేదవిదులు, భూసురోత్తములు, మహర్షులు ఉచితాసనములపై గూర్చుండిరి. ఉగ్రసేనమహారాజు ఇంద్రసింహాసన మధిష్ఠించెను. పుర ప్రముఖులతో, నగరవాసులతో కొలువుకూటము కళకళ లాడుచుండెను.

రత్నపీఠికలపై బలరామకృష్ణులు, వారల కిరువైపుల దేవకీ వసుదేవులు ఆసీనులైరి. గర్గమహర్షి అధ్వర్యవమున ఉపనయన సంస్కారము ప్రారంభింపబడెను. వేదవిదులు చతుర్వేదముల పఠించు చుండిరి. మంగళవాద్యములు మృదుమధురముగ మ్రోగుచుండెను. గర్గమహర్షి వసుదేవునితో 'బలరామకృష్ణులకు గాయత్రీ మంత్రోపదేశము చేయు' మని కోరెను. పరమాత్మస్వరూపులగు బలరామకృష్ణులకు తాను గాయత్రీ మంత్రోపదేశము చేయుటయా? అను సంశయముతో వసుదేవుడు వెను కంజ వేసెను. 'సందేహింపకుడు' అని పరమాత్మ నవ్వుచు పలికెను. వారికి మంత్రోపదేశము చేసిన పిమ్మట దేవకీ వసుదేవులు తమ జన్మ ధన్య మయ్యె నని మురిసిరి.

పీతాంబరముల దాల్చి బలరామకృష్ణులు 'భవతి భిక్షాం దేహి' అని తలిదండ్రుల కడ కేగిరి. తొలుత దేవకీదేవి భిక్ష నొసగెను. తదుపరి వసుదేవుడు భిక్ష నొసగి దివ్యమణుల నొసగెను. ఉగ్రసేనుడు పరవశుడై భిక్ష నొసగిన పిమ్మట బలరామ కృష్ణులు గర్గమహర్షి పాదములకు ప్రణమిల్లిరి. భిక్ష నొసగు మని అర్థించిరి. ఆనందాశ్రువులు జాలువారుచుండ మహర్షి వారికి భిక్ష నొసగెను. నగరవాసులు, పురప్రముఖులు బలరామ కృష్ణులకు పెక్కు కానుకలొసగిరి. ఉగ్రసేనుడు మహర్షిని పీతాంబరము లతో, అమూల్యాభరణములతో, సాలువులతో సత్కరించెను. భూసురోత్తములకు గో భూదానములు విరివిగ నొసగబడెను. పిమ్మట అన్న దానము జరిగెను. సకల జనులు బలరామ కృష్ణుల వినయసంపదలకు అచ్చెరు వొందిరి.

అవంతీపట్టణమున నున్న సకల విద్యాశాస్త్రపారంగతుడగు సాందీపనికడకు బలరామ కృష్ణులను విద్యాభ్యాసమునకై పంపిరి. సకల విద్యాస్వరూపులైనను గురువులేనిదే విద్య ప్రకాశింపదను సూక్తి నమసరించి బలరామకృష్ణులు గురుకులవాసము చేసిరి. అరువదినాలుగు విద్యలు అరువదినాలుగు రోజులలో గ్రహించి గురువు అనుగ్రహము బడసిరి. వారు గురుదక్షిణ నొసగుటకై సాందీపని దరిచేరి ప్రణమిల్లిరి. ఆనందాశ్రువులు జాలువారుచుండ సాందీపని వారిని కౌగిలించుకొనెను. పరమాత్మ

స్వరూపులకే గురు వగుట కన్న సాందీపనికి కావలసిన దేమున్నది ? సతి కోర్కె ననుసరించి గతించిన కొమరుని బ్రతికింపుమని అదియే తనకు గురుదక్షిణ యని సాందీపని కోరెను.

పరమాత్మ సముద్రుని కడకేగి సాందీపని కొమారుని గొనిరమ్మని కోరెను. అందులకు సముద్రుడు "ఓ మహానుభావా ! నాయందు పంచ జనుడను రక్కసుడు దాగియుండెను. వాడే గురుపుత్రుని దాచెను" అని వివరించెను. పరమాత్మ సముద్రగర్భమున కేగి రక్కసుని బట్టుకొనెను. వాడు పరమాత్మను శూలముతో పొడిచెను. ఆయన వాని శిరముపై పిడి కిలితో మోదెను. రక్కసుని కపాలము రెండువ్రయ్యలయ్యెను. వాని తేజస్సు పరమాత్మలో లీన మయ్యెను. దానవుని కపాలమందున్న పాంచ జన్యము అను శంఖమును పరమాత్మ చేకొనెను. యమపురము కేగి పాంచజన్యమును పూరించి గురుపుత్రు నిమ్మని యముని అర్థించెను. ఆయన పరమాత్మకు ప్రణమిల్లి పెక్కు కానుకల నొసగి, ఆయనకు గురు పుత్రుని అప్పగించెను. ఆ బాలుని పరమాత్మ గురువున కొసగెను. గురుని ఆశీస్సునంది బలరామకృష్ణులు మధురానగరమును చేరుకొనిరి.

పరమాత్మ పాంచజన్యము పూరించెను. మధురానగరవాసులు పరవశించిరి. వృక్షములు చిగిర్చినవి. శ్రీకృష్ణుడు అక్రూరుని గృహ మున కేగెను. పరమాత్మ స్వయముగ తన మందిరమునకు విచ్చేయుట తన పూర్వజన్మ పుణ్యఫలమని అక్రూరుడు భావించెను. ఆయన పరమా త్మకు షోడశోపచారములు సల్పి "స్వామీ ! నీవు జగదుద్ధారకుడవు. నీ వాగ్దానమును నిలబెట్టుకొంటివి. నీ కొసగుటకు నా హృదయము దక్క అన్యము కనిపించుట లేదు. భక్తులపాలిటి కామధేనువు నీవే" అని విన మ్రుడై పలికెను.

## అక్రూరుని రాయబారము

పరమాత్మ అక్రూరునితో "తాతా ! నీవు వయోవృద్ధుడవు. మేము నీ బిడ్డలవంటివారము. నీవు నన్ను శ్లాఘించగూడదు. నీవు హస్తినా పురమున కేగి పాండవుల స్థితిగతులను విచారించి రమ్ము" అనెను.

అక్రూరుడు హస్తినాపురమున కేగెను. పరమాత్మ పలుకులను ధృతరాష్ట్రునికడ వల్లించెను. పుత్రప్రేమ అడ్డువచ్చుటచే పాండవుల కెట్టి సహాయము చేయలేకుంటినని ఆయన తన అశక్తతను వెల్లడించెను.

ఆ వార్తను అక్రూరుడు పరమాత్మకు అందించుచు 'కృష్ణా! పాండవులకు సహాయము చేయుగల సమర్థుడవు నీవే. పాండవులు నీ యందు భక్తివిశ్వాసములు గలిగియుండిరి' అన పరమాత్మ కనులు చెమ్మగిల్లెను. 'కౌరవులకు తగినశాస్తి జరుగవలసినదే' అని పరమాత్మ తలంచెను.

శ్రీకృష్ణుడు ఉద్ధవుని వెంటనిడుకొని కుబ్జగృహమున కేగెను. ఆమె పరమాత్మను హంసతూలికాతల్పముపై గూర్చుండబెట్టి అర్ఘ్యపాద్యాదు లొసగి, పరిమళపుష్పములతో పూజించెను, పరమాత్మ కడు సంతసించి కుబ్జను కేళీవిలాసములతో ఆనందసాగరమున నోలలాడించెను. తనజన్మ ధన్య మయ్యె నని ఆమె మురిసెను. కుబ్జకు ఉపశ్లోకుడను కుమారుడు గలిగెను. వాడు నారదమహర్షికడ శుశ్రూషచేసి భక్తిశాస్త్రము రచించెను

## రజకుని చరిత్ర

శ్రీరామావతారమున చాకలిరేవులో సీతారాములను దూషించిన రజకుడే ద్వాపరమున కంసుని వస్త్రముల నుదుకు చాకలి యయ్యెను. ఆ రజకునకే మధురానగర రాజవీథిలో పరమాత్మ తగినశిక్ష విధించెను.

## తంతువాయకుడు

త్రేతాయుగమున శీలధ్వజుడను రాజునకు తంతువాయకుడు మధుపర్కముల (వివాహసందర్భమున వధూవరుల కిచ్చెడి వస్త్రములు) నేసి ఇచ్చెను. రాజు వాటిని అల్లుళ్లకు రామలక్ష్మణుల కొసగెను. వారు వాటిని ధరించి కడుసంతసించిరి. ఆ దృశ్యము చూచి తంతువాయకుడు తనజన్మ ధన్య మయ్యె నని మురిసెను. స్వయముగ రామలక్ష్మణులకు పట్టుపుట్టముల నేసి ప్రీతితో వారికొసగు టెన్నటికో యని అనుకొనెను. ద్వాపరాంతమున కృష్ణావతార సమయమున వాని కోర్కె నెరవేరునని

రామలక్ష్మణులు అభయ మొసగిరి. పరమాత్మ కృష్ణావతారమున నేత గా దొసగిన పట్టుపుట్టముల దాల్చి వానికోర్కెను తీర్చెను. ఆ తంతువా యకుడే ఈ నేతగాడు.

## మాలాకారుని చరిత్ర

దేవేంద్రుని ఉద్యానవనము నందనవనము. కుబేరుని ఉద్యాన వనమునకు చైత్రరథము అనిపేరు. వాటిని హేమమాలి అను తోటమాలి బాగుగా పెంచెడివాడు. వాడు న్యాయశీలి, పెద్దలను గౌరవించువాడు. నిత్యము ఐదువేల పద్మములతో శివుని పూజించెడివాడు, వాని భక్తికి మెచ్చి మహేశ్వరుడు వరము కోరుకొమ్మనెను. గోలోకనాథుడు నా గృహమున కేతెంచినపుడు ఆ మహనీయుని పరిమళపుష్పములతో అలం కరించి చరితార్థు డగునటుల వరము బొందెను. హేమమాలియను తోట మాలియే సుదాముడను మాలాకారుడు. పరమాత్మ వాని ఇంటికేగి వాని కోర్కెను తీర్చెను.

## కుబ్జ చరిత్ర

త్రేతాయుగమున శ్రీరామచంద్రుని ప్రేమించి లక్ష్మణస్వామిచే విరూపి గావింపబడిన శూర్పణఖ ఈశ్వరునిగూర్చి తప మొనర్చెను. మహేశ్వరుడు ప్రత్యక్షమై శూర్పణఖను వరము కోరుకొమ్మనెను. శ్రీరామ చంద్రమూర్తియే తనకు భర్త కావలెనని ఆమె కోరెను ద్వాపరాంత మున ఆమె కోర్కె దీరునని శంకరుడు అభయ మొసగెను. ఆ పరమాత్మనే శ్రీకృష్ణావతారమున పతిగ బొందగలిగెను.

## కువలయాపీడ చరిత్ర

బలిచక్రవర్తి కుమారుడు మందగతి సకలశాస్త్రము అభ్యసించిన వాడు. మహాబలోపేతుడు. ఆయన శ్రీరంగయాత్రకు బయలుదేరెను. మదగజమువలెనున్న వాని కాలిక్రిందపడి యాత్రికులు అసువులుబాసిరి. వృద్ధుడు, బక్కచిక్కిన త్రితుండను ఋషి మందగతికాళ్ళక్రింద పడెను. ఆయన మందగతితో 'శ్రీరంగనాథుని ఉత్సవసమయమున మదోన్మత్తు డవై నన్ను బడద్రోసితివి. నీవు గజరూపము నొందుదువు గాక!' అని

శపించెను, తప్పిదమును మన్నింపుమని మందగతి మునిని వేడుకొనెను ద్వాపరాంతమున కువలయాపీడము అను గజరాజువై శ్రీకృష్ణ పరమాత్మతో పోరి ముక్తిని బొందగలవు' అని త్రితుండు అనుగ్రహించెను. ఆ మందగతియే కువలయాపీడము. దేవేంద్రుడు దానిని కంసున కొసగెను. శ్రీకృష్ణుడు దానిని కడతేర్చెను.

## చాణూరముష్టికుల చరిత్ర

అమరావతీ పట్టణమున ఉదంధు డను భూసురోత్తముడు గలడు. ఆయనకు ఐదుగురు కొమారులు గలరు. వారు తలిదండ్రుల మాటలను లెక్కసేయక, వేదవిహితమగు కులాచారమును పాటింపక తోరము, ముద్గరము మున్నగు ఆయుధములు చేబూని యుద్ధము సేయుటను అభ్యసించుచుండిరి. ఉదంధుడు కుపితుడై "దుష్టులారా! ఇదేమి దుర్బుద్ధి. శాంతి శమదమాది గుణములు, జ్ఞానవిజ్ఞానములు, తపస్సు విప్రుల కుండవలసిన లక్షణము లు. అవి మాని క్షత్రియధర్మమగు సమరము సేయుట నేర్చుకొనుచుంటిరి. కావున మీ రైదుగురు దానవకులమున జన్మించి మల్లవిద్యాప్రవీణు లగుదురుగాక!" అని శపించెను. వారే ద్వాపరాంతమున చాణూరముష్టికులు మున్నగు యోధులుగ జన్మించిరి, బలరామ కృష్ణులచే సంహరింప బడిరి.

## కంసుని సోదరుల చరిత్ర

అలకాపురమున భక్తుడు, జ్ఞానసంపన్నుడగు యక్షుడు గలడు. ఆతడు శివభక్తితత్పరుడు వానికి దేవకూట, మహాగిరి, గండ, చండ, ప్రచండ, ఖండా, ఖండ పృథువు అను అష్టసుతులు గలరు. తండ్రి పనుపున వారు మానససరోవరమున కేగి సహస్రదళ పద్మములను చూచి కడు సంతసించి, వాటిని గైకొని పద్మపరిమళమును అఘ్రాణించి పిమ్మట తండ్రికి సమర్పించిరి. అఘ్రాణించిన పుష్పములు పూజకు పనికిరావు. యక్షుడు తనయుల తప్పిదము నెరుగక వాటితో శివుని అర్చించెను. అందుచే యక్షుని సుతులు ముమ్మారు దానవజన్మల నెత్తి కంససోదరులై బలరామ కృష్ణులచే హతులైరి.

## పాంచజన్య చరిత్ర

పాంచజన్య మను శంఖము పరమాత్మ ముఖకమలము నుండి ఉద్భవించెను. సదా భగవానుని అధరామృత పానమునకు నోచుకొనెను. పద్మమువలెనుండు పరమాత్మ హస్తమున తాను రాజహంసవలెనున్నను తనను పరమాత్మ నోటితో పూరించి ధన్యుని గావించెనని పాంచజన్యము గర్వించెను. ఆదిలక్ష్మికన్న తానే అధికుడనని భావించెను. అది గ్రహించిన శ్రీదేవి కోపో ద్రిక్తయై " ఓ పాంచజన్యమా! నీకింత పొగరా? నీవు పంచజనుడను రక్కసుడుగ జన్మింతువు గాక!" అని శపించెను. ఆ దానవుడే సాందీపుని తనయు నెత్తుకొనిపోయి దాచినది. ద్వాపరాంతమున శ్రీకృష్ణుడు సముద్రగర్భమున కేగి పంచజనుని సంహరించి, బాలుని గొనివచ్చి గురుదక్షిణ చెల్లించెను. పరమాత్మచే వాడు సంహరింపబడుటచే ముక్తిని బొందెను.

## ఉద్ధవుడు

ఉద్ధవుడు పరమాత్మకు ప్రాణసఖుడు, బృహస్పతి శిష్యుడు, మేధా సంపన్నుడు, ఉత్తమదాత, సమయస్ఫూర్తి గలవాడు, ఏకాంతభక్తుడు, దేవభాగుని పుత్రుడు.

పరమాత్మ ఉద్ధవునితో "ఓయీ! మధురానగరమునకు వచ్చునపుడు రెండునాళులలో బృందావనమునకు మరలివత్తునని బాస చేసితిని. రాజకార్యములలో నిమగ్నుడ నగుటచే బృందావనమున కేగుట ఆలస్యమగుచున్నది. అట వ్రజవాసు లెట్లుండిరో? అక్రూరుడు మమ్ములను మధురానగరమునకు గొనివచ్చునపుడు వ్రజవనితలు అడ్డుతగిలిరి. వారు విరహవేదనతో కుములుచుందురు. నేను వత్తునను ఆశతో నిరీక్షించుచుందురు. ఆశతోనున్న ప్రాణములు పోవు. విరహవేదనకు సాటియైనది వేరొకటి లేదు.

బృందావనము ప్రేమకు నిలయము. దానిని విడిచి క్షణమైన నిలువలేను. యమునానది, రమణీయమగు నికుంజములు, కల్పవృక్షములు. గోమాతలు, లేగదూడలు వ్రజవాసులతో కలకలలాడుచుండును.

నీకు సందేశము నొసగుదును. ఒకటి నందరాజుకు, రెండవది యశోదా దేవికి, మూడవది రాధాదేవికి, నాలుగవది గోపికలకు మరియు నూరు యూథములకు శతలేఖల నొసగుదును.

నందయశోదలు నన్నెంతో ప్రేమతో పెంచిరి. వారిని విడిచి నాకు మాత్రము సంతోషమా? రాజ్యకార్యములలో మునిగియుండుటచే వచ్చుటకు వీలుగలుగలేదని తెలుపుము. రాధాదేవి నాకు అత్యంతప్రియు మైనది. నన్నే సదా స్మరించుచుండును. విరహవేదనతో ఆమె ఎటుల తల్లడిల్లుచున్నదో! వ్రజవనితలు సర్వము త్యజించి నన్నే నమ్ముకొని యుండిరి. నాకొరకు ప్రాణముల వీడుటకైనను వెనుకాడరు. నా భక్తుల నేను విడువను. చల్లనిమాటలతో వారి తప్తహృదయముల చల్లార్చుము.

ఉద్ధవా! నీవు నా సఖుడవని విశ్వసించుటకు నే నిచ్చటికి వచ్చిన బంగరు రథముపై బృందావనమున కేగుము. అవే అశ్వములు. నా కౌస్తుభము, పీతాంబరములు, వేణువును, పుష్పములతో అలంకరింపబడిన వెదురుకర్రను గైకొనుము. సుగంధలేపనముల పూసికొనుము. శిఖి పింఛము, కిరీటము మున్నగు వాటిని ధరించుము. నా సారూప్యమునే బొంది బయలుదేరుము" అనెను.

## ప్రయాణము

ఉద్ధవుడు బృందావనమునకు స్వర్ణరథముపై బయలుదేరెను. మార్గమధ్యమున క్షీరముతో నిండిన పొదుగులతో నొప్పారు గోమాతలు కనబడెను. గోధూళికా లగ్నమది. వాటి ధూళి రథముపై బడుచుండెను. ఆబోతులు గోమాతలవెంట ఒయ్యారముతో నడయాడుచుండెను. గో వత్సము లేళ్ళగుంపులవలె చెంగుచెంగున దుముకుచుండెను. చేపునకు వచ్చిన పాలను దూడలు త్రాగుచుండెను. మధువుతో మత్తెక్కిన భ్రమ రములు కూనిరాగములు తీయుచుండెను. వికసించిన పద్మములతో సర స్సులు శోభించుచుండెను.

పిల్లనగ్రోవులపై గోపబాలురు మనసమోహన రాగముల నాలపిం చుచుండిరి. వారు ఉద్ధవునిచూచి నందకిశోరుడని భ్రమ చెందిరి. 'అదీ

పీతాంబరము, అదే కౌస్తుభము, అదే వనమాల, అదే బంగరురథము, అవే అశ్వములు. బలరామస్వామి కన్పించుట లేదే ! అని అనుకొనిరి. పరమాత్మకు ప్రియసఖుడగు సుదాముడు ఉద్ధవుని నిశితముగ పరికించెను. 'లక్షణములన్నీ శ్రీకృష్ణునివే కాని వృద్ధుడుగ కనబడుచున్నాడు' అని గోపబాలురతో చెప్పెను.

## ఉద్ధవ సందేశము

ఉద్ధవుడు రథమును దిగి గోపబాలురను సమీపించి శ్రీకృష్ణు డొసగిన సందేశమును సుదామున కొసగెను. దానిని చదువుకొని సుదాముడు ఉద్ధవునితో "ఓయీ ! నందనందనుడు మా యందలి మమకారమును మరచిపోయెనా ? ఆయన మా సర్వస్వము. ప్రాణతుల్యుడు. ఆయన కన్పింపని ప్రతిక్షణము మాకు ఒకయుగము. ఆయనలేని పగలు మాకు చీకటి. మాకు సదా పరమాత్మ సంస్మరణమే. శ్రీకృష్ణుని అక్రూరుడు మధురకు గొనిపోయిన వేళావిశేషమేమో గాని పరమాత్మ మరలి రాలేదు. ఆయనను విడిచి మేము బ్రతుకు టెట్లు ? ఆసతో కొన్నినాళులు బ్రతుకుదుము. పిమ్మట మా ప్రాణములు పరమాత్మలో లీనమగును " అని విషాదాశ్రువులు రాల్చెను. ఉద్ధవుడు సుదాముని గోపబాలుర నోదార్చుచు "గోపబాలకులారా ! మీ ప్రేమాభిమానములు ప్రశంసనీయము. పరమాత్మ తప్పక బృందావనమునకు రాగలడు. ఉగ్రసేనుని పట్టాభిషేకము జరిగి యెన్నినాళ్లో కాలేదు. రాజకార్యములు చక్కబెట్టుటలో జాగు చేయవలసి వచ్చెను. ఆ మహనీయుడు మిమ్ములను మరువలేదు. మీ కొరకు ఆయన ఎంతో తపించుచున్నాడు. మిమ్ము ఎన్నటికి విడువడు. మీ అచంచల ప్రేమానురాగములు శ్రీకృష్ణునకు తెలిపి అనతికాలములోనే ఇటకు గొనివత్తుము " అని అనునయించి నందయశోదల అంతఃపురమునకు జనెను.

## స్వాగతము

ఉద్ధవునకు నందరాజు స్వాగత సత్కారముల నొసగి " ఉద్ధవా ! నీరాక మాకు ఆనందదాయకము. బలరామకృష్ణులకు కుశలమా ? కంస వధతో దేవకీ వసుదేవుల భయము తొలగిపోయెను. వాని పాపము పండి

బ్రద్దలయ్యె. పరమాత్మకు మేము జ్ఞప్తియందుంటిమా? రావవిందులలో నోలలాడుచుండెనా? బృందావనము మరచిపోయెనా? ఇచటి స్థావర జంగములపై పరమాత్మకు మక్కువ ఎక్కువ. అది ఇపు డేమయ్యెనో? సౌందర్యరాసులగు బలరామకృష్ణులు బృందావనికి అరుదెంచి బాల్యక్రీడలతో మమ్ము మురిపింతురా? పరమాత్మ లేమిచే బృందావనము నిస్సారమయ్యెను. విషతుల్యమయ్యెను. పరమాత్మకొరకు నిరీక్షించుటచే సకల కర్మలు నిలిచిపోయెను. పరమాత్మ పాదచిహ్నములు యమునానదీతీరములో, అందలి ఇసుకతిన్నెలలో, గోవర్ధనగిరి పర్వతప్రాంగణములో కొల్లలుగ కనిపించును. శ్రీకృష్ణుడు సాక్షాత్పరమాత్మయని గర్గాచార్యులు తెలిపియుండిరి. వ్రజవనితలు ఎంత వారించినను లెక్కపేయక అనాలోచితముగ బలరామకృష్ణులను మధురానగరమునకు గొనిపోయితిని. పరమాత్మ కొరకు సకల జీవరాసులు ఎంతటి విరహవేదన అనుభవించుచున్నవో గమనించితివా? చంద్రుడులేని చకోరపక్షులవలె నుంటిమి. ఏనాటికైనను నందకిశోరుడు రాకపోవునా యను ఆశతో బ్రదుకుచుంటిమి" అని కన్నీరు గార్చెను. ఉద్ధవుడు చలించెను.

## యశోదాదేవి వేదన

యశోదాదేవి కన్నుల నీరుగ్రమ్మెను. ఎటుల ఏమని పలుకరించవలెనో ఆమెకు తోచలేదు. ఆమె శ్రీకృష్ణుని స్మరించుటచే స్తనద్వయము నుండి క్షీరధారలు స్రవింప దొడంగెను. పరమాత్మ కన్పింపకపోవుటచే యశోదాదేవికి సర్వము శూన్యముగ కన్పట్టెను. చమటలు స్రవించుచుండ, విషాదాశ్రువులు జాలువారుచుండ, దీనవదనయై "ఉద్ధవా! నా గోపాలకృష్ణునకు నేను జ్ఞప్తియందుంటినా? అమ్మా! పాలు, పెరుగు, వెన్నమీగడలు కావలెనని ఇక నన్నెవ రడుగుదురు? నందకిశోరుడు ముట్టనిదే మేము భుజించి ఎరుగము. అవి మంచిరోజులు. ఇప్పుడుగడ్డు రోజులు వచ్చినవి. నిరీక్షించుటకు నాలో శక్తి క్షీణించుచున్నది. పరమాత్మను చూచు భాగ్యము మా కబ్బునా?" అని ఆవేదనతో ప్రశ్నించెను.

## ఔదార్యు

ఉద్ధవుని హృదయము కరగిపోయెను. ఆయన యశోదాదేవితో "మిమ్ములను స్తుతించుటకు తగినమాటలు వచ్చుటలేదు. పరమాత్మ యందు ఇంతటి అనురక్తియుండుట యోగీశ్వరులకు సైతము కడు దుర్లభము. శ్రీకృష్ణుడు తప్పక అరుదెంచును. మీ ఆదరాభిమానముల చూరగొనగలడు. కంసుని వధించినంతమాత్రమున దుష్టశిక్షణ కార్యక్రమము ముగియలేదు. జరాసంధాదులు కల్లోలములు సృష్టించుచున్నారు. వారి సంహారము త్వరలో పూర్తియగును. తదుపరి పరమాత్మ ఇటకు తప్పక రాగలడు. నా పలుకులు విశ్వసింపుడు" అని అనునయించెను. ఆయన పరమాత్మ పంపిన సందేశములను నంద యశోదలకు అందించెను. వాటిని వారు చదువుకొనుచుండ, వారిలో పరమాత్మపై ప్రేమ పెల్లుబికెను. దుఃఖము వెల్లువ అయ్యెను. అది భగవద్విరహము. వేదాంతసారము.

ఉద్ధవుడు నంద యశోదలతో "శ్రీకృష్ణునకు రాగద్వేషములు లేవు. భక్తియుండు తావునకు తప్పక రాగలడు. ఆయనకు పుట్టుక లేదు. కర్మలేదు. మాయాశక్తి సమన్వితుడు. అనేక అవతారముల దాల్చును. ఆయనలేని వస్తువులేదు" అని దెలిపెను నందయశోదలు లోలోన కుములుచుండిరి విషాదము వారిలో మూర్తిభవించెను. వారిది జ్ఞానభక్తి. ఆ రాత్రి ఆవేదనలతో గడచెను.

## వ్రజవనితలు

బ్రాహ్మీముహూర్తమున ఉద్ధవుడు మేల్కాంచెను. వ్రజవనితలు లేచి, దీపముల పైకెగద్రోసిరి. గృహదేవతను, గడపలను పూజించి, పెరుగు చిలుకుట ప్రారంభించిరి. సకల కార్యములలో వారికి శ్రీకృష్ణ ధ్యాన తత్పరతయే. వారి ముంజేతి గాజులు దివ్యముగ ప్రకాశించుచుండెను. గాజుల గలగలలు, వక్షోజముల పిరుదుల కదలికలు సొంపుగనుండెను. కర్ణాభరణముల కాంతికి కపోలములు మెరయుచుండెను. కంఠహారము లూగుచుండెను. పెరుగు చిలుకు కవ్వపు ధ్వనులు, కంఠా

భరణముల గలగలధ్వనులు బ్రహ్మానాదమును జ్ఞప్తికి తెచ్చుచుండెను. వారు శ్రీకృష్ణుని లీలలు గానము చేయుచుండిరి. ఆ బ్రహ్మానాదముతో అమంగళములు నశించెను. బృందావనమున భక్తిదేవత నృత్యము చేయుచున్నటుల తోచుచుండెను.

నందుని అంతఃపురద్వారముకడ బంగరురథము విడిసియుండెను భామని కాంతులతో బంగరురథము దివ్యముగ ప్రకాశించుచుండెను. గోపికలు రథమును జూచిరి. అక్రూరుడు మరల వచ్చెనేమో యని సంశయించిరి. ఆయన పుట్టుక భక్తుల బాధించుటకేమో యని సందేహించిరి. శ్రీకృష్ణుడు కంసుని సంహరించెను గదా? ఇక అక్రూరునకు పరమాత్మతో పని యేమి? నందకిశోరుడు కన్పించుట లేదే. ఇందేదో రహస్యము గలదు" అని గోపికలు భావించి ఉద్ధవునితో 'ఓయీ! ఈ రథ మెవరిది? పరమాత్మునిదేనా?' అని నిగ్గదీసిరి.

ఉద్ధవుడు గోపికలతో "మీ రెంతో ధన్యులు! పరమాత్మపై మీకు గల గాఢానురాగము వర్ణనాతీతము" అనెను. వారు ఉద్ధవుడే శ్రీకృష్ణుడని భ్రమచెందిరి. నిశితముగ పరికించిన పిమ్మట అతడు వృద్ధుడని, కృష్ణభక్తు డగునేమో యని సంశయించి కుశలప్రశ్నలకై కదళీవనమునకురమ్మని ఆయనను మోమోట పెట్టిరి. ఉద్ధవుడు వారివెంట కదళీవనమునకు జనెను.

## విషురోక్తులు

గోపికలు ఉద్ధవుని పూజించిరి. ప్రియముగ పలుక దొడంగిరి. వారు ఉద్ధవునితో "అయ్యా! తాము పరమాత్మకు ఆప్తుడని తోచుచున్నది. నందయశోదలను గూడ మధురానగరమునకు తోడ్కొనిపోవుటకు వచ్చియుందురు. పరమాత్మ మమ్ములను మరచియుండును. ఆయన లోకనిందకు వెరచి తలిదండ్రులను గొనిరమ్మని మమ్ముల బంపెనేమో! అదిగో! నందరాజు అంతఃపురము. అట కేగుము. మురళీధరునిపై గల మక్కువచే ఆయన రథమునకు అడ్డు నిలిచితిమి. కన్నీరు మున్నీరుగ నేడ్చితిమి. పరమాత్మ శిలాహృదయుడు. కానిచో మమ్ములను విడిచి వెళ్ళునా? నమ్మినవారిని ప్రేమించుట నిజమైన ప్రేమ. క్రొత్తవారిపై

మోజు ఎక్కువ. పౌతవారిపై వెగటు ఎక్కువ. మా ప్రేమ నిరుపాధిక మైనది. ఎంతటి సాహసమున కొడిగట్టినాడు! ఎంతటి అన్యాయమునకు పాల్పడినాడు!" అని ఆక్రోశించుచు ఉద్ధవుని రాధాదేవి కడకు గొని పోయిరి.

## రాధాదేవి దర్శనము

యమునా తీరమందలి రమణీయ నికుంజమున విరహతప్తయైన రాధాదేవి కుములుండెను. అంటి ఆకులు, యమునాతరంగ శీకరములు, అమృతము నొలికించు చంద్రకిరణములే గాక వెన్నెలలో కలకలలాడు కదళీవన మంతయు కుమిలిపోయెను. ఆమె శ్రీకృష్ణపరమాత్మ రాకకై నిరీక్షించుచున్నది. లేనిచో ఎన్నడో అసువులబాసి యుండెడిది. 'కృష్ణా! కృష్ణా!' అని రాధాదేవి నిట్టూర్పులు విడచుచు అమావాస్యనాటిచంద్రుని వలె కృశించియుండెను.

## ఉద్ధవుని రాధాస్తవము

ఉద్ధవుడు రాధాదేవిని ఇటుల స్తుతించెను. "ఓ రాధాదేవీ! నీవు పరమాత్మ పట్టమహిషివి లక్ష్మీదేవితో సమానురాలవు. ఆయన ఆదిదేవుడు; నీవు ప్రకృతివి. ఆయిన బ్రహ్మయైనచో నీవు శారదాదేవివి. ఆయన పరమశివుడు, నీవు పార్వతివి. ఆయన నారదుడగుచో, నివు మహతియను వీణవు. ఆయన దత్తాత్రేయు డగుచో, నీవు మధుమతీదేవివి. ఆయన త్రివిక్రము డగుచో, నివు జయంతివి. ఆయన యజ్ఞరూపు డగుచో, నీవు దక్షిణవు. ఆయన పృథుచక్రవర్తి, నీవు ఆర్చివి. ఆయన మత్స్యావతార మున, నీవు శ్రుతిరూపవు. ఆయన కూర్మరూపుడగుచో, నీవు సర్వస్వరూపిణివి. ఆయన మోహినీరూపమున నున్న, నీవు మోహినీశక్తివి. ఆయన వామనరూపమున నున్న, నీవు వరశువవు. ఆయన శ్రీరామ చంద్రమూర్తియగుచో, నీవు సీతామహాదేవివి. ఆయన వ్యాసు డగుచో, నీవు వేదాంతవాణివి. ఆయన బలరాము డగుచో, నీవు రేవతీదేవివి. ఆయన బుద్ధుడగుచో నీవు బుద్ధివి. ఆయన చంద్రుడగుచో నీవు చంద్ర కళవు. ఆయిన కల్కి యగుచో, నీవు కృతివి. ఆయన సూర్యు డగుచో నీవు ప్రకాశమవు. ఆయన అగ్నియగుచో నివు జ్వాలవు. ఆయన క్షీరాబ్ధి

యగుచో, నీవు తరంగము. ఆయన పరబ్రహ్మతత్త్వము నీవు చిచ్ఛక్తివి. మీ రిరువురు అవిభాజ్యులు. ఒకే తేజస్సు. నీలవర్ణము గౌరవర్ణముగ ప్రకాశించుచున్నది. అట్టి దివ్యదంపతులకు నమస్కృతులు" అని స్తుతించి కృష్ణసందేశము రాధాదేవి కొసగెను. గోపికాయూధముల కిచ్చిన లేఖలు వారి కిచ్చెను.

## శ్రీకృష్ణ సందేశము

ఉద్ధవు డొసగిన శ్రీకృష్ణసందేశమును రాధాదేవి శిరమున దాల్చి నంతనే ఆనందపారవశ్యముతో మూర్ఛిల్లెను. చెలులు పుష్పరసములతో పన్నీటితో శీతలోపచారములు చేసిరి. కొంతతడవునకు ఆమె తెప్పరిల్లి కొని విషాదాశ్రువుల రాల్చెను. గోపికలు బిగ్గరగ నేడ్చిరి. ఆ కన్నీరే లీలాసరోవర మయ్యెను. పరమాత్మ తప్పక బృందావనమునకు విచ్చే యునని ఉద్ధవుడు వారికి అభయ మొసగెను. పరమాత్మ పలుకులను పల్లించెను. రాధాదేవి కడు సంతసించెను.

రాధాదేవి ఉద్ధవునితో "ఓయీ! శ్యామసుందరుడు, అఖండా నందప్రదుడు, ఆ మహనీయుడు నా కెప్పుడు దర్శన మొసగును? మేఘునికొరకు మయూరమువలె, చంద్రునికొరకు చకోరమువలె, నేను నా నాథునికొరకు నిరీక్షించుచుంటిని. ఎట్టి విషమఘటికలలో మాకు వియో గము గలిగెనో గాని, పరమాత్మదర్శనము ఈ క్షణమువరకు లభింపలేదు. క్షణ మొక యుగముగ గడుచుచున్నది. ఏనాటికైనను పరమాత్మ రాక పోవునా యను విశ్వాసముతో ప్రాణముల ధారణ చేసితిని. బృందావన మునకు నందకిశోరుడు వచ్చునా? అయన దర్శనభాగ్యము మాకు అబ్బునా? నిన్ను చూచిన పిమ్మట నా మనస్సు చల్లబడెను. పరమాత్మ పలుకులు మా మనస్సులనే గాక హృదయములను రంజింప చేసెను. మధురానగరమున తా నుండి సందేశములతో మమ్ము తృప్తుల గావింప గలనని భావించుచుండెనా? వాటివలన మాకు గలుగు లాభమేమి? పర మాత్మ దర్శనము చేయించి పుణ్యము గట్టుకొనుము. మానుండి పరమా త్మను వేరుచేసి అక్రూరుడు మా ప్రాణముల హరించెను. నీవు శ్రీకృష్ణుని మాకొసగి మా ప్రాణముల నిలుపుము" అని దీనముగ బలికెను. ఉద్ధ

వుడు ఆమెతో "మీ ఆవేదనము పరమాత్మకు దెలిపి ఆయనను వెంటనే బృందావనమునకు గొనివత్తును. ఇందుకు నీ పాదములే సాక్షి" అని ప్రమాణము చేసెను.

ఉద్ధవుని మధురోక్తులు రాధాదేవికి, వ్రజవనితలకు అమృతోపమానముగ తోచెను. రాధాదేవి రెండు చంద్రమణులను ఉద్ధవున కొసగెను. వాటిని రాసోత్సవ సమయమున పరమాత్మ ఆమె కొసగెనట. రాధాదేవి రెండు అష్టదళ పద్మములను, వింజామరలను, శ్వేతచ్ఛత్రమును వానికి ప్రసాదించెను. పై వస్తువులన్నియు పరమాత్మనుండి ఉద్భవించినవే. శంఖచూడుని సంహరించిన పిమ్మట పరమాత్మ చూడామణిని రాధాదేవి కొసగెను. దానినిగూడ ఆమె ఉద్ధవున కొసగెను. గోపికలందరు ఒక్కొక్క ఆభరణమును తీసి వాని కొసగిరి. ఉద్ధవుడు పరమాత్మను బృందావనమునకు తప్పక తోడ్కొనివచ్చునని వారి విశ్వాసము.

గోపికలు ఉద్ధవునిచుట్టును చేరి "అయ్యా! నీవు బుద్ధికుశలుడవు. పరమాత్మకు మేము జ్ఞప్తియందుంటిమా? ఈ లేఖలను ఆయన ఎచట వ్రాసెను? ఇంకేమైన చెప్పియుండెనా" అని గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నించిరి.

ఉద్ధవుడు వారితో "వ్రజవనితలారా! మీరు పరమాత్మను ఎటుల స్మరించుచుంటిరో, అటులే ఆయనగూడ మిమ్ములను స్మరించుచున్నాడు. విరహవేదనతో బాధనొందుచున్నాడు. ఆయన మీకు ఒక ఉపదేశము చేసెను. అదేమన బంధమునకు, మోక్షమునకు మనస్సు కారణభూతమైనది. ఈ విశ్వమంతయు సత్యమని భ్రమచెందుట బంధము, సర్వము బ్రహ్మస్వరూపమని తెలియుట మోక్షము. తనతోకూడ సర్వము నేనే అని భావన గలిగిన వారికి బ్రహ్మాకారచిత్త మలవడును. విషయాకారదృష్టి పోనంతవరకు బ్రహ్మాకారత వెలువడదు. వస్తుదర్శనము కానరాదు. స్థూలదేహమునుబట్టి దూరముగ నుంటిని. ఆత్మదృష్ట్యా చూచినచో ఘటమునకు మృత్తువలె సమీపమున నుంటిని. మీరు నేను అవిభాజ్యులము" అని తెలిపెను. అది విని గోపికలు శ్రీకృష్ణుని స్మరించుచు కన్నీరు మున్నీరుగ నేడ్చిరి.

## తిరుగు ప్రయాణము

ఉద్ధవుడు నందయశోదలకడ కేగెను. మధురానగరమున కేగుటకు అనుమతింపుమని ఆయన నందరాజును వేడుకొనెను. ఆయన ఉద్ధవునితో "ఓయీ! నీవు నందకిశోరుని ప్రాణసఖుడవు. శ్రీకృష్ణుని మంచి మాటలతో మధురానగరమునుండి బృందావనమునకు గొనిరాగల సమర్థుడవు నీవే. పరమాత్మను జూడనిదే మేము బ్రతుకలేము. ఎందులకు బ్రతుకవలె? పరమాత్మ జాగుచేసినచో మేము బ్రతికియుందు మను నమ్మకము లేదు. పెంచినతండ్రిని మరువవద్దని హితము పలుకుము" అనెను.

యశోదాదేవి వానితో "ఉద్ధవా! నేను జీవచ్ఛవముగ నుంటిని. గోపాలకృష్ణుడు లేని ఈ బృందావనముతో నాకు పనిలేదు. సర్వము శూన్యముగ కనబడుచున్నది. నందకిశోరుని చూడనిచో నాకు తృప్తి గలుగదు. అటు చూడుము. బృందావనమందలి సకల జీవరాసులు నిర్వీర్యమై నిస్తేజమై కళాహీనముగ కన్పించుట లేదా? నందనందనుని రాకకై అవి ఎదురుచూచుచున్నవి. ఒక పర్యాయము నాకు దర్శన మొసగుమని నా మాటగ పరమాత్మతో చెప్పుము" అని దీనముగ వేడుకొనెను.

రాధాదేవి వానితో "ఉద్ధవా! రాధాదేవి నీకొరకు వేచియున్నది. నీవు వెంటనే బృందావనమునకు రానిచో నీ రాధ నీకు దక్కదు అని పరమాత్మతో చెప్పుము. ఎంత యత్నించిన ఆమె పరమాత్మకు ప్రేమలేఖ వ్రాయలేకపోయెను. ఆమె విషాదాశ్రువులు వ్రాతకు అడ్డువచ్చెను.

గోపికలు వానితో "ఉద్ధవా! మధురానగరమందలి వనితలు మా కన్న విద్యాధికలు, వాగ్గేయకారిణులు, చక్కనిచుక్కలు గావచ్చును. కాని వారి వలలో చిక్కుకొనినచో వెలికివచ్చుట అసాధ్యమని నందకిశోరునికి చెప్పుము. మేము వ్రజవనితలము. కల్లకపటములు నేరని వారము. మా సర్వస్వము పరమాత్మ కొసగితిమి. ఆ మహనీయుని పలుకులు నిజమని నమ్మితిమి. మమ్ములను నదిసంద్రమున ద్రోసి మధురానగరవాసినులతో కులుకుట సమంజసము గాదని పరమాత్మతో పలుకుము. మాతో రాసక్రీడలు సలుపకున్నను ఒకసారి మాకు తన దివ్యమంగళరూపమును జూపుమని హితము పలుకుము" అని వేడుకొనిరి.

ఉద్ధవుడు బృందావనమునకు నమస్కరించెను. యమునాతీర మందలి ఇసుకరేణువులు శ్రీకృష్ణుని దోడ్కొనిరమ్మని మోమోటు పెట్టెను. పశుపక్ష్యాదులు సైతము పరమాత్మ రాకకు ఎదురుచూచుచుంటిమని విన్న వించినవి. బృందావనము వారికి వీడ్కో లొసగెను. గోపబాలురు నంద కిశోరున కిమ్మని పాలు, పెరుగు, వెన్న, మీగడకడవలు, చెరుకుగడలు, శిఖిపింఛములు కానుకగ నొసగిరి. పరమాత్మను దోడ్కొని బృందావన మునకు మరలివత్తునని ఉద్ధవుడు బాసచేసెను. బంగరురథము మధురా నగరమునకు బయలుదేరెను, వ్రజవాసుల కనులనీరు గ్రమ్మెను.

మధురలో అక్షయవటమున పరమాత్మ ఉద్ధవునిరాకకై నిరీక్షించు చుండెను. కొంతతడవునకు ఉద్ధవుడు వచ్చెను. ఆయన పరమాత్మతో "కృష్ణా! నీవులేని బృందావనము వెలవెలబోవుచున్నది. సకల జీవరాసులు నీ కొరకు తపించుచున్నవి. సందేశములతో వేదాంతోపన్యాసములతో వారిని తృప్తిపరచుట అసాధ్యము. నీ తలిదండ్రులు, రాధాదేవి, వ్రజ వాసులు నిన్ను బృందావనమునకు దోడ్కొనిరమ్మని వేడుకొనిరి. ఆల సించినచో వారు ప్రాణముల వీడుట తథ్యము. పిదప పశ్చాత్తాపము నొందిన ఫల మేమి? నీవు మధురానగర విలాసకేంద్రములలో కేళీవిలా సములలో నోలలాడుచుంటివని సంశయించుచుండిరి. వారి విరహవేదన భరింప శక్యము గానిది. నిన్ను బృందావనమునకు దోడ్కొని వత్తునని ప్రతిన బూనితిని" అని విన్నవించెను.

## శ్రీకృష్ణుని రాక

శ్రీకృష్ణుడు మధురానగర రక్షణబాధ్యత బలరామస్వామికి అప్పగిం చెను. ఆయన ఉద్ధవసమేతముగ బంగరురథముపై బృందావనమునకు బయలుదేరెను. వారు గోవర్ధనగిరిని, యమునానదిని, ఇసుకతిన్నెలను దాటి బృందావనము సమీపించిరి. గోవులు పరమాత్మను చూచినవి. అవి అంబారవములు చేయుచు లేగదూడలు పరుగిడుచుండ, శరత్కాల మేఘ ములు సూర్యభగవానుని చుట్టుకొనినటుల బంగరురథమును చుట్టుముట్టి నవి. వాటి కనులవెంట ఆనందాశ్రువులు జాలువారినవి. గోమాతలను చూడగనే పరమాత్మ 'మందాకినీ' 'పూర్ణచంద్రిక' మున్నగు నామము

లతో పిలిచెను. అవి పరవశించినవి. గోవులు కన్పింపకపోవుటచే గోప బాలురు వాటిని వెదుకజొచ్చిరి. ఆలమందలు రథమునుచుట్టి నిలిచియుండినవి. పరమాత్మ అందుండెనేమో యని గోపబాలురు రథమును పరిశీలించిరి. నందకిశోరుడు రథము దిగి పరుగు పరుగున వచ్చి వారిని కౌగిలించుకొనెను. శ్రీదాముడు శ్రీకృష్ణునిచేర ముద్దాడెను. ఇది ఏనాటియను బంధమో! జీవాత్మ పరమాత్మలకు గల ప్రేమ అంతటి గాఢమైనదేమో! పరమాత్మ వారికి చక్కెరపొంగలి, పులిహోర, పెరుగన్నము పెట్టెను. వాటిని వారు కడుపార మెక్కిరి. పరమాత్మ బృందావనమున కరుదెంచుటచే వారిలో ఆనందోత్సాహములు పెల్లుబికెను. ప్రమోదువారిన వారి జీవనాడులు చిగిర్చెను. ఉద్ధవుడు పరమాత్మ రాకను నంద యశోదలకు, వృషభానుల కెరింగించిరి.

మంగళవాద్యములు మనోహరముగ మ్రోగుచుండెను. ఆబాల గోపాలము పరమాత్మకు స్వాగతము పలుకుటకు తరలెను. భూసురోత్తములు పూర్ణకుంభముతో ముందుండిరి. వేదవిదులు స్వస్తివాచకములు పలుకుచుండిరి. పుణ్యస్త్రీలు లాజలు, గంధాక్షతలు, మంగళహారతులతో బయలుదేరిరి. రాధాదేవి తలిదండ్రులు వృషభానుడు, కళావతి పరిమళ పుష్పమాలికలు, గురువిందగింజలు, వేణువులు, బంగరుబెత్తములు పరమాత్మకు కానుకగ తీసికొని పోవుచుండిరి. గోపకులు నృత్యము చేయుచుండిరి. గోపబాలురు గంతులు వేయుచుండిరి. రాధాదేవి వారికి బంగరు నాణెములు కానుకగ నొసగెను. తాను బంగరుపల్లకి నెక్కి పరమాత్మకు ప్రీతికరమైన పరిమళ ద్రవ్యములను, మధుర పదార్థములను గైకొని ప్రాణసఖులు వెంటనడువ పరమాత్మ కడకు బయలుదేరెను. ఆ కోలాహలము చూచి పరమాత్మ వారి కెదురుగ వచ్చెను.

ఆయన నందయశోదలకు ప్రణమిల్లెను. యశోదాదేవి వానిని ముద్దాడెను. వృషభానులు కానుకల నొసగిరి. ఉద్ధవుని శ్లాఘించిరి. వేదవిదులు, భూసురోత్తములు పరమాత్మకు స్వాగతము పలికి పూర్ణకుంభ మొసగిరి. పుణ్యస్త్రీలు నీరాజన మొసగిరి. జయజయ ధ్వానములతో బృందావనము మురిసెను. నందకిశోరుడు రాధాదేవి కడకు వచ్చెను.

ఆమె ఆయన పాదములకు ప్రణమిల్లెను. నందనందనుడు ఆమెకు సకల శుభములు గలుగునటులు ఆశీర్వదించెను. నందరాజు పరమాత్మమున్నగు వారిని అంతఃపురమునకు గొనిపోయెను. మధురఫలములను, పరిమళ పుష్పములను సర్వులకు వంచిరి. పరమాత్మకడ సెలవు గైకొని యెల్లరు తమ తమ నెలవులకు జనిరి.

## రాధాదేవి కబురు

సంధ్యాసమయమున కదళీవనమునకు రమ్మని రాధాదేవి నంద కిశోరునకు కబురంపెను. పరమాత్మ విచ్చేసెను. రాధాదేవి ఆ దివ్య మంగళరూపుని రత్నపీఠికపై గూర్చుండ బనిచి, అర్ఘ్యపాద్యాదుల నొసగి, షోడశోపచారములతో పూజించెను. రాధాదేవి విరహాగ్నికి కదళీ వనము కమిలి యుండెను. నందనందనుడు మధుర కేగినప్పటినుండి రాధాదేవి 'న చందనం, న భోజనం, న తాంబూలం, న నిద్రా' పాటిం చెను. పరమాత్మదర్శనముతో ఆమె ముగ్ధురాలై సర్వాలంకారభూషితయై పరమాత్మతో "నాథా ! మధురానగర మిచటి కెంతదూరము? మరుక్షణ మున మరలివత్తునని బాస చేసితిరి. నన్ను విడిచి ఇన్నినాళులు మధు రలో నెటుల గడపితిరి ? నా విరహవేదన నీకు తెలియదా? నా బాధను ఎవరితో చెప్పుకొనవలెను? దమయంతి గూడ లేదే ? విరహవేదన ఎట్టిదో ఆమెకు తెలియును. వ్రజవనితల స్థితియునంతే" అని దీనముగ బలికెను.

పరమాత్మ రాధాదేవితో "ప్రియా ! ఇది విచారించు సమయము గాదు. నీవే నా అర్ధాంగివి. నిన్ను నే నెటుల మరువగలను? అందుచే బృందావనమునకు మరలి వచ్చి నిన్ను గలసికొంటిని. నన్ను నీవు అప్రాకృతునిగ గ్రహింపుము. మనకు నెడబాటు గలుగదు. అవ్యాజ ప్రేమతో నన్ను చేరుము.

అది కార్తికమాస పూర్ణిమ. వెన్నెలలో వారు రాసోత్సవము ప్రారంభించిరి. పరమాత్మ మృదుమధురముగ మురళిని మ్రోగించుచుం డెను. అన్ని రూపములతో అందరికడ నుండి పరమాత్మ రాధాదేవితో గలసి శాస్త్రసమ్మతముగ నృత్యముచేయ దొడంగెను. దేవతలు వారిపై పుష్పవృష్టి కురియించిరి.

రాధాకృష్ణులు యమునానదిని, అందలి ఇసుక తిన్నెలను తిలకించుచు గోవర్ధనగిరి చేరిరి. గోపికాయూధములు ఆటకు వచ్చి నిష్ఠురోక్తులాడ దొడంగిరి. రాధామాధవులు అంతర్హితులై గోవర్ధనగిరికి మూడామడల దూరమునమున్న రోహితాచలమును చేరిరి. ఆ ప్రాంతము రామణీయకమునకు ప్రసిద్ధి వడపినది. అచట రాధాకృష్ణులు ఆనందోత్సాహములతో యథేచ్ఛగ విహరించుచుండిరి.

## ఋభుమహర్షి

రోహితాచలముపై నొంటికాలిపై నిలిచి ఋభుమహర్షి పరమాత్మను గూర్చి తపము చేయుచుండెను. రాధాదేవి పరమాత్మతో 'నాథా! ఈతడు ఎవరు? తపోధనుడుగ తోచుచున్నాడు? భక్తిప్రపత్తులు ఉట్టిపడుచున్నవి' అని అడుగ, శ్రీకృష్ణపరమాత్మ ఋషిని బిలిచెను. ఆయన తురీయావస్థయం దుండుటవలన బదులు పలుకలేదు. మహర్షి ధ్యేయమూర్తిని పరమాత్మ అంతర్హిత మగునటుల చేసెను. శ్రీకృష్ణుడు కనిపించకపోవుటచే కలవరముతో మహర్షి కనులుదెరచి చూడ రాధాకృష్ణుల దర్శన మయ్యెను.

ఋభుమహర్షి పరమాత్మతో "ప్రభూ! నేడు సుదినము. రాధాకృష్ణుల దర్శనభాగ్య మబ్బినది. నీవు పరమానంద స్వరూపుడవు. శ్యామవర్ణము గలవాడవు. రాధాదేవి శ్యామ. (శ్యామ యనగా శీతకాలమున వెచ్చగను, వేసవియందు చల్లగనుండు దేహము గలది.) (శ్యామఅనగా యౌవనవతి అనిగూడ అందురు.) తాము ఇరువురు అవతారమూర్తులు. నన్ను ఉద్ధరించుట కరుదెంచిన కరుణామయులు" అని అశ్రుధారలతో వారి పాదముల గడిగి తన్మయుడై దేహము త్యజించెను. మహర్షి దేహమునుండి వెలువడిన దివ్యతేజస్సు పరమాత్మలో లీన మయ్యెను.

పరమాత్మ మహర్షిని మరల రమ్మని పిలిచెను. ఆయన కృష్ణరూపమున వచ్చెను. పరమాత్మ వానిని కౌగిలించుకొని శిరము నాఘ్రాణించి వానిచేతిని పట్టుకొనెను. అంతలో దివ్యరథము వచ్చెను. ఋభుమహర్షి రాధాకృష్ణులకు ప్రణమిల్లి దేదీవ్యమానముగ వెలుగొందుచు రథము నధి

రోహించి బృందావనమున కేగెను. అది జీవన్ముక్త లక్షణము. ఋభు మహర్షి దేహము రాధాకృష్ణులను జూచి ద్రవించి నదీరూపము దాల్చెనని పరమాత్మ దెలుప రాధాదేవి చకితురా లయ్యెను.

పరమాత్మ రాధాదేవితో "నా నాభికమలమున బ్రహ్మ ఆవిర్భవించెను. ఆయన నన్ను గూర్చి తపముచేసి నా అనుగ్రహము పొందెను. ఆ సమయమున బ్రహ్మ ఊరువునుండి నారదమహర్షి జన్మించెను. ఒక పర్యాయము బ్రహ్మ నారదునితో 'త్రిలోకసంచారము వలన గలుగు ఫలమేమి? సృష్టి చేయరాదా?' అనెను. మహర్షి చతుర్ముఖునితో సృష్టించుట అవివేకమునకు దుఃఖమునకు హేతువు. పరమాత్మయందు అనురక్తి గలిగియుండుటకన్న నాకేమి గావలెను? ఆయన నామసంకీర్తనమే నా ధ్యేయము. నీకు మాత్ర మెందులకు ఈ సృష్టి? అని బదులు పలికెను. బ్రహ్మ కుపితుడై 'ఓయీ! కల్పాంతము వరకు నీవు గంధర్వుడవై గానము చేయుచుండుము' అని శపించెను. నారదుడు గంధర్వుడుగ దేవలోకమున కల్పకాల ముండెను. ఒకతూరి గంధర్వులతో గూడి నారదుడు బ్రహ్మకొలువునకు జనెను. మహర్షి సత్యలోకమందలి గంధర్వస్త్రీలనుజూచి మోహితుడై మైమరచి స్వరలయలులేకుండ తప్పు తాళము వేసెను. బ్రహ్మ మహర్షిని శపించెను. ఆనాటినుండి నారద మునీంద్రుడు నన్ను స్మరించుచు స్తోత్రము చేయుచుండెను. ఆయన పరమభాగవతోత్తముడు. నా హృదయసమానుడు'.

నారదుడు వేదనగరమునకు జనెను. ఆ నగరవాసులు వికృత రూపములతో అంగవైకల్యము గలిగియుండిరి. ఆయన వారితో ఇది ఏమి వింత? మీలో యక్షులు కిన్నరులు గలరు. ఈ అంగవైకల్యమునకు హేతువేమి? అని అడిగెను. వారు 'మునీంద్రా! మేము రాగదేవతలము. నారదుడు ప్రేమోన్మత్తుడై రాగతాళక్రమము తప్పి గానము చేసెను. అందుచే ఈ నగరవాసులు కురూపులు. అంగవైకల్యము గలవారైరి. మహర్షి వారితో 'రాగతాళములు ఎటుల వచ్చును' అని వారిని ప్రశ్నించెను. వారు 'మహర్షీ! నీవు సరస్వతీదేవికడ శిక్షణ పొందినచో దివ్యజ్ఞానము కలుగును' అని తెలిపిరి. నారదుడు శారదాదేవి గూర్చి

తపము గావించెను. ఆమె ప్రసన్నురాలై రాగ తాళములు తప్పకుండు నటులు అనుగ్రహించెను. మహతి నొసగెను. స్వరనాదములు, నృత్య, తాళగీతము లన్నియు ప్రసాదించెను, (అందుచే నారదునకు స్వరబ్రహ్మ అను బిరుదు వచ్చెను.) ఆయన తన గానకళను తుంబురునకు నేర్పెను. నారద తుంబురులు బృందావనమునకు వచ్చిరి. నా గుణరూపములను కీర్తించిరి. ఆ గానమాధుర్యమునకు సంతసించి ద్రవరూపము నొంది తిని. అదే బ్రహ్మద్రవము. అందు అనేక బ్రహ్మాండములు తిరుగుచుం డును. అటులే ఋభుమహర్షిగూడ నదీరూపము దాల్చెను.

రాధాదేవితో గూడ పరమాత్మ మాలతీవనమున కేగి విరహవేదనతో నుండుచున్న గోపికలకు దర్శన మొసగి, రాసక్రీడ సలుపుచు మురళిని ప్రయోగించెను. సకల చరాచరములు పరవశించినవి.

పరమాత్మ మధుర కేగుటకు సన్నద్ధుడయ్యెను. వ్రజవాసులు నందకిశోరునితో 'కృష్ణా! నీవు వ్రజమునకే సంపదవు. యదువంశము నకు వెలుగును ప్రసాదించువాడవు. సకల చరాచరములను మోహింప జేయువాడవు. గ్రీష్మముచే దప్పిగొను వానికి చల్లనినీరు ప్రాప్తించు నటులు జ్వరపీడితునకు ఔషధమువలె, మృతినొందు వానికి అమృతము లభించినటులు, నీరాక మాకు ఆనందదాయకము. మా చిత్తము నీ పాదారవిందములకడ స్థిరముగ నిలుచునటులు చేయుము. భక్తుల బ్రోచుటకై సగుణుడవుగ భాసించుచుందువు. నిరపేక్షతో నిన్నే కొల్తుము. అందలి ఆనందము అనన్యభక్తులకే తెలియును. కృష్ణా! నీ వెన్నటికి మమ్ములను మరువవద్దు. విడువకూడదు. త్వరలో బృందావనమునకు రావలెను. నిన్ను చూడనిదే మా ప్రాణములు నిలువవు. నీకొరకే మేము బ్రతికియుంటిమి' అని వేడుకొనిరి.

పరమాత్మ వ్రజవాసులతో 'మీరందరు నాకు ప్రేమభాజనులు. బృందావనమందలి తృణములు, కణములు నాకు అత్యంత ప్రీతికర మైనవి. తనువులు వేరైనను తలపు లొకటే. మన మనస్సులు వేరుకావు. మీ మనస్సులను నాపై లగ్నము చేయుడు. మీకు ఎట్టి ఆపదలు గలు గవు. ఒకమాసము గడచిన పిమ్మట మరలుదును. కంస సంహారముతో

బాధలు తొలగలేదు. వాని మామ జరాసంధుడు మహాబలోపేతుడు. వాని సంహారముతోగాని శత్రునిర్మూలన పూర్తిగాదు. భక్తులు నన్నెటులు విడువలేకుందురో నేనును వారిని అటులె విడువలేను. నన్ను భజించు వారిని నేను భజింతును. ఇది నా స్వధర్మము' అని వివరించెను.

పరమాత్మ ఉద్ధవుడు ఒకరథముపై నధివసించిరి. వేరొకరథముపై నందయశోదలు ఆసీనులైరి. వ్రజవాసులకడ అనుమతినొంది పరమాత్మ మధురానగరమునకు బయలుదేరెను. నందయశోదలు సంతపించిరి. రాధాదేవి హృదయము వ్రక్కలయ్యెను. తనను గూడ మధురకు గొనిపోలేదను ఆవేదనతో ఆమె మూర్ఛిల్లెను. వ్రజవాసుల స్థితియు నంతే.

## కోలాసురుడు

కౌశాంబి నగరమును రాజధానిగ చేసికొని కౌశారవి అను రాజు పాలించుచుండెను. కోలాసురుడు అను దానవుడు రాజును పారద్రోలి నగరవాసుల బాధించుచుండెను. వారు మధురకు బయలుదేరిరి. మార్గమధ్యమున వేటకై అరుదెంచిన బలరామస్వామితో 'ప్రభూ! కోలాసురుడు మమ్ములను పెక్కురీతుల బాధించుచున్నాడు. కౌశారవి మిమ్ములను గూర్చి తప మాచరించుచుండెను. ఆయనను అనుగ్రహింపుము. ఇక నీవే మాకు రక్షకుడవు. ఆ రక్కసుడు కంసునకు ఆప్తుడు. వానిని వెంటనే సంహరింపుము' అని వేడికొనిరి.

బలరామస్వామి కోలాసురునిపైకి దాడి వెడలెను. వాడు అనేక అక్షౌహిణుల సేనను గొనివచ్చెను. బలరామస్వామి నాగలిని వాని కడ్డు పెట్టెను. అంజనేయుని వాలమువలె బలరాముని నాగలి పెరుగునట. తనపైకి వచ్చినవారిని బలరాముడు ముసలముతో సంహరించుచుండెను కోలాసురుడు మదగజము నెక్కి ఆయనతో పోరుటకు సిద్ధమయ్యెను. బలరామస్వామి ముసలముతో మదగజమును పొడిచెను. అది అసువుల బాసెను. రక్కసుడు శూలముతో బలరాముని పొడిచెను. ఆయన వానిని ముసలముతో బలముగ మోదెను. వాడు గదతో ఆయనను కొట్టెను. బలరామస్వామి వానిని నాగలితో దగ్గరకు లాగి ప్రళయకాలాగ్ని వలెనున్న ముసలముతో బాదెను. రక్కసుని మాయలు ముసలముకడ పనికిరాలేదు.

బలరామస్వామి వానిని గిరగిర త్రిప్పి ముసలముతో బాదెను. కోలాసురుడు మృతినొందెను. దేవతలు బలరామస్వామిపై పుష్పవృష్టి కురియించిరి. బలరాముడు కౌశారవికి పట్టాభిషేకము గావించి గర్గమహర్షి మున్నగువారిని వెంట నిడుకొని తీర్థయాత్రకు బయలుదేరెను.

బలరామస్వామి భాగీరథీ తీరమునకు జని గంగను స్తోత్రము చేయుచు, స్నానాదికములు పూర్తిగావించి భూసురులకు గోవులు, రత్నములు, బంగారు నాణెములు దాన మొసగెను. అంతట ఆయన కౌశాంబీ నగరమునకు నాలుగు ఆమడల దూరముననున్న రామతీర్థము చేరెను. ఆ ప్రాంతమును దృఢాశ్వుడు అమరాజు పాలించుచుండెను. ఆయన కురూపియగు లోమశమహర్షిని చూచి పరిహసించెను. మహర్షి వానిని 'పందిమోము గలిగిన రక్కసుడ వగుదువు గాక!' అని శపించెను. వాడే కోలాసురుడు. రామతీర్థమందు బలరాముడు పెక్కు దానములు చేసెను.

అంతట ఆయన జాహ్నవీ తీర్థమున కేగి పెక్కు దానధర్మముల గావించెను. పిమ్మట ఆహారక్షేత్రమునకు జనెను. అచట మండూక మహర్షి తురీయావస్థయందుండ, వాని ధ్యేయమూర్తిని బలరామస్వామి అంతర్హితము గావించెను, మహర్షి కనులు దెరువ బలరామస్వామి కనుపట్టెను. మునీంద్రుడు ఆయనకు ప్రణమిల్ల బలరామస్వామి వానిని వరము కోరుకొమ్మనెను. భాగవతవిద్యను ప్రసాదింపుమని మహర్షి కోరెను. ఉద్ధవునిద్వారా ఆయనకు ఆ విద్య లభించునని బలరామస్వామి అభయ మొసగెను.

మండూకమహర్షి బలరామునితో "స్వామీ! ఆ అధికారమును ఉద్ధవున కెవ రొసగిరి? ఆయన నా కెటులు తటస్థించును?" అని ప్రశ్నింప, ఆయన 'మునీంద్రా! ఉద్ధవుడు తీర్థయాత్రలో నున్నాడు. ఆయనను భాగవతసంప్రదాయ ప్రవర్తగ పరమాత్మ నియమించెను. ఆయన రాధాదేవి దుఃఖమును ఉపశమింపజేసిన మహానుభావుడు. ఆయునకు పరమాత్మ మంత్రోపదేశమునకు సైతము అధికార మొసగెను. తన తేజస్సు వాని కొసగెను. ఉద్ధవుడు చిరంజీవి. జనమేజయుడు అశ్వ

మేధ యాగము చేయునపుడు, ఉద్ధవుడు అచట భాగవతతత్త్వమును పురాణప్రవచనము చేయును. అది విను భాగ్యము నీకు అప్పుడు గలుగును' అని తెలిపెను. బలరాముడు పెక్కు తీర్థములను సేవించి మధురా నగరమునకు మరలెను.

## మధురానగర మాహాత్మ్యము

శ్రీమన్నారాయణుడు ఆదివరాహమూర్తియై భూదేవిని పైకి దెచ్చి నిలిపిన స్థలమే మధురానగరము. దీని అధిష్ఠానదైవము శ్రీకృష్ణ పరమాత్మ. దీనికి సచివుడు కపిలవరాహమూర్తి. దీనికి రక్షకురాలు చండికా దేవి. ఆకొన్నవారికి అన్నమిడు కరుణామయి మధురానగర అధిదేవత. ఇచట మృతినొందు వారికి గోలోకప్రాప్తి కలుగును. ఇచట బ్రహ్మ తపస్సుచేసి మనువును గనెను. ఇచట ఈశ్వరుడు, దేవవరుడు తపము గావించి ద్వారపాలకత్వము ఆర్జించిరి. ఇచట దేవరాజు తపముగావించి ఇంద్రత్వము నందెను. ఇచట ధ్రువుడు తపస్సు చేసెను. సప్తఋషులు ఈ తావున తపస్సుచేసి యోగసిద్ధిని బొందిరి. శంతనమహారాజు తపము గావించి భీష్ముని కుమారునిగ బొందినది ఈ భూమియందే. అంబరీషుడు ముక్తినొందినది ఈ పుణ్యస్థలమందే.

మధురనామ ముచ్చరించినచో భగవన్నామఫలితము గలుగును. మధురమృత్తికను ఆఘ్రాణించిన తులసీదళము నాఘ్రాణించిన ఫలము దక్కును. ఇచట భుజించినవారు భగవన్నివేదన గావించిన ఫలమును బొందుదురు. మధురను సేవించిన సకల తీర్థములను సేవించినట్లే. మధురను దర్శింపని నేత్రములు నేత్రములు గావు. కాలిడని పాదములు పాదములు గావు. సకల తీర్థములు ఇచట గలవు. శ్రీకృష్ణ పరమాత్మ ఈ తావుననే జన్మించినది. ఈ నగరమందలి వీథులలో ముక్తి విక్రయింపబడునమటలో అతిశయోక్తి లేదు. ప్రళయకాలములో సైతము నశింపని మహానగరము మధుర యొక్కటే. మధురానగర మాహాత్మ్యము చదువు వారికి సకలైశ్వర్యములు, సకల మనోరథములు సిద్ధించును. మరియు గోలోకప్రాప్తి కలుగును.

మధురాఖండము సమాప్తము.

# ద్వారకా ఖండము

## జరాసంధుడు

కంస వధానంతరము వాని సతులు, అస్తి ప్రాప్తులు జరాసంధుని కడ విలపించిరి. వాడు కుపితుడై యదువంశము నిర్మూలింతునని శపథ మొనర్చెను.

మధురానగరమున ఉగ్రసేనుని కొలువుకూటమునందు బలరామ కృష్ణులు కొలువుదీరిరి, జరాసంధుడు మధురానగరమును ముట్టడించెను పరమాత్మ చలింపలేదు. ఆయన బలరామునితో 'అన్నా! ఇపుడు మన మేమి చేయవలెనో బోధ చేయుడు' అని అర్థించెను. బలరామస్వామి పరమాత్మతో 'కృష్ణా! జరాసంధుని వదలినచో వాడు సర్వము నొద్ది పోరాడును. అందుచే తొలుత సేనను సమూలముగ సంహరింపవలెను' అనెను. జయజయ ధ్వానములతో కొలువుకూటము ప్రతిధ్వనించెను.

శ్రీకృష్ణ పరమాత్మ స్మరించినంత మాత్రముననే సకలాయుధ ములు అత్యుత్సాహముతో వచ్చినవి. వాటిని గైకొని బలరామ కృష్ణులు జరాసంధుని సేనను చీల్చి చెండాడుచుండిరి. వంగదేశాధీశుడు, సుయో ధనుడు అనేక అక్షౌహిణుల సేనను జరాసంధునకు తోడ్పడుటకై పంపిరి. కంసుని మిత్రులు మిన్నకుందురా? వారును శక్తికొలది జరాసంధునికి సకల విధముల తోడ్పడుచుండిరి. పరమాత్మ శార్ఙ్గ ధనుష్టంకారము గావించెను. పదునాలుగు భువనములు కంపించెను. పరమాత్మ వదలిన మెరుపు బాణములకు గజములు పారిపోయెను. అశ్వములు చిందర వందర యయ్యెను. రథములు ప్రక్క అయ్యెను. సారథులు పిక్క బలము చూపిరి. సేనల కవచములు తెగిపోయెను. రక్తపుటేరులు ప్రవ హించుచుండెను. రణరంగము వైతరణీనదివోలె తోచెను. అందు ఏను గులు మొసళ్ల వలెను, అశ్వములు కూర్మముల వలెను, కరములు మత్స్య ముల వలెను, కురులు నాచులవలెను, కుండలములు గులకరాళ్ల వలెను, ధ్వజములు తెగి సైకతమువలెను తోచెను. భూత, ప్రేత, పిశాచగణములు

వీరవిహారము చేయుచుండెను. అవి కపాలపాత్రలో నెత్తురు నింపుకొని త్రాగుచుండెను. మృగరాజుపై నిలిచి భద్రకాళి తాండవము చేయ దొడంగెను. గంధర్వస్త్రీలు, అప్సరసలు ఆ దృశ్యమును తిలకించుటకు వచ్చిరి. మృతినొందిన వారు స్వర్గసుఖముల బడయుచుండిరి.

బలరామస్వామి నాగలితో అక్షౌహిణుల సేనను లాగి ముసలముతో సంహరించుచుండెను. జరాసంధుడు సేనతో బలరాము నెదుర్కొనెను. ఆయన హలముతో వాని రథమును లాగెను. జరాసంధుడు విరథుడయ్యెను. బలరామ జరాసంధులు ద్వంద్వయుద్ధమునకు పాల్పడిరి. వారిరువురు మృగరాజులవలె పోరు సల్పుచుండిరి. బాహాబాహి ముష్టాముష్టియుద్ధము జరుగుచుండెను. భూమి కంపించెను. బలరామస్వామి జరాసంధుని నేలపై విసరికొట్టెను. ముసలముతో మోదుచుండెను. పరమాత్మ బలరాముని వారించుచు జరాసంధుని చంపవద్దని హెచ్చరించెను. పరాభవము చాలునని హితవు పలికెను. పరాభవాగ్నియందు దహించికొనిపోవుచు జరాసంధుడు పారిపోయెను. అనుచరులు వానిని వాని ప్రాసాదమునకు చేర్చిరి.

రణరంగమునుండి విజయోపేతులై నగరమునకు మరలివచ్చు బలరామ కృష్ణులను మధురానగరవాసులు కొనియాడుచు పూజించిరి. జరాసంధుడు పదునేడుమారులు మధురానగరమును ముట్టడించి బలరామ కృష్ణులచే పరాజితుడై పారిపోయెను. పదునెనిమిదవ పర్యాయము జరాసంధుడు ముట్టడించుటకు సేనను సమాయత్త పరచుచుండెను. బలరామ కృష్ణులు శాత్రవులనుండి తెచ్చిన అమూల్యాభరణములు, అలంకారములు ఉగ్రసేన మహారాజునకు సమర్పించిరి.

## కాలయవనుడు

కాలయవనుడు బలపరాక్రమములు గలవాడు. వానిని చూచి యాదవులు భయపడుచుండిరి. నారదుడు వానికడ కేగి 'కాలయవనా! నీవు శూరుడవని తలచుచున్నావు. మధురానగరమున వీరాగ్రేసరుడు కలడు. ఆయన జరాసంధుని జయించెను. నీవు ఆ పరాక్రమశాలిని జయింపవలెను' అని ప్రేరేపించెను.

కాలయవనుడు పెక్కుఅక్షౌహిణుల సేనతో మధురపై దాడి వెడలెను జరాసంధుడుకూడ ముట్టడించెను. యాదవులు సముద్రగర్భమున దాగి యుండుటకు నిశ్చయించుకొనిరి. సముద్రమధ్యమున సంద్రెండామడల మహానగరము నిర్మింపుమని శ్రీకృష్ణుడు విశ్వకర్మకు ఆనతిచ్చెను. విశ్వకర్మచే అద్భుతముగ నిర్మింపబడిన మహానగరమే ద్వారకానగరము. అది సకల సంపదలకు నిలయము. యోగబలముతో పరమాత్మ మధుర యందలి ఆబాలగోపాలమును ఒక్క రాత్రిలో ద్వారకానగరమునకు తరలించెను. బలరామస్వామిని ద్వారకానగరమునకు రక్షకుడుగ నియమించి పరమాత్మ ఒంటరిగ నిరాయుధుడై రణరంగమునకు పోవుచుండెను. కాలయవనుడు ఆయనను చిక్కించుకొనుటకు ఎంత యత్నించినను ఫలితము లేకపోయెను.

## ముచికుందుడు

పరమాత్మ వానిని శ్యామలాద్రియందలి గుహకడకు గొనిపోయెను. అచట మాంధాత కుమారుడు ముచికుందుడు తప మాచరించుచుండెను. ఆయన దేవాసురయుద్ధమున దేవతలకు సాయము చేయుటచే వారు వానిని వరము గోరుకొమ్మనిరి, ఆయన ' నేను ఇప్పుడు గాఢనిద్రపోవలెను. మేల్కనిన వెంటనే నాకు పరమాత్మ దర్శనము గావలెను. మధ్య ఎవడైనను నాకు నిద్రాభంగము కలిగించినచో నా దృష్టి తగిలినవెంటనే వాడు భస్మముగావలెను' అని కోరెను. దేవతలు 'తథాస్తు' అని దీవించిరి అది కృతయుగమందలి గాథ. ముచికుందుడు నిదురించు గుహకడకు కాలయవనుని గొనివచ్చి పరమాత్మ అంతర్హితు డయ్యెను.

పరమాత్మ గుహయందు జొచ్చెనని తలచి కాలయవనుడు ఆ గుహయందు ప్రవేశించెను. పరమాత్మయే ముచికుందుడని భ్రమచెంది కాలయవనుడు ఆయనను తన్నెను. ముచికుందుడు కనులు తెరచిచూడ కాలయవనుడు కనిపించెను. మహర్షి దేహమునుండి అగ్నిజ్వాలలు బయలుదేరి కాలయవనుని భస్మము గావించెను . పరమాత్మ చతుర్భుజములతో ముచికుందునకు దర్శన మొసగెను. గర్గుడు తనకు తెలిపిన శ్రీహరి ఆతడేయని విశ్వసించి ముచికుందుడు పరమాత్మను స్తుతించెను.

" నందనందనా ! హే కృష్ణా ! నీ మోము పద్మము. నేత్రములు పద్మములు. కరములు పద్మములు. పాదములు పద్మములు. విరాట్స్వ రూపుడవు. కాలకాలుడవు, అనంతుడవు. పూర్ణుడవు. నిత్య బుద్ధ ముక్త స్వరూపుడవు. హే భక్తవత్సలా ! పాహిమాం ! రక్షమాం ! ".

పరమాత్మ ముచికుందునితో " ఓయీ ! నీ భక్తిప్రపత్తులు నన్ను ముగ్ధుని గావించినవి. నీవు బదరికాశ్రమమున కేగి తపము చేయుము. దేహము గతించిన పిమ్మట యోగివై జన్మించి మరల నన్నుగూర్చి తప మాచరించినచో నన్ను బొందెదవు " అని అభయ మొసగెను.

## బలరామస్వామి పెండ్లి

సూర్యవంశపు రాజులలో ఆనర్తుడను రాజు గలడు. ఆయనకు రైవతు డను కుమారుడు గలడు. ఆయన కుశస్థలి అను నగరము నిర్మించుకొని ధర్మపరిపాలన పలుపుచుండెను. రైవతునకు నూర్గురు తనయులును, ఒక కొమార్తె గలరు. ఆమె పేరు రేవతి. అందాలరాశి. సద్గుణ సంపన్నురాలు. ఆమెకు యుక్తవయస్సు వచ్చెను. తగిన వరుని వెదకుచు రాజు బయలుదేరెను. చంద్రవంశపు రాజులలో యోగ్యుడు, అతి బలసంపన్నుడగు వరుని గూర్చి విచారించుచుండెను.

రైవతుడు యోగబలముతో కొమార్తెయగు రేవతిని వెంటనిడుకొని సత్యలోకమున కేగెను. ఆతడు చతుర్ముఖునితో ' ఓ బ్రహ్మదేవా ! నీవు సకల చరాచరములు సృష్టించువాడవు. దేవతలు నీ అవయవములు, రాక్షసులు నీ పాదములు. సృష్టి నీ దేహము. ఈమె నా గారాబుపట్టి. పేరు రేవతి. తగిన వరుని దెలుపుము ' అని వేడుకొనెను.

బ్రహ్మ రాజుతో ' ఓయీ ! ప్రాకృతపురుషులు ఈమెకు తగరు. శ్రీకృష్ణుని అన్న బలరామస్వామి నీ తనయకు తగిన వరుడు. వసుదేవుని కుమారుడు. బలరామకృష్ణులు ద్వారకానగరమందు వేంచేసియున్నారు. నీవు వారిని ఆశ్రయించిన నీ అభీష్టము నెరవేరును ' అని తెలిపెను.

రైవతుడు మహానందభరితుడై అమూల్యాభరణములు, పట్టుపుట్ట ములు, నవరత్నములు, బంగారునాణెములు రథమున నిడుకొని పరివార సమేతముగ ద్వారకానగరమున కేగి బలరామస్వామిని దర్శించెను. తన తనయను చేపట్టుమని ప్రార్థించెను. కానుకల సమర్పించెను. బలరామ స్వామి రేవతిని పరిణయ మాడుటకు సమ్మతించెను. రేవతీ బలరాముల కల్యాణము వైభవముగ జరిగెను. రైవతుడు బలరామకృష్ణుల కడ సెలవు గైకొని తప మాచరించుటకై బదరికాశ్రమమునకు జనెను.

## రుక్మిణీ కల్యాణము

కుండిననగరమును రాజధానిగ చేసికొని భీష్మకుడను రాజు విదర్భ దేశము పాలించుచుండెను. ఆయన ధర్మయుతుడు. మహాయశస్వి. ఆయనకు రుక్మి, రుక్మధర, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మనేత్రులను ఐదు గురు కుమారులును, రుక్మిణి (రుక్మము = బంగారము) అను కొమార్తె గలరు. ఆమె సాక్షాత్ లక్ష్మీదేవి అంశయే. స్వర్ణకాంతులతో మెరయు శరీరచ్ఛాయ, సౌందర్యరాశి. శుద్ధచైతన్యమే రుక్మిణిగ ఉద్భవించెను. సుగుణములే ఆమెకు ఆభరణములు. మాతాపితలకు, సోదరులకు తలలో నాల్కగ మెలగుచుండెను. ఆమె శుక్లపక్ష చంద్రునివలె దినదినాభివృద్ధి నొందుచుండెను.

రుక్మిణి చెలులతో గచ్చకాయలు, ఓమనగుంటలు ఆడుచుండ ముంజేతిగాజుల గలగలలు జగత్తును మురిపించుచుండెను. బొమ్మల పెండ్లిండ్లు చేయుచుండెను. గుజ్జనగూళ్ళు వండి సఖులకు పంచిపెట్టు చుండెను. ప్రాసాదమందలి తూగుటుయ్యాల లూగుచుండెను. చిలుక లకు మాటలు నేర్పుచుండెను. నెమళ్లతో నాట్యముచేయ దొడంగెను. కలహంసలకు నడకలు నేర్పుచుండెను. సాముద్రికశాస్త్రము ననుసరించి ఆమె శుభలక్షణశోభిత. పెద్దలవలన పరమాత్మ రూప గుణములను వినగా రుక్మిణికి ఆయనపై మక్కువ ఎక్కువయ్యెను.

నారదమహర్షి కుండిననగరమునకు విచ్చేసెను. రాజు మహర్షికి స్వాగత సత్కారములు సల్పి 'మునీంద్రా! తాము త్రిలోకసంచారులు.

నా కౌమార్తెకు యుక్తవయస్సు వచ్చినది. తగిన వరుని దెలుపుము ' అనెను. దేవకీ వసుదేవుల తనయుడగు శ్రీకృష్ణపరమాత్మ ఆమెకు తగిన వరుడని నారదుడు హితము పలికెను. రాజు కడు సంతసించెను. నంద నందనుని వీరోచిత కృత్యముల నెఱింగినవా డగుటవలన భీష్మకుడు అందుల కంగీకరించెను. రుక్మిణీదేవి పరవశించెను.

భీష్మకుడు కొలువుకూటమున సభ నేర్పాటుచేసెను. అయన నగర వాసులతో రుక్మిణిని శ్రీకృష్ణ పరమాత్మ కిచ్చి కల్యాణము చేయుటకు నిశ్చయించుకొంటినని తెలిపెను. సదస్యుల సంతోషముతో కరతాళ ధ్వనులు ప్రతిధ్వనించెను. రుక్మి హృదయము భగ్గున మండెను. అయన శ్రీకృష్ణునకు బద్ధవిరోధి. అందుచే రుక్మి క్రోధోద్రిక్తమూర్తియై పేరోలగమున 'రాజా! శ్రీకృష్ణుడు రుక్మిణికి తగిన వరుడు కాడు. శ్యామ వర్ణము గలవాడు. యయాతిచే శపింపబడి యదువంశమున జన్మించెను. నందవ్రజమున పెరిగెను. రాజ్యార్హత లేదు. పాలు, పెరుగు, వెన్న, మీగడలు దొంగిలించిన ఘనుడు. నందవ్రజమందలి గోపికలను తన మురళీరవముతో మురిపించి, వారి హృదయములను హరించి, వారితో రాసక్రీడలు సల్పిన జారుడు. కులము, గోత్రము, నీతి, జాతి, పరువు, ప్రతిష్ఠలు లేని మర్యాద లెరుగని అతిసామాన్యునకా రుక్మిణి నిచ్చుట? వానితో ఆమె అనుభవించు సుఖ మేమి?

చేదిదేశాధీశుడగు శిశుపాలుడు మన్మథుని మించిన సుందరుడు. బలపరాక్రమములు గలవాడు. రుక్మిణికి అయన తగిన వరుడు ' అనెను. రాజు, సదస్యులు నిశ్చేష్టులైరి. రుక్మి క్రూరుడు, కుటిలుడు, దుర్జన సహవాసి. ఎంతటి కిరాతకృత్యమునకైనను వెఱవని మూర్ఖుడు. అందుచే రాజు మిన్నకుండెను. కన్నబిడ్డను శిశుపాలున కిచ్చుటకు అంగీకరింపక తప్పలేదు.

ఆ వార్త విని రుక్మిణీదేవి ఖిన్నురాలయ్యెను. ఆమె తలిదండ్రుల కడ కేగెను. రాజు కొమార్తెతో 'నారదమహర్షి వాక్యముల ననుసరించి నిన్ను శ్రీకృష్ణపరమాత్మ కిచ్చి పరిణయము గావింప పూనుకొంటిని. రుక్మి శ్రీకృష్ణునకు విరోధి. ఆ దుష్టునకు పరమాత్మ విశిష్టత ఎటులు తెలి

యుమ ? అతడు పరమాత్మను పెక్కువిధముల దూషించెను. ఆ పలుకులు కర్ణకఠోరముగ నున్నవి. నిస్సహాయస్థితిలో నుంటిని. రుక్మిమనసు మార్చుట అసాధ్యము. మారుపలుకు సాహసము నాకు లేదు. అందుచే నిన్ను శిశుపాలున కిచ్చి వివాహము చేయుటకు నిశ్చయించుకొంటిని.

రుక్మిణి సద్గుణసంపన్నురాలు. తలిదండ్రుల అశక్తతను దీనావస్థను గమనించెను. పరమాత్మని దక్క అన్యుని చేపట్టుటకు ఇచ్చగించ లేదు. అందులకు తన ప్రాణముల నైతము పణముగ నొడ్డుటకు ఆమె సిద్ధపడెను. సంకల్పసిద్ధికై విశ్వాసపాత్రుడగు భూసురోత్తముని రావించెను. ఆయన పేరు అగ్నిద్యోతనుడు.

అగ్నిద్యోతనుడు వేదశాస్త్రపారంగతుడు, కృష్ణభక్తుడు, సమయస్ఫూర్తి గలవాడు. రుక్మిణి వానితో "విప్రోత్తమా ! కొలువుకూటమున జరిగిన ఉదంతము మీకు తెలియనిది కాదు. నారదమహర్షి హితవాక్యముల ననుసరించి నన్ను పరమాత్మ కిచ్చుటకు నా తలిదండ్రులు అంగీకరించిరి. నా అన్న రుక్మి అందులకు అభ్యంతరము దెలుపుటయే గాక నన్ను శిశుపాలున కొసగుదునని ప్రేలెనట. రుక్మి బలవంతుడు. రాజు రాణి నిస్సహాయులు. విధిలేక వారు నన్ను శిశుపాలున కీయదలచిరి. నన్ను కాపాడ సమర్థుడు ఆ పరమాత్మయే. నీవు పరమాత్మ కడకేగి నా దీనావస్థను ఆయనకు దెలిపి ఆ మహనీయుని కుండిన నగరమునకు గొనిరమ్ము. ఆయన నన్ను ద్వారకకు దోడ్కొని పోవును. నా సర్వస్వము ఏనాడో పరమాత్మకు సమర్పించితిని. పరమాత్మ సకాలమునకు రానిచో రుక్మిణి అసువులు వాయుట నిక్కమని తెలుపుము" అనెను.

అగ్నిద్యోతనుడు రుక్మిణితో "రాజకుమారీ ! ఈ దేహము నీ తండ్రిచే పోషింపబడినది. నీకొరకై ఎట్టి త్యాగమునకైన వెనుదీయను. పరమాత్మ కడకేగి నీ అభిమతము నెరిగించి నిన్ను ఆయన ద్వారకకు గొనిపోవునటులు చేతును. పరమాత్మ దీనజనరక్షకుడు. ఆపన్నుల కాపాడుదునని కంకణము గట్టుకొనిన దయాంబురాశి. సర్వజగత్తుకు కారణభూతుడు, సర్వజ్ఞుడు. దివ్యదృష్టితో ఎచట నేమి జరుగుచున్నదో

గ్రహింపగలిగిన ధీశాలి. కష్టములు కాపురముండవు. నీకోర్కె ఫలించును. త్వరపడి ప్రాణత్యాగమునకు పాల్పడవలదు. పరమాత్మ నిన్ను తప్పక కాపాడును" అని అనునయించెను. రుక్మిణీదేవి విప్రునకు వీడ్కో లొసగెను. ఆ రహస్యము వా రిరువురకే తెలియును.

అగ్నిద్యోతనుడు ద్వారకానగరమునకు బయలుదేరెను. తన్ను దౌత్యమునకు రుక్మిణీదేవి నియమించుట దైవసంకల్పమే. తన జన్మ ధన్య మయ్యెనని తలపోయుచు అగ్నిద్యోతనుడు ద్వారకానగరమున ప్రవేశించెను.

ద్వారకానగరము దేదీప్యమానముగ ప్రకాశించుచుండెను. ఎచట వినినను కృష్ణనామ సంకీర్తనమే. శ్రీకృష్ణుని వీరోచిత గాథలే. నగర వాసులకు పరమాత్మ యందలి ప్రేమానురాగములకు అచ్చెరు వొందుచు పరమాత్మ మందిరమునకు జనెను. బ్రహ్మతేజస్సుతో దివ్యముగ ప్రకాశించు అగ్నిద్యోతనుని చూడగనే ద్వారపాలకులు స్వాగతము పలికిరి. పరమాత్మ మందిరవైభవము కనులార తిలకించుచు ముందునకు సాగుచుండ ఆ వార్త పరమాత్మ చెవిని బడెను.

రత్నఖచిత స్వర్ణసింహాసనముపై నధివసించియున్న పరమాత్మ డిగ్గన లేచి అగ్నిద్యోతనునకు నమస్కరించి అర్ఘ్యపాద్యాదుల నొసగి ఉచితాసనమున గూర్చుండ బనిచి, షోడశోపచారపూజలు గావించి, కుశల ప్రశ్నలవేసి, మృష్టాన్నముల వడ్డించి భోజనానంతరము పూలపాన్పుపై శయనించిన పిమ్మట పరమాత్మ వానికి పాదసంవాహనము చేయుచు అమాయకునివలె నటించుచు "భూసురోత్తమా! బ్రహ్మతేజస్సు మూర్తీభవించిన మహనీయునివలె తోచుచున్నావు. ఎచటనుండి రాక? విప్రులు ధర్మయుక్తముగ సంచరించుచున్నారా? సదాచారమును పాటించుచున్నారా? సకల సంపదలతో రాజ్యము సుభిక్షముగ మున్నదా? యజ్ఞయాగాది క్రతువులకు ఎట్టి అవరోధము లేదుగదా? ఊరకరారు మహాత్ము లని పెద్ద లందురు. మిమ్ములను తృప్తిపరచుటయే నా ధ్యేయము. తమరాకకు హేతువు తెలుప ప్రార్థన" అనెను.

అగ్నిద్యోతనుడు పరమాత్మతో "నందనందనా! నీవు సర్వజ్ఞుడవు. బ్రహ్మాండము లన్నియు నీ కుక్షియందు గలవు. నిన్ను దర్శించుటవలన నా జన్మ చరితార్థమయ్యెను. యోగీశ్వరులకు సైతము అలభ్యమగు నీ దివ్యమంగళరూప దర్శనభాగ్యము నొసగి నన్ను కృతార్థుని గావించితివి. నీ ఆతిథ్యము ఆదర్శప్రాయమైనది. నీ సంకల్పము లేనిచో గడ్డిపోచయైనను కదలదు, నా రాక నీ సంకల్పమే.

నేను కుండినసగరము నుండి వచ్చియున్నాను. విదర్భదేశాధిపతి భీష్మకుని గారాబుపట్టి రుక్మిణీదేవి నిన్ను వరించినది. అన్యుని చేపట్టనని ప్రతిన బూనినది. ఆమె అన్న రుక్మి ఆమెను చేదిదేశాధీశుడగు శిశుపాలున కిచ్చుటకు యత్నించుచుండెను. పరిణయ సన్నాహములు చురుకుగ సాగుచున్నవి. రాజు, రాణి నిస్సహాయులు. రుక్మిణీదేవిని కాపాడ గల శక్తి నీకే గలదు" అనుచు రుక్మిణీదేవి పంపిన సందేశమును పరమాత్మకు తెల్పెను. పరమాత్మ రుక్మిణి పంపిన లేఖను విప్పిచూడ రుక్మిణీదేవి దీనవదనయై అందు గోచరించెను.

ఆమె పరమాత్మతో "ప్రభూ! నారదమహర్షి మీ గుణగణములను నాకడ వర్ణించెను. నీవు అప్రాకృత పురుషుడవని విశ్వసించి త్రికరణశుద్ధిగ నిన్నే వరించితిని. నీ కల్యాణ గుణములను స్మరించినచో సమస్తతాపములు నశించును. నీ జగన్మోహనాకారము జూచి పశుపక్ష్యాదులు పరవశించును. ఇక నిన్ను నేను వరించుటలో విశేషమేమి గలదు? నాలో సిగ్గు నశించినది. నీయందే నా మనస్సు లగ్నమైయున్నది. సకల ధర్మములు వీడి నిన్నే సేవింపుమని ప్రాజ్ఞులు పలుకుదురు. నీవు సకల కల్యాణ గుణప్రపూర్ణుడవు. నిన్ను ఏ స్త్రీ వరించకుండును? నీకే ఆత్మార్పణ చేసితిని. నాదైనది నీకు అర్పింపలేదు. నీది నీకే సమర్పించితిని. నీవు నిరాకరించినచో విరహాగ్నిలో మ్రగ్గుదును. మరుజన్మమున నీపాద సన్నిధిని దాసినై పడియుందును. నీ పాదోదకము, నీ నామామృతము అంతస్తమస్సును పారద్రోలును. ఆదిలక్ష్మి నిన్నే వరించెను. సముద్రమథనము గావించి మహాలక్ష్మిని గైకొనినటుల సేనామథనము గావించి నన్ను గొనిపొమ్ము.

మృగరాజుకు దక్కవలసిన సొత్తును జంబుకము ఆశించినటుల శిశుపాలుడు వేచియుండెను. ఆ దుష్టుని చెరనుండి నన్ను కాపాడు బాధ్యత నీదే. వివాహమునకు ముందుగ గౌరీపూజకై నగరపు పొలి మేరలలో నున్న దేవళమునకు వత్తును. నన్ను నీవు తోడ్కొనిపోవుటకు అది తగిన సమయము.

ప్రాణేశా! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రముల కలిమియేల? పురుషరత్నమా! నీవు భోగింపగాలేని ఈ శరీర సౌందర్యము వలన ప్రయోజనమే మి? భువనమోహనా! నిన్ను దర్శింపనేరని చక్షురింద్రి యముల సత్త్వమేల? నీ వనమాలికాగంధము ఆఘ్రాణింపగాలేని ఘ్రాణ మేల? నీకు దాస్యము చేయని జన్మమేల? కలువలను వికసింప చేయు వాడు చంద్రుడు మాత్రమే. నా హృదయకమలమును వికసింప చేయ గల శక్తిమంతుడవు నీ వొక్కడవే. అందుచే నా విన్నప మాలకించి వెంటనే రమ్ము. నీకొరకు నేను నిరీక్షించుచుందును" అని విన్నవించెను. పరమాత్మ నవనీతహృదయము కరగెను.

శ్రీకృష్ణపరమాత్మ విప్రునితో "భూసురోత్తమా! నేడు సుదినము. రుక్మిణీదేవి రూపగుణములు నారదుడు నాకు దెలిపెను. ఆమెయందు నాకు అనురాగము అంకురించెను. నాకును అన్నపానములు రుచించుట లేదు. నిదుర కరవయ్యెను. నా కనుల యెదుట రుక్మిణీదేవి గోచరించు చున్నది. క్షత్రియులకు స్వయంవర మున్నది. రుక్మి అభీష్టముతో పని లేదు. కుండిననగరమునకు బయలుదేరుదము" అని పలికెను. అగ్ని ద్యోతనుడు పరవశించెను. అతని దౌత్యము ఫలించెను.

బంగరురథమున పరమాత్మ అగ్నిద్యోతనుడు ఆసీనులైరి. సారథి అశ్వములను అదలించెను. కుండిననగరమువైపు స్వర్ణరథము దూసికొని పోవుచుండెను. అది తెలిసి సేనాసమేతుడై బలరామస్వామి కుండిన నగరమునకు బయలుదేరెను.

బంగరురథము కుండిననగరపు పొలిమేరనున్న ఉద్యానవనమున ప్రవేశించెను. సారథి అశ్వములను చింతచెట్టునకు కట్టెను. అగ్నిద్యోత నుడు నగరమును పరమాత్మకు చూపెను. కుండిననగరమునకు చుట్టు

ఎత్తైన ప్రాకారము గలదు. దానిచుట్టు అగాధమగు అగడ్త. అందలి కమలములు వికసించియున్నవి. సింహద్వారము పెద్దది. కోటబురుజులపై మయూరములు పురివిప్పి నాట్యము చేయుచున్నవి. కుండిననగర రాజ్యలక్ష్మి శ్రీకృష్ణపరమాత్మకు స్వాగతము పలికెను.

రుక్మిణీదేవిని శిశుపాలున కిచ్చి వివాహము చేయుటకు సకలసన్నాహములు జరిగెను. విశాలమగు కొలువుకూటమున చలువపందిళ్లు వేసిరి. వానిని చాందినీలతో, పరిమళ పుష్పమాలికలతో, పచ్చని ఆకుతోరణములతో అలంకరించిరి. నేలపై పన్నీటిని చిలికిరి. రత్నాలకంబళులు పరచిరి. పరిమళధూపముల వేసిరి. ఏమి జరుగునోయని నగరవాసులు నిరీక్షించు చుండిరి.

చెలులు రుక్మిణీదేవిని సర్వాలంకార భూషితను గావించిరి. ఎఱ్ఱని వస్త్రము గట్టబెట్టిరి. వేదవిదులు శాంతివచనముల వల్లించుచుండిరి. రాజు సువర్ణము, మంచిముత్తెములు. గజాశ్వములు, స్వర్ణపాత్రలను దాన మొసగెను.

శిశుపాలుని తండ్రి దమఘోషుడు ఆయన అనుమతితో పెండ్లి కొడుకును గావించి స్వస్తి చదివిరి. స్నాతకము జరిపిరి. మంగళవాద్యములు మ్రోగుచుండ పెండ్లికుమారుని ఏనుగు అంబారిపై ఆసీనుని గావించిరి. జరాసంధుడు మున్నగువారు పరమాత్మపై ప్రతీకారము తీర్చుకొనుటకు నగరమునకు విచ్చేసిరి. వారు పెండ్లికొమారుని కొలువు కూటమునకు గొనిపోయిరి. రాజు వారికి తగు ఆసనముల చూపెను.

రుక్మిణీదేవి శ్రీకృష్ణపరమాత్మ పాదారవిందములయందు మనసు లగ్న మొనర్చి ధ్యానించుచుండెను. ద్వారక కేగిన అగ్నిద్యోతమని జాడ కన్పించుట లేదు. ఆమె కలవరముతో 'విప్రుడు ఇంకను రాలేదే? పరమాత్మ జాడ కన్పించుట లేదు. భూసురునకు పరమాత్మ దర్శనము కాలేదేమో? ఒకవేళ కలిగినను నాకోర్కెను ఆయన అంగీకరింపలేదేమో చొరవ తీసుకొని నేను లేఖవ్రాయుట తప్పిదమని పరమాత్మ భావించి యుండునా? ఆ మహనీయుడు రాకున్నచో నాగతి ఏమి? మంగళగౌరికి

వాపై దయ కలుగకుండుటకు హేతువేమి? ఆమెను భక్తిశ్రద్ధలతో కొలిచి నందులకు ఫల మిదేనా? శిశుపాలుని వివాహమాడుట కల్ల. అందులకు ప్రాణత్యాగ మొనర్చుటకైన వెనుదీయను. నా నాథుడు పరమాత్మయే.

రుక్మిణీదేవి విషాదాశ్రువులు రాల్చుచు, చెలులు వెంట నడువ కోట బురుజులపై నడయాడుచు ద్వారకనుండి నగరమునకు వచ్చుమార్గమును నిశితముగ పరికించుచుండెను. భూసురోత్తముడు కానరాలేదు. రుక్మిణీ దేవి పరమాత్మను స్మరించుకొని 'హే ద్వారకావాసా! నందకిశోరా! నిను శరణు జొచ్చితిని. నిన్నే మనసార ప్రేమించితిని. నన్ను కాపాడగల సమర్థుడవు నీవే. ఆపన్నుల నెందరినో రక్షించితివి. నేను నీకు భార మగుదునా? నేను నీకే అర్ధాంగి నగుదునని నారదమునీంద్రుడు పలికిన పలుకులు వ్యర్థములేనా? నీ కఠినపరీక్షకు నేను నిలువలేను. కనికరించి నన్ను కాపాడుము. ఇవే నీకు నా హృదయపూర్వక నమస్కృతులు' అని దీనముగ విలపించెను.

చెలులు రుక్మిణీదేవితో 'ఓ రాజకుమారీ! నీవు ఎంత వెర్రిదానవు. చేదిదేశాధిపతిని చేపట్టి సకల సుఖము లనుభవింపక నవనీతచోరుడగు గోపబాలకుని చేపట్టి నీవు పొందు సుఖమేమి? అని పలుక రుక్మిణీదేవి వారిని తీవ్రముగ మందలించెను. ఆమె తనదృష్టిని ద్వారకకేగు మార్గ ముపై లగ్న మొనర్చెను. అగ్నిద్యోతనుడు అత్యుత్సాహముతో అంతః పురమునకు వచ్చుట గమనించి రుక్మిణీదేవి ఆనందాతిరేకముతో చెలుల వెంటనిడుకొని క్రిందికి దిగివచ్చెను. ఆమెకు ఎడమకన్ను అదరెను.

అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవిని సమీపించెను. ఆయన రాజకుమా రితో 'అమ్మా! ఫలించినది నీ కోరిక. పరమాత్మకు నీపై ప్రేమాభిమా నములు కోకొల్లలు. నీ రూపగుణములు ఆయన నెంతో ఆకర్షించినవి. నీవు ఆ మహనీయుని ఎటుల ప్రేమించుచుంటివో ఆ నందనందనుడును అటులే నిన్ను ప్రేమించుచున్నాడు. ఎంద రెదురైనను లెక్కసేయక పరమాత్మ నిన్ను చేపట్టును. నీ దీనావస్థను విని ఆయన విషాదాశ్రువుల రాల్చెను. నీవు ఎంతో అదృష్టవంతురాలవు. పరమాత్మ ఉపవనమునకు వేంచేసియున్నాడు. ఆయన నీకొరకు ఎన్నో కానుకల గొనివచ్చెను. ఇక

అసక్త బుద్ధి స్సర్వత్ర జితాత్మా విగతస్పృహః,
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి. 49

సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే
సమాసేనైవ కౌన్తేయ! నిష్ఠా జ్ఞానస్య యా పరా. 50

బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్యచ,
శబ్దాదీ న్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ. 51

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః,
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః. 52

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్,
విముచ్య నిర్మమ శ్శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే. 53

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి,
సమ స్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్. 54

భక్త్యా మా మభిజానాతి యావా న్యశ్చాస్మి తత్త్వతః,
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్. 55

సర్వ కర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః,
మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్. 56

చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః,
బుద్ధియోగ ముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ. 57

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి,
అథ చేత్త్వమహంకారా న్న శ్రోష్యసి వినజ్క్ష్యసి. 58

రుక్మిణీదేవి పరివారముతో గౌరి ఆలయమున ప్రవేశించెను. జే గంటలు గణగణ మ్రోగుచున్నవి. దీపపుకాంతులతో గౌరీదేవి దేదీప్యమానముగ వెలుగొందుచు, ప్రసన్నదృక్కులను రాజకుమారిపై ప్రసరింప జేయుచుండెను. రుక్మిణీదేవి తొలుత సాక్షిగణపతిని పూజించి తదుపరి శివుని అర్చించి, కడకు గౌరీదేవిని పూజించుచు 'అమ్మా! మహేశ్వరీ! పరమాత్మను నాకు పతిగ నొసర్చుము. అన్యుని నే నొల్లను. ఇది నా కడపటి నిర్ణయము. నా అన్న రుక్మి పరమమూర్ఖుడు. పరమాత్మకు వ్యతిరేకి. జరాసంధుడు మున్నగు రాజులు నన్ను శిశుపాలునకు కట్టబెట్టుటకు సమాయత్తు లగుచుండిరి. ఇక నీవే నాకు దిక్కు. బిడ్డకోర్కె తల్లి దీర్పనిచో దానిగతి ఏమగును? ఇవే నీకు నా ప్రణామములు' అని దీనముగ వేడుకొనెను. గౌరీదేవి ప్రసన్నురాలై నటులు ఆమెకు దోచెను.

రుక్మిణీదేవి పుణ్యస్త్రీలను, కన్నెపిల్లలను పుష్పములతో పూజించి అపూపములు, పాయసాన్నములు గౌరీదేవికి నైవేద్యమిడి, నీరాజనమిడి పూజారు లొసగిన తీర్థప్రసాదముల స్వీకరించెను. వేదవిదులు ఆమెతో 'అమ్మా! రుక్మిణీదేవీ! నీవు అరుంధతివలె పతిని సేవించుచు సీతామహాదేవి సహనమును పుణికిపుచ్చుకొందువు గాక! అని ఆశీర్వదించిరి.

అంత రుక్మిణీదేవి పాదచారిణియై లీలాకమలము చేబూని గంధగజేంద్రమువలె మందగమనముతో అంతఃపురమునకు మరలుచుండ ఆమె సౌందర్యము చూచి రాజన్యులు చకితులైరి. విరహవేదనతో కుములుచుండిరి. రుక్మిణీదేవి పరమాత్మకొరకు క్రీగంట చూచుచు పాదమునకు ముల్లు గ్రుచ్చుకొనినటుల అభినయించుచు మందగమనముతో నడచుచుండ, పీతాంబరధారి చంద్రబింబమువంటి నెమ్మోముతో వేణువు చేబూనిన మోహనమూర్తి యగు శ్రీకృష్ణపరమాత్మ కనబడెను. తనను గొనిపొమ్మని రాజకుమారి నందకిశోరునకు సైగ చేసెను. అందలి అంతరార్థమును పరివారముగాని, రక్షకభటులు గాని గ్రహింపనేరరైరి. పరమాత్మ స్త్రీగణములలో జొరబడి రుక్మిణి కడకు దూసికొనిపోవ, ఆమె పరమాత్మ కరగ్రహణము చేసిన మరుక్షణమున వా రిరువురు రథమునందాసీనులైరి.

పరమాత్మ శంఖము పూరింపగనే రథాశ్వములు వేగముగ పయ నింప దొడంగెను. స్వయంవరమునకు విచ్చేపిన రాజన్యులు పరాభవా గ్నిలో హతులైరి. నగరవాసులు రుక్మిణీ శ్రీకృష్ణులకు జేజేలు పలికిరి. శిశుపాలునకు, రుక్మికి, జరాసంధునకు తగినశాస్తి జరిగినదని కడు సంత సించిరి. ఏ నోట వినినను వధూవరుల కమనీయగాథలే. దుష్టశిక్షణ శిష్ట రక్షణకు అరుదెంచిన అవతారమూర్తి యని పరమాత్మను నగరవాసులు ప్రశంసించిరి.

అది వినిన రుక్మి, వాని సోదరులు, జరాసంధుడు, శిశుపాలుడు మున్నగువారు నిర్విణ్ణులైరి. శస్త్రాస్త్రములను పరమాత్మపై ప్రయోగిం చిరి. రుక్మిణీదేవి గౌరీదేవిని స్తుతించుచుండెను. ఎట్టి ఆపదలు గలుగవని పరమాత్మ రుక్మిణీదేవికి అభయ మొసగెను.

బలరామస్వామి సోదరుడు గదుడు. గదాయుద్ధమందు ప్రవీణుడు. ఆయన శాత్రవుల రథముల విరగగొట్టెను. కంఠముల తెగ నరికెను. సేనల తరిమికొట్టెను. గజరాజుల కుంభస్థలముల పగులగొట్టెను. అవి గుమ్మడిపండ్లవలె నేలపై దొరలుచుండ జరాసంధుని ధైర్యము బీటలు వారెను. గదాయుద్ధ విశారదుడగు సాళ్వుడు గదుని ఎదుర్కొనెను. గదుడు బలముగ గదతో సాళ్వుని మోదెను. వాడు నేల కొరిగెను. ఆ దృశ్యము చూచి కుపితుడై పౌండ్రకుడు గదుని రథధ్వజమును విరుగ గొట్టెను. దంతవక్త్రుడు వాని రథమును చూర్ణము గావించెను. జరాసం ధుడు వాని అశ్వముల గూల్చెను. విదూరదుడు వాని రథసారథిని పడ గొట్టెను. గదుడు విరథు డయ్యెను.

అది చూచిన బలరామస్వామి క్రోధోద్రిక్తుడై ముసలముతో దంత వక్త్రుని దంతమును నరికివేసెను. అంతట శత్రుసేనను హలముతో దగ్గరకు లాగి ముసలముతో ధాన్యము దంచినటుల దంచుచుండెను. యుద్ధరంగము రక్తసిక్తమగు కళేబరములతో బీభత్సముగ కన్పట్టెను. రుక్మిణీ శ్రీకృష్ణులు కడు సంతసించిరి.

అతిరథులు మహారథులు నేల కొరగుటచే శత్రుసేనలు చెదరి పారి పోయెను. శిశుపాలుని కీర్తి నశించెను. పెండ్లి కాకపోవుటయే గాక

పరాభవము పుష్కలముగ లభించెను. వానిమోమున ప్రేతకళ ఉట్టిపడు
చుండ పతిని గోల్పోయిన పతివలె విషాదాశ్రువులు రాల్చుచు విలపించు
చుండెను. తన వ్యూహము ఫలింపలేదు. పరమాత్మను పరాభవింపదలచి
తానే పరాభవాగ్నియందు మడియుటకు సిద్ధముగ నుండెను.

శిశుపాలుని హృదయము ప్రక్క లయ్యెను. వాడు తనలో 'ఈ
కన్య కాకున్న వేరొక కన్యను చేపట్టకుందునా? యదువంశ్యుని విడు
చుట కల్ల. ద్వారకను ముట్టడించి శత్రునిర్మూలనము గావింపవచ్చును.
కాలచక్రము తిరుగుచుండును. సింహము పిల్లి కావచ్చును. పిల్లి
సింహము కావచ్చును. జయాపజయములు దైవాధీనములు' అని ఊర
డిల్లెను. అతడు తన రాజధానీ నగరమునకు జనెను. జరాసంధుడు
మున్నగువారు తమ తమ నెలవులకు పోయిరి.

రుక్మి ఆశలు భగ్నమయ్యెను. జరాసంధుడు మున్నగువారు పలా
యనమైరి. రుక్మి ఏకాకి యయ్యెను. పరాభవముతో క్రుంగిపోవుచు
మహోగ్రుడై 'శ్రీకృష్ణుడు పిరికిపంద. చోరునివలె నగరము జొచ్చి
రుక్మిణిని గొనిపోయెను. బలరామకృష్ణులను హతమార్చి రుక్మిణిని గొని
వత్తును. కానిచో కుండిననగరమున కాలు పెట్టను' అని మీసములు మెలి
పెట్టుచు శపథము చేసెను. మ్లేచ్ఛదేశమందలి కరవాలము, ఘూర్జర
రాష్ట్రమందలి గద, వంగదేశమందలి పరిఘాయుధము గైకొని ఉడుము
చర్మపు కవచములు ముంజేతుల ధరించి స్వర్ణరథముపై రుక్మి దూసుకు
పోయెను. అతడు శ్రీకృష్ణుని వెంబడించెను. బలరాముడు యాదవసేనను
వానిసేనపై పురికొల్పెను. వారు రణరంగమున తీవ్రముగ పోరిరి.

రుక్మి శ్రీకృష్ణుని సమీపించి 'ఓయీ! నిలు నిలు, పారిపోకుము.
రుక్మిణిని బలాత్కరించి రథమున నెక్కించుకొని పారిపోవుదువా? యుద్ధ
మన పాలు, పెరుగు, వెన్న దొంగిలించుట యనుకొంటివా? పూతనాది
రక్కసుల పరిమార్చుటచే వీరాగ్రేసరుడనని భావించుచుంటివా? వ్రజ
వనితలతో రాసక్రీడసల్పుట యనుకొంటివా? గోపబాలురతో గోవులగాచుట
యనుకొంటివా? శిశుపాలున కీయదలంచిన రుక్మిణిని నీవు గొనిపోవుటలో
ఔచిత్య మేమి? నీవు పుట్టినది మధురయందలి కారాగృహమున. పెరిగి

వది నందవ్రజములో, రాసక్రీడ సల్పినది బృందావనములో. రుక్మిణి జాతిరత్నము. రాచకొమార్తె, సౌందర్యరాశి, సకల సద్గుణసంపన్న, సుక్షత్రియవంశమున జన్మించినది. నీకా? కులగోత్రములు లేవు. నీవు చోరుడవు. వల్లనివాడవు. అస్తి అన్నవో చింతాకంతైనా లేదు. శిశుపాలుడో? సుక్షత్రియుడు, చేదిదేశపు యువరాజు, బలపరాక్రమములు కలవాడు. మెఱపుతీగవలె ప్రకాశించువాడు. అతడు రుక్మిణికి తగిన వరుడు. నీవు రాక్షసవివాహమున కొడిగట్టిన శిలాహృదయుడవు. రుక్మిణిని విడువుము. విడువనిచో బ్రతుకుపై ఆస వీడుము' అని వదరుచు శస్త్ర ప్రయోగము జేయ అది నందకిశోరుని వక్షఃస్థలము తాకి నేలపై బడెను. రుక్మి పది బాణములను పరమాత్మపై ప్రయోగించెను. ఆయన వాటిని ఒక్కశస్త్రముతో ఖండించెను. శక్త్యాయుధమును రుక్మి శ్రీకృష్ణునిపై ప్రయోగించెను. ఆయన ఒక్కశరముతో దానిని విరుగగొట్టెను కౌమోదకి అను గదతో రుక్మి రథమును చూర్ణము గావించెను. వాడు పరిఘాయుధము పరమాత్మపై ప్రయోగింప అది పుష్పమాలికయై వసుదేవుని కంఠసీమ నలంకరించెను. రుక్మి విరథు డయ్యెను. వాని శిరఃకవచము, ముంజేతి కవచములు తెగిపోయెను. మృగరాజు గజరాజుపై లంఘించినటుల పరమాత్మ రుక్మిపై కురికి నేలపై బడద్రోసి, వాని వక్షఃస్థలమున గూర్చుండి నందకమను కత్తితో కొడువబోవుచు 'రుక్మీ! ఏమని ప్రేలితివి? నాకు గోత్రము లేదనియా? నేను దేవకీ వసుదేవుల కుమారుడను. చంద్రవంశజుడను. మాది సుక్షత్రియవంశము కాదా? చోరుడని జారుడని నిందించితివి. నాది కాని వస్తువు ఈ జగత్తునందు లేదే? అందుచే నేను చోరుడను జారుడను నెట్లగుదును? నీకు ఆరాధ్యదైవము, అప్తుడగు కంసుని వధించిన వీరాగ్రేసరుడను. నేను శ్యామసుందరుడను. పిపీలికాది బ్రహ్మపర్యంతము నన్ను జూచి మురియుచు నా సారూప్యమును గోరుచుండును. ఇక శిశుపాలుడో దుష్టుడు. దుర్వ్యసనములతో సకల జనులను బాధించువాడు. ఏనాడో వానిని యమపురి కంపియుండెడివాడను. కాని వాని తల్లి నాతో 'నూరు తప్పులవరకు వీనిని క్షమింపు' మని కోరుటచే వదలియుంటిని. ఇక రాక్షసవివాహ మందువా? అందు ఇసుమంతయు తప్పులేదు, నీ సోదరి సకలసద్గుణసంపన్న. ఆమెకు

యుక్తవయస్సు వచ్చినది. నా రూపగుణములు, సాహసకృత్యములు విని నన్ను వరించినది. మీ తలిదండ్రులు సైతము అందుల కంగీక రించిరి. నీవే అంగీకరింప వైతివి. నన్ను కుండిననగరమునకు రమ్మని తనను చేపట్టుమని నీ సోదరి విప్రునిచే కబు రంపినది. శిశుపాలుని బారి నుండి తనను రక్షింపుమని వేడుకొనినది. శిష్టరక్షణ నా కర్తవ్యము. అందుచే నేను నీ నగరికి విచ్చేసి ఉపవనమందుండ నీ తలిదండ్రులు నగరవాసులు నన్ను సేవించి రుక్మిణిని చేపట్టుమని బతిమాలిరి. అందు లకు నేను అంగీకరించితిని. ఈ విషయము నీకు తెలియదా? తెలియు తున్న అది నీ చారుల దోషము. నీవు మూర్ఖుడవు. తలిదండ్రులను, సోదరిని లెక్కచేయక, వారిని బెదరించి నీ ఇచ్చవచ్చిన వారికి రుక్మిణీ నిచ్చుటలో ఔచిత్యమేమి? నీ పాపము పండినది. ఈ కత్తితో నీ ప్రాణ ముల గైకొందును. ఎవడడ్డు పడుదురో చూతును ' అని రుక్మి వక్షఃస్థల మును చీల్పబోవ, రుక్మిణి పతిపాదములకు ప్రణమిల్లి 'నాథా! మీ పరా క్రమము తెలియనేరక రుక్మి ఇట్టి అకృత్యమునకు పాల్పడెను. నీవు కరుణామయుడవు. కనికరించి వీనిని వదలివేయుము. నా విన్నప మాల కించి నన్ను పరిణయమాడుట కంగీకరించితివి. పరమాత్మ తమకు అల్లుడ య్యెనని నా తలిదండ్రులు మురియు సమయమున వారికి పుత్రశోకము గలుగ జేయకుడు. మన వివాహమహోత్సవమునకు కుండిననగరవాసులు ఆనందాతిరేకముతో వేచియున్నారు ' అని ప్రార్థించెను.

పరమాత్మ సతికోర్కెను మన్నించి రుక్మిని సంహరింపక వానికి బుద్ధి వచ్చుటకై తన రథచక్రములకు కట్టివేసి కత్తితో వాని శిరోజములు గడ్డము, మీసముల కొద్దికొద్దిగ దీసివేసెను.

బలరామస్వామి పరమాత్మతో 'కృష్ణా! శిరశ్ఛేదము కన్నను ఇది ఘోరమైన శిక్ష. రుక్మి దుష్టుడే కావచ్చు. కాని అతడు నీకు ఇపుడు బావ మరది. వానికిట్టి శిక్ష విధించుటచే రుక్మిణి మనస్సు నొచ్చును. నూతన వధువును సంతోషింప చేయుట ధర్మము ' అని హితవు పలికెను. పర మాత్మ రుక్మిని వదలివేసెను.

బలరామస్వామి రుక్మిణీదేవితో 'ఓ కల్యాణీ! నీవు శ్రీకృష్ణుని మనసార ప్రేమించితివి. ప్రియాప్రియములు కాలాధీనములు. ఈ సంసార బంధమునకు కారణము పరమాత్ముని మాయయే. అది తెలియక సకల జనులు స్వపరభేదములతో కొట్టుమిట్టాడుచుందురు. ఆత్మస్వరూపము పరమాత్మయే. ఆయనకన్న అన్యము భాసింపదు. ఇక పరాభవ మెక్కడిది?' అని అనునయించెను.

రుక్మిని వదలినందుకు రుక్మిణీదేవి బలరామకృష్ణులకు కృతజ్ఞతాంజలులు సమర్పించెను. విరూపియై కుండినవగర మేగుట కిచ్చగింపక, సచివుల వాక్యము మన్నింపక, రుక్మి భోజకటక మను గ్రామము నిర్మించుకొని అందుండ నిశ్చయించుకొనెను.

రుక్మిణీ శ్రీకృష్ణులు ద్వారకకు బంగరురథముపై వచ్చుచుండిరని విని ప్రజలు కడు సంతసించిరి. మార్గశీర్ష మాసమున శుభసమయమున రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణమహోత్సవము కనులపండువుగ జరుపుటకు సకల సన్నాహములు చేయ దొడంగిరి.

## రుక్మిణీ కల్యాణము

ద్వారకానగరమందలి కొలువుకూటము రమణీయముగ అలంకరింప బడెను. మంగళవాద్యములు మ్రోగుచున్నవి. వివిధ దేశాధిపతులు విచ్చేసి కొలువుకూటమున ఉచితాసనముల నలంకరించిరి. నగరవాసులతో వ్రజవాసులతో కొలువుకూటము క్రిక్కిరిసి యుండెను. భీష్మకుడు సతీసమేతముగ ఆసీను డయ్యెను. ఉగ్రసేన మహారాజు స్వర్ణసింహాసన మలంకరించెను. దేవకీ వసుదేవులు, నంద యశోదలు, రోహిణీదేవి ఉచితాసనముల నలంకరించిరి. గర్గుడు, నారదుడు కల్యాణవేదిక సమీపమున ఉచితాసనముల నలంకరించిరి.

కల్యాణవేదికకు రాజపురోహితుడు వచ్చెను. పవిత్రోదకములు, పరిమళ ద్రవ్యములు, నారికేళ కదళీ చూత పనస మధుర ఫలములు, పసుపుకుంకుమలు, ఆకులు పోకలు, మల్లె, సన్నజాజి, సౌగంధిక, పారిజాత పుష్పమాలికలు బంగరు పళ్ళెరములతో గొనిరాబడెను.

రుక్మిణీదేవి సర్వాలంకారభూషితయై, గౌరీపూజ పూర్తిగావించుకొని తీర్థప్రసాదముల స్వీకరించి చెలులతో సరససల్లాపము లాడుచుండెను.

పరమాత్మని పెండ్లికొమారుని గావించి గోపకులు వ్రజవనితలు మురియుచుండిరి. 'కల్యాణమైన పిదప మేము కన్పింతుమా' అని పరసమాడిరి. 'ఇక మీతో పనేమి' అని పరమాత్మ పలుక, 'ఏమి చేతువో చూతువు గాక' అని గోపికలు అనిరి.

శుభముహూర్తము సమీపించెను. వధూవరులను గొనిరమ్మని కబురు బంప శ్రీకృష్ణుడు మందహాసము చేయుచు, కొలువుకూటమునకు విచ్చేసి నంద యశోదలకు ప్రణమిల్లెను. వారి కనులవెంట ఆనందాశ్రువులు జాలువారెను. యశోదాదేవి నందకిశోరుని చెక్కిలి ముద్దాడెను. రాజు పరమాత్మ శిరము నాఘ్రాణించెను. అంతట శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులకు, ఉగ్రసేన మహారాజునకు, భీష్మకునకు వాని సతికి, మహర్షులకు నమస్కరించి కల్యాణవేదికపైకి వచ్చెను. కొలువుకూటము జయ జయ ధ్వానములతో మారుమ్రోగెను. పరమాత్మ అభయహస్తమును చూపెను. కృపాకటాక్ష వీక్షణములు వారిపై ప్రసరింప జేసెను. సభాసదులు మంత్రముగ్ధులైరి. రాజపురోహితుడు పరమాత్మను రత్నపీఠికపై నథివసింప చేసెను. రుక్మిణీదేవి రాకకు సర్వులు నిరీక్షించుచుండిరి.

అదిగో అందాలరాశి, సకల సద్గుణసంపన్న, సర్వాలంకారభూషితయై జలతారు మేలిముసుగుతో, మందగమనముతో అరుదెంచు కుండిన నగర రాజ్యలక్ష్మియగు రుక్మిణీదేవి! ఆమె వేదికపైకి వచ్చి పరమాత్మకు ప్రణమిల్లెను. సదస్యుల కరతాళధ్వనులు మిన్నంటెను. రాజ పురోహితుడు రాజకుమారిని వేరొక రత్నపీఠికపై గూర్చుండ బనిచెను.

ఉగ్రసేన మహారాజు అనుమతితో రాజపురోహితుడు కల్యాణక్రతువును ప్రారంభించెను. పవిత్రోదకమును వధూవరులపై చల్లిరి. పన్నీరు పరిమళ ద్రవ్యములు చిలికిరి. మధుపర్కముల నొసగిరి. వాటినిధరించి వధూవరులు యథాస్థానముల ఆసీనులైరి.

రాజపురోహితుడు శ్రీకృష్ణుని ప్రవరను ఇటుల వినిపించెను:

"చతుస్సాగర పర్యంతం గో బ్రాహ్మణేభ్య శ్శుభం భవతు. అంగిరస, గార్గ్య, శైన్య త్రయార్షేయ ప్రవరాన్విత గార్గస్య ... ... దేవమీఢ మహారాజ వర్మణో నప్త్రే ... ... శూరసేన మహారాజ వర్మణః పుత్రాయ వసుదేవ మహారాజ వర్మణః పుత్రాయ అనంతకోటి బ్రహ్మాండనాయకాయ శ్రీకృష్ణ పరబ్రహ్మణే వరాయ"

అంతట కుండిన నగరాధీశ్వరుని రాజపురోహితుడు రుక్మిణీదేవి ప్రవరము ఇటుల పఠించెను.

"అంగిరసాయాస్య, గౌతమ త్రయార్షేయ ప్రవరాన్విత గౌతమసగోత్రస్య... ... కైశికమహారాజ వర్మణః నప్త్రీ... ... క్రథమహారాజ వర్మణః పౌత్రీం భీష్మకమహారాజ వర్మణః పుత్రీం మహాలక్ష్మీ స్వరూపాం రుక్మిణీనామ్నీ కన్యాం రుక్మిణా రమ్యపేయోతం దృష్ట్వా కృష్ణం శ్రియః పతిమ్ .... ...."

రాజపురోహితుడు దేదీప్యమానముగ వెలుగొందు సువర్ణమాంగల్యమును సదస్యులకు జూపెను. వారు పరవశించిరి. మాంగల్యము చేబూనిన శ్రీకృష్ణపరమాత్మ కనుచూపులతో పెద్దల ఆశీస్సుల నంది దానిని రుక్మిణీదేవి కంఠమున అలంకరించెను. దేవతలు పుష్పవృష్టి కురియించిరి. సదస్యులు తమ జన్మ ధన్యమయ్యెనని మురిసిరి. వధూవరులు పుష్పమాలికలు మార్చుకొనిరి. మంచిముత్తెములతో మిశ్రితమైన తలంబ్రాలు చిరునవ్వులతో శిరమున నొండొరులు పోసికొనిరి. 'సీతమ్మ పెండ్లికూతు రాయెను, శ్రీరాముడు పెండ్లికొడు కాయెను' అని నాదస్వర విద్వాంసులు కర్ణపేయముగ నాలపించిరి. వధూవరులు ముమ్మారు హోమకుండము చుట్టును ప్రదక్షిణము చేసిరి. గర్గ, నారద ప్రభృతి మహర్షులు, ఉగ్రసేనాది బంధువర్గము వధూవరులపై మంత్రాక్షతలు చల్లి సకల శ్రేయములు గలుగునటుల ఆశీర్వదించిరి. వధూవరులు ఎవరో కాదు. సాక్షాత్ లక్ష్మీనారాయణులే. నారద తుంబురులు గానము చేసిరి. అప్సరసలు నృత్యము చేసిరి. సభ్యులు రా జిచ్చిన విందులు, వినోదములలో పాల్గొని సంతుష్టాంతరంగులైరి.

ఉగ్రసేన మహారాజు మహర్షులకు, భూసురోత్తములకు గో, భూ సువర్ణదానములు విరివిగ చేసెను. నంద యశోదలను, భీష్మకదంపతు లను పట్టుపుట్టములతో, అమూల్యాభరణములతో సత్కరించెను. వ్రజ వనితలకు, పరివారమునకు వస్త్రదానము నిచ్చెను. బంగరునాణెములను బహూకరించెను. గోపకులకు, గోపబాలురకు తలపాగలు, మేలిమి ముల క్రాళ్లు, బంగరు వేణువులు, బెత్తములు బహూకరించెను. అనాటి ద్వారకా నగర వైభవము వర్ణనాతీతము.

## శమంతకమణి

సత్రాజిత్తు యాదవులలో ప్రముఖుడు. సూర్యోపాసకుడు. ఆది త్యుని అనుగ్రహముచే శమంతకమణిని పొందెను. అది యుండుటావున అరిష్టము లుండవు. నిత్యము నూరు బారువుల బంగారము నొసగును. శ్రీకృష్ణుడు సత్రాజిత్తుతో 'ఓయీ! ఈ మణి మహిమాన్విత మైనది. దీనిని ఉగ్రసేన మహారాజునకు సమర్పింపుము. మన ఇంటిపై బడిన వర్షము మన కుటుంబమునకే ఉపయోగపడును. అ వర్షమే కొండపై కురియుచో సర్వులకు మేలు గలుగును. ఈ శమంతకమణి రాజుకడ నున్న దేశమంతటికి సత్ఫలితము గలుగును' అని హితవు పలికెను. సత్రాజిత్తు పరమాత్మతో 'కృష్ణా! నేను వెర్రివాడ ననుకొంటివా? నిత్యము నూరు బారువుల బంగారము నొసగు మణిని అన్యుల కొసగునట్టి మంద భాగ్యుడను గాను. తొలుత స్వార్థము. తదుపరి పరమార్థము' అని మృదువుగ నుడివెను. సత్రాజిత్తు ఆ మణిని తన తమ్ముడగు ప్రసేనుని కడ భద్రపరచెను.

ప్రసేనుడు శమంతకమణిని కంఠమున అలంకరించుకొని వేట కేగెను. మణిని చూచిన మృగరాజు ప్రసేనుని కడతేర్చి దానిని గైకొని చనుచుండ, అది జాంబవంతుని కంటబడెను. ఆయన మృగరాజును దునిమి ఆ మణిని తనగుహకు చేర్చి పసికూన ఊయలపై గట్టెను. ఆ దివ్యకాంతుల జూచి ఆ బిడ్డ కిలకిల నవ్వుచుండెనట.

సత్రాజిత్తు శ్రీకృష్ణుడే ప్రసేనుని సంహరించి శమంతకమణిని సంగ్రహించెనని కృష్ణునిపై నింద వేసెను. పరమాత్మ సర్వజ్ఞుడు. జరిగిన ఉదంతము గ్రహించి జాంబవంతుని కడకేగి పండ్రెండు దినములు వానితో పోరు సలిపెను. ఆ మహనీయుడు పరమాత్మ యని గ్రహించిన జాంబవంతుడు శమంతకమణినే గాక జాంబవతిని గూడ నొసగి, వారిరువురి కల్యాణము జరిపించెను.

పరమాత్మ పెద్దల సమక్షమున శమంతకమణిని సత్రాజిత్తున కొసగెను. జరిగిన వృత్తాంతము నెరిగిన సత్రాజిత్తు, తాను పరమాత్మపై నింద వేసినందుకు పశ్చాత్తప్తుడై శమంతకమణితో పాటు తన తనయ సత్యభామను గూడ ఆ మహానుభావున కొసగెను. పరమాత్మ శమంతకమణిని వలదని తెల్పి సత్యభామను చేపట్టుటకు అంగీకరించెను. శ్రీకృష్ణ సత్యభామల కల్యాణము కమలవండువుగా జరిగెను.

ఒకపర్యాయము పాండవులను చూచుటకు శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు జనెను. అచట కాళింది అను కృష్ణభక్తురా లుండెను. ఆమెను ద్వారకకు గొనివచ్చి పరమాత్మ పరిణయమాడెను. మేనత్త కూతురగు మిత్రవిందను గూడ వివాహమాడెను.

ఏడు పొగరుబోతు గిత్తలను ఒకేపర్యాయము పడగొట్టిన వానికి తన కొమార్తె నాగ్నజితి నిచ్చి వివాహము చేయుదునని నగ్నజిత్తను రాజు చాట బంచెను. పరమాత్మ అటు లొనర్చి నాగ్నజితిని పరిణయమాడెను. ఆయన మత్స్యయంత్రమును ఛేదించి బృహత్సేనునికూతురు లక్ష్మణను, కేకయ మహారాజు కొమార్తె భద్రను పెండ్లియాడెను.

పరమాత్మ అష్టభార్యలనే గాక, పదునారువేల గోపికలను గూడ వివాహమాడెను. గతమును మరచి శ్రీకృష్ణుడు తన కొమారునకు రుక్మి కొమార్తె నిచ్చి కల్యాణము వైభవముగ జరిపించెను.

## పతి వశీకరణమంత్రము

సత్యభామపై పరమాత్మకు మక్కువ ఎక్కువ. ఆమె సంగీత, సాహిత్య, నృత్య, గీత, వాద్యములలో దిట్ట. సౌందర్యరాశి. శ్రీకృష్ణుని అష్టభార్యలలో తానే అగ్రగణ్యురాల నను అహంకారము సత్యభామకు గలదు. పరమాత్మ సదా తన మందిరమందే వసించవలెనని ఇతరుల గృహములకు జనరాదని సత్యభామ పట్టుదల. సత్యను పరమాత్మ పరీక్షింప నెంచెను.

ఒకానొక సమయమున నారదమహర్షి సత్యగృహమునకు అతుదెంచెను. ఆమె అయనకు అర్ఘ్యపాద్యాదుల నొసగి 'మునీంద్రా! శ్రీకృష్ణునకు అష్టభార్యలు, పదునారువేల గోపిక లుండిరి గదా! ఆయన అందరి గృహముల కేతెంచుటచే పరమాత్మతో సరససల్లాపము లాడుటకు నాకుగల అవకాశము బహుస్వల్పము. అందుచే నా నాథులు సదా నా మందిర మందే యుండునట్లు ఉపాయము తెలుప ప్రార్థన' అని వేడుకొనెను.

కలహభోజనుడగు నారదునకు చక్కని అవకాశము లభించెను. మహర్షి సత్యాదేవితో 'అమ్మా! సత్యాదేవీ! నీ పతి నిన్నే సదా సేవించుటకు ఒకవ్రతము గలదు. దానినే పతివశీకరణవ్రత మందురు. దానిని నీవు ఆచరించినచో నీ పతి సదా నీ కడనే యుండును. నీ సవతుల గుమ్మము త్రొక్కడు' అనెను. సత్యాదేవి మోము వికసించెను. ఆమె నారదునితో 'మునీంద్రా! వ్రతము కలదమచున్నావా? వ్రతవిధానము దెలిపినచో తప్పక చేయుదును. సెలవిండు' అని వేడుకొనెను. నారద మహర్షి ఆమెతో 'సత్యాదేవీ! వ్రతవిధానము సులభమే గాని వ్రతానంతరము నీ పతిని త్రాసులోనుంచి బంగారు అభరణములతో తూచవలెను. వాటిని విప్రులకు దాన మొసగవలెను' అనెను.

## శ్రీకృష్ణ తులాభారము

సత్యాదేవికడ ధనరాసులకు కొదువలేదు. పరమాత్మతో సరితూగ గల బంగారు అభరణములు కోకొల్లలు అని ఆమె భావన. అందుచే ఆమె మహర్షితో 'మునీంద్రా! వ్రత మాచరించుటకు సిద్ధముగనుంటిని'

అనెను. మహర్షి సత్యాదేవితో వ్రతము పూర్తి చేయించి శ్రీకృష్ణుని త్రాసు నందు గూర్చుండబెట్టి ధనరాసులు గొనిరమ్మని చెప్పెను. ఆమె ధనాగారమునుండి అమూల్యాభరణములు తెప్పించి త్రాసునం దుంచెను. త్రాసు పరమాత్మవైపు మొగ్గుచుండెను. కోశాగారము ఖాళీయయ్యెను. ఏమి చేయవలెనో తోచక సత్యాదేవి తాను ధరించిన ఆభరణముల నైత మొలిచి త్రాసునం దుంచెను. మొగ్గు పరమాత్మవైపే నుండెను. సత్యాదేవి కలవరమొందెను. అది నారదుని మాయోపాయమని గ్రహించెను.

మహర్షి పరమాత్మతో 'కృష్ణా! లెమ్ము. సత్యాదేవి ధనాగారము పట్టిపోయెను. నగరవీథులలో నిమ్ము వేలమువేసి, ఆ ధనము గొని నా దారిని నే నేగెదను. ఈ మహతిని, చిరుతల గైకొని నావెంట రమ్ము'అని వాటి నొపగెను. పరమాత్మ మహర్షివెంట జనుటకు సిద్ధపడెను.

ఆ దృశ్యము జూచి సత్యాదేవి చకితురా లయ్యెను. ఆమె మునీంద్రునితో 'నీవు తాపసివి కావు. నన్ను మోసగించి నా ప్రియుని గొని పోవుటకు ఉద్యుక్తుడవగు చుంటివా? నా పతిని విడిచి క్షణమైన నేను బ్రతుకలేను. ఈ విపత్తు నధిగమించు ఉపాయము నీవే తెలుపుము. అటు లాచరించుటకు వెమదీయను. సత్యాదేవి ఆడి తప్పుదెరుగదు' అని వేడుకొనెను.

మహర్షి ఆమెతో 'సత్యాదేవీ! నీకడ కృష్ణునకు సరితూగు ధనము లేదు. రుక్మిణికడ ధనరాసు లున్నవేమో విచారింపుము' అని మృదువుగ బలికెను. అది విని కోపోద్రిక్తయై సత్యాదేవి 'మునీంద్రా! నేను రుక్మిణిని ఆశ్రయించుటయా? అసంభవము. నీవు నన్ను పరాభవించుటకే ఇట్టి కఠినవ్రతమునకు ప్రేరేపించితివి. నీవు మాయలమారివి. నిన్ను విశ్వసించుట నాదే తప్పు. నీవు శిలాహృదయుడవని కలనైన ఊహింపలేదు' అని ఆక్రోశించెను.

నారదమహర్షి ఆమెతో 'సత్యాదేవీ! ఇందు నా తప్పు ఇసు మంతయు లేదు. నీ కోర్కెపై వ్రతవిధానము, తదుపరి కార్యక్రమము నీకు తెలిపియుంటిని. అందులకు నీవు అంగీకరించితివి. పరమాత్మను త్రాసు

వందుంచి ధనరాసులతో తూచుటకు పూనుకొంటివి. అందులకు నన్ను నిందించుట న్యాయమా? కృష్ణా! రమ్ము పోవుదము' అనెను.

శ్రీకృష్ణుడు సత్యాదేవితో 'దేవీ! ఈ జడదారి మాటలు నమ్మి మోసపోతివి. రుక్మిణికడ కేగుమని నీతో నేను చెప్పగలనా? నీ ఆత్మాభిమానము అసదృశమైనదని నాకు తెలియును. అది నీకొక అలంకారము. కాని నారదుని వలలోనుండి తప్పించుకొను నుపాయ మాలోచింపుము. కానిచో ఈ త్రిలోకసంచారికి నేను సేవకు డగుట తథ్యము' అని దీనముగ పలికెను.

సత్యాదేవి కలవర మందెను. పతిని మునీంద్రునకు దానము చేయుట అవివేకమని గ్రహించెను. ఆమె పతితో 'నాథా! నిన్ను నారదుని వెంట పంపుదునా! నా స్వార్థము నాకే విపత్తు గొనితెచ్చెను. మీ అష్టభార్యలలో నేనే అగ్రగణ్యురాలనని విర్రవీగితిని. సదా నీవు నావెంట నుండుటకు అభిలషించితిని. అందుచే నారదుని వ్యూహమున చిక్కుకొంటిని. ఇప్పుడు నాలోని అహంకారము నశించినది. నేను రుక్మిణిని వెంట గొని వత్తును. మహర్షి చెరనుండి నిన్ను విడిపించుటకు ఆమె సమర్థురాలు. 'నారదా! ఒక్కక్షణ మాగుము. రుక్మిణీదేవిని గొనివత్తును' అని సత్యాదేవి అంతఃపురమునకు జనెను.

పరమాత్మ మహర్షితో 'ఎంతపని చేసితివి. సత్యను విడిచి నేనెట్లు చరింపగలను' అన 'ఇది నీ లీలయేగదా స్వామీ!' అని మహర్షి నవ్వెను. అందలి రహస్యము పరివారమునకు తెలియలేదు.

సత్యాదేవిరాకను గమనించిన రుక్మిణీదేవి ఆమె కెదురేగెను. సత్యాదేవి ఆమెతో 'అక్కా! నీవు వెంటనే బయలుదేరుము. పతి చిక్కులలో పడెను. ఆ మహనీయుని త్రాసు నందుంచి సరిపడు ధనము నారదున కొసగుదునని మాట జారితిని. నాకడ నున్న ధనరాసులు చాలలేదు. పరమాత్మను ద్వారకానగర వీథులలో వేలము వేసి, ఆ ధనమును గైకొని తనదారిని తాను పోవుదునని నారదుడు బెదరించుచున్నాడు. పతి నా వైపు దీనముగ జూచెను. నిన్ను గొనివత్తునని నారదునకు చెప్పి వచ్చితిని' అనెను.

రుక్మిణి సత్యవతితో 'చెల్లీ! ఎంతపని చేసితివి. పరమాత్మను ధన రాసులతో తూచగలనని భావించితివా? ఎంత అపచారము! భయమును వీడుము. ఇదిగూడ పరమాత్మ లీలయే' అనుచు తులసీదళములు గైకొని వచ్చెను. ఆమె పరమాత్మకు ప్రణమిల్లి తులసీదళము కనుల కద్దుకొని త్రాసునం దుంచెను. త్రాసుముల్లు తులసీదళమువైపు మొగ్గెను. పరమాత్మ రుక్మిణీదేవి భక్తిప్రపత్తులకు సంతసించుచుండ సత్యభామ ఆమె పాదములను కనుల కద్దుకొనెను. పరమాత్మ, నారదమహర్షి కడు సంతసించిరి.

రుక్మిణీదేవి సత్యతో 'నీవు పరమాత్మను పతిగ చూచుచుందువు. నేను ఆ మహనీయుని పరమాత్మగ కొలుచుచుందును. పరమాత్మ భక్తవశంకరుడు' అనెను.

సత్య శ్రీకృష్ణునితో 'నాథా! ఇది నీ లీలయే. ఈ కపట నాటక సూత్రధారివి నీవే. నీవు సృష్టించిన జీవరాశులతో నీవే ఆడుకొనుచు ఆనందింతువు. ఇది నీకొక విలాసము' అనెను,

పరమాత్మ మందహాసము చేయుచు రుక్మిణి కుడివైపున సత్యవతి యెడమవైపున నిలిచియుండ వారితో సరససల్లాపములాడ దొడంగెను. ఆ దృశ్యము చూచిన నారదమహర్షి తనజన్మ చరితార్థమయ్యెనని మురిసెను. దేవతలు పుష్పవృష్టి కురియించిరి.

## అనర్తుడు

వైవస్వతమనువు కుమారుడు శర్యాతి. ఆయనకు ఉత్తానబర్హి, అనర్తుడు, భూరిసేను డను ముగ్గురు సుతులును, సుకన్యయను కొమార్తెయును గలరు. తూర్పుప్రాంతము ఉత్తానబర్హికి, ఉత్తరప్రాంతము అనర్తునకు, పశ్చిమప్రాంతము భూరిసేనున కొసగుచు, 'దీనినంతయు నేను సంపాదించితిని. సత్పరిపాలన గావించితిని. మీరును అట్లేయొనర్పుడు' అని అహంకారముతో బలికెను.

అనర్తుడు జ్ఞాని. అయన తండ్రితో 'ఇది ఏమి వింత! ఈ భూమి నీదికాదు. పరమేశ్వరునిది. పాలించువాడవు నీవు కావు. ఆ పరమేశ్వరుడే

పాలించుచున్నాడు. నీవు సంపాదించితివని పలుకుచున్నావు. ఆ మహా నియుడే దీనిని సృష్టించెను. ప్రపంచమంతయు ఆయన ఆధీనము. ఆ మహానుభావుని కన్న పరాక్రమము గల వా రెవ్వరు? తనకంటె భిన్నవస్తువు లేకుండ సృష్టించి ఆయనయే పాలించుచున్నాడు. సృష్టి, స్థితి, లయకారుడు, కాలస్వరూపుడు ఆయనయే. సర్వభూతాంతరాత్మ ఆయనయే. ఆయన ఆజ్ఞ ననుసరించి సూర్యచంద్రాదులు ఉదయించు చున్నారు. వాయువు వీచుచున్నాడు, మేఘములు వర్షించుచున్నవి. మనవి అనుకొను సంపదలేమియు లేవు. అందుచే పరమేశ్వరుని సేవింప వలెను. ఇది నాది యను అహంకారము పనికిరాదు' అని హితవు పలికెను.

శర్యాతియు జ్ఞానియే. కాని కన్నకొడుకగు అనర్తుడు. తనను తీవ్రపదజాలముతో మందలించుట సహింపలేకపోయెను. శర్యాతి అన ర్తునితో 'ఓయీ! ఉచితానుచితముల గ్రహింపనేరక, నన్ను మందలిం చుటకు సాహసించితివా? నీవు నా రాజ్యమున నుండుటకు అర్హత కోల్పో యితివి. ఈ రాజ్యముతో నీకు పనిలేదు. నీ ఆరాధ్యదైవమే నీకు రాజ్య మొసగును. నీవు ఆ పరమేశ్వరునికడ కేగుము' అని కటువుగ పలికెను.

అనర్తుడు సముద్రతీరమున కేగి పరమాత్మను గూర్చి తప మాచ రింప ఆయన ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనెను. అనర్తుడు రెండు చేతులెత్తి ఆ మహానుభావునకు ప్రణమిల్లుచు, 'ఓ వాసుదేవా! నీవే నాకు దిక్కు. నా తండ్రి నన్ను రాజ్యమునుండి బహిష్కరించెను. నీవు దయాంబురాశివి. నేను నిలుచుటకు తావు లేదు. నా సర్వస్వము నీవే' అని దీనముగ పలికెను.

పరమాత్మ వానితో 'అనర్తా! నీ తండ్రి పలుకులు నిక్కమమే. ఈ రాజ్యమంతయు నీ తండ్రిదే. నీ భక్తిశ్రద్ధలు ప్రశంసనీయములు. వైకుంఠమున నూరుయోజనముల విస్తీర్ణముగల భాగము నీ కిత్తును' అని గోలోకమున ఒక ఖండము తీసి, సముద్రమధ్యమందు సుదర్శన చక్రము నిలిపి దానిపై ఆ ఖండము నిలిపెను. ఆ ఖండము అనర్తుడు పాలించి పుత్ర పౌత్రుల బడసెను. అది విని శర్యాతి కడు సంతసించెను. ఆ ఖండమునకు ఆనర్తదేశ మని పేరు గలిగెను.

అనర్తుని కుమారుడు రైవతుడు. అయన శ్రీశైల పర్వతమందలి చిన్నఖండమును తెచ్చి అనర్త దేశమున నుంచెను. ఆ పర్వతమునకు రైవతగిరి అని పేరు వచ్చెను. అందు రైవతుడు కుశస్థలి అను మహా నగరము నిర్మించి న్యాయపరిపాలన నెరపుచుండెను. అయనకు రేవతి యను కొమార్తె గలదు. ఆమె సౌందర్యరాశి. సకల సద్గుణసంపన్నురాలు. బ్రహ్మ పనుపున రేవతిని బలరామస్వామి కొసగి పరిణయము గావించి తనజన్మ ధన్యమయ్యెనని రైవతుడు కడు మురిసెను. ఆ కుశ స్థలి నగరమే ద్వారకానగరము. దానికి ద్వారవతి అను పేరుగూడ గలదు. ద్వారకానగరము మోక్షపురములలో నొకటి.

అయోధ్యా, మధురా, మాయా, కాశీ, కాంచీ, హ్యవంతికా
పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్షదాయకాః.

## గోమతీతీర్థము

ద్వారకలో పెక్కుతీర్థములు గలవు. రైవతునకు పరమాత్మ ప్రత్యక్షమయ్యెను. పరమభక్తాగ్రేసరుడగు రైవతుని చూడగనే పరమాత్మ కనుల నుండి ఆనందాశ్రువులు జాలువారెను. ఆ అశ్రువులే గోమతీనదిగ అవిర్భవించెను. అందు గ్రుంకులిడిన వారికి ముక్తి కరతలామలకము.

## చక్రతీర్థము

అలకానగరమును రాజధానిగ జేసికొని ధనాధిపతియగు కుబేరుడు పాలించుచుండెను. అయన కైలాసప్రాంతమున విష్ణుక్రతువు చేయుచుండెను. ఆ యాగమునకు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు విచ్చేసిరి. ప్రత్యేకాహ్వానమును పురస్కరించుకొని శ్రీమన్నారాయణుడు గూడ విచ్చేసెను. కనులపండువుగ క్రతువు జరుగుచుండెను. కుబేరుని కొమారుడు నలకూబరుడు కోశాధికారిగ వీరభద్రుడు రక్షకుడుగా నియమింపబడిరి. గణపతిని సత్పురుషుల సేవకు నియోగించిరి. కుమార స్వామిని అతిథిమర్యాదలకు, ఘంటానాథుడు, పార్శ్వమౌళి అను సచివ అను దానము లొసగుటకు నియమించిరి. యజ్ఞము మహావైభవముగ పరిసమాప్తి నొందెను. అనంతరము అవభృథస్నానము జరిగెను.

ఉచితరీతిని కుబేరుడు దానములు చేసెను. సదస్యులు ఆయన దాతృత్వమును పెక్కురీతుల కీర్తించిరి. ఆ సమయమున దుర్వాసుడు మృగచర్మము దాల్చి, దర్భాసనము సమిధలు చేబూని క్రతుస్థలమునకు అరుదెంచెను. ఆయన కోపిష్ఠి. కుబేరుడు వినమ్రుడై మహర్షికి స్వాగత సత్కారము లొసగి ఉచితాసనమున గూర్చుండ బనిచి 'మహానుభావా! నిరాక మాకెల్లరకు ఆనందదాయకము' అనెను. అది విని మహర్షి 'ఈ క్రతువును కేశవుడు సైతము మెచ్చుకొనెను. నీ భక్తిప్రపత్తులు కడు ప్రశంసనీయములు. నీకు రాజరాజు అను బిరుదు గలదు. నేను నిన్నె న్నడు నేమియు నర్థింపలేదు. దాతవని నీ కడకు వచ్చితిని. ఒకవరము గోరుదును. దానిని నీవు నా కొసగిన ప్రత్యుపకృతిగ వేరొక వరమును నేను నీకిత్తును. కానిచో భయంకర శాపమునకు గురియగుదువు' అని బెదరించెను. కుబేరుడు నవ్వుచు 'మునీంద్రా! నీ ఇచ్చవచ్చిన వరము గోరుము. దానిని తీర్చుటకు నేను సంసిద్ధుడను' అని వినమ్రుడై పలికెను. అక్షయనిధు లిమ్మని దుర్వాసుడు కోరెను. అందులకు కుబేరుడు సమ్మతించెను.

ఘంటానాథుడు, పార్శ్వమౌళి అను సచివులు మహర్షితో 'విప్రులు లుబ్ధులు. ఒక్కపొట్టకు అంతద్రవ్య మెందుకు? కావలసిన మేరకు గైకొనుడు' అనుచు కుబేరునకు అడ్డుపడిరి. దుర్వాసుని హృదయము భగ్గున మండెను. ఆయన నేత్రములు అగ్నిగోళము లయ్యెను. కుబేరుడు గడ గడ వణకుచు మహర్షికి ప్రణమిల్లెను. ఆయన శాంతింపలేదు. ఆయన ఘంటానాథునితో 'ఓరీ దురాత్మా! పవిత్రోదకముండు సరస్సులలో మొసళ్ళుండును. ఆ ఉదకము గ్రోలుటకు వచ్చిన వారిని అవి పట్టి పీడించును. అటులే దాతలకడ మీవంటి మూర్ఖు లుందురు. మీరే మొసళ్లు అందుచే నీవు మొసలి వగుదువు గాక! పార్శ్వమౌళి గజరూపము బొందుదు గాక!' అని శపించెను.

సచివు లిరువురు శ్రీమన్నారాయణుని ప్రార్థించిరి. ఆయన వారి కడ 'దుర్వాసుని శాపము తప్పదు. మీ ఉభయులకు పోరు సంభవించును. అప్పుడు మిమ్ములను రక్షింతును' అని అభయ మొసగెను.

గోమతీతీర్థమున ఘంటానాథుడు పెద్దమొసలి రూపమున ప్రవేశించెను. పార్శ్వమౌళి రైవతగిరిపై గజేంద్రుడను నామముతో మద్ది, మందారము, పాటలము, మేడ, పనస, ఖర్జూరము మున్నగు ఫలవృక్షముంతో నిండిన వనమందు విహరించుచుండెను.

## గజేంద్రమోక్షము

వైశాఖమాసమందు దప్పిగొని ఎంత వెదకినను నిర్మలోదకము కన్పింపకపోవుటచే గజేంద్రుడు రైవతగిరి దిగి గోమతీతీర్థమునకు బంధుమిత్ర పరివారముతో అరుదెంచెను. నీరు ఎంత లోతుండిన ఏనుగలకు అంత ఉల్లాసము. గోమతీతీర్థము చూచి ఉల్లాసముతో గజేంద్రుడు పరివార సమేతముగ గ్రుంకులిడుటకు అందు దిగెను. అవి తొండములతో నీటిని చల్లుకొనుచుండ గజేంద్రుడు వారితో క్రీడించుచుండెను. గోమతి తీర్థమునయున్న మొసలి మెల్లగవచ్చి గజేంద్రుని కాలు పట్టుకొని లోనికి లాగుచుండెను. గజరాజు కాలు విదిలించినను తనపట్టు విడువలేదు. అతడు బిగ్గరగా ఘీంకారము చేయుచు, విషాదాశ్రువులు జాలువారుచుండ మొసలితో ఎంత పోరు సల్పినను ఫలితము లేకపోయెను.

వనమున ఏనుగునకు, నీటియందు మొసలికి బలమెక్కువ యందురు. గజేంద్రుడు బలము గోల్పోయెను. ప్రాణభీతితో గజరాజు 'హే కృష్ణా! ముకుందా! మురారీ! ఈ మొసలి నన్ను లోనికి లాగుచున్నది. శక్తికొలది దీనితో పోరు సల్పితిని. ఫలితము కన్పించుట లేదు. అది నన్ను కబళించుటకు సిద్ధముగ నున్నది. నన్ను రక్షింపవా ప్రభూ! ఆలసించినచో మృత్యుదేవత గొనిపోవుట తథ్యము. ఓ దయామయా! ఎందరో రక్కసుల పరిమార్చితివి. ఈ మొసలి నీకొక లెక్కయా? దీనిని సంహరించి నన్ను కాపాడి 'భక్తసంరక్షకుడు' అన్న బిరుదు సార్థకము చేసికొనుము. ఇక నీవే నాకు దిక్కు' అని దీనారవములు చేసెను.

వైకుంఠధామమున శ్రీకృష్ణపరమాత్మ సతులతో సరస సల్లాపము లాడుచుండ గజేంద్రుని దీనారవములు ఆయన చెవిని బడెను. పరమాత్మ చలించెను. ఆయన ముఖకవళికలు పరికించి సతులు పతి పరధ్యానమందుండెనని భావించిరి. మహాలక్ష్మి చీరకొంగు పరమాత్మ అంగవస్త్రమునకు

కట్టబడియుండెను. ఆ ముడిని విప్పక, చక్రము గైకొనక, గరుడవాహనారూఢుడై గజేంద్రుని రక్షించుటకు పరమాత్మ బయలుదేరెను. సుదర్శన చక్రము, శ్రీదేవి, పరివారము వెంటబడిరి.

మొసలి విజయగర్వముతో విర్రవీగుచు గజేంద్రుని లోనికి లాగుచుండెను. అయన ప్రాణములు కడపట్టుచుండ మృత్యువు తప్పదని గ్రహించి 'హే కృష్ణా! ద్వారకావాసా! నిన్ను స్తుతించుటకు సైతము శక్తి కొరవడుచున్నది. కరుణామయా! నీ దర్శనము నాకు లభించునో లభించదో! నిన్ను కోరునది నీ సారూప్యమే' అని అంజలి ఘటించుచుండెను.

గరుత్మంతుడు 'కృష్ణా, కృష్ణా!' అని మధురగానము చేయుచు పరమాత్ముని దోడ్కొని వచ్చెను. ఆ పక్షీంద్రుని పలుకులు చెవినిబడ, గజేంద్రుని కనురెప్పలు విడివడెను. పరివారసమేతముగ గరుడవాహనారూఢుడై పరమాత్మ కన్పట్టెను. గజేంద్రుడు తన దృష్టిని శ్రీకృష్ణ పరమాత్మపై లగ్నమొనర్చెను. వాని నోటివెంట మాటలు వెలువడలేదు. విశ్వమంతయు పరమాత్మ నిండియుండెను. గజేంద్రుడు తన జన్మ ధన్యమయ్యెనని మురియుచుండెను.

శ్రీకృష్ణపరమాత్మ వానితో 'గజేంద్రా! భయము వీడుము. ఈ మొసలిని సంహరించి నిన్ను కాపాడుదును' అనుచు గోమతీతీర్థమున దుమికి సుదర్శనచక్రమును మొసలిపై ప్రయోగించెను. ఆ చక్రము మొసలిని సమీపింపక పూర్వమే దాని శిరము, మొండెము విడివడెను. ప్రయోగము వృథాగాకుండుటకై చక్రము గోమతీతీర్థమందలి రాళ్ళను స్పృశించెను. ఆ రాళ్ళన్నియు చక్రచిహ్నితము లయ్యెను. గజేంద్రునకు మొసలికి శాపవిముక్తి గలిగెను. వారిరువురు నిజరూపములనంది పరమాత్మకు ప్రణమిల్లి కుబేరుని కొలువుకూటమునకు జనిరి.

సంసారసాగరమందు అహంకారమను మొసలి యుండును. అది మనలను పట్టి పీడించుచుండును. మనము పరమాత్ముని శరణాగతులమైనచో ఎట్టిబాధలు గలుగవు. మోక్షము కరతలామలకమగును. ఇదియే గజేంద్రమోక్ష మందలి సారాంశము.

## శంఖోద్ధారక తీర్థము

త్రితుడు అను మహర్షి కృష్ణభక్తుడు. ఆయన శిష్యగణముతో గోమతీనదీతీరమున తప మాచరించుచుండ వాని శిష్యుడు శక్తిమంతుడు గురువుకడనున్న శంఖము నపహరించి పారిపోవుచుండెను. మహర్షి కుపితుడై శంఖరూపమును పొందుమని శక్తిమంతుని శపించెను. వాడు తన తప్పిదము మన్నింపుమని వేడుకొనెను. అంతట మహర్షి వానితో 'నీవు పరమాత్మను వేడుకొనినచో ఆయన రక్షింపగలడు' అని అనెను.

శక్తిమంతుడు పరమాత్మకు ప్రణమిల్లి 'ప్రభూ! అజ్ఞానినై గురు శంఖమును అపహరించితిని. ఆయన నన్ను శంఖరూపము పొందుమని శపించెను. నిన్ను శరణుజొచ్చిన నాకు శాపవిముక్తి గలుగునని హితవు పలికెను. ధ్రువుని, ద్రౌపదిని, ప్రహ్లాదుని, గజేంద్రుని, పాండవులను, యదువంశమును, గురుపత్నిని రక్షించియుంటివి. నిన్ను శరణంటిని నా తప్పిదము మన్నించి నన్ను కాపాడుము' అని వేడుకొనెను. పరమాత్మ వానికి నిజరూపమును ప్రసాదించెను. శక్తిమంతుడు దివ్యరూపమును బొంది వైకుంఠమునకు జనెను.

## సరస్వతీ తీర్థము

ప్రభాసక్షేత్రమున సరస్వతీనది పశ్చిమవాహిని. ఆ నదీతీరమున బోధిపిప్పలము' అను రావిచెట్టు కలదు. ఆ తావుననే పరమాత్మ ఉద్ధవునకు భాగవత విద్యాప్రబోధము చేసెను. భాద్రపద శుక్లపూర్ణిమనాడు సరస్వతీనదియందు గ్రుంకులిడి సువర్ణదానము చేయుట శుభప్రదమని అందురు.

## గోమతీ సింధుసంగమము

హస్తినాపురమున ఒక వణిక్ప్రముఖుడు గలడు. ఆయన సంపద కుబేరుని ఐశ్వర్యమును మరపించునట్లుండెను. వానికి వేశ్యతోసంబంధ మేర్పడెను. జూదము, మద్యమునకు వశుడయ్యెను. దానధర్మములు చేయుట మానెను. మాతాపితరుల సేవించుట లేదు. భగవత్కథా కాలక్షేపములు వినబడునని దూరముగ పోవువాడు.

కొంతకాలమునకు వర్తకుని సంపద తరగి పోయెను. దరిద్రుడయ్యెను. వేశ్యను మాత్రము విడువలేదు. చోరవృత్తి నవలంబించెను. శంతనమహారాజు వానినిపట్టి కారాగారమున బంధించెను. పిమ్మట వానిని రాజ్యమునుండి వెడలగొట్టెను. వాడు అడవులలో ద్రిమ్మరుచుండ మృగరాజు వానిని చీల్చివేసెను. యమకింకరులు వానిని చిత్రవధ చేయుచు యమలోకమునకు గొనిపోవుచుండిరి. వాని కళేబరమునుండి మాంసఖండము నొకగ్రద్ద ముక్కున గరచుకొని ఆకసమున కెగిరెను. వేరొక గ్రద్ద దానితో పోరుసలుప ఆ మాంసఖండము గోమతీ సాగరసంగమమున బడెను. శ్రీహరి ప్రత్యక్షమై ఆ వర్తకుని యమకింకరుల బారినుండి రక్షించి వైకుంఠమునకు పంపెను.

వైశాఖ పూర్ణిమనాడు సాగర సంగమమున స్నానము చేయుట శ్రేయస్కరము.

## రైవతాచలము

గౌతమమహర్షి కుమారుడు మేధావి. మహాతపస్వి. ఆయన వింధ్య పర్వతమున బహుకాలము తపస్సు చేసెను. వానికడకు అపాంతరత మహర్షి రాగా మేధావి లేవలేదు. మహర్షి పర్వతమౌదువని మేధావిని శపించెను. మేధావి శ్రీశైలపర్వతమునకు కుమారు డయ్యెను. వానికి ద్వారకామాహాత్మ్యము వినవలెనను కోర్కె గలిగెను. ద్వారకయందే వసింపవలెనను కాంక్ష పొడమెను. తనను రైవతరాజు కడకు గొనిపొమ్మని ఆయన నారదమహర్షిని వేడుకొనెను. నారదుని అభిమతము మేరకు రైవతరాజు శ్రీశైలపర్వత కుమారుని ద్వారకలో నుంచుటకు ప్రతిన బూనెను.

నారదుడు కలహప్రియుడు. ఆయన శ్రీశైల పర్వతము కడకేగి ఆ వార్త నెరింగించెను. అతడు మేరుపర్వతమును, హిమాలయ పర్వతమును తన కుమారుడు తనకు దక్కునటుల చేయుమని మొరపెట్టుకొనెను. ఆ పర్వతము లన్నియు రైవతరాజుపై పగబూని పోరుకు సిద్ధపడినవి. రైవతరాజు శ్రీశైలపర్వతరాజు తనయుని పెకలించి, సంజీవనీ పర్వతమును ఆంజనేయస్వామి గొనిపోవునటుల గొనిపోవుచుండెను. పర్వతము లన్నియు రైవతరాజు నెదుర్కొని భీకరమైనపోరాటము సాగించినవి.

రైవతరాజు శ్రీశైల పర్వతరాజు కొమరుని విడిచిపెట్టలేదు. రైవతుడు కృష్ణభక్తుడు, నారదమునీంద్రుడు పరమాత్మని కడకేగి రైవతుని రక్షింపవలసిన తరుణ మాసన్నమైనదని తెలిపెను. పరమాత్మ రైవతరాజునకు ప్రత్యక్షమై వానిని రక్షింతునని అభయ మొసగెను. ఆయన తన తేజస్సును రైవతునియందు ప్రవేశపెట్టెను. రైవతరాజు అమేయ బలసంపన్నుడై మేరుపర్వతమును ఒకపోటు పొడువ అది పడిపోయెను ఆయన శైలసంఘములను అణగద్రొక్కెను. ఆయనకు భయపడి పర్వతము:లు పలాయనమయ్యెను. రైవతుడు శ్రీశైలపర్వత కుమారుని ద్వారకలో నిలిపెను. ఆ పర్వతమునకు రైవతకపర్వతమని పేరువచ్చెను. దీనిని దర్శించినచో ముక్తి లభించునని ప్రతీతి. రైవతుడు త్రవ్వించిన తీర్థమునకు యజ్ఞతీర్థమని పేరు.

## కపిటంకతీర్థము

నరకాసురుని మిత్రుడు ద్వివిదుడను వానరుడుండెను. పరమాత్మ నరకాసురుని సంహరించెనని విని, ద్వివిదుడు ద్వారకానగరమునకు వచ్చి, ఇండ్ల పైకప్పులపై నెక్కి అల్లరి చేయుచుండెను. బలరామస్వామి కుపితుడై దానిపై రాయి విసరెను. వానరము మృతి నొందెను దానికి కపిటంకతీర్థ మని పేరు.

## నృగకూప తీర్థము

నృగమహారాజు భూ గో దానములు విరివిగా చేసెను. ఒక విప్రునకు దాన మొసగిన గోవు రాజుయొక్క ఆలమందలో గలిసెను. అది తెలియక రాజు దానిని వేరొక విప్రునకు దాన మొసగెను. విప్రు లిరువురు జగడ మాడుకొనుచుండిరి. వేరొకగోవు నిత్తునని రాజు ఎంత బతిమాలినను వారు వినిపించుకొనలేదు. తెలియకచేసిన పాపమైనను నృగరాజు ఊసరవెల్లి రూపము దాల్చి పాడుబడిన బావిలో పడియుండెను. గోపాలకులు ఆ వార్తను పరమాత్మకు దెలుప ఆయన దానిని పైకిలాగెను నృగమహారాజునకు నిజరూపము గలిగెను. ఆ బావికి నృగతీర్థమని పేరు వచ్చెను. కార్తికమాసమున గ్రుంకులిడిన శుభప్రద మని ప్రతీతి.

## గోపీప్రాదము

గోపికల అంగరాగము పడిన తావున గోపీచందన మేర్పడెను. దీనిని ధరించిన అశ్వమేధ రాజసూయయాగముల ఫలితము చేకూరును. గోపీమృత్తిక గోపీచందనము సమానము. దీనిని ధరించిన యమకింకరులు దరికిరారు.

సింధుదేశ ప్రభువు దీర్ఘబాహుడు, క్రూరుడు, వేశ్యాలోలుడు, మహాపాపి, నూరుహత్యలు సలిపినవాడు, పెద్దలను దుర్భాషలాడువాడు. వాని మంత్రి గూడ అంతటి ఘనుడే.

ఒకనాడు దీర్ఘబాహుడు వాని సచివుడు వేటకు జనిరి. మంత్రి రాజును బాకుతో బొడిచి చంపెను. ఆ రాజును యమకింకరులు గొని పోయి కుంభీపాకమున (బెల్లంవండే తొట్టిలో) బడద్రోసిరి. అగ్ని చల్లారెను. అందలి హేతువును వ్యాసుడు ఇటుల దెలిపెను. 'ఈ రాజు ఒక మహాత్ముని కరాగ్రమునుండి రాలిన గోపీచందనము పైబడి మడిసెను. అందుచే అగ్ని చల్లబడెను'. రాజు పడిన తావే గోపీప్రాదము. గోపీచందన ప్రభావముచే రాజును యమధర్మరాజు విమానముపై వైకుంఠమునకు బంపెను.

## సిద్ధాశ్రమము

అనర్తదేశమందు సిద్ధాశ్రమము గలదు. వైశాఖమాసమున అమావాస్యనాడు సూర్యగ్రహణము వచ్చెను. శ్రీదాముని శాపమున రాధాదేవికి కృష్ణవియోగము పరిధి తీరెను. ఆమె కదళీవనమునుండి శతగోపికాయుధములు వెంటనడువ సిద్ధాశ్రమమునకు జనెను. ఆ సమయమువనే పరమాత్మ పదునారువేల నూటయెనిమిదిమంది గోపికలతో సిద్ధాశ్రమము చేరుకొనెను.

రాధాదేవి సిద్ధాశ్రమమున స్నానము చేయుచుండ చెలులు ఆమె చుట్టు నిలబడిరి. గోపాలకులు శస్త్రములు చేబూని అప్రమత్తులై కావలి కాయుచుండిరి. స్నానానంతరము గోపికలు రాధాదేవిని ప్రేమతో అలంక

రించుచుండిరి. ద్వారకానగరవాసులు గ్రహణస్నానమునకు అశ్రమము నకు వచ్చిరి. వారు రాధాదేవిని చూచుటకు గుంపులు గుంపులుగా నెట్టు కొని ముందుకు బోవుచుండ గోపాలకులు వారిని సర్దుచుండిరి.

ఆ దృశ్యము చూచి శ్రీకృష్ణుని అష్టసతులు పరమాత్మతో 'స్వామీ! ఆమె ఎవరు? ఆ కోలాహలమునకు కారణమేమి? అని అడుగ, పరమాత్మ వారితో 'ఆ జగదేకసుందరి కీర్తి వృషభామల గారాబుపట్టి. పేరు రాధా దేవి. సమస్త గోపికాలోకమునకు అరాధ్యదేవత. సిద్ధాశ్రమమున వర్వ దిన సమయమగుటచే ఆమె చెలులతో స్నానము చేయుటకు విచ్చేసెను వా రందరు ఆమెకు విధేయులు' అని వివరించెను.

సత్యభామకు పరమాత్మ పలుకులు ములుకులవలె గ్రుచ్చుకొన్నవి. ఆమె సపత్నులతో 'సౌందర్యమున రాధాదేవి నాకన్న అధికురాలా? నా రూప లావణ్యాదుల చూచి యెందరో ముగ్ధులైరి గదా! శతధన్వుడు నా వలన గదా మృతినొందినది. పరమాత్మకు నాపై మక్కువ యెక్కువగు టచే నన్ను గరుడవాహనముపై నెక్కించుకొన్నది. నా అంగీకారముతో గదా పరమాత్మ మిమ్ముల పరిణయమాడినది! నరకాసురుడు దేవలోకము నుండి ఛత్రమును రామగిరికి గొనిపోవ దానిని తెప్పింపుమని నే వేడగా పరమాత్మ తెచ్చినాడు. శ్వేతగజములను గొనిరమ్మని నేను పరమాత్మను కోరుటచే గదా వాటిని దేవేంద్రుని కడనుండి అయన తెచ్చినది! పారి జాతపత్రములు, పుష్పములు, ఫలములు, నవరత్నదీధితులతో మెరయు చుండును. అందుండి అనేకరాగములు వినబడుచుండును. ఆ కుసుమము మన అభీష్టానుసారము అరచేతిలో ఇముడును. వ్యాప్తము గావలెనన్న అది వ్యాప్తమగును. అట్టి మహిమాన్వితమగు పారిజాతపు మొక్కను నా కోర్కెపై గదా పరమాత్మ నా మందిరద్వారముకడ నాటినది. రూప మున గాని, ఉదారగుణములలో గాని నాకన్న అధికులు గలరా!' అని గర్వముతో పలికెను.

అష్టసతులు పరమాత్మతో 'నాథా! రాధాదేవిని విడిచి క్షణమైన నిలువలేను. మా ప్రేమ అవిచ్ఛిన్నమైనదని తాము పలుకుచుండెడివారు. ఆమెను చూడవలెనని కుతూహలము కలుగుచున్నది' అని వేడుకొనిరి. పరమాత్మ వారిని వెంటనిడుకొని రాధాదేవి శిబిరమునకు జనెను.

రాధాదేవి శిబిరము బంగరుతో నిర్మింపబడెను. ధ్వజములు, పతాకములు, ముత్తెపుసరములతో గూర్చిన తెరలతో అలంకరింపబడినది. ఆమె మనస్సునే గాక, ఆమె హృదయముగూడ పరమాత్మ జూరగొనెను. శ్రీకృష్ణుని జ్యేష్ఠభార్య రాధాదేవియే. వా రిరువురకు బాల్యముననే బ్రహ్మ భండారకవనమున పాణిగ్రహణము చేయించెను. రాధాదేవి కుండలములు కోటి సూర్యకాంతితో మెరయుచున్నవి. రత్నకంబళములపై శిరీషపుష్పములు చల్లిరి. వాటిపై తన కుసుమకోమలపాదములతో నడయాడుచుండెను. ఆమె సౌందర్యము ప్రేమ అగ్నిజ్వాలవలె నుండెను. రాధాదేవిని చూచి శ్రీకృష్ణుని అష్టసతులు చకితులైరి. ఆమె అందచందములు వారిని మంత్రముగ్ధుల గావించెను. పరమాత్మ పలుకులు యథార్థమని వారు విశ్వసించిరి. పరమాత్మ రాధాదేవిని సమీపించెను. ఆయనను చూచిన గోపికలు జయజయ ధ్వానములు చేసిరి, రాధాదేవి నెమ్మోము వికసించెను. పరమాత్మను దర్శించిన రాధాదేవి కమలనేత్రముల ఆనందాశ్రువులు జాలువారుచుండెను. ఆమె శ్యమంతక చింతామణులతో పొదుగబడిన రత్నసింహాసనముపై పారిజాతపుష్పముల బరచి, దానిపై పరమాత్మను గూర్చుండబెట్టెను. ఆ సింహాసనమునకు అమర్చబడిన ఛత్రము నుండి అమృతము స్రవింప దొడంగెను. రాధాదేవి పరమాత్మచుట్టును ముమ్మారు ప్రదక్షిణము గావించి, ఆనందబాష్పములతో ఆయన పాద కమలములను అభిషేకించెను.

రాధాదేవి పరమాత్మతో 'ప్రియా! శ్రీదాముని శాపముగడువు పూర్తియైనది. నా దానధర్మములు ఫలించెను. నా జన్మ చరితార్థమయ్యెను. సిద్ధాశ్రమస్నాన ఫలితము దక్కినది. నీవు భక్తులకెంతో సహాయకారివి. నీయందు అనన్యభక్తిని ప్రదర్శింపలేకపోతిని. నాపై నీకు ఎంతప్రేమ. నా వలననే గదా నీవు శంఖచూడుని సంహరించినది. నీ ప్రేమచే గదా నందవ్రజము శోభాయమానముగ నుండుట. వారిని రక్షించుటకొరకే గదా నీవు గోవర్ధనగిరిని గోటిపై నిలుపుట. నీవు రాసక్రీడలలో మమ్ముల నీ ఇచ్ఛవచ్చినటుల ఆడింపలేదా' అని మధురస్మృతుల నేకరువు పెట్టుచుండ శతచంద్రానన అను చెలికత్తె రాధాదేవికి పరమాత్మ అష్టసతుల చూపి వారికి మర్యాద చేయుమని విన్నవించెను.

రాధాదేవి వారితో 'చకోరము లెన్నియున్నను చంద్రు డొకడే గదా! చూపు లెన్నియున్నను ఆదిత్య డొక్కడే గదా! (చూపు లనగా నేత్రములు విప్పారుట). మన మెందరమైనను మనకు నాథు డొక్కడే గదా! పద్మప్రభావము మధుపమునకు మాత్రమే తెలియును. రత్న ప్రభావము రత్నపరీక్షకునకు, విద్దెల విశేషము విద్వాంసునకు, కావ్య ప్రభావము కవికి, రసప్రభావము రసికునకు నెటుల తెలియునో, అటులే పరమాత్మ ప్రభావము భక్తులకు మాత్రమే తెలియును. మీరందరు అట్టి వారే. అందుచే పరమాత్మకు ప్రేమభాజనలైతిరి' అని మెచ్చుకొనెను.

రుక్మిణీదేవి రాధాదేవితో 'శుభకరీ! నీకు పరమాత్మ వశుడయ్యెను. సర్వులు పరమాత్మను కీర్తించుచుండ ఆయన నిన్ను శ్లాఘించుచుండెను. ఒకపర్యాయము మా శిబిరమునకు విచ్చేయ ప్రార్థన' అని వేడుకొనెను రాధాదేవి అందులకు సమ్మతించి రుక్మిణీదేవి శిబిరమునకు జనెను. ఆమె రాధాదేవిని శిరీషకుసుమములతో అలంకరింపబడిన సింహాసనముపై గూర్చుండబెట్టి పూలతో పూజించెను. మృష్టాన్నముల నిడెను. పరమాత్ముని అష్టసతులకు రాధాదేవిపై గౌరవము హెచ్చెను. వారందరు భగవత్కథలను చెప్పుకొనుచుండ రాత్రి ప్రొద్దుపోయెను. వారు రాధాదేవి నామె మందిరమున జేర్చి, తమ తమ నెలవులకు జనిరి. రుక్మిణీదేవి పరమాత్మ కడకేగెను.

ఆ రాత్రి పరమాత్మకు నిదురరాలేదు. అందులకు కారణ మేమని రుక్మిణీదేవి పరమాత్మను ప్రశ్నించెను. ఆయన ఆమెతో 'రాధాదేవిపై మీకుగల ప్రేమానురాగములు ప్రశంసనీయములు. ఆమె పరుండబోవు సమయమున పాలు త్రాగును. నేడు ఆమెకు మీరు పాలివ్వలేదు. కనుక ఆమెకు కునుకు రాలేదు. దానిచే నాకుగూడ నిదుర వచ్చుటలేదు' అనెను. రుక్మిణీదేవి వేడివేడి పాలను రాధాదేవి కొసగెను. ఆమె శ్రీకృష్ణధ్యాన తత్పరురాలై యుండుటచే ఆ వేడిపాలను గ్రోలెను. ఆ విషయము రుక్మిణీదేవి పరమాత్మకు తెలిపెను. పరమాత్మ పాదసేవ చేయుట కామె యత్నింప వాటిపై బొబ్బలుండెను. ఆమె చకితురాలయ్యెను. పరమాత్మ రుక్మిణితో 'నా పాదద్వయమును రాధాదేవి తన హృదయకమలమున భద్రపరచుకొనెను. భక్తిపాశము నా పాదములను కట్టివేసెను అందుచే

నా పాదములు రాధాదేవిని విడువవు. భక్తిపారవశ్యమున ఆమె వేడిపాలు గ్రోలుటచే ఆమె హృదయ కమలమందున్న నా పాదములు బొబ్బలెక్కి నవి ' అని వివరించెను. అది వినిన పరమాత్మ అష్టసతులు రాధాదేవి అనన్యభక్తి ప్రవత్తులకు అచ్చెరు వొందిరి.

ప్రేమకు మారుపేరు రాధాదేవి, ఆమె ప్రేమ అగ్నిజ్వాల. తది తరుల ప్రేమ దానిముందు దివటీ వంటిది. రాధాకృష్ణుల క్రీడలు అప్రా కృతములు. వాటిని స్మరించిన మాత్రముననే మన పాపములు తొలగి పోవును. ప్రేమ నిర్గుణము; మనోధర్మము గాదు.

## రాసక్రీడ

అష్టసతులు పరమాత్మతో 'నాథా! వ్రజవనితలు అదృష్టవతులు. ప్రేమ, భక్తి వారియందు గోచరించును. రాసక్రీడ వారి సొమ్ము, బృందావనమున రాసక్రీడ సల్పినట్లు వింటిమి. ప్రత్యక్షముగ రాసక్రీడ దర్శింపవలెనను కాంక్ష గలిగినది. రాధాదేవి, మేము, పదునారువేల నూటెనిమిదిమంది గోపికలతో గూడి నీవు రాసక్రీడ సలుపవలెను. రసమయక్రీడ గదా రాసక్రీడ ' అని వేడుకొనిరి.

పరమాత్మ సతులతో 'రాధాదేవికి రాసేశ్వరి అనిపేరు. రాసోత్స వము ఆమె సొమ్ము. ఆమె అంగీకరించినచో రాసక్రీడ జరుగును' అని అనెను. వారందరు రాధాదేవితో 'వ్రజసుందరీ! పరమాత్మ హృదయ మున నీకు విశిష్టస్థానము గలదు. కీర్తివంశమునకు వన్నెదెచ్చిన విదుషీ మణివి. రాసోత్సవము నయనానందకరముగ చూడవలెనని ముచ్చట పడుచుంటిమి. అందు మేము గూడ పాల్గొనుటకు అనుమతింపుము' అని ప్రార్థించిరి.

రాధాదేవి వారితో 'నాకు అభ్యంతరము లేదు. పరమాత్మ అంగీక రించిన రాసోత్సవము జరుగును. పరిశుద్ధమైన మనస్సుతో ప్రేమించిన పరమాత్మ వశుడగును. మీరును పరమాత్మ ప్రేమానురాగముల చూర గొనినవారే. పరమాత్మ అందరివాడే ' అని నవ్వుచు పలికెను. పరమాత్మ అందులకు సమ్మతించెనని వారు ఆమెకు తెలిపిరి. అందుల కామె అంగీ కరించెను.

ఆనాడే వైశాఖ పూర్ణిమ. సాయంసమయమున చంద్రోదయవేళ సిద్ధాశ్రమమున రాసోత్సవము ప్రారంభించిరి. పరమాత్మ సర్వాలంకార భూషితుడై, సౌందర్యదేవతయనదగు రాధాదేవితో రాసము చేయదొడంగెను. గోపికాయూథములతో అష్టసఖులతో చుక్కలలోని చంద్రునివలె పరమాత్మ ప్రకాశించుచుండెను. ఒక్కొక్క గోపికతో ఒక్కొక్క కృష్ణుని వలె పరమాత్మ అన్నిరూపముల దాల్చెను. మురళిని మనోహరముగ ప్రయోగించుచు లయవిన్యాసముతో పరమాత్మ నృత్యముచేయ దొడంగెను. రాధాకృష్ణుల రాసము వర్ణనాతీతము. రుక్మిణి, సత్య మున్నగు వారు పరవశలైరి. అది వారికొక దివ్యానుభూతి. రాధాకృష్ణుల పవిత్ర ప్రేమ వారికి అవగతమయ్యెను. వారు వారిరువురిని ఆరాధ్యదేవతలుగ నెంచుకొనిరి. సిద్ధాశ్రమప్రాంతము బహుకొద్ది. కాలము స్వల్పము. ఘటనాఘటన సమర్థుడగు పరమాత్మ ఆ ప్రాంతమును కాలమును అనంతము చేసి రాసక్రీడా సాగరమున సర్వుల నోలలాడించెను.

రాసోత్సవము తిలకించిన దేవతలు, గంధర్వులు. కిన్నరులు, కింపురుషులు సంతోషాతిశయముతో పుష్పవృష్టి కురియించిరి. అంతట సర్వులు జలక్రీడలు సల్పి, సర్వాలంకారభూషితులైరి. సకల భోగములు జరిగినవి. రుక్మిణి, సత్య మున్నగువారు పరమాత్మతో 'నాథా! మా జన్మ ధన్యమయ్యెను. మీ సౌందర్యమును మేము అనుభవించినము ఈ రాసోత్సవ సమయము న భూతో న భవిష్యతి. దివ్యానుభూతిని పొందితిమి. మేము పాల్గొనుటకు చక్కని అవకాశము గల్పించితిరి. నేటి రాసోత్సవమునకు విశేషమేమైన గలదా?' అని ప్రశ్నించిరి. 'రాధాదేవిని ఆ ప్రశ్న వేయుడు' అని పరమాత్మ నవ్వుచు పలికెను.

సత్యాదేవి మున్నగువారు రాధాదేవితో 'రాసేశ్వరీ! నేటి రాసోత్సవమున విశేషమేమైన గలదా?' అనిరి. ఆమె మందహాసముచేయుచు 'సఖియలారా! నేటి రాసోత్సవమునందు పదతు లెక్కువగా పాల్గొనిరి. కాని బృందావనమందలి ఆనందము ఇచట రాదు. బృందావనమున పరమాత్మను చూడగనే కల్పవృక్షములు శిరమువంచి నమస్కరించును. మొగ్గలు వికసించును. ఆనందాశ్రువులవలె మకరందము స్రవించును. భూమి బంగార మగును. యమునానది ఉత్తుంగ తరంగములతో పర

మాత్మకు స్వాగతము పలికి, సర్వాలింగన భాగ్యమబ్బెనని పొంగును. ఆ [illegible]మున ఇచట లేదు గదా? మాధవీలతలు, పూలగురువిందతీగలు పరిమళపుష్పముల వెదజల్లుచు మకరందము స్రవించును. రోమాంచ ములవలె పత్రములు నిలబడును. గగనమున విహరించు పక్షులు ఆగిపోవును. ఆ భ్రమరగానము, పద్మపరిమళము ఇచట కానరావు. అచటి మారుతము పంచభూతములలోనిది గాదు. గోవర్ధనగిరి శిఖ రములు బంగ్గరు శిఖరములై ప్రకాశించును. అచటి రాళ్ళు రత్నము లగును. పర్వతరాజు పరమాత్మను పూలతో పూజించును. అచటి సెల యేళ్ళు గొనివచ్చు పవిత్రోదకము ఇచట లభింపదు. యమునానది ఇసుకతిన్నెలు ఇచట లేవు. వాటిపై విహరించు వారము. ఆ నవ్వులు, విలాసములు, అలకలు, ఆ వేణువు, ఆ మకరికాపత్రములు, ఆ ఆటలు ఇచట లేవు. కాముబాణముల కన్నను తీక్ష్ణమైన చూపులతో చూచుకొనుట ఇచట కానరాదు. రాసోత్సవ సమయమున పరమాత్మ కుంజములలో దాగియుండెడివాడు. ఆ నికుంజములు ఇచట లేవు గదా? బృందావన వైభవము వర్ణనాతీతము. ఆ రాసోత్సవములకు దీనికి పోలిక లేదు. ఆ ఆనందములో ఇది బహుస్వల్పము' అని వివరించెను. సత్యాదేవి మున్నగువారి భ్రమలు తొలగిపోయెను. రాధాదేవి ఔన్నత్యమును వారు గొనియాడిరి. వా రందరు సిద్ధాశ్రమమునుండి ద్వారకానగరము నకు చేరిరి. పరమాత్మ సంకల్పమాత్రమున వారందరికి ప్రాసాదముల నిర్మించెను.

## ద్వారకానగర వర్ణన

ద్వారకానగరమున మూడు దుర్గములు గలవు. అంతర్దుర్గమున రత్నములతో నిర్మింపబడిన ప్రాసాదములు గలవు. అందు పరమాత్మ రాధాదేవి, అష్టసతులతో నుండును. రాధాదేవి ప్రాసాదద్వారముకడ గోలోకమునుండి వచ్చిన లీలాసరోవరము గలదు. అందు గ్రుంకులిడిన వారిని అవసానదశలో పార్షదులు రథము గొనివచ్చి వారికి వింజామరలు వీచుచు మురళీ దుందుభులు మ్రోగించుచు గోలోకమునకు గొనిపోవుదు రని ప్రతీతి. జ్ఞానతీర్థమున స్నాన మాచరించిన భక్తిజ్ఞానములు గలు

ద్వారకయందు అనేక తీర్థములు గలవు. తిథులలో ఏకాదశి, సర్పములలో శేషుడు, పక్షులలో గరుత్మంతుడు, పురాణములలో భాగవతము, దేవతలలో వాసుదేవునివలె, క్షేత్రరాజములలో మోక్షపురములలో ద్వారవతి (ద్వారక) శ్రేష్ఠమైనది. దీనికి కుశస్థలి యనిగూడ పేరు. కృష్ణభక్తులకు మనోహరమగు తావు. వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ నామములతోనున్న శ్రీకృష్ణపరమాత్మకు నమస్కృతులు. ద్వారక సమీపమున గల సముద్రమందు స్నాన మాచరించి కృష్ణప్రతిమను ప్రతిష్ఠించి పూజించిన చిన్మయశరీరమును బొందుదురు. ముక్తి కరతలామలకము. అచట ద్వారకనాథ్ అను కృష్ణమందిరము ప్రసిద్ధమైనది.

## కుచేలుడు

కుచేలుడు పరమాత్మకు ఆప్తుడు. భూసురోత్తముడు, విరాగి, బ్రహ్మవేత్త, జితేంద్రియుడు, ఉత్తముడు. ఆయన నామధేయము సుదాముడు. చినిగిన బట్టలు కట్టుచుండుటచే కుచేలుడు అనుపేరు వచ్చినది. ఆయన పరమాత్మకు బాల్యస్నేహితుడు, సహాధ్యాయి. ఆయన సాందీపనికడ పరమాత్మతోగూడ సకలవిద్యల నభ్యసించిన దిట్ట. దరిద్రుడైనను యాచనసేయువాడు కాడు. సదా బ్రహ్మనిష్ఠయం దుండువాడు. కలిగిన దానితో సంతృప్తిపడు స్వభావము గలవాడు. సంసారపోషణకు యత్నించువాడుకాడు. 'మనము పరమాత్మను సేవించుచున్నచోఆయన మన కాహారము నొసగకుండునా? కర్మమాత్రమే అన్న మొసగును. అజగరము బ్రతుకుట లేదా? పరమాత్మ చేతనుడుగదా?' అని నమ్మువాడు.

కుచేలుని సతి 'వామాక్షి'. పతివ్రతాశిరోమణి. వారికి ఇరువదేడుగురు సంతానము. దైవప్రేరణచే గలిగిన దానితో సంతృప్తి నొంది పతిసేవ చేయుచుండెడిది. ఆమె పతితో 'నాథా! పరమాత్మ తమకు సహాధ్యాయి. అవంతీపురమున తా మిరువురు సాందీపనికడ విద్య నభ్యసించితిరి. పరమాత్ముని ఆశ్రయించిన వారికి సకల సంపదలు గలుగును. మనలను మాత్రము పరమాత్మ ఉపేక్షించునా? ఒకపర్యాయము ఆయన కడకు వెళ్లి రాగూడదా?' అని ఆవేదనను వెళ్ళబుచ్చెను.

ద్వారకయందు అనేక తీర్థములు గలవు. తిథులలో ఏకాదశి, సర్పములలో శేషుడు, పక్షులలో గరుత్మంతుడు, పురాణములలో భాగవతము, దేవతలలో వాసుదేవునివలె, క్షేత్రరాజములలో మోక్షపురములలో ద్వారవతి (ద్వారక) శ్రేష్ఠమైనది. దీనికి కుశస్థలి యనిగూడ పేరు. కృష్ణభక్తులకు మనోహరమగు తావు. వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ నామములతోనున్న శ్రీకృష్ణపరమాత్మకు నమస్కృతులు. ద్వారక సమీపమున గల సముద్రమందు స్నాన మాచరించి కృష్ణప్రతిమను ప్రతిష్ఠించి పూజించిన చిన్మయశరీరమును బొందుదురు. ముక్తి కరతలామలకము. అచట ద్వారకనాథ్ అను కృష్ణమందిరము ప్రసిద్ధమైనది.

## కుచేలుడు

కుచేలుడు పరమాత్మకు ఆప్తుడు. భూసురోత్తముడు, విరాగి, బ్రహ్మవేత్త, జితేంద్రియుడు, ఉత్తముడు. ఆయన నామధేయము సుదాముడు. చినిగిన బట్టలు కట్టుచుండుటచే కుచేలుడు అనుపేరు వచ్చినది. ఆయన పరమాత్మకు బాల్యస్నేహితుడు, సహాధ్యాయి. ఆయన సాందీపనికడ పరమాత్మతోగూడ సకలవిద్యల నభ్యసించిన దిట్ట. దరిద్రుడైనను యాచనసేయువాడు కాడు. సదా బ్రహ్మనిష్ఠయం దుండువాడు. కలిగిన దానితో సంతృప్తిపడు స్వభావము గలవాడు. సంసారపోషణకు యత్నించువాడుకాడు. 'మనము పరమాత్మను సేవించుచున్నచోఆయన మన కాహారము నొసగకుండునా? కర్మమాత్రమే అన్న మొసగును. అజగరము బ్రతుకుట లేదా? పరమాత్మ చేతనుడుగదా?' అని నమ్మువాడు.

కుచేలుని సతి 'వామాక్షి'. పతివ్రతాశిరోమణి. వారికి ఇరువదేడుగురు సంతానము. దైవప్రేరణచే గలిగిన దానితో సంతృప్తి నొంది పతిసేవ చేయుచుండెడిది. ఆమె పతితో 'నాథా! పరమాత్మ తమకు సహాధ్యాయి. అవంతీపురమున తా మిరువురు సాందీపనికడ విద్య నభ్యసించితిరి. పరమాత్ముని ఆశ్రయించిన వారికి సకల సంపదలు గలుగును. మనలను మాత్రము పరమాత్మ ఉపేక్షించునా? ఒకపర్యాయము ఆయన కడకు వెళ్లిరాగూడదా?' అని ఆవేదనను వెళ్ళబుచ్చెను.

తన అర్ధాంగి ఆవేదనను కుచేలుడు గ్రహించెను. అంతయు బ్రహ్మలిఖిత ప్రకారమే జరుగునని, మనము పరమాత్మని ధ్యానింపవలె నను తత్త్వము గలవాడైనను కుచేలుడు సతి హితవాక్యముల మన్నించి 'వామాక్షీ! పరమాత్మ దర్శనము నాకు లభించునా? ద్వారపాలకులు నన్ను లోనికి పోనిత్తురా? భగవద్దర్శనము కొరకు గాక నా దారిద్ర్యము పోగొట్టుమని పరమాత్మను యాచింపుమందువా? ఆయన సర్వజ్ఞుడు గదా! అడుగనిదే తీయకుండునా? తీయకున్నను నా చిరకాలమిత్రుని చూచి ఆనందించి వత్తును. పెద్దలకడకు, దైవసన్నిధి కేగునపుడు రిక్త హస్తములతో పోరాదు. నాలుగుగుప్పెళ్లు అటుకులు దొరకునేమో పొరుగు వారిని విచారించి రమ్ము' అనెను. వామాక్షి అటుకులు తెచ్చి పతి అంగ వస్త్రమున ముడివేసెను.

కుచేలుడు ద్వారకకు బయలుదేరెను. పరమాత్మ దర్శనభాగ్యము నకు ఆయన ఉవ్విళ్ళూరుచుండెను. సముద్రముదాటి ద్వారకానగరము సమీపించెను. స్వర్ణమందిరములు, దుర్గములు, పతాకములు, రమణీ యోద్యానవనములు, పవిత్రతోయముల గొనివచ్చు సెలయేళ్ళు మనో హరముగ కన్పట్టెను. సారసపక్షుల మధురగానము వీనుల విందొనర్చు చుండెను. గగనమున గరుడుడు 'కృష్ణా! కృష్ణా!' అని కుచేలునకు స్వాగతము పలికెను. అది శుభశకునమని భావించి కుచేలుడు 'పరమాత్మ ఎచట నుండును?' అని ద్వారపాలకుల ప్రశ్నింప అన్నిమందిరములలో నుండునని వారు చెప్పిరి. ఒక మందిరమున కుచేలుడు ప్రవేశింప అది రుక్మిణీదేవి మందిరమయ్యెను. పరమాత్మ కుచేలుని సమీపించి కౌగిలించు కొని లోనికి గొనిపోయెను. ఆ దివ్యస్పర్శచే కుచేలుడు పులకితుడయ్యెను. ఆనందాశ్రువులు జాలువారుచుండ కుచేలుడు ఆత్మసఖుని వెంట నడచెను.

రుక్మిణీదేవి స్వర్ణకలశముతో పవిత్రోదకము తెచ్చెను. కుచేలుని పాదద్వయము బంగరుపళ్లెరమందుంచి రుక్మిణీదేవి గ్రుమ్మరించిన పవి త్రోదకముతో కడిగి, తత్పాదోదకము పరమాత్మ శిరమున చల్లుకొనెను. అది చూచిన వారందరు పాదోదకము శిరస్సున చల్లుకొనిరి. కుచేలుని తన పర్యంకముపై కూర్చుండబెట్టి పరిమళ గంధములను, లేపనములను

పరమాత్మ ఆయనకు స్వయముగ జూసి పూలతో పూజించెను. మృష్టాన్నములు నిడెను. కుచేలుడు సంతుష్టాంతరంగు డయ్యెను. తనకు పరమాత్మ సేవ సేయుటయా? అని పొంగుచు ఆ కరుణామయుని కీర్తింప దొడంగెను.

అంతట పరమాత్మ కుచేలునితో 'సఖా! నీ నివాస మెచట? నీవు గృహస్థువైతివా? అగుచో ఆమె అనుకూలవతియేనా? యజ్ఞోపవీతమును బట్టి గృహస్థుడవని తోచుచున్నది. కాని నీ చినిగిన బట్టలనుబట్టి అవధూత లక్షణములున్నటుల తోచుచున్నది. జనక వశిష్ఠాదులవలె నిర్లిప్తుడవై యుంటివి. నీకు సంతాన మెందరు? చిన్ననాటి మధురస్మృతులు జ్ఞప్తికి వచ్చుచున్నవి. ఒకనాడు సమిధల గొనివచ్చుటకై గురువు మనలను అడవికి పంపెను. ఆ సమయమున ఉరుములతో మెరుపులతో గాలివాన వచ్చెను. గాఢాంధకారమున రాత్రివేళ మన మిరువురము విడివడకుండుటకై చేతులను బట్టుకొని భ్రిమ్మరుచుండ తెల్లవారెను. గురువు మనల నన్వేషించుచు 'కృష్ణా! సుదామా! నా ఆజ్ఞను పాలించి కడగండ్ల పాలైతిరి. మీకు సకలవిద్యలు సిద్ధించుగాక! అవి కంఠస్థమగు గాక! సద్యస్స్ఫూర్తి గలుగు గాక! సకల శుభములు సమకూరు గాక! సకలైశ్వర్యములు సిద్ధించు గాక!' అని వర మొసగెను గదా? ఆ వరప్రభావము ననుభవించుచున్నాము. నీవంటి సఖునితో గురుకులవాసము చేయుట నా అదృష్టము. వేదమూర్తియైన నీతో మైత్రి నెరపుట నాకు గర్వకారణము' అని ఉల్లాసముతో మధురస్మృతుల జ్ఞప్తికి తెచ్చెను.

కుచేలుడు కృష్ణునితో 'దేవాదిదేవా! అనంతకోటి బ్రహ్మాండ నాయకా! ఆత్మేశ్వరుడవు, సకల విద్యాస్వరూపుడవైన నీవు గురుకుల వాసము చేయుట 'గురువుకడనే విద్య నేర్వవలెను' అని లోకమున చాటుటకే గదా! నీవు వేదమయుడవు. సర్వజ్ఞుడవు. నీకు తెలియని విషయము లేముండును?' అని మిన్నకుండెను. తాను తెచ్చిన అటుకులు పరమాత్మ కిచ్చుటకు సిగ్గుపడెను. అది గ్రహించిన పరమాత్మ కుచేలుని అంగవస్త్రమున కట్టిన మూటముడి విడదీసి అందున్న అటుకులను ప్రీతితో గైకొని 'ఇట్టి అటుకులు నా చిన్నతనమున మా అమ్మ నాకు

తినిపించుచుండెడిది. మరల ఇదే తీపట' అని పిడికెడు అటుకులు పర మాత్మ భుజించెను. వెంటనే భూలోకసంపత్తులు వచ్చెను. రెండవ పిడి కెడు అటుకులు భుజించినంతనే పాతాళలోక సంపత్తులు వచ్చెను. మూడవ పిడికెడు భుజింపబోవ లక్ష్మీదేవి అడ్డుపడి 'నాథా! నే నేమి అప రాధ మొనర్చితినని నన్ను వదలివేయనుంటివి? ఇక మనము కుచేలు నకు సేవచేయవలసి వచ్చును' అనెను. పరమాత్మ అటుకులను వదలి మృష్టాన్నముల నారగించెను. బాల్య క్రీడల స్మరించుకొనుచు వారు ఆ రాత్రి గడపిరి.

కుచేలుడు తన గృహమునకు మరలెను. పరమాత్మ వానిని కౌగి లించుకొని ఘనముగ వీడ్కో లొసగెను.

కుచేలుడు త్రోవలో 'పరమాత్మ ఎంతటి దయార్ద్రహృదయుడు. న న్నెంతో ఆదరించెను. ఆ మహానుభావు డెక్కడ? ఈ బడుగు బాప డెక్కడ? అయన లక్ష్మీనాథుడు. నేను దరిద్రనారాయణుడను. ధనము వలన గలుగు అనర్థముల గ్రహించి వాటిని నా కొసగలేదు. సంపద గలి గిన నేను గర్విష్ఠి నగుదునని, తనను మరతునని, నా సేమ మరసియే నాకు సిరు లొసగలేదు. సర్వము భగవద్వస్తువు యైన దరిద్రమెక్కడిది? నేను భిక్షాటన సేయునటుల పరమాత్మ కల గనినచో మెల్గాంచిన వెంటనే పశ్చాత్తప్తుడు గాకుండునా' అని తలచుచు తనపల్లెను సమీపించెను.

అదేమి చిత్రమోగాని రమణీయోద్యానములు, సరస్సులు, కమల ములు, రత్నదీధితులతో వెలుగొందు ప్రాసాదము కన్పట్టెను. కుచేలుడు చకితుడయ్యెను. మరల ద్వారకకు అరుదెంచితినేమో యని భ్రమ చెందెను. అంతలో వామాక్షి సర్వాలంకారభూషితయై లక్ష్మీదేవివలె పతి కెదుఃరేగి 'రండు', 'రండు' అని ఆహ్వానించెను. కుచేలుడు ఆమెను పరిశీలింప ఆమె తన అర్ధాంగియే. తన పూరిల్లు కృష్ణమందిరము బోలి యున్నది. సమస్త వస్తుసముదాయము సమృద్ధిగ నున్నది. తాను, తన సతి యౌవనులైరి. అదంతయు పరమాత్మ అనుగ్రహమని కుచే లుడు గ్రహించెను. వా రిరువురికి పరమాత్మపై అచంచల భక్తివిశ్వాసము పెంపొందెను.

కుచేలుడు తనలో 'పరమాత్మ ఎంతటి దయాంబురాశి. నాకు వీడ్కో లొసగునపుడు మాటమాత్రమైనను దెలుపలేదు. నలగని అటుకులు ప్రీతితో భుజించి ఇంతటి ఐశ్వర్యము నొసగెను. అట్టి వాని సఖ్యము మరల నాకు లభించునా? శ్రీకృష్ణపరమాత్మ పాదారవిందములనే నేను సదా గొల్తుగాక! సాక్షాత్ పరమాత్మయే అండగనుండ నాకేమి కొరత? ఈ సంపద నాది కాదు. అందుచే బీదసాదలకు దానము చేయుదును' అని విరివిగ భూరివిరాళము లొసగుచుండెను. అది తరగని సంపద. అక్షయనిధి. కుచేలదంపతులు పరమాత్మను సేవించుచు కడకు కైవల్య మొందిరి.

ద్వారకాఖండము సమాప్తము.



# విశ్వజిత్ ఖండము

## మరుత్తుడు

సూర్యవంశమున మరుత్తు అనురాజు గలడు. ఆయన హిమగిరికి ఉత్తరదిక్కున యజ్ఞము చేసెను. హోమకుండము, బ్రహ్మకుండము, పంచకుండములను నిర్మించిరి. హోతలు, అధ్వర్యులు, ఉద్గాతలు, దీక్షితులు, చతుర్వేద పండితులు ఏనుగు తొండములంత అజ్యధారలతో అగ్నిహోత్రమున వేల్చుచుండిరి. అజ్యముచే అగ్నిహోత్రుడు, సోమముచే దేవతలు కడు సంతసించిరి. మరుత్తుని గురువు సంవర్తుడు. ఆయనకు గురుదక్షిణగ రాజు జంబూద్వీపము, నవరత్నములు, ఏనుగులు, అశ్వములు, సువర్ణాభరణములు కానుకగ నొసగెను. విప్రులకు గోభూ సువర్ణదానముల నిచ్చిరి. రాజుగారొసగిన బంగరు భోజన పాన పాత్రలను మోయలేక వారు అచటనే గుట్టలు గుట్టలుగ పడవేసిరి.

యజ్ఞకుండమున పరమాత్మ ప్రత్యక్షమయ్యెను. మరుత్తుడు పరవశుడయ్యెను. ఆయననోట మాటలు వెలువడలేదు. పరమాత్మ రాజుతో వరము కోరుకొమ్మనెను. 'నా మనస్సు నీ పాదారవిందములకడ స్థిరముగ నిలిచియుండునటుల వరమిమ్ము' అని మరుత్తుడు కోరెను, భక్తుల సుఖమే నా సుఖము. వరము కోరుకొమ్ము అని పరమాత్మ రాజును మోమోట పెట్టెను.

అంతట మరుత్తుడు పరమాత్మతో 'మహానుభావా! వైకుంఠము భూలోకమునకు రావలెను. ఆ కావున భక్తు లుండవలెను. అందు నేనుండవలెను, పరమాత్మ అచట వేంచేసి సర్వుల కాపాడుచుండవలెను' అని వరము కోరెను. ద్వాపరాంతమున మరుత్తుని కోర్కె నెరవేరునని పరమాత్మ అభయ మొసగెను. ఆ మరుత్తుడే ఉగ్రసేన మహారాజు. వైకుంఠమే ద్వారక. ఆ భక్తులే యాదవులుగ విచ్చేసిరి. పరమాత్మ ఉగ్రసేన మహారాజుచే రాజసూయయాగము చేయించెను.

## రాజసూయ యాగము

స్వర్గలోకమునుండి సుధర్మయను దేవసభ భూలోకమునకు విచ్చే సెను. ఉగ్రసేనమహారాజు పరమాత్మను పూజించి 'కృష్ణా! రాజసూయ యాగ మహిమను నారదునివలన వినియుంటిని. ఆ యాగము సేయ వలెనను కోర్కె గలదు. నీవు అనుమతించిన యజ్ఞము సఫలమగును. నీ పాదారవిందముల సేవించుటచే మనోరథము లీడేరుట తథ్యము. నీవు సర్వభూతములకు ఆత్మభూతుడవు. నీవు సృజించిన బొమ్మలే ఈ జగత్తు. నీవు యజ్ఞపురుషుడవు. నీ వండగనుండ నాకేమి భయము అనెను.

పరమాత్మ రాజుతో 'తాతా! నీ సంకల్పము బహుదొడ్డది. పూర్వ జన్మ విశేషముచే గాని అట్టి కోర్కె జనింపదు. రాజసూయయాగము పూర్తి గావించినచో సకల లోకములను జయించినట్లగును. ఆలసింపక యాదవుల బిలిచి తాంబూల మిడుడు. విజయలక్ష్మిని పొందగోరువారు దానిని స్వీకరింపవలెను. యాదవులు నా అంశ. వారు వీరాగ్రేసరులు. సకల లోకముల గెల్చుటకు సమర్థులు' అని పరమాత్మ ప్రోత్సహించెను.

ఉగ్రసేన మహారాజు యాదవుల రావించి కొలువు దీరెను. ఆయన వారితో 'వీరాగ్రేసరులారా! నాకు రాజసూయ యాగము చేయవలెనను కోర్కె గలిగినది. దానికి పరమాత్మ అనుమతి వడసితిని. ఈ ప్రపంచ మును జయింపగల వీరుడు ఈ బంగరు పళ్లెరమందలి తాంబూలమును గైకొనుగాక' అనెను. రుక్మిణీదేవి కుమారుడు ప్రద్యుమ్నుడు ముందుకు వచ్చి 'రాజా! ఈ తాంబూలమును గైకొనుచున్నాను. రాజసూయ యాగము పూర్తిగావింపనిచో బ్రహ్మహత్యాపాతకము నొందెదను' అని శపథము చేసెను. గర్గమహర్షి శుభముహూర్తమును నిశ్చయించెను.

పవిత్రోదకములతో ప్రద్యుమ్నుని అభిషేకించిరి. నూతనవస్త్రము లను కట్టబెట్టిరి. ఉగ్రసేనుడు వాని నొసట విజయతిలకము దిద్దెను. జయజయ ధ్వానములు మిన్నంటెను. ప్రద్యుమ్నుడు పరమాత్మకు ప్రణమిల్లి ఆయన ఆశీస్సుల నందుకొనెను. రుక్మిణీదేవి వానికి విజయ మును కాంక్షించుచు దివ్యాక్షతల శిరమున నుంచెను.

## దిగ్విజయయాత్ర

బలరామస్వామి ప్రద్యుమ్నునకు కవచ మొసగెను. ఉగ్రసేనుడు కరవాలము నిచ్చెను. అక్రూరుడు దక్షిణావర్త మను శంఖమును, ఉద్ధవుడు వాడని మాలికను కానుకగ నొసగెను. గర్గమహర్షి మంత్రకవచము ప్రసాదించెను. బ్రహ్మ పద్మరాగము, శంకరుడు త్రిశూలము, వరుణుడు పాశము, శక్తిధరుడు అమోఘశక్తి, వాయువు వింజామరలు, యముడు దండాయుధము, కుబేరుడు రత్నమాలను సమర్పించిరి.

భూదేవి అప్రాకృతపాదుకలు, భద్రకాళి కుంత మను ఆయుధము, దేవేంద్రుడు స్వర్ణరథమును ఇచ్చిరి. ఆ రథమునకు సహస్రాశ్వములు, సహస్ర చక్రములు గలవు. సహస్ర ధ్వజములు గలవు. అది సంకల్ప మాత్రముననే బ్రహ్మాండములకు దూసికొని పోవును.

మంగళవాద్యములు మనోహరముగ మ్రోగుచుండెను. విప్రులు వేదముల పఠించుచుండిరి. పుణ్యస్త్రీలు లాజలు, అక్షతలు చల్లుచుండిరి. దేవతలు పుష్పవృష్టి కురియించిరి. ప్రద్యుమ్నుడు తలిదండ్రులకు, బలరామస్వామికి, గర్గమహర్షికి నమస్కరించి వారి ఆశీస్సుల నంది రథమారోహించెను. నూటొక్క యాదవజాతులు, ప్రద్యుమ్ని సోదరులు వెంట నుండిరి. పరమాత్మ ప్రేరితుడై జాంబవతీనందనుడైన సాంబుడు కూడ వానివెంట బయలుదేరుటకు సిద్ధముగ నుండెను.

గరుడ, మీన, నాగ ధ్వజములతో, ఘంటాకింకిణీ రవములతో, అరుణాంబరములతో, వింజామరలతో దేదీప్యమానముగ ప్రకాశించు స్వర్ణ రథములతో, దేవతా విమానములతో, భద్రగజములతో, వివిధదేశముల నుండి వచ్చిన దివ్యాశ్వములతో యదుసేన ప్రద్యుమునివెంట నేగుటకు సిద్ధముగ నుండెను.

ఉగ్రసేనుడు ప్రద్యుమ్నునితో 'నీవు పరమాత్మ ఆశీస్సుల నందితివి. నీకు జయము తథ్యము. కాని స్త్రీలను, ఉన్మాదులను, విరథులను శరణుజొచ్చిన వారిని, భయపడువారిని సంహరింపకుము. ఆర్తుల ఆర్తి బోగొట్టుము. అది క్షత్రియధర్మము. ఆతతాయిని నిర్దాక్షిణ్యముగ శిక్షిం

షుము. అహంకారిని, పెద్దల సమక్షమున లేవనివారిని నరికివేయుము. క్షత్రియునకు యుద్ధము ధర్మము. గోవులు, విప్రులు, సాధువులు వీరిని కాపాడుము' అని హితము పలికెను.

ప్రద్యుమ్నుడు బయలుదేరెను. అగ్రభాగమున సేనానమేతుడై మహాబలోపేతుడగు కృతవర్మ, పశ్చిమ భాగమున పతాకాయుతుడై అక్రూరుడు, వారి వెనుక ఉద్ధవుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధాది కృష్ణ సుతులు, భోజులు, యదువీరులు బయలుదేరిరి.

పరమాత్మ ప్రద్యుమ్న, అనిరుద్ధ, సంకర్షణాది రూపముల నుండెను ఆయనకు భక్తులపైగల వాత్సల్యము వర్ణనాతీతము. భూమియందలి రేణువులు, గగనమందలి తారలను లెక్కింపగలమేమో గాని పరమాత్మ లీలల వైభవమును వర్ణించుట అసాధ్యము.

ప్రద్యుమ్నుని రథమందలి శ్వేతఛత్రము నీడ సుదూర మాక్ర మించెను. గజముల ఘీంకారములు, అశ్వముల సకిలింపులు, యదుసేన జయజయ ధ్వానములు, ఢంకార, ఖాంకార, ఘీంకార, క్రేంకార, ధణ ధణాత్కార, భటపటాత్కారములతో చెవులు చిల్లులు పడుచున్నవి. భూదేవి కంపించెను. వానరమూకలు విజయోత్సాహముతో కేరింతలు గొట్టు చున్నవి. ప్రద్యుమ్నుడు తొలుత కచ్ఛపదేశము చేరెను.

కచ్ఛపదేశమునకు హేలావతి రాజధాని. ప్రద్యుమ్నునిసేన పాద ఘట్టనలకు రేగిన ధూళి గగనము గప్పి గాఢాంధకారము గావించెను. కచ్ఛపదేశాధీశుడు ముగ్ధుడై మేలుజాతి అశ్వనులు, ఇరువది బారువుల బంగారము, పెక్కు కానుకలు ప్రద్యుమ్నునకు సమర్పించి స్తుతించెను. తొలి విజయమునకు యదువీరులు కడు ముదమందిరి.

యదుసేన కళింగదేశము చేరెను. కళింగరాజు ప్రద్యుమ్నునితో బోరుటకు సిద్ధమై గదను అనిరుద్ధునిపై విసరెను. అది అనిరుద్ధుని తాకి బాధ కలిగించెను. ఆ దృశ్యమును చూచిన యదుసేన కళింగసేనపై శరవర్షమును కురియించెను. కళింగుడు ప్రద్యుమ్నుని శరణు వేడెను. పెక్కుకానుకలు సమర్పించెను. ద్వితీయవిజయము యదుసేనలో విజయ విశ్వాసమును పూరించెను.

ప్రద్యుమ్నుడు సేనాపమేతుడై మరుధర్మదేశమున కేగెను. అది గిరులమయము. ఆ గిరులే దుర్గములుగ నున్నవి. గయుడు ఆ దేశమునకు రాజు. ఉద్ధవుని హితవాక్యముల మన్నింపక దురహంకారియగు గయుడు ప్రద్యుమ్నునితో పోరు సల్పుటకు సిద్ధమయ్యెను. అది విని యదుసేన గయునిసేనపై తారసిల్లెను. గయునిసేన పారిపోయెను. పరమాత్మ కుమారుడగు దీప్తిమంతుడు గయుని పారద్రోలెను. వాడు ప్రద్యుమ్నుని శరణు వేడెను. తృతీయ విజయము యదువీరుల నుత్తేజితుల గావించెను.

అవంతీ రాజధానియగు ఉజ్జయినికి ప్రద్యుమ్నుడు రాగానే జయసేనుడు ప్రేమతో పెక్కు కానుకలను అయనకు సమర్పించెను. అంతట యదుసేన నర్మదాతీరమందలి మాహిష్మతీ నగరమునకు జనెను. ఇంద్రనీలుడు దానికి ప్రభువు. తాను దుర్యోధనుని అనుగ్రహమువలన ప్రభుడనైతినని, ఆయనకుదక్క అన్యులకు కప్పము కట్టనని తొలుత బీరములు పలికినను యదుసేననుచూచి భీతిల్లి ప్రద్యుమ్నునకు కప్పముగట్టి శరణు జొచ్చెను. యదుసేన ఘూర్జరదేశమున కేగ ఆ రాజు ప్రద్యుమ్నునకు కప్పముగట్టి శరణు వేడెను.

యదుసేన చేదిదేశమున కేగెను. దానిని దమఘోషుని కుమారుడు శిశుపాలుడు పాలించుచుండెను. ఉద్ధవుడు పల్కిన హితవాక్యములను పెడచెవిని పెట్టి యదుసేన నెదుర్కొనెను. ప్రద్యుమ్నుడు కోపోద్రిక్తుడై యమపాశముతో శిశుపాలుని కట్టి, కరవాలముతో వానిశిరము ఖండించబోవ, వాని తలిదండ్రులు ప్రద్యుమ్నుని శరణు జొచ్చి కప్పము గట్టి, పుత్రభిక్ష వేడిరి. ఆయన శిశుపాలుని వదలివేయ, వాడు 'బ్రతుకు జీవుడా' అని మెల్లగ జారుకొనెను.


యదుసేన అంగ, వంగ, కొంకణ దేశముల కేగి, ఆ రాజులను జయించి, మగధదేశమున కేగి జరాసంధుని గూడ జయించిరి. అంతట యదువీరులు కురుదేశమున కేగి కౌరవులతో పోరు సలుప, బలరామకృష్ణులు వారికి తమ బాంధవ్యమును తెలిపి శాంతింపజేయ, కౌరవులు ప్రద్యుమ్నుని పూజించి కప్పము గట్టిరి.

యదుసేన అలకాపురి కేగి కుబేరుని జయించి, వానివలన నిధుల బడసి కప్పము గొనిరి. అచటినుండి ప్రద్యుమ్నుడు కింపురుషఖండము, హరివర్షము, హిరణ్మయఖండము, రమ్యకఖండము, కేతుమాలాఖండము భద్రాశ్వఖండము, ఇలావృతఖండము, గంధర్వదేశములను జయించి ద్వారకకు మరలెను. ఆ వార్తను ఉద్ధవుడు ఉగ్రసేన మహారాజునకు, పరమాత్మకు దెలుప, వారు మంగళవాద్యములతో నెదురేగి ప్రద్యుమ్నుని గజారూఢుని గావించి, ద్వారకానగరవీథులలో నగరవాసుల జయజయ ధ్వానములు మిన్నంటుచుండ నూరేగించి అంతఃపురమునకు గొని పోయిరి.

## రాజసూయము

పిండారక క్షేత్రమున ఉగ్రసేనుడు రాజసూయ యాగము జరిపించెను. గో, భూ, సువర్ణ, అన్నదానములు విరివిగా జరిపెను. ఉగ్రసేన మహారాజు, వాసుడు, గర్గుడు మున్నగు మహర్షులతో అవభృథ స్నానము చేయుచుండ దేవదుందుభులు మ్రోగెను. వారిపై దేవతలు పుష్పవృష్టి కురియించిరి. ఉగ్రసేనుడు ప్రద్యుమ్నుని కౌగిలించుకొని వాని పరాక్రమము ప్రశంసించెను. బలరామస్వామి, శ్రీకృష్ణపరమాత్మ, మహర్షులు, యదువీరులు కడు సంతసించిరి.

విశ్వజిత్ ఖండము సమాప్తము.



## బలభద్ర ఖండము

భూదేవి గోలోకమున కేగి భూభారము అధిక మయ్యెనని పరమాత్మతో మొరపెట్టుకొనెను. ఆయన సంకర్షణుని బిలిచి 'ఓయీ! తొలుత నీవు దేవకీదేవి గర్భమున ప్రవేశించి, తదుపరి రోహిణీదేవి గర్భమున జన్మింపుము. భూభారము తగ్గించుటకై నేమను దేవకీదేవి గర్భమున జన్మింతును' అనెను. ఆదిశేషుడు సఖులలో, పార్షదులతో తాను భూలోకమున కేగుచుంటినని తెలుపుచు వారందరిని యదుకులమున పరిచారకులు కండని హితము పలికెను.

నాగకన్యలు సంకర్షణుని విడువలేక పోయిరి. అయనను విడిచి క్షణమైన బ్రతుకలేనని నాగలక్ష్మి విషాదాశ్రువుల రాల్చెను. సంకర్షణుడు నాగలక్ష్మితో 'ప్రియా! నిన్ను విడుచుట నాకు మాత్రము సంతోషమా? నీవు రేవతియను కన్యయందు లీనమగుము. అప్పుడు బలరామస్వామినై నిన్ను బొందగలను' అనెను.

## జ్యోతిష్మతి

కశ్యపప్రజాపతి కద్రువలకు శేషుడు జన్మించెను. ఆయన ఒక పడగతో సమస్త భూభారము మోయుచుండెను. ఆ సమయమున చాక్షుషమనువు యజ్ఞము సేయ, యజ్ఞకుండమునుండి జ్యోతిష్మతియను కన్య ఉద్భవించెను. ఆయన ఆమెతో 'నీ కెట్టి వరుడు గావలెనో తెలుపుము' అన, ఆమె 'సకల లోకములలోకెల్ల బలసంపన్నుడు నాకు తగ్గ వరుడు' అనెను.

చాక్షుషమనువు దేవేంద్రుని బిలిచి, 'నీకన్న బలిష్ఠులు గలరా?' అని ప్రశ్నింప ఆయన తనకన్న వాయువు బలోపేతుడని విన్నవించెను. వాయువును ప్రశ్నింప తనకన్న ధరాధరములు అధిక బలమైనవని తెలిపెను. శైలముల ప్రశ్నించ అవి తమకన్న భూదేవి అధికురాలని చెప్పినవి. భూదేవిని ప్రశ్నింప, తనకన్న తనను మోయు ఆదిశేషుడు బలిష్ఠుడని చెప్పెను.

అది విని జ్యోతిష్మతి వింధ్యపర్వతమునకు జని, మండువేసవిలో పంచాగ్నిమధ్యమందు నిలిచియు, హేమంతమందు చన్నీటిలో కంఠము లోతునకు జని బ్రహ్మను గూర్చి తపము గావించెను.

జ్యోతిష్మతి అందచందములకు ముగ్ధులై దేవేంద్రుడు, కుబేరుడు, అగ్నిదేవుడు, నవగ్రహములు ఆమె ఆశ్రమమున కేగి తమ్ము వివాహ మాడుమని అర్థించిరి. అనంతుడే తన పతియని జ్యోతిష్మతి వక్కాణిం చెను. అది విని దేవేంద్రుడు మున్నగువారు ఆమెను అవహేళన చేసిరి. ఆమె కోపోద్రిక్తయై వారిని పెక్కురీతుల శపించెను. దేవేంద్రుడు ఆమెతో 'జ్యోతిష్మతీ! ఒకవేళ అనంతుడు నీకు భర్తయైనను నీకు సంతా నము గలుగదు' అని ప్రతిశాప మిడెను. ఆమె చతుర్ముఖుని గూర్చి మరల తపముజేయ దొడంగెను.

బ్రహ్మ ప్రత్యక్షమై ఆమెతో 'జ్యోతిష్మతీ! వరము కోరుకొనుము. దానిని నీవు తప్పక పొందగలవు' అన, అనంతుడు తనకు పతిగ లభింప వలెనని ఆమె కోరెను. బ్రహ్మ ఆమెతో 'నీవు కుశస్థలిని పాలించు రైవత రాజునకు కొమార్తెగ జన్మింపుము. నీకోర్కె సఫలమగును' అని అభయ మొసగెను. జ్యోతిష్మతి రైవతరాజుకు కొమార్తెగ జన్మించెను. ఆమెయే రేవతి. నాగలక్ష్మి రేవతియందు ప్రవేశించెను. సంకర్షణుడు ద్వారకలో బలరామస్వామిగ అవతరించెను.

## బలరాముని రాసలీల

గర్గమహర్షి ఏకాంతముగ యమునానదీ తీరమున గూర్చుండెను. నాగకన్యలు మహర్షికి ప్రణమిల్లి, బలరామస్వామియే తమకు పతియగు ఉపాయము తెలుపుమని ప్రార్థించిరి. గర్గుడు వారికి బలభద్ర పంచాం గము నుపదేశించెను. వారు దానిని జపించుటచే బలరామస్వామి రేవతీ సహితముగ వారితో చైత్ర, వైశాఖ మాసములలో రాసము జరిపెను. రేవతీ నాగకన్యలను ఆనందాబ్ధిలో నోలలాడించెను.

బలభద్రఖండము సమాప్తము.

# విజ్ఞానఖండము

ఉగ్రసేన మహారాజు సుదర్శన మహాసభకు విచ్చేసిన వ్యాస మహర్షితో ' ఓ మహానుభావా! ఏ మార్గము ననుసరించిన నేను పరమాత్మునికి భక్తుడ నగుదునో తెలుప ప్రార్థన ' అనెను.

మహర్షి రాజుతో 'ఉగ్రసేనా! పూర్వజన్మమున నీవు మరుత్తుడను క్షత్రియుడవు. నిర్హేతుకముగ నీవు పరమాత్మ ప్రీతికొరకు రాజసూయ యాగము చేసితివి. అందుచే ఈ జన్మమున పరిపూర్ణతమావతారుడు భక్తపరాధీనుడగు పరమాత్మ నీ గృహము పావనము చేయుచుండెను. నీతో కూడ, ఈ జగమంతయు పరమాత్మ స్వరూపమే. నేను లేనిదే ఈ సంసారము జరుగదను అజ్ఞానము తొలగినచో అఖండానందము స్ఫురించును. అజ్ఞాన మను నిద్రనుండి మేల్కొలుపుటకే ఈ సాధనములన్నియు కావలెను. ఏ మార్గ మనుసరించియైనను గమ్యము చేరవచ్చును. ప్రతిఫలాపేక్షలేని భక్తి నిరుపాధికభక్తి, శుద్ధభక్తి, ప్రేమభక్తి. ఈ మార్గము సులభము. గొప్ప ఫలితము నొసగును '.

మానవజన్మకు భగవన్నిష్ఠయే ఫలము. భగవద్గుణ సంకీర్తన చేయని కాలము వ్యర్థయే. భూరేణువుల లెక్కించవచ్చుగాని, భగవద్గుణములు అనంతము. అమృతతుల్యములగు భగవత్కథలయందు శ్రద్ధ గలుగవలెను. భగవంతుని పూజలో హృదయము కరుగవలెను. పుష్పము సమర్పించునపుడు పరవశుడు కావలెను.

ధ్యానము పరిపక్వమగుచో ధ్యానమూర్తి మాత్రమే కన్పింపవలెను. భగవానుని అనుగ్రహమే భగవద్దర్శనమును ప్రసాదించును. నీ నిష్ఠ నిన్ను పవిత్రుని చేయును.

ధ్యానము కూర్చుండి చేయుట ప్రశస్తము. మనస్సునకు సరిపడు విధముగ గూర్చుండవలెను. వేషభాషలకన్న అంతఃశుద్ధి ఆవశ్యకము. నిర్మలమైన మనస్సుతో ధ్యానమూర్తిని హృత్పుండరీకమున నిలుపవలెను.

గోపికలు శ్యామసుందరుని దివ్యమంగళవిగ్రహమును పూజించెడి వారు. ఉపనిషత్కాంతల పాపటలపై నున్న పాదారవిందములు, యోగుల హృదయములలో నిలిచియున్న పాదములు, గంగోద్భవపాద ములు, గుహుడు స్మరించిన పాదములు వారి హృదయపద్మమున నెల కొన్నవి. వారు భగవంతుని షోడశోపచారములతో పూజించి నిర్మాల్య తులసిని ధరించిరి. పాదోదకము స్వీకరించిరి.

భక్తి వృద్ధిచెందుకొలది హృదయము ద్రవించును. భగవంతుని రూపగుణములు వినినచో ఆనందాశ్రువులు రాలవలెను. వాక్ గద్గదికము, దేహము గగుర్పాటును చెందవలెను. ఏ రూపము సేవింతుమో ఆ రూప మును సకల జీవరాసులలో దర్శింపవలెను. ప్రేమభక్తికే పరమాత్మ వశ డగును.

భగవానుని సేవించిన సుగ్రీవుడు, జాంబవంతుడు, జటాయువు, వానరులు, మునిపత్నులు మున్నగువారు తరించిరి. వీరికి ఏ శాస్త్రము తెలియును? తనను ఆశ్రయించిన వారిని ఉద్ధరించు శక్తి ఆ పరమా త్మునికే గలదు.

పరమహంస లన గోపికలే. ప్రేమ పంచమపురుషార్థము. వారి ప్రేమ అకారణప్రేమ. పరమాత్మపై స్ఫూర్తి దక్క అన్యము లేదు. వారికి దేహస్మృతి లేదు. వారికి ఎవరూ కన్పింపలేదు. ఒక పరమాత్మయే కన్పించెను. గోపికలు శ్యామసుందరుని, సగుణమూర్తిని గోరిరి.

భగవంతునిపై ప్రేమ సంపాదింపుము. ప్రేమయే ఆత్మధర్మము. భగవద్భక్తి గలిగినచో జ్ఞానవైరాగ్యములు సహజముగ గలుగును. భక్తి యందు ఆనందము గలుగును. నీటిబుగ్గవలె ప్రేమ ఉద్భవించును. శ్రద్ధతో గూడిన భక్తి శ్రేష్ఠము.

భగవత్ప్రేమలో లీనమైనచో కర్మలు తొలగిపోవును. భక్తితో సమర్పించిన పుష్పమువలన హృదయము ద్రవించును. అప్పుడు కర్మలు తొలగిపోవును. అదే కర్మసన్న్యాసము. ప్రపంచదృష్టి యుండునంత వరకు చేయు కర్మలు సకామకర్మలే. ఈ జగత్తంతయు పరమాత్మయే

అని తెలిసి చేయు కర్మలు నిష్కామకర్మలు. భగవద్విరహ తాపమున విషయవాసనల మాలిన్యముపోయి మనస్సు శుద్ధమైన బంగారమగును.

భక్తి గలిగినచో సదా భగవానుడు కన్పించును. తదితరవస్తువుల మీద రుచి యుండదు. సర్వజగత్తును భగవంతునిగ దర్శించిన తృప్తి గలుగును. అట్టి తృప్తి గలిగిన వారికి నరకముగూడ స్వర్గముగ కన్పించును. వారికి బ్రహ్మపదవి అక్కరలేదు. వారు దేవేంద్రపదవి నాశింపరు. అష్టసిద్ధులు గోరరు. కడకు మోక్షపదవిని నిరసింతురు. 'మాకు నీవే కావలెను' అని అందురు. మోక్షానందముకన్న భక్త్యానంద మధికము.

భక్తునకు భగవంతుడే ఆత్మ. భగవానునకు భక్తుడే ఆత్మ. భగవానుడు ఇటుల పలుకునట. 'నాకు భక్తునియందే ప్రీతి. భక్తునకు త్రిమూర్తులు సైతము సాటిరారు. నా పతి లక్ష్మీదేవి, నా సోదరుడు బలరాముడు, కడకు నా మూర్తి కన్న భక్తునియందే అమరాగ మెక్కువ. క్షీరసాగరమున శయనించుటకన్న భక్తుని హృదయ కమలమందుండుట నాకు ప్రీతికరము. నేను భక్తుల వెంబడింతును. వారి పాదధూళి నా దేహమున పడవలెనన్న కాంక్షచే ఆటుల వారిని అనుసరింతును'.

భక్తి లేనిచో భగవద్దర్శనము కాదు. కోటి సాధనలైనను భక్తికి సాటిరావు. అది నిస్సారమైన పిప్పియే. భగవద్భక్తి లేనివానికి ఇహపరములు లేవు. భక్తియందు సకల పురుషార్థములు గలవు. ప్రేమభక్తితో శ్రీకృష్ణపరమాత్మ, రాధామానసచోరుడు మనకు వశుడగును. గోలోక ప్రాప్తి గలుగును.

విజ్ఞానఖండము సమాప్తము.

## గర్గమహర్షి దీవన

గర్గమహర్షి 'మునీంద్రులారా! శ్యామసుందరుడు, మురళీధరుడు రాధామానసచోరుడు, యమునాతీరవిహారి, నందకిశోరుడు, భక్తవత్సలుడగు శ్రీకృష్ణపరమాత్మ సకల జనులను సదా రక్షించుగాక! అని దీవించిరి.

శ్రీ గర్గభాగవతము సంపూర్ణము.

ఓం తత్సత్.

*T. T. D Religious Publications Series No.* 464

*Price Rs:* 25—00

***Printed and Published by Sri N. Ramesh Kumar,*** I.A.S., ***Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T. T. D Press, Tirupati. - C.*** 2,000 ***dt*** 31-10-95.